


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00

సంపుటి: 18
సంచిక: 105

ఆదివారం 6-7-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి
ఫ్యామిలీ
హైదరాబాద్
ఆదివారం ॥ 6-7-2025



● 'వింగ్స్ ఆఫ్ గోల్డ్' పురస్కారం స్వీకరిస్తున్న ఆస్థా పూనియా

● ఫస్ట్ టైమ్

కలకు బంగారు రెక్కలు ఇచ్చి...

'నావల్ ఏవియేషన్‌లో కొత్త అధ్యాయం మొదలైంది' అని సగర్వంగా, సంతోషంగా ప్రకటించింది భారత నౌకాదళం.

లింగ సమానత్వం దిశగా ఒక్కో అడుగు ముందుకు వేస్తూ వెళుతున్న భారత నౌకాదళం మరో చారిత్రక ఘట్టానికి తెర తీసింది.

భారత నౌకాదళంలో తొలి మహిళా ఫైటర్ పైలట్‌గా సబ్ లెఫ్టినెంట్ ఆస్థా పూనియా చరిత్ర సృష్టించింది...

తొలి స్వాతంత్ర్య పోరుకేక వినిపించిన ప్రాంతంగా మీరట్‌కు చరిత్రలో ప్రత్యేకస్థానం ఉంది. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు చెందిన ఆస్థా పూనియా ఎందరో ఫ్రీడమ్ ఫైటర్‌ల గురించి విని ఉండవచ్చు.

ఇప్పుడు తానే ఒక ఫైటర్ (పైలట్)గా చరిత్ర సృష్టించింది.

నావిక విమానయానం (నావల్ ఏవియేషన్)లో శిక్షణ తీసుకునే విద్యార్థులకు 'వింగ్స్ ఆఫ్ గోల్డ్' అనేది లక్ష్యంగా ఉంటుంది. నావిక విమాన యానంలో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థుల శక్తిసామర్థ్యాలు, అంకితభావానికి ఈ ప్రతిష్ఠాత్మకమైన పురస్కారం ప్రధాన మైలురాయి.

విశాఖపట్టణంలో జరిగిన ఐఎన్ఎస్ గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో 'వింగ్స్ ఆఫ్ గోల్డ్' అవార్డు అందుకుంది ఆస్థా పూనియా. పూనియాకు ఎలాంటి సైనిక కుటుంబ నేపథ్యం లేదు. బీటెక్ చేసిన తరువాత నేవీకి ఎంపికైంది.

ఫైటర్‌గా భవిష్యత్‌లో మిగ్-28,కె నౌకాదళ రఫేల్ యుద్ధ విమానాలను ఆస్థా పూనియా నడిపే అవకాశం ఉంది.

ఇప్పటివరకు మహిళా అధికారులు భారత నావికాదళంలో పైలట్, నేవల్ ఎయిర్ ఆపరేషన్స్ ఆఫీసర్‌లుగా సముద్ర నిఘా విమానాలు, హెలికాప్టర్‌లలో విధులు నిర్వహిస్తున్నారు. నౌకాదళ యుద్ధ విమానాలు నడపనున్న తొలి మహిళగా పూనియా చరిత్ర సృష్టించింది.


'నౌకాదళ వైమానిక విభాగంలో మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలనే నిబద్ధతకు ఈ చారిత్రక ఘట్టం అద్దం పడుతుంది. ఆస్థా పూనియా, అనేక అడ్డంకులను అధిగమించి నూతన శకానికి నాంది పలికింది' అని 'ఎక్స్' వేదికగా భారత నౌకాదళం ప్రకటించింది.

త్రివిధ దళాలలో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ 2016లో తొలిసారిగా మహిళలను ఫైటర్ స్ట్రీమ్‌లోకి తీసుకువచ్చింది. ఈ ఫైటర్‌లు 'ఐఏఎఫ్'లో రాఫెల్, సు-30ఎంకెఐ, మిగ్-29ఎస్ నడుపుతున్నారు. ఆర్మీ ఏవియేషన్ కార్ప్స్‌లో మేజర్ అభిలాష ఫస్ట్ ఉమెన్ కాంబాట్ ఏవియేటర్‌గా చరిత్ర సృష్టించింది.

2023లో తొలి మహిళా కమాండింగ్ ఆఫీసర్‌ను నియమించి భారత నౌకాదళం చారిత్రక నిర్ణయం తీసుకుంది. 2020 నుంచి భారత నౌకాదళంలో మహిళా అధికారుల నియామకం 15 శాతం పెరిగింది.

త్రివిధ దళాలలో గత కొన్ని సంవత్సరాలుగా మహిళలకు ఇస్తున్న ప్రాధాన్యత, లింగ సమానత్వం వైపు వేస్తున్న అడుగులు చూస్తుంటే 'అన్నీ మంచి శకునములే' అనిపిస్తోంది.

వింగ్స్ ఆఫ్ గోల్డ్



'వింగ్స్ ఆఫ్ గోల్డ్' అనేది నౌకాదళానికి చెందిన ప్రతిష్ఠాత్మకమైన పురస్కారమే కాదు... ప్రతిష్ఠాత్మకమైన పుస్తకం కూడా! యూఎస్ నావల్ ఏవియేషన్‌లో చరిత్ర సృష్టించిన ఆరుగురు మహిళల గురించి రాసిన పుస్తకం ఇది (వింగ్స్ ఆఫ్ గోల్డ్-ది స్టోరీ ఆఫ్ ది ఫస్ట్ ఉమెన్ నావల్ ఏవియేటర్స్) నేవీ ఎయిర్‌క్రాఫ్ట్‌లు నడపడంలో మహిళలకు శిక్షణ ఇవ్వాలని నావల్ ఆపరేషన్స్ చీఫ్ నిర్ణయం తీసుకున్నప్పుడు ఎన్నో వెక్కిరింపు మాటలు వినిపించాయి. 'వారు నేర్చుకోలేరు. ఒకవేళ నేర్చుకున్నా సైన్యంలో పనిచేయలేరు' అనే మాట బలంగా వినిపించింది. ఇలాంటి పురుషాధిపత్య భావజాలాన్ని తుత్తునియలు చేస్తూ ఈ ఫైటర్ పైలట్‌లు దూసుకెళ్లారు. చరిత్రలో నిలిచిపోయారు.

బార్బరా ఆలెన్ రైని 'వింగ్స్ ఆఫ్ గోల్డ్' అవార్డ్ అందుకున్న తొలి మహిళ. ఆమె సి-1 ట్రేడర్, టి-39 శేబర్లినర్‌లాంటి యుద్ధ విమానాలను నడిపేది. అమెరికా నావికాదళానికి సంబంధించి తొలి మహిళా ఫ్లైట్ ఇన్‌స్ట్రక్టర్‌లలో ఆమె ఒకరు. 1982లో ఒక ట్రైనింగ్ ఫ్లైట్ ప్రమాదంలో మరణించింది.

● వైరల్



ఓటమి ఓడిపోయింది

● షీతల్

రెండు చేతులూ లేకపోయినా బాణం సంధించి విలువిద్యలో మెడల్స్ సాధించింది పారా ఆర్చర్ షీతల్. మహేంద్ర నుంచి ప్రత్యేకంగా డిజైన్ చేసిన కారును అందుకుంది బహుమతిగా. ఇప్పుడు ఆమె ఆ కారులో షికారు చేస్తోంది. కాళ్లతో నడుపుతూ 'ఓటమిని ఓడగొట్టండి' అని పిలుపునిస్తోంది. జీవితానికి ఈ ధోరణే కదా జవాబు.

ఓడిపోవడం అలవాటు చేయడానికి మించిన వ్యసనం మనసుకు లేదు. మనసు కూడా అడవి గుర్రమే. దానిని గడ్డి మేస్తూ తిరగనిస్తే అలాగే ఉంటుంది. దాని వీపున ఎక్కి స్వారీ చేస్తే మెరుపు వేగంతో గమ్యానికి చేరుస్తుంది. మనసు చాలా మాయ చేస్తుంది. డిప్రెస్డ్‌గా ఉన్నాను మద్యం తాగు... ఎట్టైనా పో... పని చేయకుండా పడుకో... ఇక నీ వల్ల ఏం కాదు ఉరి పోసుకో.... నువ్వు దేనికీ పనికి రావు గంగలో దూకి నాకు ప్రశాంతత ఇవ్వు... ఇలా ఏదో చెబుతూ ఉంటుంది. ఎందుకంటే మనసుకు చాలా శక్తి ఉంటుంది. ఆ శక్తిని ఉపయోగించమని మనం కోరితే దానికి బద్ధకం. కష్టపడాలి కదా. కాని మనం గట్టిగా అదిలిస్తే రెట్టింపు శక్తితో పని చేస్తుంది. అందుకే దాని మాయలో పడరాదు.

శీతల్ దాని మాయలో పడలేదు. పుట్టడమే 'ఫాలొమెలియా' అనే శారీరక స్థితి వల్ల రెండు చేతులు లేకుండా జన్మించింది. కాని బెదరలేదు. భయపడలేదు. లక్షణంగా ఉన్న కాళ్లను, భుజాలను, పంటి దవడలను ఉపయోగించి బాణం ప్రయోగించడం నేర్చుకుంది. 2024లో పారిస్ పారా ఒలింపిక్స్‌లో పతకం సాధించేంత ఘనతతో ఎదిగింది. విలు విద్య అంటేనే చేతులతో ప్రదర్శించేది. అలాంటిది చేతులే లేకుండా బాణం వేసిందంటే మాటలా!

అందుకే మహేంద్ర అండ్ మహేంద్ర కంపెనీ అధినేత మహేంద్ర ఆమెకు ప్రత్యేకంగా కస్టమైజ్ చేసి స్కార్పియోను బహూకరించాడు. ఆమె స్ఫూర్తికి సలామ్ చేశాడు. కాని చాలా మంది ఇలాంటి బహుమతిని మూల పెడతారు. లేదా మరొకరు నడుపుతుంటే ఎక్కి కూచుని తిరుగుతారు. కాని శీతల్ తానే ఆ బండిని నడపాలనుకుంది. కాళ్లతో స్టీరింగ్ తిప్పుతూ నడపడం నేర్చుకుంది. అంతేకాదు హైవే మీద బండిని పరుగులు పెట్టించింది. ఆ వీడియోను చూసి అందరూ మళ్లీ 'ఆహా.. ఓహో' అని కేరింతలు కొట్టారు. చేతులు లేకుండా కారు నడుపుతున్నప్పుడు అదేదో లేదని వేరేదో లేదని బాధపడుతూ కూచోవడం ఎంత వరకు కరెక్ట్?

లేనిది మాత్రమే లేదు. ఉన్నది చాలా గొప్పగా మన వద్ద ఉన్నది. ఆ మనసును, బుర్రను, శక్తిని ఉపయోగించి జీవితాన ఎదురుపడే సవాళ్లను దాటడమే శీతల్‌ను చూసి మనం నేర్చుకోవాల్సింది.

● సెల్ఫ్-డిఫెన్స్

ఆపదలో అండగా...

'ఎంత పెద్ద ప్రాజెక్ట్ అయినా చిన్న ఆలోచనతోనే మొదలవుతుంది' అంటుంది కర్ణాటకలోని బెలగావికి చెందిన యువ ఇంజనీర్ నందిత యెనగి. శరద్ పాటిల్‌తో కలిసి సెల్ఫ్-డిఫెన్స్ బ్రాండ్ 'వేల్ వేరబుల్'ను ప్రారంభించింది నందిత.

ఈవ్-టీజింగ్ రూపంలో తనకో చేదు అనుభవం ఎదురైంది. ఆ సమయంలోనే వచ్చిన ఒక ఆలోచనే సెల్ఫ్-డిఫెన్స్ స్టార్టప్‌కు కారణం అయింది.

ఉమెన్ సేఫ్టీ వేరబుల్స్‌పై కంపెనీ దృష్టి పెట్టింది. 'వేల్ వేరబుల్' కంపెనీ ప్రసిద్ధ టీవీ షో 'షార్క్ ట్యాంక్ ఇండియా' దృష్టిలో పడింది. కంపెనీ ప్రారంభించడానికి కారణం, లక్ష్యాల గురించి ఈ కార్యక్రమంలో వివరించింది నందిత. ఈ కంపెనీలో 30 లక్షల రూపాయలు ఇన్వెస్ట్ చేయడానికి అమన్ గుప్తా, వినీత్‌సింగ్‌లు ముందుకు వచ్చారు.

'మహిళల భద్రతే ప్రధాన లక్ష్యంగా కంపెనీ మొదలు పెట్టాం. ఆత్మరక్షణ పరికరాల గురించి విస్తృతంగా ప్రచారం చేస్తాం' అంటుంది నందిత.



● నందిత యెనగి

ఎలక్ట్రికల్ షాక్ వేరబుల్స్ ద్వారా సెల్ఫ్-డిఫెన్స్ టెక్నాలజీకి సంబంధించి కొత్త అడుగు వేసింది...వేల్ వేరబుల్.

దేశీయ మార్కెట్‌పైనే ప్రధానంగా దృష్టి పెట్టినప్పటికీ అంతర్జాతీయ మార్కెట్ దృష్టిని కూడా ఆకట్టుకుంది వేల్ వేరబుల్. నందితను యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ తమ కంపెనీ గ్యాడ్జెట్స్‌ను పరిచయం చేయడానికి తమ దేశానికి ఆహ్వానించింది. యూఎస్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లో తమ కంపెనీ సెల్ఫ్-డిఫెన్స్ గ్యాడ్జెట్‌ల గురించి ఆమె వివరించింది.

హెల్త్

● ట్రైజెమినల్ న్యూరాల్జియా



నరం... నరకం



● సల్మాన్ ఖాన్

ఇదో నరాలకు సంబంధించిన సమస్య. బాలివుడ్ నటుడు సల్మాన్‌ఖాన్ ఈ సమస్యతో బాధపడటంతో ఇటీవల ఇది మరోసారి వార్తల్లోకి వచ్చింది. నరం తాలూకు సమస్య కావడంతో ఒకేచోట మాటిమాటికీ షాక్ తగులుతున్నట్టు, కనిపించని పదునైన కత్తితో పదే పదే పొడుస్తున్నట్టు బాధించే సమస్య ఇది. తానెదుర్కొన్న ఇతర వైద్య సమస్యలైన బ్రెయిన్ అన్యురిజమ్స్, ఆర్టీరియో వీనస్ మాల్‌ఫార్మేషన్ల గురించి చెబుతూనే... తన ఇతర సమస్యలతో పోల్చినప్పుడు "ట్రైజెమినల్ న్యూరాల్జియా అనేది మనిషి అనుభవించే నొప్పులలో అత్యంత చెత్త నొప్పి" అంటూ తన బాధను వెల్లడించాడు. మొదట 2007లో ఆ తర్వాత 2011లో ఈ సమస్యతో సతమతమైన అతడు ఇటీవల మళ్లీ తాజాగా ఈ సమస్య తనను బాధించినట్లు వార్తలు వెలువడ్డాయి. మొదట కాస్త అరుదైనదిగా పరిగణించే ఈ వ్యాధి తాలూకు కేసులు మునపటితో పోలిస్తే ఇటీవల కాస్త ఎక్కువగా వెలుగు చూస్తున్న నేపథ్యంలో 'ట్రైజెమినల్ న్యూరాల్జియా - (టీఎన్)' గురించి తెలుసుకుందాం...

మొదట్లో ట్రైజెమినల్ న్యూరాల్జియా బాధ చెంప భాగంలో నొప్పితో మొదలవుతుంది. కొన్ని సెకన్ల పాటు భయంకరంగా వచ్చే ఈ వ్యాధి కొన్ని సెకన్లు మొదలుకొని రెండు నుంచి కొన్ని నిమిషాలు బాధిస్తూ ఉంటుంది. ఓ పదునైన కత్తితో పొడుస్తున్నట్లు, భయంకరంగా షాక్ కొడుతున్నట్టు వచ్చే ఈ వ్యాధిలో... సమయం గడుస్తున్న కొద్దీ బాధించే వ్యవధి పెరుగుతూ పోతూ చాలా భరించలేనంత వేదనాభరితంగా ఉంటుంది. రోజులో 10 నుంచి 15 సార్లవరకూ రావచ్చు. మాట్లాడేటప్పుడు, నమిలేటప్పుడు, చల్లటి నీళ్లు తాగేటప్పుడు చాలా బాధాకరమైన రీతిలో బాధిస్తుంటుంది.



డాక్టర్ జి. రంజిత్
సీనియర్ న్యూరాలజిస్ట్ & స్ట్రోక్ ఇంటర్వెన్షనిస్ట్

ట్రైజెమినల్ న్యూరాల్జియా అంటే...

మన దేహంలో మెదడు నుంచి వెన్నుపాము నుంచి అన్ని శరీర భాగాలకు నరాలు ఒక నెట్‌వర్క్‌లా వ్యాపించి ఉంటాయి. ఈ నరాల ద్వారానే మెదడు తన అన్ని శరీర భాగాలను నియంత్రిస్తుంటుంది. ముఖాన్నీ, ముఖ భాగాలను నియంత్రించే నరాన్ని 'ట్రైజెమినల్ నర్వ్' అంటారు. ఈ నరం నుంచి వచ్చే నొప్పిని 'ట్రైజెమినల్ న్యూరాల్జియా' అంటారు. మెదడులోని బ్రెయిన్ స్టెమ్ నుంచి వచ్చే ఈ నరం లోపలి చెవి (ఆడిటరీ కెనాల్) పక్క నుంచి వచ్చి ముఖంలోని చెంప దగ్గర మూడు భాగాలుగా విడిపోతుంది.

ఎందుకీ నొప్పి..?

కొందరిలో ట్రైజెమినల్ నరం పక్కన ఉండే రక్తనాళం మెలిదిరగడంతో అది 'డీమైలినేషన్' అనే ప్రక్రియకు గురవుతుంది. ప్రతి నరం చుట్టూతా ఉండే మైలిన్ అనే పొర దెబ్బతినడాన్ని డీమైలినేషన్ అంటారు. దాంతో నరం వాచి, ఈ సమస్య వస్తుంది. కొందరిలో హెర్పిస్ సింప్లెక్స్ అనే వైరస్ కారణంగా కూడా నొప్పి వస్తుంది. ఈ వైరస్ నరం లోపల ఉన్న గాసేరియస్ గాంగ్లియాన్ అనే భాగంలో ఈ వైరస్ నిద్రాణంగా ఉంటుంది. కొన్ని కారణాల వల్ల ఈ వైరస్ ఉత్తేజితం కావడంతో ఈ నొప్పి తీవ్రతరమవుతుంది.

చికిత్స... దాదాపు 90 శాతం కేసుల్లో మందులతో ఈ వ్యాధి పూర్తిగా నయమవుతుంది. అయితే పది శాతం మందిలో నొప్పి తగ్గిన తర్వాత కూడా మళ్లీ నొప్పి తిరగబెట్టేందుకు అవకాశం ఉంది. ఇప్పుడు వాడుకలో ఉన్న మందులు (ముఖ్యంగా కార్బమాజిపిన్, ఆక్స్‌కార్డమాజిపిన్, అమైట్రిప్టలిన్, గాబాపెంటిన్, ప్రిగాబాలిన్, బాక్లోఫిన్, వాల్‌ప్రోయేట్ వంటి మందులను) సరైన మోతాదులో వాడటం వల్ల దీన్ని పూర్తిగా తగ్గించవచ్చు.

చికిత్స సాధారణంగా కార్బమాజెపైన్ వంటి యాంటీకన్వల్సెంట్ మందులతో మొదలవుతుంది. మందులు పనిచేయకపోతే లేదా వాటితో తీవ్ర దుష్పరిణామాలు కనిపిస్తే శస్త్ర చికిత్స అవసరం పడవచ్చు. మైక్రోవాస్క్యులర్ డీకంప్రెషన్ అనే పిలిచే ఈ శస్త్రచికిత్సలో నరానికి వెళ్లే రక్తనాళాన్ని మెలితిప్పి వదిలేస్తారు. ఫలితంగా చాలాకాలం పాటు ఉపశమనం పొందవచ్చు. రిస్క్ తక్కువగా ఉండే రైజాటమీ, లేదా స్టీరియోటాక్టిక్ రేడియోసర్జరీ వంటి చికిత్సల్లో నర్వ్ ఫైబర్లను అడ్డుకుని తద్వారా నొప్పిని తగ్గించేందుకు ప్రయత్నాలు జరుగుతాయి.

చివరగా... ట్రైజెమినల్ న్యూరాల్జియా నొప్పి కారణంగా జీవిత నాణ్యత (క్వాలిటీ ఆఫ్ లైఫ్) చాలా తీవ్రంగా ప్రభావితమవుతుంది. ఈ నొప్పిని తట్టుకోలేక డిప్రెషన్‌కు లోనయ్యే ముప్పు కూడా ఉంటుంది. అందుకే ఆ వ్యక్తికి సంబంధించిన తీవ్రత... మందులతో కలిగే ఉపశమనం వంటి అనేక అంశాలను దృష్టిలో ఉంచుకుని వ్యక్తిగత చికిత్స ప్రణాళికతో చికిత్స అందించాల్సిన అవసరముంటుంది.

లక్షణాలు... ● ఇది మొహానికి ఒకవైపే వస్తుంది. ఎక్కువగా చెంప/దవడ భాగంలో వస్తుంది ● కొన్నిసార్లు కంటి చుట్టూ వస్తుంది ● నొప్పి చాలా తీవ్రంగా కత్తితో పొడిచినట్లుగా రావడంతో దీన్ని 'స్టాబింగ్ పెయిన్' అని అంటారు ● ఈ నొప్పి కొద్ది సెకన్లు మొదలుకొని ఒకటి రెండు నిమిషాల పాటు రావచ్చు ● రోజులో ఐదు మొదలుకొని 15 లేదా 20 సార్లు రావచ్చు ● తినేటప్పుడు, నమిలేసమయంలో, మాట్లాడేటప్పుడు ఇది తీవ్రమవుతుంది ● ఒక్కోసారి ఈ నొప్పి వచ్చినప్పుడు నోటి నుంచి కొద్దిగా లాలాజలం స్రవించవచ్చు ● మహిళల్లో ఎక్కువగా కనిపిస్తుంది. (అంటే... మహిళలు, పురుషుల్లో 60 : 40 నిష్పత్తిలో కనిపిస్తుంది) ● ముప్పయి ఏళ్లు దాటిన వారిలో ఎక్కువగా కనిపిస్తుంది.

ట్రైజెమినల్ న్యూరాల్జియాలాగే అనిపించే ఇతర జబ్బులు

- **ట్రైజెమినల్ ఆటోనామిక్ సెఫాలాల్జియా :** ఇది ఎక్కువగా పురుషుల్లో కనిపిస్తుంటుంది. కన్ను చుట్టూ ఉండే భాగంలో నొప్పి ఎక్కువగా. కంట్లో నీళ్లు వస్తుంటాయి. ముక్కు తడి అవుతుంది. నొప్పి చాలామట్టుకు ట్రైజెమినల్ న్యూరాల్జియా లాగే ఉండటంతో ఒక్కోసారి అదే అనుకుని పొరబడే అవకాశాలెక్కువ.
- **గ్లాసోఫ్యారింజియల్ న్యూరాల్జియా :** ఈ కండిషన్‌లో ముఖంలో కంటే మెడ పక్క భాగాల్లో నొప్పి ఎక్కువగా ఉంటుంది. గుటక వేసేప్పుడు ఎక్కువగా కనిపిస్తుంది.
- **పోస్ట్ హెర్పెటిక్ ట్రైజెమినల్ న్యూరాల్జియా :** మొదట ముఖ మీద నీటి పొక్కులాంటివి వచ్చి, అవి ఎండిపోయాక నల్లటి మచ్చలుగా తయారవుతాయి. అవి తగ్గిపోయిన వారం రోజుల తర్వాత విపరీతమైన నొప్పి వస్తుంది. ఇది ఎక్కువగా 50 ఏళ్లు దాటినవారిలో కనిపిస్తుంది.
- **డెంటల్ కేరిస్ :** పళ్లు పుచ్చినప్పుడు గాని, పంటి చుట్టూ ఉండే చిగురుకు గాని ఇన్ఫెక్షన్ వచ్చినప్పుడు ముఖంలో నొప్పి వస్తుంది. అయితే ఈ నొప్పి ట్రైజెమినల్ న్యూరాల్జియాలా కేవలం కొద్ది సెకన్ల పాటే ఉండకుండా రోజంతా ఉంటుంది
- ప్రమాదవశాత్తు ముఖానికి ఏదైనా దెబ్బ తగిలినప్పుడుగాని, ముఖంలోని ఎముకలు ఫ్రాక్చర్ అయినప్పుడు గాని... గాయాలు మానిన తర్వాత ముఖంలో నొప్పి రావచ్చు.
- **గ్లకోమా :** కంటికి సంబంధించిన రుగ్మత అయిన గ్లకోమాలో కంటిలోపలి ద్రవపు ఒత్తిడి లెన్స్‌పై పడినప్పుడూ ముఖంలో నొప్పి వస్తుంది.

నిర్ధారణ పరీక్షలు...

దాదాపు 90 శాతం మందిలో లక్షణాలను బట్టి ట్రైజెమినల్ న్యూరాల్జియాను నిర్ధారణ చేయవచ్చు. కొందరికి ఎమ్మారై బ్రెయిన్ బేసల్ కట్స్, ఎమ్మార్ యాంటియో బ్రెయిన్ పరీక్షలు చేసి రక్తనాళాల్లోని తేడాలను బట్టి ఈ వ్యాధిని నిర్ధారణ చేయవచ్చు. మరికొందరిలో ట్రైజెమినల్ నరంలో ట్యూమర్స్‌తో ఈ వ్యాధిని నిర్ధారణ చేయవచ్చు.



మెడనొప్పి పీకల మీదకు...

మెడ నొప్పి అనే సమస్య జీవిత కాలంలో ప్రతి వ్యక్తీ ఏదో ఓ సందర్భంలో ఎదుర్కొనేదే. అయితే అదేపనిగా నొప్పి వస్తుంటేనో లేదా మెడ నుంచి అది భుజానికీ లేదా చేతుల చివరలకో పాకుతుంటే మాత్రం కొన్ని అంశాలను జాగ్రత్తగా గమనించాలి. మెడనొప్పికి కారణాలు, నివారణ, చికిత్స వంటి అంశాలను తెలుసుకుందాం.

తీవ్రమైన మెడనొప్పి కారణంగా కొన్నిసార్లు కొంతమందిలో నొప్పి ఎక్కువైన కొద్దీ నరాల మీద ఒత్తిడి పెరిగి మూత్రవిసర్జనలో సైతం తేడాలు వచ్చి ఇతర సమస్యలకూ దారితీయవచ్చు. అందుకే ఎప్పుడో ఓసారి వచ్చే నొప్పిని మినహాయించి, పదే పదే నొప్పి వస్తున్నా లేదా దీర్ఘకాలంగా బాధిస్తున్నా డాక్టర్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.

ఎందుకీ మెడనొప్పి...

మెడ భాగంలో ఉండే వెన్నెముకలో ఏడు వెన్నుపూసలు ఉంటాయి. వాటిలో మొదటి దాన్ని అట్లాస్ అనీ, రెండో వెన్నుపూసను యాక్సిస్ అంటారు. ఈ తర్వాత ఉండే పూసలను వరసగా సి3, సి4, సి5, సి6, సి7 అని పిలుస్తారు. ఈ వెన్నుపూసల మధ్య ఉండే ప్రదేశాన్ని స్పైనల్ కెనాల్ అంటారు. దాని లోంచి వెన్నుపాము వెళ్తూ మెదడు నుంచి చేతులు, కాళ్ల చివరి వరకు నరాలను తీసుకెళ్తుంది. వెన్నుపూసకూ, వెన్నుపూసకూ మధ్యనున్న 'వర్టిబ్రల్ ఫొరామినా' అనే రంధ్రాల నుంచి వెన్నుపాము తాలూకు నరాలు బయటకు వచ్చి అన్ని అవయవాలకూ వ్యాపించి ఉంటాయి. ఈ వెన్నుపూసల మధ్యన కుషన్‌లా, షాక్ అబ్జార్బర్‌లా డిస్కులు ఉంటాయి. ఒక్కోసారి వెన్నుపూసల మధ్య కుషన్‌లా ఉండే డిస్కులు పక్కకు జారడం వల్లనో లేదా బాగా అరగడంతో నరాలపై (ప్రధానంగా చేతులకి సప్లై అయ్యే నరాలపై) ఒత్తిడి పడి మెడనొప్పి వస్తుంటుంది. మెడదగ్గర ఉండే నరాలు భుజం వరకు ఉండటంతో ఈ నొప్పి మెడ నుంచి భుజం మీదుగా చేతుల వరకు పాకుతూ బాధిస్తుంటుంది.



డాక్టర్ రవితేజా రెడ్డి కారుమూరి
సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్

నిర్ధారణ ఇలా...

మెడనొప్పి వచ్చే వారికి తొలుత ఎక్స్-రే పరీక్ష చేయిస్తారు. ఇందులో మెడ వెన్నుపూసలలో ఏమైనా తేడాలు వచ్చాయా అని తెలుస్తుంది. మరింత సునిశితమైన అంశాల కోసం ఎమ్మారై కూడా చేయించాల్సి రావచ్చు. ఏ నరంపై ఎంత ఒత్తిడి ఉంది, దేనివల్ల కలుగుతోంది, ఎముక ఏదైనా ఫ్రాక్చరైందా, నరాల్లో వాపు, గడ్డలు ఉన్నాయా... లాంటి అనేక విషయాలు ఎమ్మారైలో తెలుస్తాయి.

ఉపశమనం కోసం...

- మెడ నొప్పి వచ్చినప్పుడు వేడి నీళ్లలో మెత్తటి గుడ్డను ముంచి, పిండి మెడపైన కాపడం పెట్టాలి. ఐస్ ముక్కను బట్టలో చుట్టి కాపడం పెట్టడం కూడా మంచిదే. ఈ కాపడాల వల్ల నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.
- మెడ కండరాల్లో నొప్పి ఉన్నప్పుడు తప్పనిసరిగా మెడకు విశ్రాంతి ఇవ్వాలి. ఎందుకంటే ఆ సమయంలో మెడ కండరాలు బిగుసుకుపోయి ఉంటాయి. అలా విశ్రాంతి ఇవ్వకపోతే నొప్పి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది.
- నొప్పి ఉన్న సమయంలోనే గాక... మామూలు వేళల్లోనూ ఒకే భుజానికి బరువైన బ్యాగ్‌ల వంటివి తగిలించుకోకూడదు. ఇలా చేయడం వల్ల మెడ కండరాలు, నరాలపై ఒత్తిడి పెరిగి నొప్పి వస్తుంది.
- నడిచే సమయంలో ఒకేవైపునకు ఒంగడం సరికాదు.

చికిత్స...

- సాధారణ మెడనొప్పి అయితే పెయిన్‌కిల్లర్ ఆయింట్‌మెంట్లను రోజుకి ఐదు నుంచి ఆరుసార్లు పూయాలి.
- నొప్పి నివారణ కోసం దీర్ఘకాలం పెయిన్‌కిల్లర్స్ ఉపయోగించడం సరికాదు. ఒకవేళ పెయిన్‌కిల్లర్స్‌తో ఒకటి రెండు రోజుల్లో రిలీఫ్ రాకపోతే తప్పనిసరిగా డాక్టర్‌ను/ఆర్థోపెడిక్ సర్జన్‌ను సంప్రదించి చికిత్స తీసుకోవాలి.
- డిస్క్ తన స్థానం నుంచి పక్కకు జరగడం లాంటిది జరిగితే శస్త్రచికిత్సతో సరిదిద్దాల్సిన అవసరం పడవచ్చు.


'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 18 సంచిక: 105

SUNDAY Special | ఆదివారం 6-7-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఇంగ్లండ్ లక్ష్యం 608

బర్మింగ్‌హామ్ టెస్టులో శుబ్‌మన్ గిల్ సెంచరీ (161)తో పాటు పంత్, జడేజా అర్ధ శతకాలతో రెండో ఇన్నింగ్స్‌ను 6 వికెట్లకు 427 పరుగుల వద్ద డిక్లేర్ చేసిన భారత్.

- వివరాలు 12లో▶



ఎదురులేని నీరజ్

భారత్‌లో నిర్వహించిన తొలి అంతర్జాతీయ జావెలిన్ త్రో ఈవెంట్... 'నీరజ్ చోప్రా క్లాసిక్'లో నీరజ్ చోప్రా విజేతగా నిలిచాడు. అతను జావెలిన్‌ను 86.18 మీ. దూరం విసిరాడు.

- వివరాలు 12లో▶



వైవిధ్యమైన వాణిజ్యం

ఇరు దేశాల మధ్య వ్యాపారం, వాణిజ్యాన్ని మరింత వైవిధ్యంగా తీర్చిదిద్దుకోవాలనిభారత్, అర్జెంటీనా నిర్ణయించినట్లు మోదీ చెప్పారు.

- వివరాలు 6లో▶



ఒకే వేదికపై రాజ్, ఉద్ధవ్

వరుసకు సోదరులైన ఉద్ధవ్ ఠాక్రే, రాజ్ ఠాక్రే దాదాపు రెండు దశాబ్దాల అనంతరం ఒకే వేదికను పంచుకున్నారు.

- వివరాలు 6లో▶



పటౌడీ కుటుంబానికి షాక్

సైఫ్ కుటుంబానికి చెందిన రూ.15 వేల కోట్ల ఆస్తులకు వారసులెవరన్నదానిపై మళ్లీ విచారించాలని మధ్యప్రదేశ్ హైకోర్టు ఆదేశించింది.

- వివరాలు 6లో▶



రోజుకు 10 గంటలు...

ఇకపై వాణిజ్య సంస్థల్లో రోజుకు పది గంటల వరకు విధులు నిర్వర్తించే అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

- వివరాలు 2లో▶

పాలిసెట్ డేటా ఎరేజ్?

వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్య



- విద్యార్థుల ఆప్షన్ల డేటా మొత్తం తారుమారు!
- ఆగిపోయిన సీట్ల కేటాయింపు ప్రక్రియ
- షెడ్యూల్ ప్రకారం శుక్రవారమే ఇవ్వాలి
- శనివారం రాత్రి వరకూ పత్తాలేని ప్రకటన
- నోరు విప్పని అధికారులు.. అంతా గందరగోళం
- ఇంజనీరింగ్ వెబ్ ఆప్షన్ల ప్రక్రియ కూడా డౌటే
- శనివారం వరకూ వెబ్‌సైట్‌లో కనిపించని కాలేజీలు
- షెడ్యూల్ ప్రకారం నేటి నుంచే ఇంజనీరింగ్ వెబ్ ఆప్షన్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర సాంకేతిక విద్య విభాగంలో గందరగోళం నెలకొంది. పాలిసెట్ సీట్ల కేటాయింపు ఆగిపోయింది. ఇంజనీరింగ్ వెబ్ ఆప్షన్ల ప్రక్రియ నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. ఏం జరుగుతుందో తెలియని స్థితి ఏర్పడింది. విషయం తెలుసుకునేందుకు మీడియా శనివారం రాత్రి వరకూ ప్రయత్నించినా అధికారులెవరూ అందుబాటులోకి రాలేదు. కిందిస్థాయి సిబ్బంది కూడా అంటీముట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఒకరిద్దరు మాత్రం సాఫ్ట్‌వేర్‌లో ఏదో సమస్య వచ్చిందని తెలిపారు. మరికొందరు వెబ్‌సైట్‌లో విద్యార్థుల డేటా మొత్తం ఎగిరిపోయిందని చెప్పారు. తాము చెప్పినట్టు ఎవరికీ చెప్పొద్దంటూ వారు వేడుకున్నారు. దీన్నిబట్టి సరిదిద్దలేని తప్పులేవో సాంకేతిక విద్య విభాగంలో జరిగినట్టు తెలుస్తోంది.

పాలిసెట్ సీట్ల కేటాయింపు ఏమైంది?

పాలిసెట్ సీట్ల కేటాయింపు ఈ నెల 4వ తేదీనే ఉంటుందని కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో సాంకేతిక విద్యా మండలి ప్రకటించింది. కానీ 4వ తేదీ రాత్రివరకూ ప్రకటించలేదు. కౌన్సెలింగ్ క్యాంపు అధికారులను వివరణ కోరితే పాలనాపరమైన అనుమతులు రావాల్సి ఉందని ఒకసారి, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై స్పష్టత రావాల్సి ఉందని మరోసారి బదులిచ్చారు. శనివారం ఉదయమే సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపారు. పాలిటెక్నిక్ సీట్ల కోసం దాదాపు 22 వేల మంది ఎదురు చూస్తున్నారు. శనివారం రాత్రివరకు సీట్లు ఖరారు చేయలేదు. దీనిపై అధికారులు స్పందించడం లేదు. విశ్వసనీయ సమాచారం ప్రకారం వేల మంది విద్యార్థుల డేటా తారుమారైనట్టు తెలిసింది. సర్వర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తినట్టు సమాచారం. విద్యార్థులు వెబ్‌సైట్‌లో పెట్టిన ఆప్షన్లు మొత్తం మారిపోయినట్టు తెలిసింది. దీనిపై సిబ్బంది, అధికారుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకోవడం, ఇది ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో సమస్య మరింత జటిలమైందని తెలియవచ్చింది. సిబ్బంది అజాగ్రత్తే దీనికి కారణమని తెలుస్తోంది. దీనివల్లే సీట్ల కేటాయింపు ఆగిపోయినట్టు సమాచారం.

ఇంజనీరింగ్ కథేంటి?

ఇంజనీరింగ్ వెబ్ ఆప్షన్లు ఆదివారం నుంచి మొదలవ్వాలి. అన్ని యూనివర్సిటీలు అనుబంధ గుర్తింపు కాలేజీలు, సీట్లు, కోర్సుల వివరాలను ప్రభుత్వానికి పంపాయి. ఎక్కువ ప్రైవేటు కాలేజీలున్న జేఎన్టీయూహెచ్ కూడా శనివారం మధ్యాహ్నం గుర్తింపు వివరాలన్నీ సాంకేతిక విద్యా మండలి కార్యాలయానికి పంపింది. వీటిని అప్‌లోడ్ చేస్తేనే విద్యార్థులు ఆదివారం ఉదయం నుంచి వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి వీలుంటుంది. కానీ, శనివారం రాత్రి పొద్దుపోయే వరకు ఈ ప్రక్రియ పూర్తవ్వకపోవడంతో అసలు వెబ్ ఆప్షన్లు ఉంటాయా? షెడ్యూల్‌ను అనుసరిస్తారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సాంకేతిక విద్య ఉన్నతాధికారి, ఎప్‌సెట్ క్యాంప్ అధికారి, జేఎన్టీయూహెచ్ రిజిస్ట్రార్ శనివారం ఉదయం 11 గంటల నుంచే

మిగతా 2వ పేజీలో ▶

సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ సూర్యకాంత్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో హైకోర్టు ఏసీజే జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ శామ్‌కోషి



చిన్నారుల రక్షణ అందరి విధి

న్యాయమే కాదు.. తలెత్తుకుని జీవించే ప్రోత్సాహం ఇవ్వాలి

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్

- చిన్నారులపై లైంగిక వేధింపుల నిందితుల్లో పరిచయస్తులే అధికం
- హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్
- బాలలపై లైంగిక వేధింపుల నిరోధంపై సదస్సు ప్రారంభం
- పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, న్యాయమూర్తులు, మంత్రులు

సాక్షి, హైదరాబాద్: చిన్నారుల రక్షణ కొన్ని సంస్థల విధి మాత్రమే కాదని, దేశంలోని ప్రతి పౌరుడి నైతిక బాధ్యత అని జాతీయ న్యాయ సేవల ప్రాధికార సంస్థ (నల్సా) చైర్మన్, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. లైంగిక వేధింపులకు గురైన చిన్నారుల కోసం స్నేహపూర్వక కోర్టుల ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు. రాష్ట్రంలో భరోసా కేంద్రాలు ఆ మేరకు తోడ్పాటునందిస్తున్నాయని ప్రశంసించారు. తెలంగాణ పోలీసు

మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

మహిళా సాధికారతలో తెలంగాణ టాప్



మహిళా సాధికారతలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని ఉపముఖ్యమంత్రి భట్టి చెప్పారు. మహిళల సంక్షేమం, అభివృద్ధి కోసం తాము చేపట్టిన కార్యక్రమాలను ఇతర రాష్ట్రాలు వచ్చి చూస్తున్నాయన్నారు.

- వివరాలు 3లో▶

వైద్య సీట్ల పెంపు..ఫ్యాకల్టీ సమస్యకు చెక్



దేశంలో వైద్య విద్య సామర్థ్యాన్ని విస్తరించి, బోధనా సిబ్బంది (ఫ్యాకల్టీ) కొరతను అధిగమించే దిశగా ఎన్ఎంసీ కీలక నిర్ణయం తీసుకుంది. ఈమేరకు కొత్త నిబంధనలను శనివారం ఢిల్లీలో విడుదల చేసింది.

- వివరాలు 14లో▶

అధికారులు చట్టాలు తెలుసుకోవాలి



కనీస చట్టాలు తెలియకుండా అధికారులు విధులు నిర్వహిస్తున్నారని హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఆయా శాఖల పరిధిలో పనిచేసే అధికారులు చట్టాలు తెలుసుకోవాలని సూచించింది.

- వివరాలు 2లో▶

ఓటరుగా చెన్నమనేని పేరు తొలగింపు



వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ బాబు పేరును ఓటర్ జాబితా నుంచి తొలగిస్తూ ఆయన స్వగృహం గేటుకు రెవెన్యూ అధికారులు శనివారం నోటీసు అంటించారు. దేశ చరిత్రలోనే ఇలాంటి చర్య ఇదే ప్రథమమని అంటున్నారు.

- వివరాలు 2లో▶

త్వరలో కొత్త స్టాంపుల విధానం

- వచ్చే శాసనసభ సమావేశాల్లోనే బిల్లు
- మహిళలకు స్టాంపు డ్యూటీ తగ్గించే యోచన
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి



సాక్షి, హైదరాబాద్: సాధారణ ప్రజలకు ఎలాంటి నష్టం కలిగించకుండా, వ్యాపార ఒప్పందాల విషయంలో పారదర్శకత ఉండేలా రాష్ట్రంలో కొత్త స్టాంపుల విధానాన్ని అమల్లోకి తెస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా భారతీయ స్టాంపుల చట్టాన్ని అనుసరించి వచ్చే శాసనసభ సమావేశాల్లోనే తెలంగాణ స్టాంపుల చట్టం సవరణ బిల్లు–2025ను ప్రవేశపెట్టేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. ఈ సవరణ బిల్లుపై శనివారం ఆయన సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి డీఎస్ లోకేశ్‌కుమార్, న్యాయ వ్యవహారాల కార్యదర్శి రెండ్ల తిరుపతి, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హన్మంతులు పాల్గొన్నారు. కాగా గత ప్రభుత్వ హయాంలో ఇందుకు సంబంధించి తెచ్చిన బిల్లుపై కేంద్రం అభ్యంతరాలు వ్యక్తం చేయడం, వాటిని నివృత్తి చేసిన తర్వాత కూడా తిప్పి పంపిన విషయాన్ని అధికారులు మంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన పొంగులేటి.. 2021లో ప్రవేశపెట్టిన బిల్లును ఉపసంహరించుకుని, ప్రస్తుత కాలానికి అనుగుణంగా 2025 బిల్లును తీసుకువస్తామని చెప్పారు. కొత్త విధానం పకడ్బందీగా ఉండేలా బిల్లును

మిగతా 5వ పేజీలో ▶



శనివారం బీజేపీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరిస్తున్న రాంచందర్‌రావు. చిత్రంలో కిషన్‌రెడ్డి, డీకే అరుణ, మురళీధర్ రావు తదితరులు

ధర్మయుద్ధం ప్రారంభిస్తున్నాం

- ప్రతి గ్యారంటీని అమలు చేసే వరకు అధర్మ ప్రభుత్వంపై పోరాడతాం
- సామాజిక న్యాయమంటే మోదీని, బీజేపీని తిట్టడం కాదు
- ఏడాదిన్నరలో ఏం చేశారో చెప్పకుండా చిల్లర మాటలు చెప్పారు: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు
- ఆరు గ్యారంటీలు అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అధర్మ పాలన సాగుతోందని.. ఎన్నో హామీలతో మభ్యపెట్టి ఓట్లు దండుకున్న కాంగ్రెస్... ఇప్పుడు వాటిని అమలు చేయకుండా మోసగిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు విమర్శించారు. ప్రజలను వంచించిన అధర్మ ప్రభుత్వంపై ధర్మ యుద్ధాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన రాంచందర్‌రావు శనివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో అప్పుల కుప్పలు..

'బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణను సర్వనాశనం చేశాయి. పదేళ్లపాటు పాలించిన బీఆర్ఎస్ రాష్ట్రాన్ని

మిగతా 13వ పేజీలో ▶

కొండారెడ్డిపల్లికి వస్తావా? కొడంగల్‌కు రమ్మంటావా?

- రైతులకు ఎవరు మంచి చేశారో చర్చకు సిద్ధం
- మా పార్టీ తరఫున రేవంత్ సవాలును స్వీకరిస్తున్నా
- చర్చకు ప్రిపేర్ అయ్యేందుకు 72 గంటల టైమ్ ఇస్తున్నా
- లేదంటే 8న ప్రెస్‌క్లబ్‌లో 11 గంటలకు రెడీ: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: 'రైతులకు ఎవరు మంచి చేశారో చర్చిద్దాం.. అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రొటీన్‌గా రంకెలు వేస్తూ చాలెంజ్‌లు చేస్తున్నారు. ఆయన ముచ్చట తీర్చేందుకు బీఆర్ఎస్ తరఫున నేను సిద్ధం. ఆయన స్థాయికి కేసీఆర్ రావాల్సిన అవసరం లేదు. రేవంత్ సొంతూరు కొండారెడ్డిపల్లి లేదా ఆయన ప్రాతినిథ్యం వహిస్తున్న కొడంగల్‌లో చర్చకు సిద్ధం. లేదంటే మా నాయకుడు కేసీఆర్ సొంతూరు చింతమడక, ఆయన నియోజకవర్గం గజ్వేల్ అయినా సరే. అసెంబ్లీలో పెడతావో, అంబేడ్కర్ విగ్రహం దగ్గర పెడతావో చర్చ నీ ఇష్టం. వేదిక, తేదీ, సమయం అన్నీ సీఎం ఇష్టమున్నట్లుగా నిర్ణయించుకోవచ్చు. బేసిక్స్ కూడా తెలియని సీఎం.. చర్చకు ప్రిపేర్ అయ్యేందుకు 72 గంటల గడువు ఇస్తున్నా. లేదంటే ఈ నెల 8న హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 11 గంటలకు

మిగతా 3వ పేజీలో ▶

ప్రెస్ క్లబ్‌లో కాదు.. అసెంబ్లీలో చర్చిద్దాం

- కేటీఆర్ సవాల్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్
- శాసనసభ సభ్యుడిగా చర్చించాల్సింది శాసన సభలోనేనని వెల్లడి



- వివరాలు 3లో

ఇదండీ సంగతి



బీఐఎస్ గుర్తింపు లేని హెల్మెట్లు వాడొద్దు

- ఐఎస్ఐ మార్క్ తప్పనిసరి
- ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని కలెక్టర్లకు కేంద్రం ఆదేశం



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో రోజురోజుకు రోడ్డు ప్రమాదాలు పెరుగుతుండటంతో వాహనదారుల భద్రత విషయంలో కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోంది. ద్విచక్ర వాహనదారుల భద్రత కోసం బీఐఎస్ గుర్తింపు గల ఐఎస్ఐ మార్క్ హెల్మెట్లు మాత్రమే వాడాలని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ స్పష్టం చేసింది. నాణ్యతలేని హెల్మెట్లు ప్రమాదాల సమయంలో

మిగతా 2వ పేజీలో ▶

కృష్ణమ్మ దూకుడు



తుంగభద్ర డ్యాం నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

ఎగువన వర్షాలతో పోటెత్తుతున్న వరద

- ఆల్మట్టి నుంచి జూరాల వరకు అన్ని ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేత
- శ్రీశైలం జలాశయంలో పెరుగుతున్న నీటిమట్టం
- ప్రస్తుతం 1.95 లక్షల క్యూసెక్కుల ప్రవాహం
- 877.4 అడుగుల వద్ద 175 టీఎంసీలకు చేరిన నిల్వ
- రెండురోజుల్లో గేట్లు ఎత్తివేసే అవకాశం!

సాక్షి, హైదరాబాద్: కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. ఎగువ పరీవాహకంలో కురుస్తున్న వర్షాలతో వరద పోటెత్తుతోంది. ప్రాజెక్టులు ఒక్కొక్కటిగా దాటుకుంటూ శ్రీశైలం వైపు పరుగులు తీస్తోంది. శ్రీశైలం ప్రాజెక్టు ఎగువన ఉన్న ప్రధాన ప్రాజెక్టులైన ఆల్మట్టి, నారాయణపూర్, ఉజ్జయిని, జూరాల, తుంగభద్ర జలాశయాల గేట్లను ఇప్పటికే ఎత్తివేసి నీళ్లను కిందకు విడుదల చేస్తున్నారు. దీంతో శ్రీశైలంలో నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. శనివారం ఉదయం 6 గంటలకు 1,20,149 క్యూసెక్కుల వరద ఉండగా, సాయంత్రం 7 గంటల నాటికి ఏకంగా 1,95,894 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో జలాశయంలో నీటి మట్టం 877.4 అడుగులకు చేరగా, నిల్వలు 175.1 టీఎంసీలకు పెరిగాయి. విద్యుదుత్పత్తి ద్వారా శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 67,019 క్యూసెక్కులను దిగువన నాగార్జునసాగర్‌కి విడుదల చేస్తున్నారు.

మరో 50 టీఎంసీలు వస్తే..

శ్రీశైలం ప్రాజెక్టు గరిష్ట నీటి మట్టం 885 అడుగులు. పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలు. ప్రాజెక్టు నిండాలంటే మరో 50 టీఎంసీలు అవసరం. అయితే వరద నిర్వహణలో భాగంగా జలాశయంలో నిల్వలు 200 టీఎంసీలకు చేరకముందే గేట్లను ఎత్తి వరదను దిగువకు విడుదల చేయనున్నారు. వరద తీవ్రత మరింత పెరిగితే సోమవారమే గేట్లు ఎత్తే అవకాశం ఉంది.

ఎగువ నుంచి స్థిరంగా వరద

ఎగువన ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌లలోకి వరద ప్రవాహం స్థిరంగా

మిగతా 13వ పేజీలో ▶

ముందు మీ ఇల్లు చక్కదిద్దుకోండి!

- భారత ఒలింపిక్ సంఘంలో లోపాలను సరిదిద్దుకోండి
- మీ ఆటగాళ్ల పేలవ ప్రదర్శన, డోపింగ్‌పైనా దృష్టిపెట్టండి
- 2036 ఒలింపిక్స్ నిర్వహణకు అవకాశం ఇవ్వాలన్న భారత్ ప్రతిపాదనపై ఐఓసీ ఘాటు వ్యాఖ్య

సాక్షి, న్యూఢిల్లీ: అహ్మదాబాద్ వేదికగా 2036 ఒలింపిక్స్‌ను నిర్వహించాలనుకున్న భారత్ ఆశలపై అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) నీళ్లుచల్లింది. ఈ విషయంలో భారత్‌కు 'కనువిప్పు' కలిగే రీతిలో సుతిమెత్తగా మందలించింది. ముందు మీ 'ఇంటి'ని చక్కదిద్దుకోవాలంటూ చురకలంటించింది. భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ)లో సంస్థాగత పాలనా

మిగతా 14వ పేజీలో ▶

క్లుప్తంగా...

12న ఓయూకు సుప్రీం సీజేఐ రాక



ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీకి ఈ నెల 12వ తేదీన సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ రానున్నారు. 'భారత రాజ్యాంగం–బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భాగస్వామ్యం'అనే అంశంపై వర్సిటీలో జరగనున్న సదస్సులో ఆయన ప్రసంగించనున్నట్లు ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ శనివారం తెలిపారు. ఠాగూర్ ఆడిటోరియంలో మధ్యాహ్నం 3.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని పేర్కొన్నారు.

కొత్తగా 201 మంది డాక్టర్ల నియామకం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వైద్య, ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేసే ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం కొత్త వైద్యుల నియామకాలపై దృష్టి పెట్టింది. శనివారం 201 మంది డాక్టర్ల నియామకానికి సంబంధించిన సెలక్షన్ లిస్టును విడుదల చేసింది. ఆయుష్‌లో 156 పోస్టుల భర్తీతో ఈ విభాగంలో వైద్య సేవలు మరింత మెరుగు కానున్నాయి. ఎంఎన్‌జే కేన్సర్ హాస్పిటల్‌లో కొత్తగా 45 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు డాక్టర్ల నియామకంతో రాష్ట్రంలోని ఏకైక ప్రభుత్వ కేన్సర్ ఆసుపత్రిలో వైద్య సేవలు మరింత మెరుగయ్యే అవకాశం ఉంది.

డెంగీ పేరుతో దోపిడీని అడ్డుకోండి

ప్రజలను భయపెట్టే ఆస్పత్రులపై కఠిన చర్యలు: దామోదర



సాక్షి, హైదరాబాద్: డెంగీ, ప్లేట్‌లెట్ల పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే ప్రైవేటు ఆస్పత్రుల విషయంలో వైద్యాధికారులు కఠినంగా వ్యవహరించాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. జీహెచ్‌ఎంసీతో పాటు కొన్ని జిల్లాల్లో పెరుగుతున్న డెంగీ కేసుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణ, నియంత్రణపై శనివారం అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. వ్యాధుల తీవ్రత ఎక్కువగా ఉన్న జీహెచ్‌ఎంసీ జోన్లకు స్పెషల్ ఆఫీసర్లను నియమించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణపై కలెక్టర్లతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించాలని ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తూకు సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రతి సోమవారం నివేదిక ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆరోగ్యశాఖ రూపొందించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. కాగా, రాష్ట్రంలో డెంగీ, ఇతర వ్యాధుల స్థితిగతులపై వైద్యాధికారులు మంత్రికి నివేదిక అందజేశారు. 19 జిల్లాల్లో పది కంటే తక్కువ కేసులు నమోదవగా, మిగిలిన జిల్లాల్లో పదికంటే ఎక్కువ కేసులు వెలుగు చూశాయని చెప్పారు.

'మోడల్' విద్యార్థులు భళా

'బాసర'కు 243 మంది ఎంపిక

సాక్షి, హైదరాబాద్: బాసర ట్రిపుల్ ఐటీకి 243 మంది మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు మోడల్ స్కూల్స్ అదనపు సంచాలకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీట్లు అధికంగా సాధించిన పాఠశాలల్లో జక్రాన్‌పల్లి, నైలంకొండపల్లి, రహీంఖాన్‌పేట, నామాపూర్, మహబూబాబాద్ ఉన్నాయి.

'టీజీటెట్-2025' ప్రాథమిక కీ విడుదల

సాక్షి, హైదరాబాద్: టీజీటెట్–2025 పరీక్ష ప్రాథమిక కీ విడుదలైంది. పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో కీని అందుబాటులో ఉంచినట్లు పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు, టీజీటెట్ చైర్మన్ ఇ.నవీన్‌నికోలస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ 'కీ'లో అభ్యంతరాలుంటే.. ఈనెల 8వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు ఆన్‌లైన్‌లో పూర్తి ఆధారాలతో సమర్పించాలని సూచించారు.

ఖరీదైనవే కొంటున్నారు..

- 'ప్రీమియం' వినియోగ వస్తువుల అమ్మకాల్లో పెరుగుదల
- ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు.. అన్నింటా కొనుగోళ్ల కళకళ
- అల్ట్రా ప్రీమియం ఫోన్ల అమ్మకాల్లో 20% వృద్ధి
- రూ.10 లక్షలకు పైగా ధర గల కార్ల అమ్మకాలు జూమ్

భారతదేశంలో 'మాస్–మార్కెట్' అన్నది క్రమంగా 'పాప్–మార్కెట్'గా మారుతోంది. టీవీలు, స్మార్ట్‌ఫోన్‌లు, కార్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ కొనేందుకు వినియోగదారులు 'ఉన్నంతలోనే' సరిపెట్టుకోవటం లేదు. ఖరీదైనవాటిని కొనడానికి ఇష్టపడుతున్నారు. ఈ ఏడాదిలో ఖరీదైన కార్లు, టీవీలు, ఏసీలు, ఫ్రిజ్‌లు, ద్విచక్ర వాహనాలు అమ్మకాలు గతేడాదితో పోలిస్తే పెరగడమే ఇందుకు నిదర్శనం.



2025 జనవరి – ఏప్రిల్ మధ్య మొత్తం స్థూల అమ్మకాల్లో ఖరీదైన టీవీలు, ఏసీలు, రిఫ్రిజిరేటర్‌లు, వాషింగ్ మెషీన్లు, కార్లు, ద్విచక్ర వాహనాల అమ్మకాలు 5 శాతం పెరిగినట్లు కన్స్యూమర్ ఇంటలిజెన్స్ ఏజెన్సీ 'నీల్సన్‌ఐక్యూ' వెల్లడించింది. 2025 తొలి నాలుగు నెలల్లో 55 అంగుళాల 4కె రిజల్యూషన్ టీవీల అమ్మకాలు.. మొత్తం టీవీల మార్కెట్ అమ్మకాలలో 41 శాతం. గత ఏడాది ఇదే కాలానికి ఇది 38 శాతం. అలాగే 8 కిలోలు, ఆపై సామర్థ్యం గల ఫ్రంట్–లోడింగ్ వాషింగ్ మెషీన్ల అమ్మకాలు 11 నుండి 16 శాతానికి, రిఫ్రిజిరేటర్ల అమ్మకాలు 9 శాతం 10 శాతానికి పెరిగాయని 'నీల్సన్ ఐక్యూ' తెలిపింది.

- సాక్షి, స్పెషల్ డెస్క్



ఫోనంటే అల్ట్రా ప్రీమియమే!

'కౌంటర్ పాయింట్ రీసెర్చ్' సంస్థ డేటా ప్రకారం స్మార్ట్‌ఫోన్‌లలో ఈ ఏడాది జనవరి–మే మధ్యకాలంలో రూ.45,000కుపైగా ధర ఉన్న అల్ట్రా ప్రీమియం సెగ్మెంట్‌లో 20 శాతం, రూ. 30,000కుపైగా ధర ఉన్న ప్రీమియం సెగ్మెంట్‌లో 2 శాతం పెరుగుదల కనిపించింది. ఈ ధోరణి అన్ని రకాల ఉత్పత్తుల సగటు అమ్మకపు ధర (ఎ.ఎస్.పి.) పెరగటానికి దోహదపడింది. స్మార్ట్‌ఫోన్‌లలో ఈ ఎ.ఎస్.పి. ఈ ఏడాదిలో మొదటిసారిగా రూ.26 వేలకు చేరుకుంది. గతేడాది ఇది రూ.25వేలు.

ధర తక్కువ కార్ల స్పీడు తగ్గింది

మరోవైపు – దిగువ, మధ్య ఆదాయ తరగతుల వారు.. తమ వేతనాల్లో తక్కువ పెరుగుదల, ద్రవ్యోల్బణం కారణంగా ఎంట్రీ–టు–మిడ్ సెగ్మెంట్ ఉత్పత్తులను కొనుగోలు చేయకపోవటంతో ఈ ఏడాది ఇప్పటివరకు మొత్తం ఎలక్ట్రానిక్స్, కార్ల మార్కెట్‌లలో అమ్మకాలు స్వల్పంగా తగ్గాయి. ఫలితంగా, మొత్తం ప్యాసింజర్ వాహనాల అమ్మకాలలో 10 లక్షల కంటే తక్కువ ధర ఉన్న కార్ల అమ్మకాలు జనవరి–మే కాలంలో.. ఇప్పటివరకు ఎన్నడూ లేని విధంగా 51.4 శాతానికి పడిపోయాయని 'జాటో డైనమిక్స్' రిసెర్చ్ సంస్థ తెలిపింది. 2024 మొదటి 5 నెలల్లో ఇది 53.4 శాతం.

పుంజుకోనున్న అమ్మకాలు

ద్రవ్యోల్బణం నియంత్రణలోకి రావటం, రిజర్వు బ్యాంకు వడ్డీ రేట్లను తగ్గించటం, ఈ ఆర్థిక సంవత్సరం నుండి ఆదాయపు పన్ను రేట్లు తగ్గటం వంటి కారణాల వల్ల రాబోయే నెలల్లో అమ్మకాలు పుంజుకుంటాయని మార్కెటర్లు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అడాస్ (అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్స్) టెక్నాలజీ ఉన్న హై-ఎండ్ కార్ల అమ్మకాల వాటా 2023లో 2.8 శాతంగా ఉండగా, 2024లో ఐదింతలు పెరిగి 15 శాతానికి చేరుకుంది.


రూ.10 లక్షలకు పైగా ధర గల కార్ల అమ్మకాలు 2020తో పోలిస్తే.. ఈ ఏడాదిలో ఇప్పటికే సుమారు రెండింతలయ్యాయి. మొత్తం కార్ల అమ్మకాల్లో 2020లో ఇవి 25 శాతమే. 2024లో 47 శాతానికి పెరిగాయి.

ఈ ఏడాది కార్ల మార్కెట్ స్వల్పంగా తగ్గటంతో పాటు, గత పదేళ్లలో ఎన్నడూ లేనంతగా ఈ వేసవిలో రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండిషనర్‌ల అమ్మకాలు క్షీణతను చవి చూడటంతో మొత్తంగా ఎలక్ట్రానిక్ అమ్మకాలు 10 శాతానికి పైగా పడిపోయాయి. అయితే అదే సమయంలో కన్స్యూమర్ ఫైనాన్స్ వచ్చి, ప్రీమియం ఉత్పత్తుల అమ్మకాల పెరుగుదలకు దోహదపడింది.

అధికారులు చట్టాలు తెలుసుకోవాలి

శిఖం పట్టా భూమిలో మీరెలా జోక్యం చేసుకుంటారు?

- నీటిపారుదల శాఖ అధికారులపై హైకోర్టు మండిపాటు
- శిఖం సర్కారీ భూమి, శిఖం పట్టా భూమి మధ్య తేడా ఉంది
- అధికారులను కూర్చోబెట్టి చట్టాలు నేర్పాలన్న న్యాయమూర్తి
- పిటిషనర్లు పరిహారం పొందడానికి అర్హులని స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కనీస చట్టాలు తెలియకుండా అధికారులు విధులు నిర్వహిస్తున్నారని హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఆయా శాఖల పరిధిలో పనిచేసే అధికారులు చట్టాలు తెలుసుకోవాలని సూచించింది. వీలైతే వారికి తరగతులు నిర్వహించాలని ఉన్నతాధికారులను ఆదేశించింది. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట్ మండలం మల్కపేట చెరువులోకి కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని నింపేందుకు చేపట్టిన కాలువ పనులను ఆపేయాలని కోరుతూ తండు చంద్రయ్య సహా మరో 10 మంది రైతులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పనుల కారణంగా తమ పట్టా భూములు శాశ్వతంగా ముంపునకు గురవుతాయని తెలిపారు. దీనిపై మే 9న తాము అధికారులకు వినతిపత్రం సమర్పించినా ఫలితం లేదని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది.

వాదనలిలా..: పిటిషనర్ తరపున న్యాయవాది సందీప్ వాదనలు వినిపించారు.. 'శిఖం సర్కారీ భూములు.. తెలంగాణ భూమి రెవెన్యూ చట్టం 1317 ఫస్లీలోని సెక్షన్ 24 ప్రకారం సర్కారువేనన్నారు. శిఖం పట్టా భూములు ప్రైవేట్ భూములు..'అని నివేదించారు. భూసేకరణ చట్టం 2013 ప్రకారం పిటిషనర్లు పరిహారానికి అర్హులని, పరిహారం చెల్లించిన తర్వాత కాలువ నిర్మాణం చేపట్టవచ్చునని చెప్పారు. 'ఎఫ్‌టీఎల్‌లో ఉన్న పిటిషనర్ల భూములు ఎప్పుడూ నీటిలో మునిగే ఉంటున్నాయి. పిటిషనర్లు తరచుగా ప్రధాన కాలువ పనులను అడ్డుకుంటున్నారు. తమ భూములకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వచ్చే భూములకు ఎలాంటి పరిహారం చెల్లించాల్సిన అవసరం లేదు..'అంటూ ప్రభుత్వ న్యాయవాది వాదించారు. ఇరుపక్షాల వాదనల అనంతరం న్యాయమూర్తి తాజాగా తీర్పు వెలువరించారు.

పిటిషనర్లు సంబంధిత ఆస్తికి పట్టాదారులు

'శిఖం పట్టా అంటే ఏమిటి? అందులో ఎంతవరకు జోక్యం చేసుకోవచ్చన్నది కూడా నీటి పారుదల శాఖ అధికారులకు తెలియడం లేదు. ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్)లో ఉన్నంత మాత్రాన ప్రతీది సర్కార్ భూమి కాదు. శిఖం సర్కారీ, శిఖం పట్టా భూములు వేర్వేరుగా ఉంటాయి. శిఖం సర్కారీ భూములు పూర్తిగా ప్రభుత్వానివే. అందులో అధికారులు ఏ పనులైనా చేపట్టవచ్చు. కానీ శిఖం పట్టా భూములు ప్రైవేట్‌వి. మామూలుగా వర్షాకాలం నీటి మునక ఉంటుంది కనుక సాగు సాధ్యంకాదు. రబీ సీజన్‌లో మునక తగ్గినప్పుడు వాటిలో పట్టాదారులు పంటను సాగుచేస్తారు. ఆ భూములపై పూర్తి హక్కు వారిదే. ప్రభుత్వ అవసరం కోసం ఆ భూములు తీసుకోవాలని భావిస్తే శిఖం పట్టాదారులు పరిహారానికి అర్హులు. ఎఫ్‌టీఎల్‌లో ఉంది కదా అని పట్టాభూముల నుంచి కాల్వ తవ్వకం చేపడతామంటే ఎలా? పిటిషనర్లు సంబంధిత ఆస్తికి పట్టాదారులు. అధికారులందరినీ కూర్చోబెట్టి నీటి పారుదల, రెవెన్యూ చట్టాలు నేర్పించండి. కాల్వల తవ్వకానికి ఈ న్యాయస్థానం వ్యతిరేకం కాదు..'అని జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి స్పష్టం చేశారు.

రోజుకు 10 గంటలు పనిచేయొచ్చు!

- కానీ వారానికి 48 పని గంటలు మించొద్దు
- సులభతర వాణిజ్య విధానానికి సర్కారు నిర్ణయం
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: సులభతర వాణిజ్య విధానం కోసం వాణిజ్య సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల పనివేళల్లో మార్పులు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇకపై వాణిజ్య సంస్థల్లో (దుకాణాలు మినహా) పనిచేసే ఒక ఉద్యోగి రోజుకు పది గంటల వరకు విధులు నిర్వర్తించే అవకాశం కల్పించింది. అయితే వారంలో 48 గంటలకు మించి పనిచేయకూడదనే నిబంధన విధించింది. రోజుకు 10 గంటల పనికి అవకాశం ఇచ్చినా, ఆరుగంటల తర్వాత అరగంట పాటు విశ్రాంతి ఇవ్వాలి. ఓవర్ టైమ్ పనిచేసే ఉద్యోగి ప్రత్యేక సందర్భాల్లో ఆరుగంటలకు మించి పనిచేయొద్దు. ఈ లెక్కన ప్రత్యేక సందర్భాల్లో ఒకరోజుకు గరిష్ఠంగా 12 గంటలు దాటి పనిచేసే అవకాశం లేదు. వారంలో 48 గంటల కంటే అధిక గంటలు పనిచేసినప్పుడు.. అందుకు తగిన అదనపు భత్యం చెల్లిస్తూనే.. ఒక త్రైమాసికంలో 144 పనిగంటలు దాటకూడదు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు అతిక్రమిస్తే సదరు వాణిజ్య సంస్థకు ప్రభుత్వం నుంచి అందుతున్న మినహాయింపులు, రాయితీలను ఎలాంటి నోటీసు లేకుండానే రద్దు చేస్తుంది. ఈ మేరకు రాష్ట్ర కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్ శనివారం నోటిఫికేషన్ జారీ చేశారు.

వీఆర్వో, వీఆర్‌ఏలకు మరో అవకాశం

జీపీవో నియామకాల కోసం మరోసారి అర్హత పరీక్ష

- రెవెన్యూ ఉద్యోగ సంఘాల భేటీలో మంత్రి పొంగులేటి



పొంగులేటికి వినతిపత్రం ఇస్తున్న లచ్చిరెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: గ్రామ పాలనాధికారుల (జీపీవో) నియామకం కోసం పూర్వ వీఆర్వోలు, వీఆర్‌ఏలకు మరోసారి అవకాశం కల్పిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. శనివారం సచివాలయంలో ఆయన రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేశ్ కుమార్‌తో కలసి రెవెన్యూ ఉద్యోగ సంఘాలతో సమావేశమయ్యారు. ఇందులో జీపీవోల నియామకంపై సుదీర్ఘంగా చర్చించారు. జీపీవోల నియామకాల కోసం నిర్వహించిన పరీక్షలో 3,454 మంది అర్హులుగా ఎంపికయ్యారని అధికారులు వివరించగా, అనివార్య కారణాలతో కొందరు వీఆర్వోలు, వీఆర్‌ఏలుగా పనిచేసిన వారు ఆ పరీక్షకు హాజరు కాలేదని, వారికి మరోమారు అవకాశం ఇవ్వాలని రెవెన్యూ సంఘాల నేతలు కోరారు. ఇందుకు మంత్రి పొంగులేటి సానుకూలంగా స్పందించారు. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన విడుదల చేస్తామని చెప్పారు.

పోటాపోటీగా వినతులు

కాగా, మంత్రి పొంగులేటితో సమావేశమయ్యేందుకు వచ్చిన రెవెన్యూ ఉద్యోగ సంఘాల నేతలు పోటాపోటీగా వినతి పత్రాలు సమర్పించారు. తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి సారథ్యంలోని రెవెన్యూ ఉద్యోగ సంఘాల నాయకుల బృందం, తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలోని మరో బృందం పలు అంశాల పరిష్కారం కోరుతూ మంత్రి కి విజ్ఞప్తి చేశాయి. మంత్రి పొంగులేటితో సమావేశమైన వారిలో ట్రెసా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వంగ రవీందర్‌రెడ్డి, కె.గౌతమ్‌కుమార్, తెలంగాణ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, వివిధ రెవెన్యూ ఉద్యోగ సంఘాల నేతలు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం, పి.రాజ్‌కుమార్, నిరంజన్, రమణారెడ్డి, రామకృష్ణారెడ్డి, ఆర్.రాంబాబు, కృష్ణచైతన్య, గరికపాటి ఉపేందర్‌రావు, లక్ష్మీనర్సింహ ఉన్నారు.

బీఐఎస్ గుర్తింపు లేని హెల్మెట్లు వాడొద్దు

▶ మొదటి పేజీ తరువాయి

రక్షణ కల్పించలేకపోవటంతో ప్రాణనష్టం పెరుగుతోందని తెలిపింది. దేశంలో ద్విచక్ర వాహనాల సంఖ్య ఇప్పటికే 21 కోట్లకు పైగా ఉంది. ఈ వాహనదారుల భద్రతకు నాణ్యమైన హెల్మెట్లు కీలకం. అందుకే 2021 నుంచే బీఐఎస్ ప్రమాణం ఐఎస్ 4151:2015 కింద ఐఎస్ఐ మార్క్ హెల్మెట్లు వాడటం తప్పనిసరి చేసింది. అయితే, రహదారుల పక్కన, స్థానిక మార్కెట్లలో నాణ్యత ప్రమాణాలు లేని హెల్మెట్లు అధికంగా విక్రయిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

176 మందికే లైసెన్సులు: హెల్మెట్ల నాణ్యత విషయంలో వినియోగదారుల వ్యవహారాల శాఖ కఠినంగా వ్యవహరిస్తోంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో బీఐఎస్ 30కి పైగా సెర్చ్ అండ్ సీజ్ దాడులు నిర్వహించింది. ఒక్క ఢిల్లీ నగరంలోనే లైసెన్స్ లేకుండా నాణ్యత లేని హెల్మెట్లు తయారు చేస్తున్న 9 మంది తయారీదారుల నుంచి 2,500లకు పైగా హెల్మెట్లు స్వాధీనం చేసుకుంది. 17 రిటైల్, రోడ్‌సైడ్ దుకాణాల్లో సుమారు 500 నాణ్యత లేని హెల్మెట్లు సీజ్ చేశారు. ప్రస్తుతం దేశంలో 176 మంది తయారీదారులకు మాత్రమే బీఐఎస్ నుంచి హెల్మెట్ల తయారీకి లైసెన్స్ ఉందని అధికారులు తెలిపారు. దేశవ్యాప్తంగా హెల్మెట్ల విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టి, నిబంధనలు అమలు చేయాలని కేంద్రం ఆదేశించింది. ఇప్పటికే చెన్నైలో 'మానక్ మిత్ర'వలంటీర్ల ద్వారా 'క్వాలిటీ కనెక్ట్'క్యాంపెయిన్ నిర్వహించి వినియోగదారులకు బీఐఎస్ గుర్తింపుపై ప్రచారం ప్రారంభించారు.

ఇక నిరీక్షించం.. ఉద్యమానికి సిద్ధం

ప్రభుత్వంపై సమరానికి సిద్ధమవుతున్న ఉపాధ్యాయులు

నాయకత్వం వహించేందుకు సిద్ధం: ఎమ్మెల్సీ శ్రీపాల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయులు ప్రభుత్వంపై సమరానికి సిద్ధమవుతున్నారు. తమ డిమాండ్ల పరి ష్కారానికి ఇంత కాలం ఓపిక పట్టామని, ఇక ఏమ్రాతం నిరీక్షించలేమని తేల్చి చెప్పారు. ఉద్యమ కార్యాచరణకు నాయకత్వం వహించేందుకు తాను సిద్ధమని టీచర్స్ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి ప్రకటించారు. పీఆర్‌టీయూటీఎస్ కార్యవర్గ సమావేశం శనివారం హైదరాబాద్‌లోని సంఘం కార్యాలయంలో అధ్యక్షుడు గుండు లక్ష్మణ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఇవ్వాల్సిన పెండింగ్ బిల్లులపై ప్రభుత్వం స్పందించకపోవడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. బకాయిల్లో నెలకు రూ.700 కోట్లు చెల్లిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఇంతకాలం ప్రభుత్వానికి సహకరిస్తూ వచ్చామని, దీనిని అలుసుగా తీసుకుంటే ఎంతమాత్రం సహించబోమని శ్రీపాల్ స్పష్టం చేశారు. టీచర్ల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేశారు.

చిన్నారుల రక్షణ అందరి విధి

▶ మొదటి పేజీ తరువాయి

మహిళా భద్రతా విభాగం, రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ, తెలంగాణ న్యాయ సేవల అథారిటీ, యూనిసెఫ్ సంయుక్తంగా హైదరాబాద్‌ని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో 'వాయిస్ ఫర్ ది వాయిస్‌లెస్.. రైట్స్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఆఫ్ సెక్సువల్ అబ్యూస్'(గొంతులేని వారి గొంతుక– చిన్నారులపై లైంగిక వేధింపులు– హక్కులు, రక్షణ) అనే అంశంపై రెండు రోజుల సదస్సు నిర్వహిస్తున్నాయి. శనివారం ఈ సదస్సును జస్టిస్ సూర్యకాంత్ ప్రారంభించి మాట్లాడారు. 'పిల్లల భద్రత చట్టపరమైనదే కాదు.. అది ఒక నైతిక, జాతీయ బాధ్యత. లైంగిక వేధింపులకు గురైన బాలల కోసం రాష్ట్రంలో భరోసా కేంద్రాల ఏర్పాటు అభినందనీయం. చిన్నారులపై లైంగిక అకృత్యాల అంశం సమాజంలో పెను సమస్యగా మారింది. చాలా సందర్భాల్లో బాధితుల తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయకుండా మౌనంగా ఉంటున్నారు. దీనిని మార్చేందుకు అందరూ సహకారం అందించాలి. దేశ జనాభాలో 24% మంది 14 ఏళ్లలోపు వారే. ప్రతి ముగ్గురిలో ఒకరు 18 ఏళ్లలోపు వారే. మొత్తం చిన్నారులు 345 మిలియన్లు. ఈ సంఖ్య అనేక ఖండాల జనాభాను మించిపోయింది. ఇల్లు, పాఠశాల, పరిసరాల్లో పిల్లలపై వేధింపులు జరుగుతున్నాయి. ఇది సమష్టి వైఫల్యమే అవుతుంది. సదుద్దేశంతో కూడిన వ్యవస్థలు నేరస్తులను శిక్షించడంపై దృష్టి పెడతాయి. కానీ, గాయపడిన పిల్లల గొంతు మూగబోతోంది. దీనికి కొత్త యంత్రాంగం అవసరం. పోలీసులు, న్యాయవ్యవస్థ, పాఠశాలలు, పౌర సమాజంతో కూడిన ఏకీకృత పిల్లల రక్షణ వ్యవస్థ బలోపేతం కావాలి. ఇది కేవలం నైతిక బాధ్యత కాదు. రాజ్యాంగబద్ధమైన నిబద్ధత'అని జస్టిస్ సూర్యకాంత్ చెప్పారు.

నిందితుల్లో చుట్టుపక్కల వారే అధికం

చిన్నారులపై పెరిగిపోతున్న హింసపై రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలపై లైంగిక వేధింపుల కేసుల నిందితుల్లో 98 శాతం మంది కుటుంబ సభ్యులు, బంధువులు, ఇరుగు పొరుగువారే ఉంటున్నారని తెలిపారు. 'కొన్ని సందర్భాల్లో తప్పుడు వయసు రికార్డులు న్యాయాన్ని పక్కదారి పట్టించగలవు. పాఠశాలల్లో చేర్పించేటప్పుడే తల్లిదండ్రులు కచ్చితమైన వయసు నమోదు చేయించాలి. పోలీసుల నుంచి న్యాయవ్యవస్థ వరకు ప్రతి ఒక్కరూ కచ్చితత్వం, కరుణతో వ్యవహరించాలి'అని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. 'చిన్నారులు, మహిళలకు భద్రత కల్పించేందుకు తమ ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టిందని తెలిపారు. న్యాయం నేరారోపణకు సంబంధించినది మాత్రమే కాదని, వైద్యం, గౌరవంతో ముడిపడిన అంశమని పేర్కొన్నారు. అశ్లీలత, ఆన్‌లైన్ విశృంఖలాలు కొత్త ముప్పులుగా మారాయని ఆందోళన వ్యక్తంచేశారు. 2016లో ప్రారంభమైన భరోసా కేంద్రాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని డీజీపీ డాక్టర్ జితేందర్ తెలిపారు. లైంగిక హింస నుంచి చిన్నారులు బయటపడేందుకు పారా మెడికల్ సాయాన్ని అందిస్తూ, వన్‌స్టాప్ సెంటర్లుగా సేవలందిస్తున్నాయని చెప్పారు. యూనిసెఫ్ ఇండియా ప్రతినిధి సింథియా మెక్‌కాఫ్రీ మాట్లాడుతూ.. 'దేశంలోని పిల్లలు గొంతులేని వారుకాదు. కానీ, వ్యవస్థలు వారిని నిశ్శబ్దంగా ఉండేలా చేశాయి. మనం వారి గొంతులను విస్తృతం చేయాలి'అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి, పీపీ పల్లె నాగేశ్వర్‌రావు, పోలీస్ ఉన్నతాధికారులు, రాష్ట్ర న్యాయ సేవల ప్రాధికార సంస్థ సభ్యకార్యదర్శి పంచాక్షరి తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం జరిగిన సాంకేతిక విభాగం సమావేశంలో జస్టిస్ మౌషుమి భట్టాచార్య, జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి సీతక్క ప్రసంగించారు.

పాలిసెట్ డేటా ఎరేజ్?

▶ మొదటి పేజీ తరువాయి

విద్యాశాఖ కార్యదర్శి వద్ద సమావేశమయ్యారు. పాలిసెట్ డేటా గందరగోళం అవ్వడంపై కొంత సీరియస్‌గానే చర్చ జరిగినట్టు తెలిసింది. ఆ తర్వాత ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌పై గంటల తరబడి చర్చించుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఆ తర్వాత శనివారం రాత్రి ముఖ్యమంత్రి నివాసానికి అధికారులు వెళ్లి చాలా సమయం చర్చించడంతో అసలేం జరుగుతోందనే ఆసక్తి నెలకొంది.


పాలిటెక్నిక్.. ఇంటర్‌తో సమానమే

పరిగణించాలని సర్కార్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సు ఇంటర్మీడియట్‌తో సమానమేనని.. ఇంటర్ అర్హతగా నిర్ణయించిన కోర్సుల్లో పాలిటెక్నిక్ పూర్తి చేసిన వారికి అవకాశం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు తేల్చిచెప్పింది. ఇంటర్ అర్హతగా పేర్కొన్న ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ డిప్లొమా కోర్సు (డీఈఈసెట్–25) చేసేందుకు తనను అధికారులు అనుమతించడం లేదని మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌కు చెందిన కె.హరీశ్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. డీఈఈ సెట్లో పిటిషనర్ 3,945 ర్యాంక్ సాధించినప్పటికీ.. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో ఇంటర్మీడియట్ అర్హత లేదంటూ కౌన్సెలింగ్‌కు అనుమతించలేదని పేర్కొన్నారు. 2001లో జారీ చేసిన జీవో 112 ప్రకారం పాలిటెక్నిక్ డిప్లొమాను ఇంటర్‌కు సమానంగా గుర్తించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. దీనిపై డీఈఈసెట్ కన్వీనర్, ఇతరులకు వినతిపత్రం అందజేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. డిప్లొమా.. ఇంటర్‌తో సమానమని టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ చెప్పిన తర్వాత కూడా అనుమతించకపోవడం సరికాదన్నారు. పిటిషనర్‌ను కౌన్సెలింగ్‌కు అనుమతించి ప్రవేశం కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

'ఈహెచ్‌ఎస్'ను వెంటనే ప్రకటించాలి

టీజీవోఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు



యాదగిరిగుట్ట: తెలంగాణ రాష్ట్ర ఉద్యోగులందరికీ ఆరోగ్య పథకాన్ని (ఈహెచ్‌ఎస్) వెంటనే ప్రకటించాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని సౌభాగ్య రిసార్ట్స్‌లో శనివారం తెలంగాణ గెజిటెడ్ అధికారుల అసోసియేషన్, హైదరాబాద్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం, ఉద్యోగుల కాంట్రిబ్యూషన్‌ను సమాన నిష్పత్తిలో చేసి.. ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని (ఈహెచ్‌ఎస్) వెంటనే అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను ప్రభుత్వం ఆమోదించడంతో పాటు, వాటిని వెంటనే విడుదల చేయాలని కోరారు. పభుత్వం ఆమోదించిన ఉద్యోగ సంఘాలకు గుర్తింపు పునరుద్ధరించి, జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌ను, ఆఫీసర్స్ కమిటీని ఏర్పాటు చేసేందుకు క్యాబినెట్ ఆమోదానికి ఉత్తర్వులు వెంటనే ఇవ్వాలన్నారు. పీఆర్‌సీ నివేదికను వెంటనే సీఎం తెప్పించుకొని తెలంగాణ 2వ పీఆర్‌సీని ఇవ్వాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడు శ్యాం, కోశాధికారి ఎం.ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా నుంచి చెన్నమనేని పేరు తొలగింపు

ఆయన భారత పౌరుడు కాదన్న హైకోర్టు తీర్పు నేపథ్యంలో రెవెన్యూ శాఖ చర్యలు

వేములవాడ: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు పేరును ఓటర్ జాబితా నుంచి తొలగిస్తూ పట్టణంలోని బైపాస్ రోడ్డులోని ఆయన స్వగృహం గేటుకు రెవెన్యూ అధికారులు శనివారం నోటీసు అంటించారు. దేశ చరిత్రలోనే ఇలాంటి చర్య ఇదే ప్రథమమని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. 16 ఏళ్లపాటు కొనసాగిన పౌరసత్వ వివాదం కేసులో చెన్నమనేని రమేశ్ భారత పౌరుడు కాదని.. ఆయన్ను జర్మనీ పౌరుడిగా తేలుస్తూ హైకోర్టు 2024 డిసెంబర్ 9న తీర్పు చెప్పిన విషయం తెలిసిందే. హైకోర్టు తీర్పు ప్రకారం వేములవాడ రెవెన్యూ అధికారులు ఎన్నికల ఓటర్ల జాబితా నుంచి ఫామ్–7 ప్రకారం చెన్నమనేని పేరును తొలగిస్తామని.. అభ్యంతరాలు ఉంటే 2025 జూలై 2లోగా తెలపాలంటూ గత నెల 25న ఆయన నివాసానికి నోటీసులు అంటించారు. గడువు ముగియడంతో జాబితా నుంచి చెన్నమనేని పేరును తొలగిస్తూ శనివారం ఉత్తర్వులను ఆయన ఇంటి గేటుకు అంటించారు.

టేకు ఆకుతో లేజర్ తీవ్రతకు చెక్..!

టేకు అనగానే.. అందమైన ఫర్నిచర్‌లో ఇమిడిన విలువైన కలప గుర్తొస్తుంది. టేకు చెట్టులో కలప తప్ప ఆకులు ఎందుకూ పనికిరావని ఇన్నాళ్లూ అనుకునేవాళ్లు. కానీ ఈ పత్రాలకు కూడా గొప్ప ప్రయోజనం ఉందని తాజా పరిశోధనలో వెల్లడైంది. తీవ్రమైన లేజర్ కిరణాల రేడియేషన్‌ను అడ్డుకునే శక్తి టేకు ఈ ఆకుల్లో ఉందని శాస్త్రవేత్తలు తేల్చారు. వైద్యం, వినోద రంగం, పరిశ్రమలు, రక్షణ రంగం, శాస్త్రీయ పరిశోధన.. ఇలా ఆధునిక యుగంలో ప్రధాన రంగాల్లోనూ.. ఇంటర్నెట్‌కు వెన్నెముక లాంటి ఫైబర్ ఆప్టిక్స్‌లోనూ.. టేకు ఆకుల్లోని ప్రత్యేక శక్తిని ఉపయోగించవచ్చని చెబుతున్నారు.

- సాక్షి, స్పెషల్ డెస్క్

అత్యంత ప్రభావశీలమైన లేజర్ కిరణాల రేడియేషన్ నుంచి చర్మాన్నీ, కంటినీ, సున్నితమైన ఆప్టికల్ పరికరాలను సైతం రక్షించే శక్తి టేకు ఆకులకు ఉందని శాస్త్రవేత్తలు తేల్చారు. వైద్యం, వినోద రంగం, పరిశ్రమలు, రక్షణ రంగం, శాస్త్రీయ పరిశోధన.. ఇలా ఆధునిక యుగంలో ప్రధాన రంగాల్లో లేజర్ రేడియేషన్‌దే ప్రధానపాత్ర. ఇంటర్నెట్‌కు వెన్నెముక లాంటి ఫైబర్ ఆప్టిక్స్‌లోనూ లేజర్ కిరణాలే కీలకం. అయితే, వీటిని ఉపయోగించే సమయంలో పొరపాటున ఆ కిరణాలు మనుషుల కళ్లకు, శరీరానికి హాని జరగనీయకుండా అడ్డుపడే కవచాన్ని రూపొందించేందుకు టేకు ఆకు అద్భుతంగా ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు. కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ నిధులతో పరిశోధనలు చేసే స్వయంప్రతిపత్తి గల సంస్థ 'రామన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఆర్‌ఆర్‌ఐ)' శాస్త్రవేత్తల పరిశోధనలో టేకు ఆకు ప్రయోజకత్వం వెల్లడైంది. ఆర్‌ఆర్‌ఐను ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త, నోబెల్ గ్రహీత సర్ సి.వి.రామన్ స్థాపించారు.



ప్రత్యేక లక్షణాలు

టేకు ఆకులను ఎండబెట్టి, పొడి చేసి, ఆ పొడిని ప్రత్యేక రసాయనాల్లో నానబెట్టి, శుద్ధి చేసిన తర్వాత గోధుమ–ఎరుపు రంగు ద్రవాన్ని వెలికితీశారు. ఈ వర్ణద్రవ్యానికి లేజర్ కాంతి లక్షణాలు మార్చి, తీవ్రతను తగ్గించే నాన్‌లీనియర్ ఆప్టికల్ (ఎన్‌ఎల్‌ఓ) గుణాలు ఉన్నట్టు ఆర్‌ఆర్‌ఐ శాస్త్రవేత్తలు గుర్తించారు. అధిక తీవ్రతల వద్ద కాంతి ప్రసారాన్ని తగ్గించడానికి.. మన శరీరం, కళ్ళను కాపాడటానికి నాన్ లీనియర్ వస్తువుల్లో ఉండే ఆప్టికల్ పవర్ లిమిటింగ్ ఉపయోగపడుతుంది. ఇవే లక్షణాలు టేకు ఆకుల్లోనూ ఉన్నట్టు పరిశోధనలో వెల్లడైంది.

సింథటిక్' పదార్థాలకు బదులుగా..

ఇప్పటివరకు వాడుతున్న గ్రాఫీన్, ఫుల్లెరెన్స్, మెటల్ నానోపార్టికల్స్ వంటి ప్రకృతికి హాని కలిగించే ఖరీదైన సింథటిక్ ఆప్టికల్ పదార్థాలకు బదులు టేకు ఆకుల్లోని రంగులను వాడుకోవచ్చని శాస్త్రవేత్తలు వెల్లడించారు. సహజమైన, కుళ్లి ప్రకృతిలో కలిసిపోయే పర్యావరణ ప్రియమైన, విరివిగా లభించే టేకు ఆకులను ఉపయోగించటం ద్వారా లేజర్ రక్షక కళ్లజోళ్లు, ఇతర ఆప్టికల్ పరికరాలు తయారు చేయవచ్చని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

లేజర్ రేడియేషన్ ఉపయోగాలు

లేజర్ రేడియోషన్ లేదా లేజర్ కాంతి ఎంత ప్రయోజనకరమైనదో అంతే ప్రమాదకరమైనది. దీన్ని ఉపయోగించేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రత్యేకమైన కళ్లజోళ్ల ధరించాలి. లేజర్ కాంతి కంటిని నేరుగా తాకితే దృష్టి కోల్పోయే ప్రమాదం ఉంది. అధిక శక్తి గల లేజర్‌లు చర్మాన్ని కూడా కాల్చేయగలవు. దీన్ని అనేక రంగాల్లో విరివిగా ఉపయోగిస్తున్నారు.

వైద్యరంగంలో కన్ను, చర్మ సంబంధ శస్త్ర చికిత్సలు; దయాగ్నొస్టిక్స్‌లో...	పరిశ్రమల్లో కటింగ్, వెల్డింగ్, లేజర్ మార్కింగ్, లేజర్ స్కానింగ్‌లలో..	శాస్త్రీయ పరిశోధనలో కాంతి లక్షణాలను అధ్యయనం చేయడానికి..
సీడీ ప్లేయర్‌లు, లేజర్ పాయింటర్‌లు, బార్‌కోడ్ స్కానర్ వంటి వినియోగదారుల ఉత్పత్తుల్లో..	రక్షణ రంగంలో కమ్యూనికేషన్, శత్రువుల క్షిపణులను కూల్చడం వంటి వాటికి..	వినోద రంగంలో లేజర్ లైట్ షోలు, స్పెషల్ ఎఫెక్టుల కోసం..

క్లుప్తంగా...

అసెంబ్లీకి రమ్మంటే ప్రెస్‌క్లబ్, బోట్స్ క్లబ్‌కు వస్తామంటారా?

- బీఆర్‌ఎస్ తీరుపై విమర్శలు గుప్పించిన జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో విచిత్ర పరిస్థితి కనిపిస్తోందని, రాష్ట్రంలోని సమస్యలపై అసెంబ్లీ సమావేశాలు పెట్టి చర్చిద్దామని అధికారపక్షం అడుగుతుంటే ప్రతిపక్షం మాత్రం రానంటోందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. అసెంబ్లీకి రమ్మని సీఎం రేవంత్‌రెడ్డి పిలుస్తుంటే ప్రెస్‌క్లబ్‌కు వస్తామని, బోట్స్ క్లబ్‌కు వస్తామని కేటీఆర్, హరీశ్‌రావు లాంటి సెకండ్ బెంచ్ లీడర్లు మాట్లాడుతున్నారన్నారు. జాతీయ పార్టీ తరఫున సీఎం రేవంత్ రెడ్డి, ప్రాంతీయ పార్టీ నుంచి మాజీ సీఎం కేసీఆర్‌ల మధ్య రాజకీయ చర్చ జరుగుతుంటే మధ్యలో సెకండ్ బెంచ్ వారు ఎందుకు మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. శనివారం గాంధీభవన్‌లో జగ్గారెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఇప్పుడు ఆ క్లబ్‌కు రా, ఈ క్లబ్‌కు రా అంటున్న వారు రెండురోజులు ఆగిన తర్వాత కల్లు కాంపౌండ్‌కు రమ్మంటారేమోనని అన్నారు. ప్రతిసారీ చంద్రబాబు శిష్యుడు రేవంత్ అని కేటీఆర్ అంటున్నారని, మరి కేసీఆర్ ఎవరి శిష్యుడని జగ్గారెడ్డి ప్రశ్నించారు.

అచ్చిరాని సవాళ్లు కేటీఆర్ మానుకోవాలి

- భువనగిరి ఎంపీ చామల



సాక్షి, హైదరాబాద్: అచ్చిరాని సవాళ్లు విసరడం మానుకోవాలని కేటీఆర్‌కు.. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి హితవు పలికారు. గతంలో కూడా వెంట్రుకలిస్తానని, కిడ్నీ ఇస్తానని సవాళ్లు విసిరి కేటీఆర్ తప్పించుకుపోయిన సందర్భాలు చాలా ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఎంపీ చామల శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. ఇప్పుడు కూడా కేటీఆర్ ప్రెస్‌క్లబ్‌కు రమ్మంటున్నారని, తర్వాత ప్రెస్‌క్లబ్ దూరమని, జూబ్లీహిల్స్ క్లబ్‌కో, సినిమా గెస్ట్‌హౌస్‌లకో రమ్మంటే వచ్చే పరిస్థితి ఉండదని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌ను లేదా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కానీ సవాల్ చేసే స్థాయి, స్తోమత, అర్హత కేటీఆర్‌కు లేవన్నారు. ముందు వాళ్ల నాన్న కాళ్లావేళ్లా పడి ప్రతిపక్ష నేత హోదా తెచ్చుకుని అప్పుడు సవాల్ విసరాలన్నారు.

ఢిల్లీ దిగివచ్చేలా రైల్‌రోకో

- ఎమ్మెల్సీ కవిత



సాక్షి, హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఢిల్లీ పాలకులు దిగివచ్చేలా రైల్‌రోకో నిర్వహిస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తెలంగాణ జాగృతి, యూపీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 17న తలపెట్టిన రైల్‌రోకోకు 'భీమ్ ఆర్మీ'నాయకులు సంఘీభావం ప్రకటించారు. భీమ్ ఆర్మీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీ ఆయాజ్ ఆధ్వర్యంలో నాయకులు బంజారాహిల్స్‌లోని ఎమ్మెల్సీ కవితతో ఆమె నివాసంలో సమావేశమయ్యారు. రైల్‌రోకోకు భీమ్ ఆర్మీ చీఫ్, ఎంపీ చంద్రశేఖర్ ఆజాద్ మద్దతు ప్రకటించారని తెలిపారు. కవితతో భేటీ అయిన వారిలో భీమ్ ఆర్మీ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ, హనుమంతరావు, సురేశ్ కుమార్, యూపీఎఫ్ కో–ఆర్డినేటర్ ఆలకుంట హరి ఉన్నారు.

నా వ్యాఖ్యలు కాంట్రాక్టర్లపైనే.. కాంగ్రెస్ పెద్దలపై కాదు

- ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి వివరణ

జడ్చర్ల: ఇటీవల బనకచర్ల ప్రాజెక్ట్ వివాదానికి సంబంధించి తెలంగాణలో ఏపీ సీఎం చంద్రబాబు కోవర్టులున్నారని చేసిన వ్యాఖ్యలు.. కేవలం కాంట్రాక్టర్లను ఉద్దేశించినవని, కాంగ్రెస్ పార్టీ పెద్దల గురించి ఎంతమాత్రం కాదని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఒక ప్రకటనలో వివరణ ఇచ్చారు. తాను చేసిన వ్యాఖ్యలను విపక్ష నేతలు తప్పుగా ప్రచారం చేయడం సరికాదని పేర్కొన్నారు. తాను సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి పరోక్షంగా ఆరోపణలు చేసినట్లు.. బీఆర్‌ఎస్ నేత కేటీఆర్‌తో పాటు పలువురు విపక్ష నేతలు ప్రచారం చేయడం సరికాదన్నారు.

మహిళా సాధికారతలో తెలంగాణ టాప్

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- 12 నుంచి మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల పంపిణీ
- ప్రజాభవన్‌లో ఇందిరా మహిళా శక్తి సంబరాలు
- ఆర్టీసీలో ఎస్‌హెచ్‌జీలు నడిపే అద్దె బస్సులకు రూ.కోటి చెక్కు అందజేత



స్వయం సహాయక సంఘాలకు రూ.కోటి చెక్కును అందజేస్తున్న భట్టి, సీతక్క, పొన్నం

సాక్షి, హైదరాబాద్: మహిళా సాధికారతలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మహిళల సంక్షేమం, అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ఇతర రాష్ట్రాలు వచ్చి చూస్తున్నాయన్నారు. ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా శనివారం ఆయన ప్రజాభవన్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్కలతో కలిసి స్వయం సహాయక సంఘాలకు రూ.కోటి చెక్కును అందించారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో అద్దె ప్రాతిపదికన నిర్వహిస్తున్న బస్సులకు తొలినెల అద్దె కింద ఈ చెక్కును అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం కార్యాచరణ అమలు చేస్తోందన్నారు. రాష్ట్ర విభజన తర్వాత పదేళ్లు పాలించిన బీఆర్‌ఎస్, ఎస్‌హెచ్‌జీలకు వడ్డీ లేని రుణాలు, ప్రోత్సాహకాలను గాలికి వదిలేసిందన్నారు. తాజాగా ప్రజా ప్రభుత్వం మళ్లీ వడ్డీ లేని రుణాలను ప్రారంభించి మహిళా సంఘాలను ప్రోత్సహిస్తోందన్నారు. రాష్ట్రంలో అవకాశం ఉన్న ప్రతిచోట క్యాంటీన్లు, పాఠశాలల మరమ్మతులు, విద్యార్థుల స్కూల్ డ్రెస్సులు కుట్టడం వంటి పనులను మహిళా సంఘాలకు ఇచ్చి వారిని ఆర్థికంగా తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని వివరించారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారని, అందులో భాగంగా మొదటి సంవత్సరం రూ.21 వేల కోట్ల వడ్డీ లేని రుణాలను మహిళా సంఘాలకు అందించామన్నారు. ప్రతీ సంవత్సరం రూ.20 వేల కోట్లకు తగ్గకుండా ఎస్‌హెచ్‌జీలకు వడ్డీ లేని రుణాలు ఇస్తున్నామన్నారు. ఈనెల 12 నుంచి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని శాసనసభ నియోజకవర్గాల్లో ప్రజలందరి సమక్షంలో మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలకు సంబంధించిన చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్టు వివరించారు. కేవలం వడ్డీ లేని రుణాలే కాకుండా బ్యాంకు లింకేజ్, రుణ బీమా, ప్రమాద బీమా వంటి సౌకర్యాలను ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు కల్పిస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు.

భట్టి సాయంతో మహిళకు కేన్సర్ చికిత్స డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన ఆమె భర్త

సాక్షి, హైదరాబాద్: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చొరవతో ఓ కుటుంబానికి ఊరట దక్కింది. ఏపీలోని ఏలూరుకు చెందిన రామకృష్ణ హైదరాబాద్‌లో మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. కాగా ఆయన భార్య కేన్సర్ లంప్‌తో బాధపడుతున్నట్టు గుర్తించి ఓ ప్రైవేటు కార్పొరేట్ ఆసుపత్రిలో చేర్పించారు. కొంతకాలం చికిత్స అనంతరం వారు వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితిలో పడ్డారు. ఈ సమయంలో గాంధీభవన్‌లో మంత్రుల ముఖాముఖి కార్యక్రమం జరుగుతుందని తెలుసుకొని రామకృష్ణ కుమారుడు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలసి లిఖితపూర్వకంగా తన తల్లిదండ్రుల ఆవేదనను వివరించారు. దీనిపై చలించిన భట్టి వెంటనే రామకృష్ణ భార్యకు వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని తన సిబ్బందిని ఆదేశించారు. సహాయం ఎక్కడా ఆగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు. భట్టి ఇచ్చిన లెటర్ ఆఫ్ క్రెడిట్‌తో రామకృష్ణ తన భార్యకు 5 సార్లు కీమోథెరపీ చేయించగలిగారు. కీమో అనంతరం రామకృష్ణ భార్య కేన్సర్ మహమ్మారి నుంచి పూర్తిగా విముక్తి పొందినట్టు వైద్యులు పరీక్షల ద్వారా నిర్ధారించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సాయంతో తన కుటుంబం నిలబడిందని రామకృష్ణ అన్నారు. శనివారం ఆయన సచివాలయంలో భట్టిని కలసి కృతజ్ఞతలు తెలిపారు.

ఆసుపత్రి నుంచి కేసీఆర్ డిశ్చార్జి

- వారం రోజుల విశ్రాంతికి వైద్యుల సూచన



కేసీఆర్‌ను కలిసిన పాలమూరు నేతలు నిరంజన్‌రెడ్డి, బాలరాజు, జైపాల్‌యాదవ్, రావుల చంద్రశేఖర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: స్వల్ప అస్వస్థతకు గురై గురువారం సోమాజిగూడ యశోద ఆసుపత్రిలో చేరిన మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖరరావు శనివారం వైద్యుల సలహా మేరకు డిశ్చార్జి అయ్యారు. వారం రోజులపాటు విశ్రాంతి తీసుకోవడంతో పాటు, వైద్య పరీక్షల కోసం వచ్చే గురు, శుక్రవారాల్లో మరోమారు ఆసుపత్రికి రావాల్సిందిగా వైద్యులు సలహా ఇచ్చారు. రెండు రోజులపాటు వైద్యుల పర్యవేక్షణలో సాధారణ చికిత్స అనంతరం కేసీఆర్ ఆరోగ్యం మెరుగుపడింది. రక్తపోటు, సోడియం స్థాయి హెచ్చుతగ్గులతో ఆసుపత్రిలో చేరాల్సిందిగా రెండు రోజుల క్రితం యశోద ఆసుపత్రి వైద్యులు కేసీఆర్‌కు సూచించిన విషయం తెలిసిందే. కాగా ఆసుపత్రిలో ఉన్న సమయంలోనే తనను పరామర్శించేందుకు వచ్చిన పార్టీ నేతలతో కేసీఆర్ శుక్రవారం భేటీ అయ్యారు. రాష్ట్రంలో సాగునీరు, రైతులు, వ్యవసాయం తదితర ప్రజా సమస్యలపై చర్చించారు. ఏపీ ప్రభుత్వం చేపడుతున్న బనకచర్ల ప్రాజెక్టు అంశంపై ఒకటి రెండు రోజుల్లో తాను మీడియాతో స్వయంగా మాట్లాడతానని కేసీఆర్ ప్రకటించారు. ఇదిలా ఉంటే తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత శనివారం ఉదయం యశోద ఆసుపత్రిలో కేసీఆర్‌ను కలిశారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన కేసీఆర్ సతీమణి శోభతో కలిసి నందినగర్ నివాసానికి వెళ్లారు.

ఒలింపిక్స్ పతకాలే లక్ష్యంగా పనిచేయాలి: వాకిటి



సాక్షి, హైదరాబాద్: క్రీడలను శిఖర స్థాయికి చేర్చాలన్న సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనల మేరకు క్రీడా శాఖ పనితనంలో మార్పురావాలని రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. శనివారం ఆయన సచివాలయంలోని తన చాంబర్లో క్రీడా శాఖపై స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ, గతంలో జరిగిన వైఫల్యాలను, అలసత్వాన్ని పక్కనపెట్టి, సీఎం ఆలోచనల మేరకు పనిచేయాలని సూచించారు. 2036 ఒలింపిక్స్‌లో పతకాలు సాధించడమే లక్ష్యంగా తెలంగాణ క్రీడా శాఖ పనిచేయాలని, చిత్తశుద్ధితో పనిచేస్తే లక్ష్యాన్ని సాధించడం సులభమేనని అన్నారు.

గల్లీ లీడర్‌లా మాట్లాడుతున్నాడు

- ఖర్గే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే.. బీజేపీ నాయకులను ఆడా కాదు.. మగా కాదు అంటూ చేసిన అసభ్యకర, అభ్యంతరకర, అనాలోచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. 'ఒక జాతీయ పార్టీ అధ్యక్షుడు తన స్థాయిని మరిచి నీచమైన వ్యాఖ్యలు చేశారు.. ఆయన ఢిల్లీ లీడర్ కాదు.. గల్లీ లీడర్ స్థాయికి దిగజారారని'ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ వరుస వైఫల్యాలతో కట్టలు తెంచుకున్న అసహనంతో మాట్లాడారా ? లేక ఎవరైనా రాసిస్తే చదివారా అని కిషన్‌రెడ్డి శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రశ్నించారు. భారత్ అధీనంలో ఉండాల్సిన కశ్మీర్‌ను అప్పనంగా పాకిస్తాన్‌కు అప్పగించిన కాంగ్రెస్.. ఇప్పుడు అవకాశం కోల్పోయిందని మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. యూపీఏ పాలనలో ఏనాడైనా ఉగ్రదాడులకు బదులిచ్చారా అని ప్రశ్నించారు. రాజ్యాంగ పీఠికలోని సెక్యులర్, సోషలిస్ట్ పదాల విషయంలోనూ ఖర్గే ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత లోక్‌సభ ఎన్నికల సందర్భంలోనూ, బీజేపీ గెలిస్తే రాజ్యాంగాన్ని మారుస్తారని, రిజర్వేషన్లు రద్దు చేస్తారని కాంగ్రెస్ భయంకరమైన విష ప్రచారానికి తెరలేపిందన్నారు. ఇప్పుడు తెలంగాణలో వైఫల్యాలు, అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు మళ్లీ అదే తరహా దుష్ప్రచారం చేస్తోందన్నారు. 6 గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఒక్కటీ అమలు చేయకుండా ప్రజలను నిట్టనిలువునా మోసం చేసిందని చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన 100 రోజుల్లో అన్ని హామీలు అమలు చేస్తామని రాహుల్, సోనియా, ఖర్గే లేఖలు రాయడాన్ని, హామీ పత్రాలు ఇవ్వడాన్ని, అబద్ధపు వాగ్దానాలు చేయడాన్ని ప్రజలు నిలదీస్తున్నారన్నారు. తనలో గూడుకట్టుకున్న నిరాశ, నిస్పృహలతో అబద్ధాలు వల్లె వేస్తూ మోసం చేసిన ఖర్గే ..తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని, లేకపోతే, తెలంగాణ ప్రజల ఆగ్రహ జ్వాలలో కాంగ్రెస్ కొట్టుకుపోవడం ఖాయమని హెచ్చరించారు.

కార్యకర్తల కృషితోనే 'సమరభేరి' విజయవంతం

ధన్యవాదాలు తెలిపిన టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: క్షేత్రస్థాయి కార్యకర్తలు, నాయకుల సమష్టి కృషితోనే కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సామాజిక న్యాయ సమరభేరి సభ విజయవంతమైందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు. సామాన్య కార్యకర్త నుంచి రాష్ట్ర స్థాయి నాయకత్వం వరకు శ్రమించిన కారణంగానే సభ ఘనంగా జరిగిందని, ఇందుకు సహకరించిన అందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'సామాజిక న్యాయ సమరభేరి సభ కోసం మండల పార్టీ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, డీసీసీ అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇంచార్జ్‌లు, టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పనిచేశారు. సభకు పిలవగానే వచ్చిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్‌లు స్ఫూర్తిని నింపారు. పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, రాష్ట్ర మంత్రులు హాజరై కార్యకర్తల్లో ఉత్తేజం కలిగించారు. అందరికీ ధన్యవాదాలు'అని మహేశ్‌గౌడ్ ఆ ప్రకటనలో తెలిపారు.

అధ్యక్ష హోదాలో తొలి సభ

కాగా, పీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ఏఐసీసీ పెద్దలను ఆహ్వానించి తొలిసారిగా భారీ సభ నిర్వహించడంలో మహేశ్‌కుమార్‌గౌడ్ విజయవంతం అయ్యారని కాంగ్రెస్ వర్గాలంటున్నాయి. ఏఐసీసీ అధ్యక్షుడు హాజరైన సభను ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించడంలో ఆయన పని విభజన చేసిన కారణంగానే ఇది సాధ్యమైందని అంటున్నాయి. సామాజిక న్యాయ సమరభేరి సక్సెస్‌తో కాంగ్రెస్ నేతల్లో కొత్త జోష్ వచ్చిందనే చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతోంది.

కొండారెడ్డిపల్లికి వస్తావా? కొడంగల్‌కు రమ్మంటావా?

▶ మొదటి పేజీ తరువాయి

మేమే వేదిక ఏర్పాటు చేసి సీఎం కోసం కుర్చీ వేసి ఎదురుచూస్తాం'అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు సవాలు చేశారు. శనివారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, 'తెలంగాణలో రేవంత్‌రెడ్డి అయన తొట్టి గ్యాంగ్ మినహా ఎవరూ సంతోషంగా లేరు. దండుపాళ్యం ముఠా రీతిలో బిల్డర్లు, కాంట్రాక్టర్లను బెదిరించి దోచుకుంటూ హామీలు అమలు చేయడం లేదు. రూ.2 లక్షల కోట్ల అప్పు చేసి తెలంగాణను ఏటీఎంగా మార్చి రేవంత్.. 'పే సీఎం'లా తయారయ్యారు. చంద్రబాబు కోవర్టులా మారిన రేవంత్ ఇక్కడి నీళ్లను ఆంధ్రకు తరలిస్తున్నారు'అని మండిపడ్డారు.

నిధులు ఢిల్లీకి.. నీళ్లు ఆంధ్రకు

'తెలంగాణలో రైతు రాజ్యాన్ని తెచ్చి, ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దింది ఎవరో ప్రజలకు తెలుసు. అన్నీ తెలిసీ నిజం ఒప్పుకోకుండా నటించడం రేవంత్‌కు మాత్రమే తెలుసు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే ఉద్యమ నినాదం స్ఫూర్తిని దెబ్బతీస్తూ నీళ్ల ఆంధ్రకు, నిధులు ఢిల్లీ కాంగ్రెస్‌కు మళ్లిస్తూ.. కొందరు తొత్తులను రేవంత్ పదవుల్లో నియమించుకున్నారు. ఇందిరమ్మ గొప్పతనం తెలవాలంటే గుడ్డలు ఊడదీసి కొట్టాలి అంటున్న రేవంత్‌కు కాలిపోయిన మోటార్లు, పేలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు, ఎరువులు, విత్తనాల కోసం లైన్లలో చెప్పులతో నిలబడటమే ఇందిరమ్మ రాజ్యం అని తెలియదా. ఎమర్జెన్సీ విధించి ఎంతోమందిని అన్యాయంగా జైల్లో పెట్టిన ఇందిరమ్మ రాజ్యం గురించి మాట్లాడితే నిక్కృష్టంగా ఉంది. మాకు ఓటేస్తే మళ్లీ పాత రోజులు తీసుకొస్తామని చెప్పి.. నిజంగానే ఆ పాత దుర్దినాలను రేవంత్‌రెడ్డి తీసుకొచ్చారు. ఎరువులను పంచడం కూడా చేతగాని సీఎం రేవంత్, చర్చకు కేసీఆర్ రావాలని సవాలు చేయడాన్ని చూసి జనం నవ్వుతున్నారు. నాలుగు పంటలకు గాను ఒక్క పంటకు ఒక్కసారి రైతుబంధు వేసి దానికి పండుగ చేసుకోమని రేవంత్‌రెడ్డి అనడం సిగ్గుచేటు. ఇవాళ తెలంగాణలోని ప్రతి వర్గం రేవంత్ రెడ్డి చేస్తున్న మోసాన్ని అర్థం చేసుకుంది. వంద అసెంబ్లీ సీట్లు వస్తాయని రేవంత్ పగటి కలలు కంటున్నారు. కాంగ్రెస్ పార్టీకి ఏ వర్గం కూడా ఈసారి ఓటేయదు'అని కేటీఆర్ స్పష్టం చేశారు.

ప్రెస్‌క్లబ్‌లో కాదు.. అసెంబ్లీలో చర్చిద్దాం

- కేటీఆర్ సవాల్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్
- శాసనసభ సభ్యుడిగా చర్చించాల్సింది శాసనసభలోనేనని వెల్లడి



సాక్షి, హైదరాబాద్: 'నువ్వో మాజీ మంత్రివి.. శాసనసభ్యుడివి. రైతులకు ఎవరు మంచి చేశారో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో చర్చకు రావాలని మాకు సవాల్ విసరడం విడ్డూరం. మేము చర్చలకు వెనకడుగు వేసే వాళ్లం కాదు. కానీ చర్చలు సభలో చేయాలి. రైతు సమస్యలకు కారకులైన మీరు చేస్తున్న రాజకీయాలపై దేవాలయం లాంటి శాసనసభ వేదికగా చర్చకు మేం సిద్ధం'అని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. శనివారం ఆయన ప్రజాభవన్‌లో మీడియాతో తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సహా ఏపీ తెరపైకి తెచ్చిన బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ ప్రజలు ప్రత్యక్ష ప్రసారం ద్వారా చూసేటప్పుడు చర్చిద్దామన్నారు. రైతులకు ఎవరు మంచి చేశారో చెప్పేందుకు ప్రెస్‌క్లబ్ వేదికగా ఈ నెల 8న సీఎం రేవంత్ తమతో చర్చకు రావాలన్న కేటీఆర్ సవాల్‌కు మంత్రి పొన్నం ఈ మేరకు స్పందించారు. గోదావరి నికర జలాలు, వరద జలాలు తెలంగాణ హక్కు అని ఆయన పేర్కొన్నారు. తాము రాయలసీమకు వ్యతిరేకం కాదని.. కానీ తెలంగాణ నీళ్లు రాయలసీమకు ఇస్తామని చెప్పడానికి బీఆర్‌ఎస్ ఎవరని ప్రశ్నించారు. నీటి పంపకాల్లో తెలంగాణకు అన్యాయం జరిగితే ఎవరితోనూ కాంప్రమైజ్ కాబోమని స్పష్టం చేశారు. నదీ జలాల విషయంలో బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణకు అన్యాయం చేసిందని ఆయన ఆరోపించారు. రాష్ట్రానికి అన్యాయం జరిగేలా నిర్ణయాలు తీసుకుందని దుయ్యబట్టారు. తెలంగాణ ప్రాంత రైతుల హక్కులు కాపాడే బాధ్యత తమదన్నారు. దీనిపై భవిష్యత్ తరాలకు తెలిసేలా శాసనసభలో చర్చిద్దామని.. ఈ మేరకు ప్రతిపక్ష నేత కేసీఆర్‌తో స్పీకర్‌కు లేఖ రాయించాలని కేటీఆర్‌కు మంత్రి పొన్నం సవాల్ విసిరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచి చూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

అక్కసు, కుళ్లు తప్ప కేటీఆర్ మాటల్లో పస లేదు

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

సాక్షి, హైదరాబాద్: లండన్‌లో రెస్టు తీసుకుని వచ్చిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మళ్లీ విమర్శలు మొదలుపెట్టారని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వ్యాఖ్యానించారు. , సీఎం రేవంత్‌రెడ్డి మీద ఆడిపోసుకోవడమే ఆయనకు పనిగా మారిందని, అక్కసు, కుళ్లు తప్ప కేటీఆర్ మాటల్లో పస కనిపించడం లేదని విమర్శించారు. శనివారం సీఎల్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీలో చర్చకు రావాలని రేవంత్‌రెడ్డి ప్రతిపక్షాన్ని పిలుస్తున్నారని, కృష్ణా, గోదావరి జలాల అంశంతో పాటు అన్ని అంశాలపై తాము చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. బీఆర్‌ఎస్‌లోనే దళిత వ్యతిరేక డీఎన్ఏ ఉందని, అందుకే మల్లికార్జున ఖర్గేకు వ్యతిరేకంగా హైదరాబాద్‌లో పోస్టర్లు వేయించారని, స్పీకర్ కుర్చీలో ప్రసాద్‌కుమార్ కూర్చోవడాన్ని కేసీఆర్ జీర్ణించుకోలేకపోతున్నారని ఆరోపించారు. కేటీఆర్‌కు కాంగ్రెస్ చరిత్ర తెలియదని, గాంధీకుటుంబంపై నోటికొచ్చినట్టు మాట్లాడితే నాలుక చీరుతామని సత్యం హెచ్చరించారు.



మునుపు ఉండినదే ఇక ఉండబోవునది: మునుపు జరిగినదే ఇక జరుగబోవునది: సూర్యుని క్రింద నూతనమైన దేదియు లేదు.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం, గ్రీష్మ ఋుతువు; ఆషాఢ మాసం; **తిథి:** శు.ఏకాదశి రా.8.24 వరకు, తదుపరి ద్వాదశి; **నక్షత్రం:** విశాఖ రా.10.44 వరకు, తదుపరి అనూరాధ; **వర్జ్యం:** రా.3.09 నుండి 4.55 వరకు; **దుర్ముహూర్తం:** సా.4.46 నుండి 5.38 వరకు; **అమృత ఘడియలు:** ప.12.54 నుండి 2.41 వరకు. **తొలి ఏకాదశి**

సూర్యోదయం : 5.34
సూర్యాస్తమయం : 6.35
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

జిన్‌పింగ్ (చైనా అధ్యక్షుడు)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

నువ్వు నీ పైనున్న వాడితో పూర్తి సమ్మతిని కలిగి ఉన్నావంటే, లేదా నీ కింద ఉన్నవాడు నీతో పూర్తి సమ్మతిని కలిగి ఉన్నాడంటే మీరిద్దరూ కలిసి త్వరలోనే దేనినో నాశనం చేయబోతున్నారనే! లేదా, ఇప్పటికే నాశనం చేసేశారని! అది ఏదైనా కావచ్చు. ఒక పెద్ద సంస్థ, ఒక పెద్ద వ్యవస్థ లేదా, ఒక పెద్ద దేశం.

'సమ్మతి' అనేది దాపరికాల నిశ్శబ్దం. అసమ్మతి లేనేలేదని పెద్దగా అరచి చెప్పే అబద్ధం. నేనెప్పుడూ నిశ్శబ్దాన్ని కోరుకున్నది లేదు. నేనెన్నటికీ నా నిష్క్రమణకు సమ్మతంగా ఉండేదీ లేదు.

"కామ్రేడ్ జిన్‌పింగ్... పార్టీ మిమ్మల్ని తక్షణం తప్పుకోమంటోంది" అని పార్టీ కార్యాలయం నుంచి కొందరు వచ్చి చెప్పారు.

"కామ్రేడ్ జిన్‌పింగ్... చైనా మిమ్మల్ని తక్షణం తప్పుకోమంటోంది" అని అధ్యక్ష భవనం నుంచి కొందరు వచ్చి చెప్పారు.

"కామ్రేడ్ జిన్‌పింగ్... సైన్యం మిమ్మల్ని తక్షణం తప్పుకోమంటోంది" అని లిబరేషన్ ఆర్మీ నుంచి కొందరు వచ్చి చెప్పారు.

నన్ను తప్పుకోమంటున్నారంటే – ప్రెసి



డెంటు గానో, జనరల్ సెక్రెటరీ గానో, ఛైర్మన్ గానో తప్పుకోమన్నట్లు కాదు నాకు. ప్రజల్లోంచి తప్పుకోమన్నట్లు. ప్రజల్లో ఉండే మనిషి ప్రజల్లోంచి తప్పుకుని ఎక్కడికి వెళతాడు?

ఆ మాటే వారితో అన్నాను.

"మీరు కొన్నాళ్లు ప్రజల్లోంచి అదృశ్యం అయిపోయారు. కొన్నాళ్లుగా మీరు మీ అనారోగ్యాన్ని ప్రజల నుంచి దాచి పెడుతున్నారు. ఇది కూడా ప్రజల్లో ఉండటమేనా కామ్రేడ్ జిన్‌పింగ్?" – అని ఆ వచ్చిన వాళ్లు!

"అదృశ్యమూ కాదు, అనారోగ్యమూ కాదు. ప్రజల గురించి ఆలోచిస్తూ కొంత దూరం నడుచుకుంటూ వెళ్లటమది" అన్నాను.

"మీ భాష కూడా మారిపోతోంది కామ్రేడ్ జిన్‌పింగ్. మీరేం మాట్లాడుతున్నారో మీకైనా అర్థం అవుతోందా?" అన్నారు వాళ్లు.

నవ్వాన్నేను.

వాళ్లెవరూ తిరిగి నవ్వేంత తీరికతో వచ్చిన వారు కాదు. నన్ను తప్పించిపోదామని వచ్చిన వాళ్లు.

"డియర్ కామ్రేడ్స్, నేను వెళ్లానే గానీ, ఒంటరిగా వెళ్లలేదు. నాతో మరో ఇద్దరు కలిసి నడిచారు. ఆ ఇద్దరిలో ఒకరు చైనా రిపబ్లిక్ అధ్యక్షుడు కామ్రేడ్ జిన్‌పింగ్. మరొకరు ఆర్మీ ఛైర్మన్ కామ్రేడ్ జిన్‌పింగ్. ఇక నేను పార్టీ జనరల్ సెక్రెటరీ కామ్రేడ్ జిన్‌పింగ్. నేనొక్కడినే ముగ్గురు కామ్రేడ్‌లుగా వెళ్లి, నాలోని ఆ ఇద్దరు కామ్రేడ్‌లలో ఒకరి నుంచి మంచిని ఎంచుకున్నాను. మరొకరిని చూసి నన్ను నేను సవరించుకున్నాను" అని చెప్పాను.

అప్పుడు నవ్వారు వాళ్లు!

"కామ్రేడ్ జిన్‌పింగ్... దశాబ్దాల క్రితమే కన్ఫ్యూషియస్‌ను చైనా వదిలేసింది. మీరింకా ఆయన్ని పట్టుకునే ఉన్నారు!" అన్నారు.

"ఎవరైనా ఇద్దరితో కలిసి నడుస్తున్నప్పుడు ఆ ఇద్దరినీ నేను నా గురువులుగా భావిస్తాను... ఒకరిని మంచి కోసం, ఇంకొకరిని వారిలోని చెడును చూసి నన్ను నేను మార్చుకోవటం కోసం ..." అని కన్ఫ్యూషియస్ చెప్పిన మాట వారికీ గుర్తుందంటే వారూ కన్ఫ్యూషియస్‌ను వదల్లేదనే కదా!

"కామ్రేడ్ జిన్ పింగ్... మిమ్మల్ని లి–రుయిహువాన్, వెన్ జియాబావో వంటి పదవీ విరమణ పొందిన పార్టీ పెద్దలు సమ్మతించటం లేదు. విదేశాలలో స్థిరపడిన చైనా వారసత్వ యువరాజులు సమ్మతించటం లేదు. జాంగ్ యూషియా వంటి సైనిక నాయకులు సమ్మతించటం లేదు. మధ్యతరగతి ప్రజలు, వ్యాపారాలు చేసుకునే వారు సమ్మతించటం లేదు. ఇక మీరేమో సమష్టి నాయకత్వాన్ని సమ్మతించటం లేదు. చెప్పండి కామ్రేడ్ ఏం చేద్దాం?" అన్నారు వాళ్లు.

ఏదైనా చేయాల్సిన అవసరం ఏముంది?!


చైనా బలమే అసమ్మతి. చైనాకు ఉన్న మరొక బలం ఆ అసమ్మతికి తలొగ్గని నాయకత్వం. ప్రజల సమ్మతి కోసమే 'పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా' ఎల్లప్పుడూ తన పైకి తను సకల అసమ్మతులను తలెత్తనివ్వనిస్తుంది.

చెట్టునే నరకనా... మెడ కోసుకోనా?

జనతంత్రం



వర్ధెల్లి మురళి



ఆంధ్రప్రదేశ్‌లోని తోతాపురి మామిడి రైతుల హాహాకారాలు ఆ రాష్ట్ర సరిహద్దుల్ని దాటి ప్రతిధ్వనిస్తున్నాయి. కిలోకు పన్నెండు రూపాయలు కనీస ధరగా నిర్ణయించిన ప్రభుత్వం కార్యాచరణపై మాత్రం ముసుగేసింది. ఫలితంగా రెండు రూపాయలకు కూడా కొనే నాథుడు లేక రైతులు మామిడి కాయల్ని రోడ్లపై పారబోస్తున్న దృశ్యాలు దర్శనమిచ్చాయి. పారబోయడానికి మనసొప్పని రైతులు రవాణా ఖర్చులు వచ్చినా చాలని హైదరాబాద్ వంటి దూర ప్రాంత మార్కెట్లకు తరలించిన ఉదంతాలు కోకొల్లలు. తీవ్రమైన నష్టాల్లో కూరుకుపోతున్న ఈ పరిస్థితుల్లో పసిబిడ్డల్లా పెంచుకున్న చెట్లను నరికేయాలో, చేతిలో వున్న కొడవలితో మెడనే నరుక్కోవాలో అర్థం కావడం లేదంటూ ఒక రైతు వాట్సప్‌లో పెట్టిన మెసేజ్ కంటతడి పెట్టించింది.

ఇదొక్క మామిడి రైతుల ఆక్రందనే కాదు. ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆంధ్రప్రదేశ్ రైతులందరి ఉమ్మడి ఆవేదన ఇదే. జగన్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు క్వింటాల్‌కు 24 వేలు పలికిన ధర ఇప్పుడు గరిష్ఠంగా ఏడు వేలు దాటకపోవడంతో మిర్చి రైతు కుదేలయ్యాడు. పత్తి ధర పదివేల నుంచి ఐదు వేలకు అంటే సగానికి సగం పడిపోయింది. అప్పుడు 18 వేల దాకా దక్కించుకున్న పొగాకు ఇప్పుడు గరిష్ఠంగా 6 వేలకు పడిపోయింది. పసుపు, కందులు, మినుములు, వేరుశనగ, మొక్కజొన్న, పెసలు, ఉల్లిపాయలు, టమాటా, మామిడిపళ్ళు, అరటి, బొప్పాయి, డ్రాగన్ ఫ్రూట్ వగైరా వ్యవసాయ ఉత్పత్తుల ధరలన్నీ సగానికి పడిపోయాయి. ఆనాటి జగన్ ప్రభుత్వం ప్రత్యేకంగా ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి ధరలు పతనమవకుండా మార్కెట్‌లో జోక్యం చేసుకునే విధానాన్ని అవలంబించడం సత్ఫలితాలనిచ్చి మంచి ధరలు లభించాయి. రైతన్నకు దరహాసాన్నిచ్చాయి.

చంద్రబాబు ప్రభుత్వం ఆ బాధ్యతను వదిలేసింది. మొత్తంగా వ్యవసాయ రంగానికి సంబంధించినంత వరకు ఈ ప్రభుత్వం కాడి పారేసింది. జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న రైతు భరోసా కంటే అధికంగా ఇస్తానని హామీ ఇచ్చి వరసగా రెండో యేడు కూడా ఎగనామం పెట్టింది. వ్యవసాయ రంగం ఈ ప్రభుత్వ ప్రాధాన్యత క్రమంలో లేదు. తొలిసారి అధికారంలోకి వచ్చినప్పుడే కేంద్రం కట్టాల్సిన పోలవరాన్ని అడిగి తెచ్చుకొని తన కమీషన్ల ప్రాధాన్యాన్ని ఆ ప్రభుత్వం చాటి చెప్పుకున్నది. రెండోసారి అదే ప్రాధాన్యతను అమరావతి రూపంలో నిలబెట్టుకొన్నది. క్వాంటమ్ వ్యాలీ, డీప్ టెక్నాలజీ, ఏఐ వగైరాలన్నీ అమరావతి హైప్ కోసం క్రైపెక్కించడం తప్ప ఆచరణాత్మకమైన మాటలు కావనే అభిప్రాయం బలంగా వినిపిస్తున్నది. క్వాంటమ్ వ్యాలీకి అవసరమయ్యే ఎకో సిస్టమ్ అమరావతికి అందుబాటులోకి రావడమనేది ఒక సుదూర స్వప్నమే తప్ప ప్రభుత్వం చెబుతున్నట్టు ఐదేళ్లలో ఐదు లక్షల ఉద్యోగాలు కల్పించే స్థితి అసంభవమని నిపుణులు చెబుతున్నారు.

మధ్యతరగతిని మభ్యపెట్టడానికి యువతకు జోల పాడటానికి ఇటువంటి పదజాలాన్ని వెదజల్లడం బాబు కాకస్‌కు వెన్నతో పెట్టిన విద్య. ఈ జోలపాటల మాటున అమరావతిలో జరుగుతున్న అసలు కార్యక్రమమేమిటో చాలామందికి అర్థమైంది. అమరావతి పేరుతో ఇప్పటికే తెచ్చిన అప్పులే కాదు, ఇంకా అవసరమైన అప్పులు తీర్చడానికి భూములు అమ్ముతామనీ, అదో సెల్ఫ్ ఫైనాన్స్ కేపిటలనీ చెబుతూ వచ్చారు. తొలుత సమీకరించిన భూముల్లో రైతుల వాటా తీసేయగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవసరాలకు పోనూ మిగిలిన భూముల అమ్మకంతో తెచ్చిన అప్పులు తీర్చడం సాధ్యం కాదనే మాట వినిపిస్తున్నది. ఈ తత్వం బోధపడినందువల్లనే ప్రపంచ బ్యాంకు వాళ్లు ఈ మధ్య ప్రభుత్వానికి తాఖీదులు పంపారట! మీరు అమ్మబోయే భూములెన్ని? ఎప్పటిలోగా అమ్ముతారు? వాటి ద్వారా ఎంత డబ్బు సమీకరిస్తారో చెప్పండని వారు అడుగుతున్నారని సమాచారం.

ఇప్పుడు కొత్తగా 45 వేల ఎకరాల భూసేకరణ ప్రయత్నాలకు రైతులు ముందుకు రాకపోవడంతో ప్రభుత్వంలో కలవరం మొదలైనట్టు కనిపిస్తున్నది. కాకస్ పరంగా ఎంత సంపాదించుకున్నా ప్రభుత్వపరంగా మాత్రం అమరావతి ప్రాజెక్టు ఒక నిరర్థక ఆస్తిగానే మిగిలిపోయే ప్రమాదముందనే హెచ్చరికలు వినబడుతున్నాయి. పోలవరం – బనకచర్ల ప్రాజెక్టు పేరుతో ఈ మధ్యకాలంలో బాబు ప్రభుత్వం చేస్తున్న హడావుడి కూడా కమీషన్ల స్టార్టప్ కథేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. 80 వేల కోట్లతో చేపట్టే ఈ ప్రాజెక్టు రాష్ట్రంలో గేమ్ ఛేంజర్ కాబోతున్నదని ఆయన చెబుతున్నారు. ఈ ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలపై రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నివేదికలో పేర్కొన్న సమాచారం ప్రకారం, ఇది పూర్తయితే ఏడు లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకూ, ఇంకో 23 లక్షల ఎకరాల స్థిరీకరణకూ ఉపయోగపడుతుంది. జలయజ్ఞంలో భాగంగా ప్రారంభించి చాలావరకు పూర్తయి పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ఇంకో 14 వేల కోట్లు సరిపోతుందనీ, ఈ పని చేస్తే కూడా అంత ఆయకట్టు అందుబాటులోకి వస్తుందనీ చెబుతున్నారు.

అటువంటప్పుడు ఏది తొలి ప్రాధాన్యత కావాలి? 14 వేల కోట్లతో పెండింగ్ పనులు పూర్తి చేయడమా? 80 వేల కోట్లతో కొత్త ప్రాజెక్టును తలకెత్తుకోవడమా? గోదావరి వరద జలాలను ఉపయోగించుకోవాలన్న ఆలోచన ఆ రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా అవసరమే కావచ్చు. ఈ ఆలోచన కూడా వాస్తవానికి గత ప్రభుత్వంలో వచ్చినదే. కానీ సత్వరం పూర్తి కావలసిన ప్రాజెక్టులకు పైసా విదల్చకుండా చేపట్టిన ఈ నిర్హేతుకమైన ప్రాధాన్యతా క్రమం దేన్ని సూచిస్తుంది? భారీ ప్రాజెక్టుతో భారీ కమీషన్ల దురాశతోనే ఈ రకమైన ఎంపిక చేసుకున్నారంటే తప్పవుతుందా? రాష్ట్రంలో ఏ పంటకూ గిట్టుబాటు ధర ఇప్పించలేకపోయిన ప్రభుత్వం, ఉన్న ఊరిలోనే కల్తీలేని విత్తనాలు, ఎరువులు అందుబాటులోకి తెస్తున్న ఆర్‌బీకేలను మూసి పారేసిన ప్రభుత్వం రైతన్నల కన్నీరు తుడవడానికి భారీ ప్రాజెక్టులను సంకల్పించిందంటే నమ్మశక్యమేనా?

అటువంటప్పుడు ఏది తొలి ప్రాధాన్యత కావాలి? 14 వేల కోట్లతో పెండింగ్ పనులు పూర్తి చేయడమా? 80 వేల కోట్లతో కొత్త ప్రాజెక్టును తలకెత్తుకోవడమా? గోదావరి వరద జలాలను ఉపయోగించుకోవాలన్న ఆలోచన ఆ రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా అవసరమే కావచ్చు. ఈ ఆలోచన కూడా వాస్తవానికి గత ప్రభుత్వంలో వచ్చినదే. కానీ సత్వరం పూర్తి కావలసిన ప్రాజెక్టులకు పైసా విదల్చకుండా చేపట్టిన ఈ నిర్హేతుకమైన ప్రాధాన్యతాక్రమం దేన్ని సూచిస్తుంది? భారీ ప్రాజెక్టుతో భారీ కమీషన్ల దురాశతోనే ఈ రకమైన ఎంపిక చేసుకున్నారంటే తప్పవుతుందా? రాష్ట్రంలో ఏ పంటకూ గిట్టుబాటు ధర ఇప్పించలేకపోయిన ప్రభుత్వం, ఉన్న ఊరిలోనే కల్తీలేని విత్తనాలు, ఎరువులు అందుబాటులోకి తెస్తున్న ఆర్‌బీకేలను మూసి పారేసిన ప్రభుత్వం రైతన్నల కన్నీరు తుడవడానికి భారీ ప్రాజెక్టులను సంకల్పించిందంటే నమ్మశక్యమేనా?

ఆలూ లేదు, చూలూ లేదు అన్నట్టుగా బాబు ఈ ప్రాజెక్టును పూర్తిచేసే అవకాశమే లేనప్పటికీ దీనిపై తెలంగాణలోని అధికార ప్రతిపక్షాలు సిగపట్లకు దిగడం ఒక విశేషం. చంద్రబాబుతో సాన్నిహిత్యం కారణంగానే ఆయన ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం చెప్పలేదని బీఆర్ఎస్ ఆరోపించింది. దీనిపై గత కొన్ని వారాలుగా తీవ్రస్థాయిలో వాదోపవాదాలు జరుగుతున్నాయి. ఈ పంచాయితీలో బీఆర్ఎస్ వాదానిదే పైచేయిగా ఉన్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దానికి ఇతరత్రా కారణాలు కూడా కొన్ని దోహదపడి ఉండవచ్చు. ప్రెస్ మీట్లలో కాదు, అసెంబ్లీలో చర్చిద్దాం రండని తాజాగా కాంగ్రెస్ మంత్రులు సవాల్ విసురుతున్నారు. పదిహేనేళ్లు ముఖ్యమంత్రిగా ఉండి ఏ ప్రాజెక్టునూ పూర్తిచేసిన రికార్డు లేని చంద్రబాబు చిటికెల పందిరిని ఆంధ్ర ప్రజలెవరూ పట్టించుకోకపోయినా తెలంగాణలో అది మంట పుట్టించడం విశేషం.

ఒకపక్క అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల రూపంలో భారతీయ రైతును బలిపీఠమెక్కించే సూచనలు పొడసూపుతున్నాయి. వాణిజ్య ఒప్పందం కోసం అమెరికా విధించిన మూడు మాసాల గడువు ఈ నెల తొమ్మిదో తేదీతో ముగిసిపోనున్నది. ఈలోగా భారత్‌తో కనీసం మినీ ఒప్పందమైనా జరగాలని ట్రంప్ పట్టుపడుతున్నారు. రెండు దేశాల ప్రతినిధుల మధ్య గత వారం రోజులుగా చర్చోపచర్చలు జరుగున్నాయి. జన్యుమార్పిడి సోయాచిక్కుడు, మొక్కజొన్నలను, యాపిల్స్‌ను, డెయిరీ ఉత్పత్తులను తక్కువ సుంకాలతో భారత మార్కెట్‌లోకి అనుమతించాలని అమెరికా డిమాండ్ చేస్తున్నది. వందల ఎకరాల భారీ కమతాల్లో పూర్తిగా యంత్రాల సాయంతో, దాదాపు యాభై శాతం సబ్సిడీ ఇస్తున్న ప్రభుత్వం దన్నుతో చౌకగా వచ్చే అమెరికా వ్యవసాయ ఉత్పత్తులు తక్కువ సుంకాలతోనే మళ్లీ మార్కెట్‌లోకి ప్రవేశిస్తే భారతీయ రైతు తట్టుకోగలడా?


పైగా భారతీయ వ్యవసాయ రంగంలోకి, ఫుడ్ చెయిన్‌లోకి జన్యుమార్పిడి ఉత్పత్తులను అనుమతించకపోవడం భారత్ విధానంగా ఉంటూ వస్తున్నది. ఫుడ్ చెయిన్ పరిధిలోకి రాదనే కారణంతో పత్తిలోకి ఇప్పటికే జన్యుమార్పిడి విత్తనాలు ప్రవేశించాయి. రేపోమాపో కుదరనున్న మినీ వాణిజ్యం ఒప్పందంతో ఏం జరగనున్నదని దేశం ఆసక్తిగా ఎదురుచూస్తున్నది. అమెరికా విధించే గడువుకంటే తమకు దేశ ప్రయోజనాలే ముఖ్యమని 'టైమ్స్ ఆఫ్ ఇండియా' ఇంటర్వ్యూలో వాణిజ్య–పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ ఘంటాపథంగా చెప్పారు. శనివారం నాటి పత్రికలో వచ్చిన ఈ ఇంటర్వ్యూలో 'మన వ్యవసాయ రంగానికి నష్టం కలిగించే ఎటువంటి ఒప్పందాన్ని చేసుకోబోమ'ని ఆయన చెప్పారు. మొక్కజొన్న ఉత్పత్తిలో టాప్ ఫైవ్‌లో ఉన్న బిహార్ అసెంబ్లీ ఎన్నికల ముంగిట్లో ట్రంప్ ప్రతిపాదనలు అంగీకరించడం బీజేపీకి కూడా ఆత్మహత్యా సదృశమే.

వాణిజ్య చర్చల్లో పాల్గొంటున్న అధికారుల భోగట్టాగా పేర్కొంటూ బ్లూమ్‌బర్గ్ లాంటి వార్తా సంస్థలు మరో కథనాన్ని చెబుతున్నాయి. కేవలం పశువుల దాణా కోసం, పౌల్ట్రీ దాణా కోసం ఉపయోగపడే విధంగా మొక్కజొన్న, సోయా చిక్కుళ్ళ ఉప ఉత్పత్తులను అనుమతించే మినీ ఒప్పందం కుదిరే అవకాశముందని ఈ కథనాల సారాంశం. మినీ రవ్వ రూపంలో వచ్చినంత మాత్రాన అది జన్యుమార్పిడి పంట కాకుండా పోతుందా? పశువుల దాణా, కోళ్ల దాణాలోకి ప్రవేశిస్తే అది ఫుడ్ చెయిన్‌లో భాగం కాకుండా పోతుందా అనేవి చర్చనీయాంశాలు. రెండు మూడు రోజుల్లో జరిగే మినీ ఒప్పందం అనంతరం, మూడు నాలుగు నెలల్లో జరిగే పూర్తి స్థాయి ఒప్పందం అనంతరం మాత్రమే ఈ అంశంపై ఒక స్పష్టత వస్తుంది. ప్రస్తుతానికి దాణా రూపంలో ప్రవేశించినా, ఒంటె గుడారంలోకి కాళ్లు జాపితే ఏం జరుగుతుందో భవిష్యత్తులో అదే జరుగుతుంది. చంద్రబాబు వంటి వ్యవసాయ వ్యతిరేక విధానాలు అనుసరించే పాలకుల కారణంగా పాతికేళ్ల కిందటే మన రైతులు ఉరితాళ్లు పేనుకున్నారు. ఇప్పుడు కొడవళ్లు మెడపైకి చేర్చుకుంటున్నారు. భవిష్యత్తులో అమెరికా జన్యుమార్పిడి పంట ఉత్పత్తులు భారత మార్కెట్‌లోకి ప్రవేశిస్తే వ్యవసాయం దండగన్న బాబు జోస్యం నిజమవుతుంది. ఈ విషయంలో నిజంగానే ఆయన విజనరీగా నిలబడిపోతారు.

vardhelli1959@gmail.com

సైన్స్‌నే నమ్మాడు... మిరాకిల్‌గా నిలిచాడు!

సందర్భం



కంచ ఐలయ్య షెఫర్డ్

తెలంగాణలో ఓ మారుమూల పల్లెలో దాదాపు అర్ధ శతాబ్దం క్రితం ఓ పల్లెటూరి గొర్లకాపరి కేవలం సైన్సును నమ్మి తన గుండెజబ్బుతో పోరాడి విజయం సాధించిన కథ ఇప్పటికీ మూఢనమ్మకాల్లో కునారిల్లేవారికి మేలుకొలుపు. కంచ కట్టయ్య వరంగల్ జిల్లా, చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేటలో 1948లో జన్మించాడు. 11వ తరగతి వరకు నర్సంపేట హైస్కూల్లో చదివి, తల్లి మరణం తరువాత 1969లో పెళ్లి చేసుకొని, వ్యవసాయం– కులవృత్తి గొర్ల మంద వ్యవహారం చూసుకునేవాడు.

అకస్మాత్తుగా 1976లో ఆయనకు గుండె జబ్బు వచ్చింది. హైదరాబాదులోని గాంధీ ఆస్పత్రిలో ఫిజిషియన్‌కు చూపించగా, 'ఈయనకు గుండెలో రెండు వాల్వులు (కవాటాలు) పనిచేస్తున్నట్టు లేవు. బతకడం కష్టం' అని చెప్పి, తమిళనాడులోని క్రిస్టియన్ మెడికల్ కాలేజీ (సీఎంసీ) హాస్పిటల్, వెల్లూరులో ఈమధ్య ఆపరేషన్లు చేస్తున్నారనీ, అక్కడికి వెళ్లమనీ చెప్పారు. ఆ రోజుల్లో హైదరాబాద్ గాంధీ, ఉస్మానియా ఆస్పత్రుల్లో ఈసీజీ, ఎకోగ్రామ్ వంటి పరికరాలు కూడా లేవు. నిజానికి అప్పటికే ఆయన ఇద్దరు పిల్లల తండ్రి. భార్య నిరక్షరాస్యురాలు. కట్టయ్య హైదరాబాదులో చదువుకుని ఉద్యోగం చేస్తున్న తమ్ముడిని తీసుకొని వెల్లూరు వెళ్లాడు. పరీక్షలు చేయించుకుంటే ఆయన గుండెలో అతి కీలకమైన వాల్వ్ పనిచెయ్యడం లేదని తేల్చారు. 45–50 వేల వరకు ఖర్చుపెట్టగలిగితే ఆపరేషన్ చేస్తామన్నారు. ఆపరేషన్‌కు సిద్ధమయ్యాడు కట్టయ్య.

సీఎంసీలోని ప్రసిద్ధ థొరాసిక్ సర్జన్ స్టాన్లీ జాన్ యువకుడు. అప్పుడప్పుడే అమెరికాలో తయారై సీఎంసీకి అందుబాటులోకి వచ్చిన స్టార్–ఎడ్వర్డ్ స్టీల్ వాల్వ్‌లను అమర్చడంలో ఆయనది అందెవేసిన చెయ్యి. 1979 నాటికే పేరున్న సర్జన్. గుండెలో అమర్చడం కోసం ఎడ్వర్డ్ కంపెనీ చేసిన మొదటి వాల్వ్ అది.

కట్టయ్య స్కూల్లో ఉన్నప్పుడే సైన్సువాదిగా మారాడు. మూఢ నమ్మకాలు ఊళ్ళలో ఆనాడు కోకొల్లలు. ఈనాటికీ ఉన్నాయి. తాను చనిపోతాడని డాక్టర్లు చెప్పాక కూడా ఒక్క పైసా కూడా మూఢ నమ్మకం మీద ఖర్చు పెట్టనని మొండికేసిన మనిషి. 'నన్ను బతికిస్తే డాక్టర్లు, మందులు మాత్రమే బతికించగలవు' అని గట్టిగా నమ్మాడు. వాల్వ్‌ను గుండెలో పెట్టించుకోవడానికి అప్పులు సప్పులు చేశాడు.

సీఎంసీ కార్డియాలజీ డిపార్ట్‌మెంట్ ఆయనకు 1979 డిసెంబర్ 17న ఆపరేషన్ చేస్తామని డేట్ ఇచ్చింది. ఇటువంటి ఆపరేషన్ చేయించుకొని బతికిన మనిషి ఉదాహరణ తన ముందు లేదు. ఆ రోజుల్లో డాక్టర్లు మనుషుల్ని ఇలా ఆపరేషన్ చేసి గుండెను రిపేర్ చేస్తారనే ఆలోచనే లేదు. గ్రామాల్లో ఆనాడు అసలు చదువే లేదు. డాక్టర్లు ఆపరేషన్ ఖర్చులతోపాటు రక్తం ఇవ్వడానికి 8 మంది కావాలని చెప్పారు. అందులో నలుగురు ఎప్పుడైనా ఇచ్చిపోవచ్చు, మరో నలుగురు ఆపరేషన్ చేసే రోజే ఇవ్వాలి. ఇది సాధారణ విషయం కాదు. మనిషి శరీరం నుంచి రక్తం తియ్యడమంటేనే భయమున్న రోజులవి. రక్తదానం మీద ఆనాడు అవగాహనే లేదు. మిత్రులు, తమ్ముని సహాయంతో కుటుంబ భారాన్ని భార్యకు, ఒక చెల్లె కుటుంబానికి అప్పజెప్పి 8 మంది రక్తదాతలతో వెల్లూరు వెళ్ళాడు.

కట్టయ్యకు స్టాన్లీ జాన్ ఆపరేషన్ విజయవంతంగా చేశాడు.



◆ కంచ కట్టయ్య స్కూల్లో ఉన్నప్పుడే సైన్సువాది. తాను చనిపోతాడని డాక్టర్లు చెప్పాక కూడా ఒక్కపైసా మూఢ నమ్మకం మీద ఖర్చు పెట్టనని మొండికేసిన మనిషి. 'నన్ను బతికిస్తే డాక్టర్లు, మందులు మాత్రమే బతికించగలవు' అని నమ్మాడు. మొట్టమొదట ప్రపంచంలో తయారైన స్టార్–ఎడ్వర్డ్ స్టీల్ వాల్వ్‌తో 46 ఏళ్లు ఈయన బతకడం ప్రపంచ రికార్డ్ అని 'పద్మశ్రీ' డాక్టర్ దాసరి ప్రసాదరావు ప్రకటించారు.



కంచ కట్టయ్య

డాక్టర్ చరియన్ ఆయనకు అతి జాగ్రత్తగా జీవరక్షణ డ్రగ్స్, ముఖ్యంగా అసిట్రోమ్ 0.5 ఎం.జి. సెట్ చేశాడు. ఇది అటువంటి కృత్రిమ వాల్వ్‌తో బతికే పేషంటుకు ప్రతిదినం చావో బతుకో నిర్ణయించే ట్యాబ్లెట్. అది ప్రతిదినం నిర్ణీత సమయానికి వేసుకోకపోతే రక్తం గడ్డ కడుతుంది. డోసు ఎక్కువైతే రక్తం పలచనై ప్రాణాపాయానికి దారితీస్తుంది.

1984లో కట్టయ్యకు మళ్ళీ రక్తం పల్చదనం తగ్గి, బ్రెయిన్ క్లాట్స్ ఏర్పడి ఫిట్స్ రావడం మొదలైంది. భార్య భారతి హైదరాబాదు ఉస్మానియాకు తెచ్చి అడ్మిట్ చేసింది. నెల రోజులు కోమాలో ఉన్నాడు. 50 రోజులకు బతికి బయటపడ్డాడు. అప్పటి నుంచి హైదరాబాదులో పిల్లలతోనే జీవించడం, హాస్పిటల్ అవసరాలు, పిల్లల చదువులు, 2010లో మళ్ళీ నిమ్స్‌లో అడ్మిషన్, 18 రోజులు వెంటిలేటర్‌పై చావుతో పోరాడాడు. ఆయనకు 1979లో అమర్చిన ఎడ్వర్డ్ స్టీల్ వాల్వ్ చక్కగా పనిచేయడం, అప్పుడు నిమ్స్ డైరెక్టర్‌గా వున్న డాక్టర్ ప్రసాదరావును ఆశ్చర్యపరిచింది. ఆయన పర్యవేక్షణలో మళ్ళీ బతికి బయటపడ్డాడు. పడిపోవడాలు, దినాల తరబడి ఎక్కిళ్ళు, హాస్పిటల్ అడ్మిషన్లు నిరంతరం సాగాయి. అయినా బతుకు కొనసాగించాడు.

ఈ కట్టయ్య అకస్మాత్తుగా బాత్‌రూమ్‌లో కమోడ్‌పై కూర్చుని ఉండగా, ఆయన గుండెలో అమర్చిన ఫస్ట్ జనరేషన్ స్టీల్ వాల్వ్ పనిచేయడం ఆగిపోయి జూన్ 7న సైలెంట్‌గా 77వ ఏట కన్నుమూశాడు. ఆయన పుట్టిన గ్రామం పాపయ్యపేటలో అదే నెల 26వ తేదీన ఏర్పాటు చేసిన 'సైన్సు మనిషి కంచె కట్టయ్య' యాదిలో జరిగిన సభలో ఉమ్మడి రాష్ట్రంలో నిమ్స్‌లో గుండె ఆపరేషన్లు మొదటగా ప్రారంభించిన 'పద్మశ్రీ' దాసరి ప్రసాదరావు 46 ఏళ్ల ఆయన గుండెలో అమర్చిన వాల్వ్ గురించి గుండె మోడల్ తెచ్చి 40 నిమిషాలు వివరించారు. వందలాది గ్రామస్థులు అది తమ సొంత గుండెకు సంబంధించిన సమస్యగా విన్నారు. 46 ఏళ్ల ఏకైక – అదీ మొట్టమొదట ప్రపంచంలో తయారైన వాల్వ్‌తో ఈయన బతకడం ప్రపంచ రికార్డ్ అని ప్రకటించారు. ప్రస్తుతం నిమ్స్ డైరెక్టర్‌గా ఉన్న డా॥ నగరి బీరప్ప– ప్రఖ్యాత గ్యాస్ట్రోఎంట్రాలజీ సర్జన్, లండన్ ఎఫ్ఆర్‌సిఎస్ బోర్డ్ మెంబర్ 'కట్టయ్య జీవితం ఒక మెడికల్ మిరాకిల్' అని పోస్ట్ చేశాడు.

కట్టయ్య పూర్తిగా మూఢ నమ్మకాల వ్యతిరేకి. మందులు, ఆపరేషన్ల వల్ల మాత్రమే వ్యాధులు తగ్గుతాయి కాని, మూఢ నమ్మకాల వల్ల కాదని జీవితాంతం నమ్మాడు. అలానే జీవించాడు. ఈయన జీవిత ఉదాహరణ ప్రజలను సైన్సు, మానవత్వం వైపు మళ్లిస్తుందని ఆశిద్దాం!

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక విశ్లేషకుడు

ఉపవాస పుణ్యం

ఇస్లామ్ ధర్మంలో ముహర్రం నెలకు అత్యంత ప్రాముఖ్యం ఉంది. ప్రవక్త (స) మహనీయులవారు ఈ మాసాన్ని 'దేవుని నెల' అన్నారు. రమజాన్ రోజాల తరువాత అత్యంత ప్రాధాన్యత కలిగిన రోజాలు ముహర్రం రోజాలే. ముహర్రం లోని 'ఆషూరా' ఉపవాసం (అంటే మొహర్రం పదవ తేదీన పాటించబడే రోజా) గడచిన మొత్తం సంవత్సర కాల (చిన్న చిన్న) పాపాలను హరించివేస్తుంది.

రుజుమార్గం

మొహర్రం పదో తేదీని 'యౌమె ఆషూరా' అంటారు. పూర్వ చరిత్రలోనూ దీనికి పెద్ద విశేషమే ఉంది. హజ్రత్ మూసా ప్రవక్త (అ)ను, ఆయన జాతిని దుర్మార్గుడైన ఫిరౌన్ బారి నుండి కాపాడినందుకు కృతజ్ఞతగా మూసా ప్రవక్త అనుయాయులు మొహర్రం పదవ తేదీన రోజా పాటించేవారు. ఈ విషయం తెలుసుకున్న ప్రవక్త మహనీయులు 'మూసా ప్రవక్తపట్ల వారికంటే మనకే ఎక్కువ ప్రేమ, గౌరవం ఉన్నాయి. కనుక మనం రెండు రోజులు ఉపవాసం పాటిద్దాం' అన్నారు. అందుకని ముహర్రం మాసం తొమ్మిది, పది తేదీల్లో గానీ, పది పదకొండు తేదీల్లో గానీ ఉపవాసం ఆచరించాలి.

ప్రవక్త (స) వారి మనుమడు ఇమామె హుసైన్ (ర), ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, రాచరికానికి వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలు అర్పించింది కూడా ఈ నెలలోనే. ఆ మహత్తర త్యాగాన్ని స్ఫూర్తిగా తీసుకొని, నేటి మన రాజకీయాలను సంస్కరించుకోవాల్సిన అవసరం ఉంది. దానితో పాటు, ప్రవక్త మహనీయులవారి ఉపదేశానుసారం 'ఆషూరా' పాటించి సుదీర్ఘకాల ఉపవాసాలు పాటించిన పుణ్యం మూటకట్టుకోవాలి. ఎలాంటి అనవసర దురాచారాలకు తావివ్వకుండా, ఏ లక్ష్యసాధన కోసం ప్రవక్త మహనీయులవారి మనుమడు హజ్రత్ ఇమామె హుసైన్(ర) త్యాగాలు చేశారో, ఆ ఆశయ సాధన కోసం అలుపెరుగని ప్రయత్నం చేయాలి. అప్పుడే ఇహలోక జీవితం సుఖమయమవుతుంది. పరలోక జీవితం సఫలమవుతుంది.

– మదీహా అర్జుమంద్
(ముహర్రం సందర్భంగా)

క్లుప్తంగా...

అప్పులు తీర్చలేక కౌలు రైతు ఆత్మహత్య


దేవేందర్

మల్హర్: అప్పులు తీర్చలేక పురుగు మందు తాగి ఓ కౌలురైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం నాచారంలో శనివారం ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. కాటారం సీఐ నాగార్జునరావు కథనం ప్రకారం.. నాచారం గ్రామానికి చెందిన బండారి దేవేందర్ (32) మూడున్నర ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే సాగు చేసిన మిర్చి పంట తెగుళ్ల బారిన పడి, దిగుబడి రాలేదు. ఇలా ప్రతీ సీజన్‌లో వరుస నష్టాలతో దేవేందర్ అప్పుల పాలయ్యాడు. వాటిని తీర్చే మార్గం లేక తరచూ బాధపడేవాడు. ఈ క్రమంలో ఈనెల 4న ఉదయం దేవేందర్ ఇంటినుంచి బయటకు వెళ్లాడు. మధ్యాహ్నం 3 గంటలకు ఇంటికి వచ్చి తాను పురుగు మందు తాగినట్లు కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో వారు వెంటనే దేవేందర్‌ను బైక్‌పై భూపాలపల్లి ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం 5 గంటల సమయంలో అతను మృతిచెందినట్లు సీఐ తెలిపారు. ఈ ఘటనపై దేవేందర్ భార్య శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ఎదురుకాల్పుల్లో మావోయిస్టు మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో శనివారం జరిగిన ఎదురు కాల్పుల్లో గుర్తు తెలియని మావోయిస్టు మృతి చెందాడు. జిల్లాలోని ఇంద్రావతి నదీ తీరంలోని నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే నిఘా వర్గాల సమాచారం మేరకు.. డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, కోబ్రా విభాగాల బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో పోలీసులకు తారసపడిన మావోయిస్టులు కాల్పులు జరపగా.. పోలీసులు సైతం ఎదురుకాల్పులకు దిగారు. ఈ ఘటనలో ఒక గుర్తు తెలియని మావోయిస్టు మరణించాడు.

బ్రెయిన్‌స్ట్రోక్‌తో ఇంటర్ విద్యార్థిని మృతి


సాత్విక

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన విశ్వనాథుల పూర్ణచందర్, కవిత దంపతుల కుమార్తె సాత్విక (18) శనివారం బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందింది. ఇంటర్‌మీడియట్ చదువుతున్న సాత్విక రెండు రోజుల క్రితం అనారోగ్యానికి గురైంది. వెంటనే తల్లిదండ్రులు మండల కేంద్రంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న క్రమంలో మెదడులో రక్తం గడ్డ కట్టడంతో.. హఠాత్తుగా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. రెండు రోజుల క్రితం వరకు ఆరోగ్యంగా ఉన్న కుమార్తె మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

కోళ్లఫాంపై కుక్కల దాడి

- 150కి పైగా కోళ్ల మృతి


మృతి చెందిన కోళ్లు

రఘునాథపాలెం: ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం రాంక్యాతండాలోని కోళ్ల ఫాంపై వీధి కుక్కలు దాడి చేయగా.. 150కి పైగా కోళ్లు మృత్యువాత పడ్డాయి. రాంక్యాతండాకు చెందిన జాటోత్ వీరు.. గ్రామ సమీపంలో కోళ్లఫాం ఏర్పాటు చేశాడు. కాగా, శనివారం సాయంత్రం కుటుంబసభ్యులు భోజనానికి ఇంటికి వెళ్లగా.. అదే సమయంలో మూడు వీధికుక్కలు అకస్మాత్తుగా ఫాంలోకి ప్రవేశించి కోళ్లను కొరికి చంపాయి. మృతి చెందిన కోళ్ల విలువ రూ.లక్షకు పైగా ఉంటుందని, ప్రభుత్వం తమకు ఆర్థిక సాయం అందించాలని బాధితుని కుటుంబసభ్యులు కోరుతున్నారు.

‘సిగాచి’ భద్రత బాగానే ఉందట!

2024 డిసెంబర్ 12న ఈ పరిశ్రమను తనిఖీ చేసిన నిజామాబాద్ డీవైసీఐ

- అంతా సవ్యంగానే ఉందని అప్పట్లో నివేదిక
- తనిఖీ చేసిన ఏడు నెలల్లోపే భారీ ప్రమాదం


(ఫైల్)

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: పాశమైలారంలోని సిగాచి పరిశ్రమను కర్మాగారాల శాఖ అధికారులు చివరిసారిగా 2024 డిసెంబర్ 12న తనిఖీ చేసినట్టు ఆ శాఖ రికార్డులు చెబుతున్నాయి. వార్షిక తనిఖీల్లో భాగంగా జంబ్లింగ్ విధానంలో నిజామాబాద్ జిల్లా డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ జి.నెహ్రూతో ఈ పరిశ్రమను తనిఖీ చేయించారు. తాను నిర్వహించిన తనిఖీల్లో పరిశ్రమలో అన్ని భద్రత ప్రమాణాలు పాటించారని నెహ్రూ అప్పట్లో నివేదిక ఇచ్చారు. ఈ తనిఖీ జరిగి ఏడు నెలల్లోనే భారీస్థాయిలో ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లేలా ప్రమాదం జరిగింది. అయితే తనిఖీలు తూతూ మంత్రంగానే చేశారా అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్మికుల ఆరోగ్యానికి ముప్పు లేకుండా, పర్యావరణానికి విఘాతం లేకుండా ఈ పరిశ్రమ అన్ని నిబంధనలు పాటించిందంటూ ఉన్నతాధికారులకు ఇచ్చిన నివేదికలో పేర్కొన్నారు.

జంబ్లింగ్ విధానంలో తనిఖీలు

పరిశ్రమలు.. కార్మికుల భద్రత ప్రమాణాలు పాటిస్తున్నాయా లేదా? అనేదానిపై కర్మాగారాలశాఖ అధికారులు తనిఖీలు నిర్వహిస్తారు. రియాక్టర్లు, బాయిలర్లు, డ్రయ్యర్లు.. ఇలా వివిధ విభాగాలను తనిఖీలు చేసి ప్రమాణాలు సరిగ్గా ఉన్నాయా? లేదా? చూస్తారు. పరిశ్రమల్లోని ఆయా విభాగాల వద్ద భద్రతపై థర్డ్ పార్టీ ప్రైవేట్ ఏజెన్సీలు తనిఖీ చేసి నివేదికలు ఇస్తాయి. కర్మాగారాల శాఖ అధికారులు ఈ నివేదికలను మాత్రమే చూసి వదిలేస్తుండటంతో ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయనే విమర్శలు ఉన్నాయి.

మెషినరీ కాలం చెల్లిందని చెప్పినా...

సిగాచి పరిశ్రమ దుర్ఘటనపై భానూరు పీఎస్‌లో ఈనెల 2న కేసు నమోదైంది. పరిశ్రమలోని మెషినరీ కాలం చెల్లిపోయిందని, వెంటనే మార్చాలని, లేకపోతే భారీ ప్రమాదం జరిగే అవకాశం ఉందనే విషయాన్ని తన తండ్రి వెంకటజగన్ మోహన్ యాజమాన్యం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లానని, తనకు చెప్పారని సాయి యశ్వంత్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అయినా యాజమాన్యం పట్టించుకోలేదన్నారు.

నేను తనిఖీ చేసినప్పుడు అన్నీ బాగా పనిచేశాయి

సిగాచి పరిశ్రమను 2024 డిసెంబర్ నెలలో నేను తనిఖీ చేశారు. డ్రయ్యర్లు, రియాక్టర్, బాయిలర్లు, ఇతర యంత్ర పరికరాలు బాగానే పనిచేశాయని మా తనిఖీలో తేలింది. అందుకే ఎలాంటి అభ్యంతరాలు లేవని మా శాఖ ఉన్నతాధికారులకు అప్పట్లో నివేదిక ఇచ్చాను. ఈ ఫ్యాక్టరీలో మూడు షిఫ్టుల్లో ఉత్పత్తి జరుగుతోంది. నేను తనిఖీ చేసిన తర్వాత పరిస్థితులు మారి ప్రమాదానికి దారితీసి ఉండొచ్చు. మామూళ్లు తీసుకున్నారనే ఆరోపణలు అవాస్తవం.

– జి.నెహ్రూ, ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్

సైకిల్ కొన్న ఆనందం తీరకముందే.. అక్కాతమ్ముడి మృతి

- ప్రమాదవశాత్తు కుంటలో పడిన చిన్నారులు
- ఆదిలాబాద్ జిల్లా మావల శివారులో ఘటన


విదాత్


వినూత్న

ఆదిలాబాద్ రూరల్: ‘తాతా.. రైతుభరోసా డబ్బులు పడ్డాయా.. మాకు సైకిళ్లు కొనివ్వవా’.. అని ఆ చిన్నారులు అడగ్గానే తాత కాదనలేకపోయాడు. వారి కోరిక మేరకు శుక్రవారం ఇద్దరికీ చెరో సైకిల్ కొనిచ్చాడు. అయితే మరుసటిరోజే అక్కాతమ్ముడు మృతి చెందిన ఘటన అందరినీ కలిచివేసింది. మావల ఎస్సై ముజాహిద్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన లంక స్వామి–గీత దంపతులకు కుమారుడు విదాత్ (10), కుమార్తె వినూత్న (11) ఉన్నారు. వీరు ఓ ప్రైవేట్ పాఠశాలలో 5వ, 6వ తరగతి చదువుతున్నారు. రైతు భరోసా డబ్బులు రావడంతో స్వామి తండ్రి రాజేశ్వర్ శుక్రవారం మనుమడు, మనుమరాలికి కొత్త సైకిళ్లను కొనిచ్చాడు. ఆ ఆనందంలో చిన్నారులిద్దరూ శనివారం పాఠశాలకు వెళ్లలేదు. కుటుంబ సభ్యులంతా ఉదయం 10 గంటల ప్రాంతంలో పొలం పనులకు వెళ్లారు. అరగంట తర్వాత ఇద్దరు చిన్నారులు కూడా చెరో సైకిల్‌పై పొలానికి బయలుదేరారు. మార్గమధ్యలో బంజారాహిల్స్ ప్రాంతంలో రోడ్డుకు ఆనుకుని ఉన్న నీటి కుంటలో ప్రమాదవశాత్తు వినూత్న సైకిల్‌తో సహా పడింది. ఆమెను రక్షించే క్రమంలో తమ్ముడు విదాత్ కూడా అందులో పడి ఊపిరాడక మృతి చెందారు. మధ్యాహ్నం అయినా పిల్లలు రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించగా, నీటి కుంట సమీపంలో సైకిల్ కనిపించింది. అనుమానం వచ్చి లోపలికి వెళ్లి చూడగా ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి.

40కి చేరిన ‘సిగాచి’ మరణాలు

- చికిత్స పొందుతున్న వారిలో మరొకరు మృతి


ఘటనా స్థలంలో ఆనవాళ్లు సేకరిస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్, హైడ్రా బృందాలు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో జరిగి దుర్ఘటనలో క్షతగాత్రులైన వారు ఒక్కొక్కరుగా రాలిపోతున్నారు. తీవ్రగాయాలై ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారిలో శుక్రవారం కార్మికుడు భీంరావు మృతి చెందగా, శనివారం మరో కార్మికుడు మున్‌మున్‌చౌదరి మృత్యువాత పడ్డారు. దీంతో ఈ దుర్ఘటనలో మరణాల సంఖ్య 40కి చేరింది. ధ్రువ ఆస్పత్రిలో చేరిన 9 మంది క్షతగాత్రుల్లో ఇప్పటికే ఇద్దరు మృతి చెందగా, మిగిలిన ఏడుగురిలో 40 నుంచి 80 శాతానికి పైగా కాలిన గాయాలైన ముగ్గురికి వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు.

ఆ రెండు మృతదేహాలు ఎవరివి?

పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రిలో రెండు ఫుల్ డెడ్‌బాడీలు ఉన్నాయి. ఈ మృతదేహాలు ఎవరివనేది తేలడం లేదు. అవి ఆయా కుటుంబసభ్యుల డీఎన్‌ఏలతో సరిపోవడం లేదు. దీంతో ఆయా కుటుంబాల్లోని ఇతర సభ్యుల రక్తం శాంపిల్స్ సేకరిస్తున్నారు. ఇప్పటికే ఇచ్చిన వారివి కాకుండా ఆ కుటుంబంలోని మరొకరి రక్తం శాంపిల్‌ను తీసుకొని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. ఈ నివేదికలు వచ్చాకే ఈ రెండు ఫుల్ డెడ్‌బాడీలను సంబంధిత కుటుంబాలకు అప్పగిస్తామని అధికారులు ప్రకటించారు. డీఎన్‌ఏ రిపోర్టులు వచ్చిన మూడు డెడ్‌బాడీలను శనివారం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

శిథిలాల కింద మరిన్ని శరీరభాగాలు లభ్యం

శనివారం శిథిలాల కింద మరిన్ని శరీరభాగాలు లభించాయి. ఎముకలు, చేతివేళ్లు, ఇతర శరీరభాగాలు లభించడంతో వాటిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. ఇప్పటికే 15 శరీరభాగాలు మార్చురీలో ఉన్నాయి. వీటి డీఎన్‌ఏ రిపోర్టులు వచ్చినా, అవి శాంపిల్స్ ఇచ్చిన వారి కుటుంబాలకు సరిపోవడం లేదు.

కొనసాగుతున్న రెస్క్యూ

పేలుడు జరిగిన స్థలంలో ఎస్‌డీఆర్‌ఎఫ్, హైడ్రా అధికారుల రెస్క్యూ ఆపరేషన్ శనివారం కూడా కొనసాగింది. శిథిలాల తొలగింపు దాదాపు పూర్తయ్యింది. కానీ పేలుడు తీవ్రతకు భూమిలోకి దంతాలు, ఎముకలు వంటి శరీరభాగాలు ఏమైనా చొచ్చుకుని పోయాయా? మరేదైనా ఆనవాళ్లు లభిస్తాయోనని ఎస్‌డీఆర్‌ఎఫ్, హైడ్రా అధికారులు పంట చేలో కలుపు తీసిన మాదిరిగా ఆనవాళ్ల కోసం చేతులతో తవ్వుతున్నారు.

దామోదర్ లొంగుబాటు పోలీసుల ప్రచారమే!

- మంత్రి సీతక్కపై వచ్చిన ప్రకటనతో మాకు సంబంధం లేదు
- మావోయిస్టు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్

సాక్షిప్రతినిధి, వరంగల్: తమ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు దామోదర్ లొంగుబాటులో వాస్తవం లేదని, అది పూర్తిగా అబద్ధమని సీపీఐ (మావోయిస్టు) రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూలై 1న పలు దిన పత్రికలు, సోషల్ మీడియాలో దామోదర్ లొంగుబాటుపై విస్తృతంగా ప్రచారం జరిగిందని, కానీ అందులో ఎలాంటి వాస్తవం లేదని, పోలీసులే ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేశారని జగన్ పేరిట శనివారం విడుదలైన ఓ లేఖలో స్పష్టం చేశారు. ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడని ఓసారి, లొంగిపోయాడని మరోసారి.. ఇలా దామోదర్‌పై మీడియాలో రకరకాలుగా ప్రచారం చేశారని, ఇదంతా ప్రజల్లో గందరగోళం సృష్టించడానికేనని తెలిపారు. తెలంగాణలో మావోయిస్టుల కార్యకలాపాలు లేకపోయినప్పటికీ పోలీసులు మాత్రం మావోయిస్ట్ పార్టీకి ఎలాంటి సహకారం అందించకూడదంటూ ములుగు, కొత్తగూడెం, ఆసిఫాబాద్ జిల్లాల్లో అమాయక ఆదివాసీలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, తెలంగాణ ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని పేర్కొన్నారు. జూన్ 26న తెలంగాణ రాష్ట్ర కమిటీ పేరుతో మంత్రి సీతక్కపై వచ్చిన పత్రికా ప్రకటనకు తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని జగన్ ఆ లేఖలో తెలిపారు.

బోటు బోల్తాపడి ఇద్దరు మహిళల దుర్మరణం

- వికారాబాద్ జిల్లాలో ఘటన

అనంతగిరి: జిల్లా కేంద్రమైన వికారాబాద్ పట్టణ పరిధిలోని సర్పన్‌పల్లి ప్రాజెక్టులో శనివారం బోటు బోల్తాపడి ఇద్దరు మహిళలు మృతి చెందారు. హైదరాబాద్‌లోని మియాపూర్‌లో నివాసం ఉంటున్న బంధువుల ఇంటికి బిహార్‌కు చెందిన వారు వచ్చారు. సరదాగా గడిపేందుకు నాలుగు కుటుంబాల వారు మధ్యాహ్నం గోధుమగూడ సమీపంలోని వైల్డర్‌నెస్ రిసార్ట్స్‌కు వచ్చారు. సాయంత్రం సర్పన్‌పల్లి ప్రాజెక్టులో విహరించేందుకు ఇద్దరు పెద్దలు, ఇద్దరు చిన్నారులు బోట్ ఎక్కారు. బోటు ప్రాజెక్టులోకి వెళ్లగానే ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. ఈ క్రమంలో డ్రైవర్ పడవను వెనక్కు తిప్పే ప్రయత్నం చేస్తుండగా అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో రీతూకుమారి (55), పూనమ్‌సింగ్ (56) నీటిలో పడిపోయారు. గట్టుపైన ఉన్న కుటుంబ సభ్యుడు అలోక్ కుమార్ ప్రాజెక్టులోకి దూకి పిల్లలను రక్షించే ప్రయత్నం చేశాడు. అప్పటికే వారు పూర్తిగా నీరుతాగి అపస్మారకస్థితికి చేరారు. స్థానికులు, కుటుంబీకులు ఎట్టకేలకు వారిని బయటకు తెచ్చారు. హుటాహుటిన పట్టణంలోని ఈశా ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఇద్దరు మహిళలు మృతిచెందారు. మహిళలను కాపాడేందుకు ప్రయత్నించిన అలోక్ కుమార్ నీరు మింగడంతో ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. చిన్నారులు ప్రాణాలతో బయటపడ్డారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వికారాబాద్ పోలీసులు తెలిపారు.

ఆడుకోవడానికి వెళ్లి.. పక్కింట్లో శవమై


- కోరుట్లలో ఆరేళ్ల బాలిక హత్య
- ఆ ఇంట్లో ఉండే యువకుడి తీరుపై అనుమానాలు



హర్షిత

కోరుట్ల: జగిత్యాల జిల్లా కోరుట్లలో ఆరేళ్ల బాలిక హత్య కలకలం రేపింది. పట్టణంలోని ఆదర్శనగర్‌కు చెందిన ఆకుల రాము–నవీన దంపతులకు కుమారుడు వేదాంశ్, కూతురు హర్షిత (6) సంతానం. హర్షిత ప్రస్తుతం ఒకటో తరగతి చదువుతోంది. రాము ఉపాధి కోసం నాలుగేళ్లుగా దుబాయ్ వెళ్లి వస్తున్నాడు. ప్రస్తుతం ఇక్కడే ఉంటున్నాడు. శనివారం సాయంత్రం ఐదు గంటల సమయంలో హర్షిత స్కూల్ నుంచి తిరిగొచ్చింది. మొహర్రం సందర్భంగా కొందరు పెద్దపులి వేషధారణతో ఆటలు ఆడుతున్నారు. హర్షిత కూడా వారితో కలిసి కాసేపు వెళ్లి ఆడుకుంది. ఆరున్నర గంటలైనా చిన్నారి ఇంటికి రాకపోవడంతో హర్షిత తల్లిదండ్రులు, నానమ్మ చుట్టుపక్కల వెతికారు. అయినా ఫలితం కనిపించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాత్రి సుమారు 8.30 గంటల సమయంలో హర్షిత ఇంటికి సమీపంలో ఉన్న కొడిపెల్లి విజయ్ ఇంట్లోని బాత్‌రూం వద్ద హర్షిత శవమై కనిపించడంతో తల్లిదండ్రులు బోరుమన్నారు. విజయ్ ఒక్కడే ఆ ఇంట్లో ఉంటాడని, ఆయన తీరు సైకోలా ఉంటుందని చుట్టుపక్కల వారు చెబుతున్నారు. బాలిక శవమై కనిపించిందన్న సమాచారం తెలుసుకున్న డీఎస్పీ రాములు, సీఐ సురేష్‌బాబు, ఎస్సై చిరంజీవి సంఘటన స్థలానికి చేరుకున్నారు. బాలిక మెడ వద్ద మొండికత్తితో కోసినట్టు ఆనవాళ్లు కనిపించాయి. బాలికపై అత్యాచారం చేసి హత్య చేసినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. కొడిపెల్లి విజయ్ ఆచూకీ లేకపోవడం గమనార్హం. హర్షిత మృతదేహాన్ని కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

అల్‌ఖైదా చెరలో ఇద్దరు తెలుగువాళ్లు

- మాలిలోని డైమండ్ సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి కిడ్నాప్
- మంగళవారం ఫ్యాక్టరీపై దాడి చేసిన అల్‌ఖైదా అనుబంధ జేఎస్ఐఎం
- ఇప్పటివరకు అధికారికంగా స్పందించని ఉగ్ర సంస్థ
- తమ వాళ్లను విడిపించాలని బంధువుల వేడుకోలు


అమరలింగేశ్వరరావు


వెంకటరమణ

సాక్షి, హైదరాబాద్: ఉపాధి కోసం పశ్చిమ ఆఫ్రికా దేశం మాలికి వెళ్లిన ముగ్గురు భారతీయులను అల్‌ఖైదా అనుబంధ సంస్థ జమాత్ నుస్రత్ అల్–ఇస్లాం వల్ ముస్లిమీన్ (జేఎస్ఐఎం) తీవ్రవాదులు కిడ్నాప్ చేశారు. హైదరాబాద్‌కు చెందిన మోటపర్తి శివరాంప్రసాద్ ఆధ్వర్యంలో మాలి కాయెస్‌లో ఏర్పాటు చేసిన డైమండ్ సిమెంట్ ఫ్యాక్టరీపై మంగళవారం తీవ్రవాదులు దాడిచేసి వారిని అపహరించారు. నల్లగొండ జిల్లా పెద్దదేవులపల్లిలో స్థిరపడిన మాచర్ల సమీపంలోని జమ్మలమడకకు చెందిన కూరాకుల అమరలింగేశ్వరరావు, ఒడిశాలోని గంజాంలో స్థిరపడిన ఏపీ వాసి వెంకటరమణ, మహారాష్ట్రకు చెందిన వెంకటేశ్వరరావును ఉగ్రవాదులు అపహరించారు. అయితే, వారు కిడ్నాప్‌నకు గురై ఐదురోజులు గడుస్తున్నా.. ఎలాంటి సమాచారం లేకపోవటంతో కుటుంబసభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

జన్మదినం రోజే కిడ్నాప్

అమరలింగేశ్వరరావును ఆయన జన్మదినం రోజే తీవ్రవాదులు కిడ్నాప్ చేశారు. సోమవారం రాత్రి హైదరాబాద్ ఎల్బీనగర్‌లో ఉంటున్న ఆయన భార్య వెంకటరమణకు ఫోన్‌చేసి అంతా బాగానే ఉందని చెప్పారు. తీరా మంగళవారం ఆయన జన్మదినం సందర్భంగా గ్రీటింగ్స్ చెప్పేందుకు ఆమె ఫోన్‌లో ప్రయత్నించగా భర్త అందుబాటులోకి రాకపోవటంతో కంపెనీ మేనేజర్ బాబుకు ఫోన్ చేస్తే.. కిడ్నాప్ అయినట్లు చెప్పారు. అయితే, కిడ్నాప్ అయినవారు సురక్షితంగానే ఉన్నారని బాబు శనివారం బందీల కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. పదేళ్లుగా ఆఫ్రికాలోనే ఉద్యోగం చేస్తున్న అమరలింగేశ్వరరావు పిల్లల చదువు కోసం ఆర్నెల్ల క్రితం తన కుటుంబాన్ని అడవిదేవులపల్లి నుంచి (భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు) హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌కు మార్చారు. చివరిసారిగా ఆయన అక్టోబర్‌లో హైదరాబాద్‌కు వచ్చారని వెంకటరమణ తెలిపారు. గంజాం జిల్లా సమరఝూలాలో స్థిరపడ్డ పి.వెంకటరమణ చాలాకాలం హైదరాబాద్‌లో ‘బ్లూస్టార్’ అనే కంపెనీలో పనిచేసి గత నవంబర్‌లోనే మాలికి వెళ్లాడని ఆయన బంధువు బబ్లూ తెలిపాడు. వెంకటరమణ యోగక్షేమాలపై తమకు ఎవరూ సరైన సమాచారం ఇవ్వటం లేదని ఆయన తల్లి నర్సమ్మ గంజాం జిల్లా హింజిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అధికారిక ప్రకటన ఇవ్వని జేఎస్ఐఎం

భారతీయులను కిడ్నాప్ చేసింది జేఎస్ఐఎం సంస్థేనని అక్కడి ప్రభుత్వం తేల్చింది. అయితే, ఆ సంస్థ మాత్రం దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన ఇప్పటివరకు విడుదల చేయలేదు. గతంలో ఈ సంస్థ మాలిలో అనేక దాడులకు పాల్పడింది. మాలిలోని వజ్రాలు, బంగారం వంటి వనరులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో దాడులు చేస్తూ స్థానిక ప్రభుత్వాలు, విదేశీ సంస్థలపై ఒత్తిడి తెస్తోంది.

త్వరలో కొత్త స్టాంపుల విధానం

▶ మొదటి పేజీ తరువాయి

రూపొందించాలని అధికారులను కోరారు.

భూముల ధరల సవరణపై ప్రతిపాదనలు సిద్ధం చేయండి

సామాన్య, మధ్యతరగతి ప్రజానీకంపై ఎలాంటి భారం పడకుండా ప్రస్తుత మార్కెట్ విలువలకు అనుగుణంగా రాష్ట్రంలో భూముల ధరలను సవరించేందుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులకు మంత్రి పొంగులేటి సూచించారు. ఎలాంటి విమర్శలకు తావు లేకుండా శాస్త్రీయ పద్ధతిలో భూముల ధరలను సవరించేందుకు, హేతుబద్ధంగా పెంచేందుకు ఉన్న అవకాశాలపై లోతైన అధ్యయనం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళాభ్యుదయం కోసం ఎన్నో చర్యలు చేపడుతున్న నేపథ్యంలో మహిళలకు స్టాంపు డ్యూటీ తగ్గించే ఆలోచన చేయాలని, కొత్త వాటితో పోలిస్తే పాత అపార్ట్‌మెంట్‌లకు కొంత వెసులుబాటు ఉండేలా ప్రతిపాదనలు చేయాలని సూచించారు. అన్ని అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఒకే గోడ.. 4 లీటర్ల పెయింట్..
233 మంది కార్మికులు

మధ్యప్రదేశ్ స్కూల్‌లో అధికారుల అంకెల గారడీ

భోపాల్: దేశంలో రకరకాలుగా అక్రమాలు, మోసాలు జరుగుతున్నాయి. కానీ, ఇంతటి విడ్డూరాన్ని ఎన్నడూ చూడలేదంటూ ముక్కున వేలేసుకుంటున్నారు జనం. మధ్యప్రదేశ్‌లోని షహ్‌డోల్ జిల్లాలో వెలుగుచూసిందీ అంకెల గారడీ. బియోహారి అసెంబ్లీ నియోజకవర్గంలోని సకండి గ్రామ ప్రభుత్వ పాఠశాల గోడకు నాలుగు లీటర్ల రంగు వేసేందుకు ఏకంగా 168 మంది కూలీలు, 65 మంది తాపీ పనివారిని వినియోగించారు. ఇందుకోసం కాంట్రాక్టర్ రూ.1.07 లక్షల బిల్లు చేశాడు. ఎలాంటి పరిశీలనలు లేకుండానే అధికారులు సంతకాలు చేయడం, నగదు డ్రా చేసుకోవడం జరిగిపోయాయి. ఇలాంటిదే మరోటి..నిపనియా గ్రామంలోని స్కూలుకు 10 కిటికీలు, నాలుగు తలుపులకు 20 లీటర్ల రంగు వేసేందుకు 275 మంది కార్మికులను, 150 మంది తాపీ పనివారిని పెట్టుకున్నారట. వీరికోసం కాంట్రాక్టర్ రూ.2.3 లక్షల మేర బిల్లు కోసం దరఖాస్తు చేసుకోగా అధికారులు ఓకే చెప్పేశారు. స్కూలు భవనం గోడలపై కనిపించాల్సిన వీరి పనితనం..ఉత్తుత్తి లెక్కలు రాయడంలో రాటుదేలింది. సుధాకర్ కన్‌స్ట్రక్షన్స్ అనే కంపెనీ ఇలాంటి కాకి లెక్కలు చూపి మే 5వ తేదీన బిల్లు చేసింది. ఈ బిల్లును ఏప్రిల్ 4వ తేదీనే స్కూలు ప్రిన్సిపాల్ ఓకే చేసినట్లు రికార్డుల్లో ఉంది. రంగు వేయడానికి ముందు, తర్వాత ఫొటోలను బిల్లులకు జత చేయడం తప్పనిసరి. ఏ ఫొటోలు లేకుండానే ఈ కంపెనీకి బిల్లులు మంజూరైపోవడం మరో ఘనత. బిల్లుల వ్యవహారం సోషల్ మీడియాలో ప్రత్యక్షం కావడంతో నెటిజన్లు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఫూల్ సింగ్ మర్పంచి స్పందిస్తూ... సకండి, నిపనియా స్కూళ్లకు వేసిన రంగుల బిల్లు వ్యవహారం సోషల్ మీడియాలో వైరలవుతోంది. దర్యాప్తు చేపట్టి, బాధ్యులైన వారిపై చర్యలుతీసుకుంటాం 'అంటూ ముక్తసరిగా చెప్పేయడం విశేషం.

సుప్రీంలో ఓబీసీలకు
రిజర్వేషన్లు

దివ్యాంగులు, మాజీ సైనికులకు కూడా..

న్యూఢిల్లీ: దేశ అత్యున్నత న్యాయస్థానంలో ఉద్యోగుల నియామకాలు, పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీలకు ఇప్పటికే రిజర్వేషన్లు కల్పించారు. ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం రిజర్వేషన్లు అమల్లోకి వచ్చాయి. సుప్రీంకోర్టు తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇతర వెనుకబడిన తరగతులకు(ఓబీసీ) సైతం రిజర్వేషన్లు కల్పించింది. సుప్రీంకోర్టులో ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించడం ఇదే మొదటిసారి కావడం విశేషం. అలాగే దివ్యాంగులు, మాజీ సైనికులు, స్వాతంత్ర్య సమరయోధులకు సంబంధించిన వారికి సైతం రిజర్వేషన్లు ఇచ్చారు. ఇందుకోసం సుప్రీంకోర్టు ఆఫీసర్స్ అండ్ సర్వెంట్స్(కండీషన్స్ ఆఫ్ సర్వీస్ అండ్ కాండక్ట్) రూల్స్‌లో సవరణ చేశారు. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఈ నెల 3న నోటిఫికేషన్ జారీ చేశారు. రిజర్వేషన్లు కల్పించే విషయంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 146 క్లాజ్(2) ద్వారా సంక్రమించిన అధికారాలను ఆయన ఉపయోగించుకున్నారు.



యాగ్జియం మిషన్‌లో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్న భారత వ్యోమగామి శుభాంశు శుక్లా భార రహిత స్థితిలో చిరునవ్వులు చిందిస్తున్న వేళ..

ఒంటె కన్నీటి చుక్క
విషానికి విరుగుడు!

బికనీర్: లొట్టిపిట్టగా, ఎడారి ఓడగా పేరు తెచ్చుకున్న ఒంటె అంటే చిన్నారులకు ఎంతో ఇష్టం. దానిని ఎక్కితే మొదటి అంతస్తు నుంచి చూస్తున్నంత అనుభూతి కల్గుతుంది. పిల్లలకు ఆనందాన్ని పంచే ఈ ఒంటెలు ఇప్పుడు చిన్నాపెద్దా అనే తేడాలేకుండా అందరికీ రక్షణగా సైతం నిలుస్తాయని తాజా అధ్యయనమొకటి గట్టిగా నమ్ముతోంది. 26 రకాల పాముల విషాలను సైతం తట్టుకునేంత అద్భుతమైన శక్తిసామర్థ్యాలు ఒంటె కన్నీటికి ఉందని ఒక పరిశోధనా బృందం అభిప్రాయపడుతోంది. ఇసుక తుపాన్లు, చుక్క నీరులేని ఎడారి ప్రాంతం, ఒళ్లు కాలి మండిపోయేంత ఎండ.. ఇలా అత్యంత ప్రతికూల పరిస్థితుల్లోనూ అవలీలగా బతికే గుణం ఒంటెకు ఉన్నట్లే ఆ ఒంటె కన్నీటికీ అసాధారణ శక్తి ఉందని పరిశోధకులు చెబుతున్నారు. దుబాయ్‌లోని సెంట్రల్ వెటర్నరీ రీసెర్చ్ లేబొరేటరీలోని శాస్త్రవేత్తల బృందం ఈ అధ్యయనం చేసింది. పాముకాటు విరుగుడు మందు తయారీలో ఒంటె కన్నీటి నుంచి సేకరించిన పోషకాలు అక్కరకొస్తాయని వాళ్లు చెబుతున్నారు. బ్యాక్టీరియా కణ గోడలను ధ్వంసంచేసి వాటిని చంపేసే రోగ నిరోధక శక్తి ఉండే ప్రొటీన్లు ఈ కన్నీటిలో పుష్కలంగా ఉన్నాయని, ఈ కన్నీటి సాయంతో అత్యంత శక్తివంతమైన పాముకాటు విరుగుడు మందును తయారుచేయొచ్చని పరిశోధకులు చెప్పారు. సన్నని ఇసుకరేణువుల గాలిలో ఏళ్లతరబడి గడిపిన కారణంగా ఒంటె కన్నీటిలో సహజంగానే కంటి సంబంధ ఇన్ఫెక్షన్లను తట్టుకునే శక్తి ఉంటుందని, ఆ కోణంలో శోధించి ఈ కొత్త విషయాన్ని సాధించామని వాళ్లు చెప్పారు. ఒంటె కన్నీళ్లలో పాముకాటును తట్టుకునే యాంటీబాడీలు అధికంగా ఉన్నట్లు తమ పరిశోధనలో తేలిందని వాళ్లు వెల్లడించారు.

ఎలా కనిపెట్టారు?

ఎకీస్ కారినాటస్ సోచిరేకీ అనే విషపూరితమైన పాము నుంచి విషాన్ని బయటకు తీసి క్యామలస్ డ్రోమిడేరియస్ రకం ఒంటెకు స్వల్పస్థాయిలో ఎక్కించారు. విషానికి ఒంటె రక్తం, కన్నీరు ఎలా స్పందిస్తున్నాయో అధ్యయనంచేశారు. గుర్రాలకు పాము విషాన్ని ఎక్కించి పాముకాటు విరుగుడు తయారుచేస్తారు. అలా తయారుచేసిన విరుగుడుతో పోలిస్తే ఒంటె కన్నీటిలో యాంటీబాడీ పాళ్లు అత్యధికంగా ఉన్నట్లు తేలింది. అయితే ప్రపంచస్థాయిలో అన్ని రకాల పాముల విషాలకు ఒంటె కన్నీరు ఏ స్థాయిలో ప్రతిస్పందిస్తుంది అనేది ఇంకా తేలాల్సి ఉంది. ఆ దిశగా పరిశోధన జరగలేదు. దుబాయ్, బికనీర్‌లో జరిగిన స్థాయిలో అన్నిచోట్లా పరిశోధనలు సత్ఫలితాలనిస్తే విరుగుడు మందు తయారీలో కొత్త అధ్యయనం మొదలైనట్లేనని అధ్యయనకారులు వ్యాఖ్యానించారు. భారత్‌లో ఏటా వేలాది మంది పాముకాటు కారణంగా చనిపోతున్న సంగతి తెలిసిందే.

వైవిధ్యమైన వాణిజ్యం

భారత్, అర్జెంటీనా నిర్ణయం
- అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిల్లీతో ప్రధాని మోదీ భేటీ
- కీలక రంగాల్లో పరస్పర సహకారం పెంపొందించుకోవాలని నిర్ణయం
- వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ఉన్నతస్థాయికి చేర్చాలని తీర్మానం



అర్జెంటినా అధ్యక్షుడు జేవియర్ మిల్లీతో ప్రధాని మోదీ

బ్యూనస్ ఎయిర్స్: తమ ఇరు దేశాల మధ్య వ్యాపారం, వాణిజ్యాన్ని మరింత వైవిధ్యంగా తీర్చిదిద్దుకోవాలని భారత ప్రధాని నరేంద్ర మోదీ, అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిల్లీ నిర్ణయించుకున్నారు. అలాగే రక్షణ, ఇంధనం, అరుదైన ఖనిజాలు తదితర కీలక రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత పెంపొందించుకోవాలని అంగీకారానికి వచ్చారు. మోదీ, జేవియర్ మిల్లీ శనివారం అర్జెంటీనా రాజధాని బ్యూనస్ ఎయిర్స్‌లో సమావేశమయ్యారు. ద్వైపాక్షిక అంశాలపై విస్తృతంగా చర్చించారు. వ్యూహాత్మక ప్రయోజనాలు కాపాడుకొనేలా రెండు దేశాల నడుమ రక్షణ రంగంలో సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించారు. రెండు దేశాల వ్యూహాత్మకభాగస్వామ్యాన్ని మరింత ఉన్నతస్థాయికి చేర్చాలని మోదీ, జేవియర్ మిల్లీ తీర్మానించారు. ఐదు దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ శనివారం అర్జెంటీనాకు చేరుకున్నారు. భారత ప్రధాని అర్జెంటీనాలో ద్వైపాక్షిక పర్యటన చేపట్టడం గత 57 ఏళ్లలో ఇదే మొదటిసారి. జేవియర్ మిల్లీతో సమావేశం అనంతరం మోదీ 'ఎక్స్'లో పోస్టుచేశారు. వ్యవసాయం, రక్షణ, ఇంధనంతోపాటు పలు కీలక రంగాల్లో సహకారంపై చర్చించామని తెలిపారు. ఫార్మాస్యూటికల్స్, క్రీడలు తదితర రంగాల్లో ఇరుదేశాలు కలిసి పని చేయడానికి అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. జేవియర్‌తో మిల్లీతో అద్భుతమైన భేటీ జరిగిందని మోదీ పేర్కొన్నారు. భారత్–అర్జెంటీనా మధ్య గత 75 ఏళ్లుగా దౌత్య సంబంధాలు కొనసాగుతున్నాయని, ఐదేళ్ల క్రితం ఈ సంబంధాలు 'వ్యూహాత్మక భాగస్వామ్యం' స్థాయికి వృద్ధి చెందాయని గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో ఇరుదేశాల ఉమ్మడి ప్రయాణం మరింత అర్థవంతంగా, ప్రగతిశీలకంగా సాగుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

జాయింట్ వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేద్దాం

వ్యవసాయ రంగంలో మరింతగా సహకరించుకోవాల్సిన అవసరం ఉందని మోదీ, మిల్లీ అభిప్రాయపడ్డారు. ఒక దేశానికి చెందిన వ్యవసాయ ఉత్పత్తులను మరో దేశంలో ప్రజలకు సులువుగా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. దీనివల్ల ఇరుదేశాల రైతులకు లబ్ధి చేకూరుతుందని వారు అంగీకరించారు. ఇందుకోసం జాయింట్ వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేయాలని, ఆ దిశగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని నిర్ణయించారు. అంతకుముందు ట్రినిడాడ్ అండ్ టొబాగో నుంచి అర్జెంటీనాకు చేరుకున్న ప్రధాని మోదీకి బ్యూనస్ ఎయిర్స్‌లోని ఎజీజా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో అధికారులతోపాటు ప్రవాస భారతీయులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అర్జెంటీనా నేషనల్ హీరో జనరల్ జోస్ డి శాన్ మార్టిన్ స్మారకం వద్ద మోదీ నివాళులర్పించారు. భారత్–అర్జెంటీనా మధ్య దశాబ్దాలుగా చక్కటి మైత్రి కొనసాగుతోంది. 2019లో అప్పటి అర్జెంటీనా అధ్యక్షుడు మారిసియో మాక్రీ ఇండియాలో పర్యటించారు. ఆ సమయంలో భారత్, అర్జెంటీనా మధ్య సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి పెంచారు. వాణిజ్యం, రక్షణ, అరుదైన ఖనిజాలు, చమురు, గ్యాస్, అణు ఇంధనం, వ్యవసాయం, సాంస్కృతికం, టెక్నాలజీ వంటి రంగాల్లో రెండు దేశాలు కలిసి పని చేస్తున్నాయి. పలు అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. పరస్పరం సహకరించుకుంటున్నాయి.

శుభాంశు బిజీబిజీ

ఎముక ఆరోగ్యం, రేడియోధార్మికతపై పరిశోధన

న్యూఢిల్లీ: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)కు చేరుకున్న భారత వ్యోమగామి శుభాంశు శుక్లా తన విధుల్లో బిజీగా మారారు. ఒకరోజు విశ్రాంతి తర్వాత తన 'ఐఎస్ఎస్ పదోరోజు'పనుల్లో భాగంగా సూక్ష్మ గురుత్వాకర్షణ స్థితిలో మనిషి ఎముకల సాంద్రత ఎలా ఉంటుంది? అనే అంశంపై ఆయన పరిశోధనలు మొదలుపెట్టారు. భారరహిత స్థితిలో ఎముకలో కణాల పుట్టుక, అభివృద్ధి, వాపు అంశాలపైనా శుక్లా శోధన సాగించారు. దీర్ఘకాలంపాటు ఖగోళయానం చేస్తే రేడియోధార్మికత కారణంగా వ్యోమగాముల కణాల్లో డీఎన్ఏ నిచ్చెనలు దెబ్బతింటే అవి మళ్లీ మరమ్మతులు చేసుకోవాలంటే భూమి గురుత్వాకర్షణ అవసరం. కానీ ఐఎస్ఎస్‌లో అత్యంత స్వల్పస్థాయిలో గురుత్వాకర్షణ శక్తి ఉంటుంది. అలాంటప్పుడు రేడియేషన్ ప్రభావ స్థాయిలు ఎలా ఉంటాయనే దానిపై శుక్లా అధ్యయనం మొదలెట్టారు. నీటి ఎలుగుబంటి(టార్డీగ్రేడ్)తోపాటు శైవలాలు శూన్యస్థితిలో ఎలా పెరగగలవు? అనే అంశంపై ప్రయోగంచేశారు. వాటర్‌బేర్‌ల ఉనికి, పునరుజ్జీవం, పునరుత్పత్తి విధానాల్లో మార్పులను ఆయన గమనించారు. ఈ సూక్ష్మజీవాలు భవిష్యత్తులో సుస్థిర జీవనానికి, ఆహారం, ఇంధనంతోపాటు పీల్చేగాలికి ఊపిరులూదొచ్చు. అయితే తొలుత భారరహిత స్థితిలో ఈ అతిసూక్ష్మజీవాలు ఎలా మనుగడ సాగిస్తాయో తెల్సుకోవాల్సి ఉంది''అని యాగ్జియం స్పేస్ సంస్థ శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ''శుక్లాతోపాటు యాగ్జియం బృంద సభ్యులు ఎముక శూన్యంలో ఎలా పెళుసుబారుతుంది? భూమి మీదకు రాగానే ఎలా పూర్వస్థితిని చేరుకుంటుంది? అనే దానిపైనా ప్రయోగంచేశారు. ఆస్టియోపోరోసిస్ వంటి ఎముక సంబంధ వ్యాధులకు మరింత మెరుగైన చికిత్సావిధానాల అభివృద్ధికి తాజా ప్రయోగాలు దోహదపడతాయి''అని యాగ్జియం స్పేస్ తెలిపింది. శూన్య స్థితిలో అస్థిపంజరంలోని కండరాలు ఎందుకు సూక్ష్మ స్థాయిలో స్థానభ్రంశం చెందుతాయనే అంశంపైనా శుక్లా పరిశోధన చేశారు. చాలా రోజులపాటు అంతరిక్షయాత్రల్లో భాగంగా ఐఎస్ఎస్‌లో గడిపే వ్యోమగాములను కండరాల క్షీణత పట్టిపీడిస్తుంది. దీనికి కణస్థాయిలో పరిష్కారం కనుగొనేందుకు శుక్లా ప్రయత్నించారు.

ఒకే వేదికపై
రాజ్, ఉద్ధవ్



అభివాదం చేస్తున్న రాజ్, ఉద్ధవ్

ముంబై: వరుసకు సోదరులైన ఉద్ధవ్ ఠాక్రే, రాజ్ ఠాక్రే దాదాపు రెండు దశాబ్దాల అనంతరం ఒకే వేదికను పంచుకున్నారు. మరాఠాల గుర్తింపు, రాష్ట్రంలో హిందీ భాష బోధన అంశం శివసేన(యూబీటీ)చీఫ్, మహారాష్ట్ర నవనిర్మాణ సేన(ఎంఎన్ఎస్) చీఫ్‌ను ఒక్కటి చేసింది. హిందీ భాషా బోధనకు ఉద్దేశించిన జీవోలను వెనక్కి తీసుకుంటూ బీజేపీ సారథ్యంలోని ఫడ్నవీస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పురస్కరించుకుని వర్లిలోని ఎన్ఎస్‌సీఐ డోమ్‌లో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో ఇద్దరు ఠాక్రేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్ధవ్ ఠాక్రే ప్రసంగిస్తూ..'మేం ఐక్యంగా ఉండేందుకే కలిసి మీ ముందుకు వచ్చాం. ముంబై స్థానిక ఎన్నికలతోపాటు మహారాష్ట్రలో ఐక్యంగా అధికారంలోకి వస్తాం'అంటూ కార్యకర్తల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. మొదటగా రాజ్ ఠాక్రే మాట్లాడుతూ..శివసేన వ్యవస్థాపకుడు బాల్ ఠాక్రే సైతం చేయలేని పనిని సీఎం ఫడ్నవీస్ చేశారంటూ తమ ఇద్దరి కలయికపై వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర నుంచి ముంబైను వేరు చేసేందుకే ఫడ్నవీస్ ప్రభుత్వం త్రి భాషా సూత్రాన్ని తెరపైకి తెచ్చిందని ఆరోపించారు. ఈ ప్రయత్నం విఫలం కావడంతో రాష్ట్ర ప్రజలను కులం ఆధారంగా విభజించే ప్రయత్నాలు చేస్తుందని వ్యాఖ్యానించారు. తన కుమారుడిది కాన్వెంట్ చదువంటూ ఎత్తి చూపడంపై రాజ్ స్పందిస్తూ...దక్షిణాదిలోని ఎంతో మంది రాజకీయ నాయకులు, సినిమా స్టార్లు ఇంగ్లిష్ స్కూళ్లలోనే చదువుకున్నారని, అయినప్పటికీ సొంత తమిళం, తెలుగును గురించి గర్వంగా చెప్పుకుంటారని చెప్పారు. 2005లో రాజ్ ఠాక్రే శివసేనను వీడిన సంగతి తెలిసిందే.

పటౌడీ కుటుంబానికి షాక్

రూ.15,000 కోట్ల ఆస్తులు ఎవరివో తేల్చాలి
- మళ్లీ విచారణ జరపాల్సిందే
- ట్రయల్ కోర్టుకు భోపాల్ హైకోర్టు ఆదేశం

జబల్పూర్: బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌తో పాటు ఆయన కుటుంబానికి గట్టి ఎదురుదెబ్బ తగలింది. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లోని రూ.15,000 కోట్ల విలువైన ఆస్తులకు వారసులు ఎవరన్నదానిపై మళ్లీ విచారణ చేపట్టాలని మధ్యప్రదేశ్ హైకోర్టు ఆదేశించింది. ఏడాదిలోగా విచారణ పూర్తిచేయాలని నిర్దేశించింది. ఆ ఆస్తులు పటౌడీ కుటుంబానికి(సైఫ్ అలీఖాన్, ఆయన తల్లి షర్మిలా ఠాగూర్, సోదరీమణులు సోహా అలీఖాన్, సబా అలీఖాన్) చెందుతాయంటూ 20 ఏళ్ల క్రితం ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పు, డిక్రీని హైకోర్టు పక్కనపెట్టింది. ఈ మేరకు జస్టిస్ సంజయ్ ద్వివేదితో కూడిన సింగిల్ బెంచ్ జూన్ 30న ఉత్తర్వు జారీ చేసింది. రూ.15,000 కోట్ల ఆస్తులకు వారసులు ఎవరో గుర్తించడానికి మళ్లీ విచారణ జరపాల్సిందేనని ట్రయల్ కోర్టుకు స్పష్టంచేసింది.

అసలు ఏమిటీ వివాదం?

భోపాల్ సంస్థానానికి చివరి పాలకుడు నవాబ్ హమీదుల్లా. ఆయనకు భార్య మైమూనా సుల్తాన్, ముగ్గురు కుమార్తెలు అబీదా, సాజీదా, రబియా ఉన్నారు. సాజీదా పటౌడీ సంస్థాన వారసుడు ఇఫ్తికార్ అలీఖాన్‌ను పెళ్లి చేసుకున్నారు. వారి కుమారుడే మన్సూర్ అలీఖాన్ పటౌడీ. ఆయన క్రికెటర్‌గా పేరుప్రఖ్యాతలు సంపాదించారు. బాలీవుడ్ నటి షర్మిలా ఠాగూర్‌ను ప్రేమవివాహం చేసుకున్నారు. వీరికి సైఫ్ అలీఖాన్, సోహా అలీఖాన్, సబా అలీఖాన్ జన్మించారు. నవాబ్ హమీదుల్లా పెద్ద కుమార్తె అబీదా దేశ విభజన సమయంలో పాకిస్తాన్‌కు వెళ్లిపోయారు. అక్కడే స్థిరపడ్డారు. దాంతో సాజీదా భోపాల్‌లోని ఆస్తులకు వారసురాలయ్యారు. అనంతరం మన్సూర్ అలీఖాన్‌కు.. సైఫ్ అలీఖాన్, ఆయన సోదరీమణులకు ఆ ఆస్తులు వారసత్వంగా వచ్చాయి. దివంగత నవాబ్ హమీదుల్లా కుటుంబ సభ్యులైన బేగం సురయ్యా రషీద్, నవాబ్ మెహర్ తేజ్ సాజీదా తదితరులు 1999లో కోర్టుకెక్కారు. ఆస్తుల్లో తమకు వాటా ఇచ్చేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. వారి విజ్ఞప్తిని భోపాల్ జిల్లా కోర్టు తిరస్కరించింది. ఆస్తులకు పటౌడీ కుటుంబమే యజమాని అంటూ 2000 ఫిబ్రవరి 14న తీర్పు వెలువరించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ బేగం సురయ్యా రషీద్, నవాబ్ మెహర్ తేజ్ సాజీదా తదితరులు మధ్యప్రదేశ్ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. నవాబ్ హమీదుల్లా వారసురాలిగా సాజీదాను గుర్తిస్తూ భారత ప్రభుత్వం 1962 జనవరి 10 సర్టిఫికెట్ జారీ చేసిందని, ఆ ఆస్తులన్నీ తమకే చెందుతాయని పటౌడీ కుటుంబ సభ్యులు స్పష్టంచేశారు. ఈ వాదనను పిటిషనర్లు తిరస్కరించారు. ఈ నేపథ్యంలో పిటిషన్లు ప్రాథమికంగా 1999లో దాఖలయ్యాయి కాబట్టి మళ్లీ విచారణ జరపాలని హైకోర్టు ధర్మాసనం తేల్చిచెప్పింది.

నీరవ్ మోదీ సోదరుడి అరెస్ట్



న్యూఢిల్లీ: ఎనిమిదేళ్ల క్రితం పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) నుంచి రూ.13,000 కోట్ల రుణాలు తీసుకుని ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ కేసులో అతని తమ్ముడు నేహాల్‌ను అమెరికా పోలీసులు అరెస్ట్‌చేశారు. పీఎన్‌బీ కేసులో నీరవ్‌తోపాటు నేహాల్‌కు పాత్ర ఉందని, అమెరికాలో అరెస్ట్‌చేయాలని అక్కడి ప్రభుత్వాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐలు అభ్యర్థించిన నేపథ్యంలో ట్రంప్ సర్కార్ అతడిని అరెస్ట్‌చేసింది. నేహాల్‌పై ఇప్పటికే ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీస్ జారీచేసిన నేపథ్యంలో శుక్రవారం అతడిని అరెస్ట్‌చేశామని భారత దర్యాప్తుసంస్థలకు అమెరికా అధికారులు సమాచారమిచ్చారు. నేహాల్‌ను తమకు అప్పగించాలని అమెరికా కోర్టును భారత ప్రభుత్వాధికారులు కోరనున్నారు. ఈ కేసు ఈనెల 17వ తేదీన విచారణకురానుంది. అదే రోజున నేహాల్ తనకు బెయిల్ ఇవ్వాలంటూ దరఖాస్తుచేసుకునే అవకాశముంది. మనీలాండరింగ్ నిరోధక చట్టంలోని సెక్షన్ 3, భారత శిక్షాస్మృతిలోని 201సెక్షన్(సాక్ష్యాధారాల ధ్వంసం), 120బీ(నేరపూరిత కుట్ర) సెక్షన్ల కింద ఈ కేసును అమెరికా ఫెడరల్ ప్రాసిక్యూటర్లు వాదించనున్నారు. నీరవ్ మోదీ, అతని మామ మెహుల్ ఛోక్సీలతోపాటు 46 ఏళ్ల నేహాల్ మోదీ పీఎన్‌బీతో ముందస్తు ప్రణాళిక ప్రకారమే వేల కోట్ల రూపాయల రుణాలు తీసుకుని ఎగ్గొట్టారని దర్యాప్తు సంస్థలు ఆరోపిస్తున్న విషయం విదితమే.

అమల్లోకి 'బిగ్ బ్యూటిఫుల్' చట్టం

తన కలల బిల్లుపై సంతకం చేసి చట్టంగా తీసుకొచ్చిన ట్రంప్

వాషింగ్టన్: పన్ను చెల్లింపుదారులపై ట్యాక్స్ భారం తగ్గించడం, వలసచట్టాల అమలుకు కావాల్సిన నిధులను సేకరించడం, రక్షణరంగ బడ్జెట్ పెంపు వంటి ఎన్నో లక్ష్యాలతో రూపొందించిన కీలక 'వన్ బిగ్ బ్యూటిఫుల్'బిల్లు ఎట్టకేలకు అమెరికాలో చట్టంగా అమల్లోకి వచ్చింది. అమెరికా సెనేట్, ప్రతినిధుల సభలో సుదీర్ఘ చర్చలు, ఉత్కంఠతో కూడిన ఓటింగ్‌ల నడుమ ఆమోదం పొందిన ఈ బిల్లుపై అమెరికా కాలమానం ప్రకారం శుక్రవారం సాయంత్రం ట్రంప్ శ్వేతసౌధంలో సంతకంచేశారు. రెండో దఫా అధ్యక్షుడయ్యాక రిపబ్లికన్ పార్టీపై తన పట్టు సడలలేదని తాజా బిల్లు ద్వారా ట్రంప్ నిరూపించుకున్నారు. మరో దశాబ్దకాలంలో అమెరికా ఆర్థికలోటును మరో 3.3 ట్రిలియన్ డాలర్లు పెంచేసే చట్టంగా అపవాదును మూటగట్టుకున్న దాదాపు 870 పేజీల ఈ కొత్త చట్టంలోని కొన్ని కీలక అంశాలపై క్లుప్తంగా..

2017నాటి పన్నుల్లో కోత కొనసాగింపు

ట్రంప్ తొలిదఫా అధ్యక్షునిగా ఎన్నికైనప్పుడు ప్రజలు చెల్లించాల్సి పన్ను రేటును తగ్గించారు. పరిశ్రమలకూ దీనిని వర్తింపజేశారు. ప్రభుత్వానికి తక్కువ పన్ను చెల్లించిన కారణంగా తమ వద్ద మిగిలిపోయిన సొమ్మును జనం ఖర్చుచేస్తారు. ఇలా వస్తుసేవల వినియోగం పెరిగి ఆర్థికాభివృద్ధి ఊపందుకుంటుందని ట్రంప్ ఆశిస్తున్నారు.

వైద్యసాయంపై భారీ కోత

ఏ ప్రభుత్వమైనా కొత్త పథకం తెస్తే అందులో వైద్య ప్రయోజనాలు పెరుగుతాయి. కానీ ఈ బిల్లు ప్రస్తుతం అందుబాటులో ఉన్న వైద్య ప్రయోజనాలకు గండికొడుతోంది. తక్కువ ఆదాయం ఉన్న వ్యక్తులు/కుటుంబాలు/ వికలాంగులకు మెడికల్ ఎయిడ్ ప్రయోజనాలు దూరంకానున్నాయి. దీంతో మెడికల్ ఇన్సూరెన్స్ రక్షణలేక లక్షలాది మంది తమ సొంత డబ్బులను వైద్యం కోసం ఖర్చుచేయాల్సిఉంటుంది. ఎక్కువ గంటలు పనిచేసే వ్యక్తులకే అధిక మెడిక్‌ఎయిడ్ నిబంధనను చేర్చారు. ప్రస్తుతం అమెరికాలో 7.1 కోట్ల మంది ప్రభుత్వ వైద్య బీమా సదుపాయాన్ని పొందుతున్నారు. కొత్త చట్టం కారణంగా 1.7 కోట్ల మందికి ఈ సదుపాయం దూరమవుతుంది.

పెన్షన్లు, గౌరవ భృతిపై పన్నుల తగ్గింపు

రిటైర్డ్ ఉద్యోగులు, వికలాంగులు, ఇతర పెన్షనర్లపై విధించే సామాజిక భద్రతా ఆదాయ పన్నును తగ్గించారు. 65 ఏళ్లు పైబడిన వాళ్లకు అందే పెన్షన్, ఇతర ప్రయోజనాలపై మూలఆదాయం వద్ద కోతను 4,000 డాలర్లకు పరిమితం చేశారు.

తగ్గనున్న ఫుడ్ కూపన్ల లబ్ధిదారులు

బైడెన్ హయాంలో అందించిన పునరుత్పాదక ఇంధన వనరుల ప్రోత్సాహక ప్రయోజనాలకు ప్రభుత్వం ఈ చట్టం ద్వారా కోతపెట్టింది. సౌర, పవన విద్యుత్ సంస్థలకు ఇచ్చే పన్ను ప్రయోజనాలను తగ్గించి ఆ మేరకు బొగ్గు, చమురు సంస్థలకు ప్రయోజనం కల్పించనున్నారు. కార్లు కొనేందుకు వాహనరుణం తీసుకుంటే అందుకు చెల్లించే వడ్డీని సైతం తగ్గించారు. తక్కువ ఆదాయవర్గాలకు అందించే ఫుడ్ కూపన్లు(టోకెన్లు) తగ్గించనున్నారు. ప్రస్తుతం 4 కోట్ల మంది ఈ ఫుడ్ టోకెన్లను ఉపయోగించుకుంటున్నారు. కొత్త చట్టం కారణంగా 47 లక్షల మంది ఆ అర్హతను కోల్పోతారు.



కాంగ్రెస్ సభ్యుల సమక్షంలో వైట్‌హౌస్‌లో సంతకం చేసిన బిల్లుతో ట్రంప్

భారీగా రక్షణ బడ్జెట్

రక్షణ బడ్జెట్‌ను మరో 150 బిలియన్ డాలర్లు పెంచనున్నారు. సరిహద్దు గోడనిర్మాణం, అక్రమంగా చొరబడిన విదేశీయుల కోసం మొత్తంగా 1,00,000 పడకలతో నిర్బంధ కేంద్రాలను నిర్మించనున్నారు.

టెక్సాస్‌లో ఆకస్మిక వరదలు

9 మంది చిన్నారులు సహా 27 మంది మృతి

కెర్‌విల్లె: అమెరికాలోని టెక్సాస్‌లో కురిసిన కుండపోత వర్షాలు 9 మంది చిన్నారులు సహా మొత్తం 27 మందిని బలి తీసుకున్నాయి. సమ్మర్ క్యాంప్‌పైకి వరద దూసుకెళ్లిన ఘటనలో 23 మంది బాలికలు గల్లంతయ్యారు. కనిపించకుండా పోయిన వారి సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నాయంటున్నారు. కొన్ని నెలలపాటు కురవాల్సిన వాన గురువారం రాత్రి సమయంలో అనూహ్యంగా కేవలం కొన్ని గంటల్లోనే కురిసిందని అధికారులు తెలిపారు. గ్వాడలుపె నది సమీపంలోని హంట్ అనే చిన్న పట్టణం వద్ద 'క్యాంప్ మిస్టిక్'పేరుతో నిర్వహించే సమ్మర్ క్యాంప్‌లో 750 మంది బాలికలు పాల్గొన్నారు. వరద ప్రమాదం ముంచుకు రావడంతో అధికారులు కొందరు బాలికలను హెలికాప్టర్ ద్వారా తరలించారు. మిగతా వారిని వంతెన మీదుగా సురక్షిత ప్రాంతానికి తీసుకెళ్లారు. వీరిలో 23 మంది కనిపించకుండా పోయారని అధికారులు తెలిపారు.



శనివారం ధర్మశాలలో కేంద్ర మంత్రి కిరణ్ రిజిజుతో మాట్లాడుతున్న దలైలామా

మరో 40 ఏళ్లు జీవించాలనుకుంటున్నా

చివరిదాకా లామాగా కొనసాగుతా: దలైలామా
- నేడు 90వ జన్మదిన వేడుకలు

ధర్మశాల: టిబెటన్ల అత్యున్నత ఆధ్యాత్మిక గురువు 14వ దలైలామా త్వరలో తన వారసుడిని ప్రకటిస్తారన్న వార్తలకు చెక్‌పెడుతూ దలైలామా శనివారం తన మనసులో మాట వెల్లడించారు. మరో 30–40 ఏళ్లు జీవించాలనే ఆశ ఉందని, తుదిశ్వాస వరకు బుద్ధుని బోధనలను శక్తివంచనలేకుండా వ్యాప్తి చెందిస్తానని ఆయన ప్రకటించారు. జీవించి ఉన్నంత కాలం తానే లామాగా కొనసాగుతానని ఆయన పరోక్షంగా చెప్పారు. ఆదివారం తన 90వ పుట్టిన రోజును పురస్కరించుకుని హిమాలయాల్లోని మెక్లియోడ్‌గంజ్ పట్టణంలోని సుగ్లాగ్‌ఖాంగ్ ఆలయంలో దలైలామా ఆయుష్షు బాగుండాలంటూ శనివారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. శక్తిస్వరూపిణిగా పేర్కొనే 'ఒరాకిల్'.. దలైలామా చెంతకొచ్చి ఆయనను ఆశీర్వదించింది. ఒరాకిల్ ఆవాహనను ఈ ప్రత్యేక ప్రార్థనల్లో కీలకఘట్టంగా చెప్పొచ్చు. ఈ ప్రత్యేక ప్రార్థనల్లో కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దలైలామా మీడియాతో మాట్లాడారు. ''కాలజ్ఞానం నాకేదో చెబుతున్నట్లు అనిపిస్తోంది. నాపై అవలోకితేశ్వర ఆశీస్సులు కురుస్తున్నట్లు తోస్తోంది. ఇప్పటికే నా శాయశక్తులా కృషిచేశా. ఇలా బుద్ధుని బోధనలను వ్యాప్తి చెందించేందుకు నేను మరో 30–40 సంవత్సరాలు జీవించాలని ఆశ పడుతున్నా. నాపై అవలోకితేశ్వర ప్రభావం చిన్నతనం నుంచే ఉంది. బౌద్ధధర్మాన్ని మరికొంత కాలం ప్రపంచానికి చాటి చెబుతా. అందులోభాగంగానే 130 ఏళ్లు వచ్చేవరకు జీవిస్తాననే భావిస్తున్నా''అని అన్నారు.

సాక్షి హైదరాబాద్

ఆదివారం । 6 । జూలై । 2025



నేరస్తులూ.. ఖబడ్దార్!
నాన్ బెయిలబుల్ వారెంట్ల (ఎన్‌బీడబ్ల్యూ) అమలుపై రాచకొండ పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం ప్రత్యేక వ్యూహాన్ని అనుసరిస్తున్నారు. -8లో



హి'స్టార్'కల్.. టేస్ట్..
నగర చరిత్ర, సంస్కృతి వైవిధ్యమైన వంటకాలకు కూడా ప్రసిద్ధి చెందింది. మొఘలాయి, పర్షియన్ తెలుగు ప్రభావాలు కలగలిసిన రుచులకు నెలవుగా మారింది. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
32.0/23.0
నగరంలో ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 32, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.



కళాకారులను కనికరించరూ!

సంస్కృతీ సంప్రదాయాలకు కళారూపాలతో జీవం పోసి భావితరాలకు అందిస్తున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలని మంత్రి జూపల్లి కృష్ణారావుకు పలువురు కళాకారులు వినతిపత్రం అందజేశారు. శనివారం తెలంగాణ జానపద సకల కళాకారుల జేఏసీ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ఎదుట ధర్నా నిర్వహించారు. తమకు ఉపాధి అవకాశాలు, గుర్తింపు కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు అందించాలని డిమాండ్ చేశారు. - గన్‌ఫౌండ్రీ



తూలుతూ.. సోలుతూ..

మానసిక రుగ్మతలతో యువత విలవిల



వైద్య నిపుణులను ఆశ్రయిస్తున్న బాధితులు
- తమకు తెలియకుండానే డ్రగ్స్ మహమ్మారి బారిన..
- ఎండీఎంతో పాటు మాదక ద్రవ్యాల వినియోగం
- నగరంలో చాపకింద నీరులా మత్తు పదార్థాల దందా

సాక్షి, సిటీబ్యూరో:

ఒకవైపు వందలాది కేసుల నమోదు.. మరోవైపు కిలోల కొద్దీ మత్తు పదార్థాల స్వాధీనం.. సాఫ్ట్‌వేర్ నిపుణులు మొదలుకొని సాధారణ వ్యక్తుల వరకు ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడుతూనే ఉన్నారు. అయినప్పటికీ నగరంలో మత్తు పదార్థాలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. గంజాయి, ఎండీఎం సహా వివిధ రకాల మాదక ద్రవ్యాలు గొలుసుకట్టులా నగరంలో సరఫరా అవుతున్నాయి. ఆపరేషన్ ధూల్‌పేట్ వంటి కార్యక్రమాలతో నిఘా వ్యవస్థను పటిష్టం చేసినప్పటికీ.. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతంలోకి డ్రగ్స్ దందా చాపకింద నీరులా విస్తరిస్తోంది. ఒడిశా, బిహార్ తదితర రాష్ట్రాల నుంచి యథేచ్ఛగా నగరానికి గంజాయి దిగుమతి అవుతూనే ఉంది. ఇటీవల కాలంలో డ్రగ్స్ విక్రేతలు సరికొత్త ఎత్తుగడలను అనుసరిస్తున్నారు. ఐస్‌క్రీంలు, చాక్లెట్లు, కుల్ఫీలు, కేక్‌లు వంటి రూపాల్లో విక్రయిస్తున్నారు. దీంతో తమకు తెలియకుండానే చాలా మంది వాటి బారిన పడుతున్నారు. 'వివిధ రకాల మానసిక లక్షణాలతో వచ్చేవాళ్లను పరిశీలించినప్పుడు వాళ్లు మత్తు పదార్థాలు సేవించినట్లు స్పష్టమవుతోంది. కానీ అదే విషయం చెబితే నమ్మలేకపోతున్నారు. గంజాయి, డ్రగ్స్ చాపకిందనీరులా నగరమంతటా ప్రవహిస్తోంది' అని నగరానికి చెందిన సీనియర్ సైకియాట్రిస్ట్ డాక్టర్ సంహిత తెలిపారు. ఇలాంటి వారి మానసిక లక్షణాలను గుర్తించి అందుకు అనుగుణమైన చికిత్సను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.

వేడుకలే.. వేదికలై..

కొద్ది రోజుల క్రితం నగరంలోని ఓ కార్పొరేట్ విద్యాసంస్థలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. పాత, కొత్త విద్యార్థుల కలయికతో సందడి నెలకొంది. హైదరాబాద్‌లో చదువుకొని చాలా రోజుల క్రితం పుణె వెళ్లిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆ వేడుకల్లో పాల్గొనేందుకు తనతో పాటు మత్తు పదార్థాలను సైతం తన వెంట తెచ్చాడు. చాలా రోజుల తర్వాత వచ్చిన స్నేహితుడు ఆఫర్ చేసిన చాక్లెట్‌లలో గంజాయి కూడా ఉందని తెలియని పూర్వ విద్యార్థులు ఎంతో ఇష్టంగా వాటిని ఆరగించారు. ఆ చాక్లెట్‌లలో ఏదో 'మత్తు' ఉందని వాళ్లకు ఆ తర్వాత అర్థమైంది. నగరంలో ఇలాంటి వేడుకలే గంజాయి, ఎండీఎం, హాష్ ఆయిల్ వంటి వివిధ రకాల మత్తు పదార్థాల సరఫరాకు అడ్డాగా మారుతున్నాయి.

విద్యార్థులు, ఐటీ ఉద్యోగులే లక్ష్యంగా..

కార్పొరేట్ విద్యాసంస్థలు, సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో పని చేసే ఉద్యోగులనే లక్ష్యంగా చేసుకొని డ్రగ్స్ విక్రేతలు 'ఎర' వేస్తున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. 'డ్రగ్స్ విక్రేతలు వేసే 'ఎర'కు చిక్కిన వాళ్లు క్రమంగా మత్తు బానిసలుగా మారుతున్నారని చెబుతున్నారు. ఇటీవల పోలీస్, ఎక్సైజ్ దాడుల్లో ఎక్కడో ఒకచోట ఇలాంటి సాఫ్ట్‌వేర్ నిపుణులే పట్టుబడటం గమనార్హం. రెండు రోజుల క్రితం మంగళ్‌హాట్‌లో ఎక్సైజ్ పోలీసుల తనిఖీల్లో ఓ సాఫ్ట్‌వేర్ నిపుణుడి వద్ద అరకిలో గంజాయి లభించింది. ఉప్పల్, నాగోల్ వద్ద జరిపిన తనిఖీల్లో ఎండీఎంను స్వాధీనం చేసుకున్నారు.

తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి..

'టీనేజ్ పిల్లలే ఈ విష వలయంలో చిక్కుకుంటున్నారు. బాగా చదువుకొనే పిల్లలు ఆకస్మాత్తుగా ఇలాంటి వాటి బారిన పడి తీవ్రంగా నష్టపోతున్నారు' అని డాక్టర్ సంహిత చెప్పారు. పిల్లల కదలికలపై తల్లిదండ్రులు ఓ కన్నేసి ఉంచాలని, అలాగే వాళ్లు చదువుకునే స్కూళ్లు, కాలేజీలను తరచుగా సందర్శించాలని చెప్పారు. ఎలాంటి సందేహం కలిగినా వెంటనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. గలగలా మాట్లాడుతూ సందడి చేసే పిల్లలు ఆకస్మాత్తుగా మౌనంగా ఉంటున్నారంటే వారి మానసిక ఆరోగ్యాన్ని అనుమానించాల్సిందేనని మణికొండకు చెందిన మరో మానసిక నిపుణుడు డాక్టర్ హరీష్ చెప్పారు. నగరంలోని అనేక ప్రాంతాల్లో ఒక గొలుసుకట్టు వ్యవస్థలాగా ఈ డ్రగ్స్ దందా విస్తరిస్తోంది. బేకరీలు, హోటళ్లు,కిరాణాదుకాణాలు, పాన్‌షాపులు మత్తుపదార్థాల విక్రయ దుకాణాలుగా మారుతున్నాయి. మానసిక వైద్యుల వద్దకు వెళ్లి చికిత్స పొందే పరిస్థితి కంటే మత్తు పదార్థాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

దందాకు అడ్డుకట్ట పడదా?

తాజాగా ఒడిశా నుంచి ధూల్‌పేట్‌కు దేవుడి పటాల వెనుక గంజాయి సరఫరా చేస్తుండగా ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి 11 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితులపైన కేసులు నమోదు చేశారు. బిహార్ నుంచి గంజాయి తరలించి సరూర్‌నగర్ ప్రాంతంలోని ఓ కిరాణా దుకాణంలో 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు, ఎక్సైజ్ అధికారులు పెద్ద ఎత్తున దాడుల చేసి క్వింటాళ్ల కొద్దీ గంజాయి, కిలోల కొద్దీ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుంటున్నారు. రూ.కోట్ల విలువైన మత్తుపదార్థాలను కాల్చివేస్తున్నారు. అయినా ఈ దందాకు మాత్రం అడ్డుకట్టపడటం లేదు.

బీబీ కా ఆలంలకు పూలు, దట్టీలు సమర్పించిన మంత్రులు



చార్మినార్: మొహర్రం సంతాప దినాల సందర్భంగా షియా ముస్లింలకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ ఆమేర్ అలీఖాన్, వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్‌లతో కలిసి శనివారం ఆయన బీబీ కా అలావాను సందర్శించి ఆలంలకు పూలు, దట్టీలు సమర్పించారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. పదో మొహరం సందర్భంగా ఆదివారం పాతబస్తీ ప్రధాన వీధుల్లో నిర్వహించే బీబీ కా ఆలం సామూహిక ఊరేగింపునకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కర్ణాటక నుంచి లక్ష్మి అనే ఏనుగును రప్పించినట్లు చెప్పారు. కట్టుదిట్టమైన భద్రతా చర్యలు నడుమ బీబీ కా ఆలం సామూహిక ఊరేగింపు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మీర్ హైదర్ అలీ జాఫ్రీ తదితరులు పాల్గొన్నారు.

తపాలా సేవలు తప్పనిసరి

పోస్ట్‌మ్యాన్‌లను అడ్డుకుంటే చర్యలు



- భవనాల్లోకి రానివ్వాల్సిందే
- లిఫ్టులను వాడనివ్వాలి
- జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ ఆదేశాలు
- రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లకు మార్గదర్శకాలు

సాక్షి, సిటీబ్యూరో: తపాలా సేవలను సమర్థంగా, సమయానుసారంగా ప్రజలకు అందించేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) కీలక చర్యలు చేపట్టింది. జీహెచ్‌ఎంసీ పరిధిలోని పలు రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, గేటెడ్ కమ్యూనిటీలు, బహుళ అంతస్తుల భవనాల నివాసితులు పోస్ట్‌మ్యాన్‌లను, ఇతరత్రా డెలివరీ సర్వీస్ వ్యక్తులను లోపలికి రానీయకుండా అడ్డుకుంటున్నారు. దీంతో వారు చాలా ఇబ్బందులు పడుతున్నారు. పాస్‌పోర్టులు, డ్రైవింగ్ లైసెన్సులు, ఆధార్ కార్డుల వంటి ముఖ్యమైన వాటిని డోర్ డెలివరీ చేయలేకపోతున్నారు. ఈ-కామర్స్ సంస్థల ద్వారా దేశం నుంచి, విదేశాల నుంచి అందే పార్శిళ్ల గృహస్తులకు చేర్చడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గేట్ల వద్దే సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకుంటున్నారు. వీరిని లోపలికి వెళ్లనీయడం లేదు. లిఫ్టులు వాడవద్దంటున్నారు. వాహనాలను పార్కింగ్ చేయనీయడం లేదు. వారి ఇబ్బందుల్ని వివరిస్తూ.. తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కార్యాలయం నుంచి జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్‌కు లేఖ అందింది. ఈ ఇబ్బందుల వల్ల ప్రజలకు అందాల్సిన సర్వీసులు సకాలంలో అందడం లేదని లేఖలో పేర్కొన్నారు. అందుకు స్పందిస్తూ కమిషనర్ పోస్ట్‌మ్యాన్‌లను అడ్డుకోకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లను ఆదేశించారు. తమ పరిధిలోని రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లకు తగిన మార్గదర్శకాలు జారీ చేయాలన్నారు.

కమిషనర్ ఆదేశాల్లోని ముఖ్యాంశాలివీ..
- డోర్‌స్టెప్ డెలివరీకి పోస్ట్‌మ్యాన్‌లకు ఆంక్షలు లేని ప్రవేశం కల్పించాలి.
- పోస్ట్‌మ్యాన్స్ ప్యాసింజర్ లిఫ్టలను ఉపయోగించేందుకు అడ్డంకులు విధించకూడదు.
- వారి వాహనాలకు భద్రత ఉండేలా, నిర్ణీత స్థలాల్లో పార్కింగ్ సదుపాయం కల్పించాలి.
- ప్రతి అపార్ట్‌మెంట్ లేదా కమ్యూనిటీలో ప్రామాణిక లేబుల్‌లతో కూడిన లెటర్ బాక్సులు ఉండేలా చూడాలి.
- పోస్టాఫీస్ యాక్ట్- 2023 ప్రకారం ఇవన్నీ తప్పనిసరిగా పాటించాలి.

అవగాహన కల్పించాలి:
- జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్లు ఈ అంశాలను స్థానిక ప్రజలకు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లకు తెలియజేసేందుకు తగిన ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలి.
- మీడియా, కమ్యూనిటీ మీటింగులు, పబ్లిక్ నోటీసుల ద్వారా సమాచారం తెలియజేయాలి.

ప్రభుత్వ ఉద్యోగిని అడ్డుకోవడం నేరం..
ప్రభుత్వ ఉద్యోగిని విధులు నిర్వహించకుండా అడ్డుకోవడం అంటే అది భారతీయ న్యాయ సంహిత 2023 (సెక్షన్ - 221) ప్రకారం శిక్షార్హమైన నేరంగా పరిగణిస్తారు. ఆటంకాలు కొనసాగిస్తే చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సేవకు గౌరవం కల్పించాలి..
పోస్ట్‌మ్యాన్‌లు ప్రజలకు ప్రభుత్వ పత్రాలు, వ్యక్తిగత సమాచారం కలిగిన లేఖలు, ఆహ్వానాలు తదితరాలు నేరుగా ఇంటిముందుకు తీసుకెళ్లే సేవలు అందిస్తున్నారు. వారికి గౌరవనీయమైన వాతావరణం, సమర్థవంతమైన వనరులు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని కమిషనర్ పేర్కొన్నారు.

జీహెచ్‌ఎంసీ ఆస్తుల సర్వేకు సిద్ధం

- లే ఔట్ ఓపెన్ స్పేస్‌ల నుంచి డంపింగ్ యార్డుల వరకూ..
- నాలుగు జోన్లలో డీజీపీఎస్ సర్వేకు కన్సల్టెంట్లకు ఆహ్వానం

కార్యాలయ భవనాల నుంచి.. మున్సిపల్ షాపుల దాకా



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ ఆస్తులు, వాటి పరిరక్షణపై అధికారులు దృష్టి సారించారు. బల్దియా స్థిరాస్తులైన లే ఔట్ ఓపెన్ స్పేస్‌లు, పార్కులు, ఆటస్థలాలు, మున్సిపల్ మార్కెట్లు, షాపులు, కార్యాలయ భవనాలు, కమ్యూనిటీ హాళ్లు, మున్సిపల్ భూములు, జంతు వధశాలలు, డంపింగ్ యార్డులు తదితరాలను సర్వే చేయించనున్నారు. చార్మినార్, ఖైరతాబాద్, సికింద్రాబాద్, శేరిలింగంపల్లి జోన్లలో వీటి సర్వే, డిజిటైజేషన్, జియో రిఫరెన్సింగ్‌ల కోసం కన్సల్టెంట్ల నుంచి ఆర్‌ఎఫ్‌పీ టెండర్లు ఆహ్వానించారు. ఈ నాలుగు జోన్లలో దాదాపు 1,400 స్థిరాస్తులున్నట్లు అంచనా. వీటి విస్తీర్ణం దాదాపు 575 ఎకరాలు. కచ్చితంగా ఎన్ని ఆస్తులు, ఎంత విస్తీర్ణంలో ఉన్నాయో సర్వే ద్వారా తెలియనుంది. సర్వేకు ఎంపికయ్యే కన్సల్టెన్సీ అంగుళం వరకు కచ్చితమైన వివరాలందజేసే డీజీపీఎస్(డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్) సర్వే చేయాలి. అన్ని ఆస్తుల విస్తీర్ణం, సరిహద్దులు, పక్కనున్న భవనాలు, రోడ్లు, తదితరమైన వాటిని సర్వేచేయాలి. అన్ని మూలల నుంచి రియల్ కోఆర్డినేట్లు గుర్తించాలి. భవనాల బయటి భాగంతో పాటు లోపలి దృశ్యాలు కూడా కనిపించేలా ఫొటోలు తీయాలి. ప్రస్తుత వినియోగం, భవనం పేరు తదితర వివరాలు నమోదు చేయాలి. లే ఔట్ ఓపెన్ స్పేస్‌లకు సంబంధించి ఎంత మేర కబ్జా అయింది, కబ్జాలో ఎన్ని నిర్మాణాలున్నాయో గుర్తించాలి. ప్రతి ఆస్తికి యూనిక్ ఐడీ నెంబరు ఇవ్వాలి. ఇలా పలు అంశాల్ని పొందుపరచాల్సి ఉంటుంది. ఎంపికయ్యే ఏజెన్సీ ఆర్నెళ్లలోగా ఈ సర్వే పూర్తిచేయాలి. ఎల్‌బీనగర్, కూకట్‌పల్లి జోన్లలోనూ ఇలాంటి సర్వేకు ఇంత క్రితమే ఆర్‌ఎఫ్‌పీ టెండర్లు ఆహ్వానించినప్పటికీ, ఇంకా ఏజెన్సీ ఎంపిక పూర్తికాలేదు. టెక్నికల్ బిడ్లు తెరిచినప్పటికీ, ఫైనాన్షియల్ బిడ్లు తెరవాల్సి ఉంది. ఈ రెండు జోన్లలో, ప్రస్తుత నాలుగు జోన్లలో సర్వే ద్వారా మొత్తం జీహెచ్‌ఎంసీ ఆస్తులె ఎన్నో.. వాటిల్లో ఎన్ని కబ్జాల పాలయ్యాయో, ఏవి ఎలాంటి పరిస్థితిలో ఉన్నాయో తెలుస్తుందని సంబంధిత అధికారి తెలిపారు.

రైళ్లలో గంజాయి రవాణా

- ముగ్గురు మహిళలు, మరో వ్యక్తి అరెస్టు
- 46 కిలోల గంజాయి ప్యాకెట్లు స్వాధీనం

సికింద్రాబాద్: రైలు ప్రయాణాల ద్వారా అక్రమంగా గంజాయి రవాణా చేస్తూ ముగ్గురు మహిళలు, మరో వ్యక్తి సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు శనివారం పట్టుబడ్డారు. నిందితుల నుంచి రూ.23 లక్షల విలువ చేసే 46 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. జీఆర్‌పీ డీఎస్‌పీ ఎస్‌ఎన్ జావెద్, ఇన్‌స్పెక్టర్ బి.సాయీశ్వర్‌గౌడ్ కథనం ప్రకారం..రైల్వే పోలీసులు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో ఆకస్మిక తనిఖీలు చేస్తుండగా ముగ్గురు మహిళలు, మరో వ్యక్తి జనరల్ వెయిటింగ్ హాల్లో అనుమానాస్పద పరిస్థితుల్లో పట్టుబడ్డారు. విచారణలో అసలు విషయాన్ని నిందితులు అంగీకరించారు. మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ జిల్లాకు చెందిన బాలి అతీష్ పవార్, రోహిత్ గోదాజీచౌహాన్, రజినీ రోహిత్ చౌహాన్, పద్మా అశోక్ పింపాలే అనే నలుగురు సమీప బంధువులు. వీరిలో బాలి అతీష్ చౌహాన్ వృత్తి ప్లాస్టిక్ బొమ్మల వ్యాపారం కాగా మిగతా ముగ్గురు మహిళలు కూలీలు. రెండేళ్ల క్రితం మిర్చీ కోత పని మీద ఖమ్మం వచ్చిన బాలి అతీష్‌పవార్‌కు గంజాయి వ్యాపారం గురించి తెలిసింది. అప్పట్లోనే గంజాయి రవాణా చేస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. బెయిల్ మీద బయటకు వచ్చిన తర్వాత ఆర్థిక సమస్యలు ఎదురవడంతో.. బంధువులైన ముగ్గురు మహిళలకు ఎరవేసి గంజాయి రవాణా కోసం వినియోగించుకుంటున్నాడు. ఒడిశా ప్రాంతంలో రూ.2 వేలకు ఒక ప్యాకెట్ చొప్పున కొనుగోలు చేసి రైలు ప్రయాణాల ద్వారా ఇతర రాష్ట్రాలకు తరలించి అదే ప్యాకెట్‌ను రూ.5 వేలకు విక్రయించడం ద్వారా సులభంగా డబ్బు సంపాదించడానికి అలవాటు పడ్డారు. ఈ క్రమంలో ఈ నెల 3న 46 కిలోల గంజాయి ప్యాకెట్లను వెంట తీసుకుని ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైలు ద్వారా సికింద్రాబాద్‌కు చేరుకున్నారు. మరుసటి రోజు ఔరంగాబాద్ వెళ్లేందుకు దేవగిరి ఎక్స్‌ప్రెస్ రైలు కోసం వేచిచూస్తుండగా నలుగురు నిందితులు పోలీసులకు పట్టుబడ్డారు. వీరిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు వీరికి గంజాయి విక్రయించిన ఒడిశాలోని బరంపూర్‌కు చెందిన బూర, అశిష్ కుమార్‌లపై కేసులు నమోదు చేశారు.

సీఎస్‌ఆర్ ఫండ్ పేరిట టోకరా

టాస్క్‌ఫోర్స్ పోలీసులమంటూ రూ.50 లక్షలతో పరార్

మలక్‌పేట: స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడిని మోసగించిన ఓ ముఠా.. రూ.50 లక్షల నగదుతో ఉడాయించిన ఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానిక ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ చెప్పిన వివరాల ప్రకారం.. మంచిర్యాలకు చెందిన విజయ్‌కుమార్ 'సేవారత్ ట్రస్ట్' నిర్వహిస్తున్నారు. అదే ప్రాంతానికి చెందిన నరేందర్, శ్రీకాంత్ అనే ఇద్దరు వ్యక్తులు విజయ్‌కుమార్‌ను కలిశారు. సేవారత్ సంస్థ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఎంతో బాగున్నాయని చెప్పారు. తమ వద్ద బ్లాక్ మనీ ఉందని, బ్యాంక్ అకౌంట్లో రూ. 6 కోట్లు ఉన్నట్లు ల్యాప్‌టాప్‌లో చూపించి విజయ్‌కుమార్‌ను నమ్మించారు. సీఎస్‌ఆర్ ఫండ్ కింద రూ.కోటి సేవారత్ సంస్థ అకౌంట్లో వేస్తామని, ఫిఫ్టీ ఫిఫ్టీ తీసుకుందామని ఒప్పందం చేసుకున్నారు. కొన్ని రోజులుగా ఈ విషయంపై ఇరువర్గాల మధ్య చర్చ జరుగుతోంది. అందుకు సమ్మతించిన విజయ్‌కుమార్ హైదరాబాద్‌లోని తన బంధువుల ఇంట్లో కలుద్దామని మూసారంబాగ్‌కు రమ్మని చెప్పాడు. నవీన్, సోను అనే ఇద్దరు వ్యక్తులు వస్తారని వారు విజయ్‌కుమార్‌తో చెప్పారు.

దీంతో విజయ్‌కుమార్ రూ.50 లక్షలు సర్దుబాటు చేసుకుని మూసారంబాగ్‌లో ఉంటున్న బంధువు రాంచంద్రయ్య ఇంటికి వచ్చాడు. శుక్రవారం రాత్రి 10.30 గంటల సమయంలో నవీన్, సోను విజయ్‌కుమార్ ఉన్న ఇంటికి చేరుకున్నారు. నగదు వారికి చూపించి ఈ విషయంపై చర్చించుకుంటుండగా గుర్తు తెలియని మరో ముగ్గురు వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించారు. తాము టాస్క్‌ఫోర్స్ పోలీసులమంటూ భారీ నగదు మీకు ఎలా వచ్చిందని బెదిరించారు. రూ.50 లక్షల నగదుతో పాటు నవీన్, సోనును వెంటబెట్టుకుని వారు వచ్చిన వాహనంలోనే పరారయ్యారు. ఈ ఘటనతో అవాక్కయిన విజయ్‌కుమార్.. వెంటనే మలక్‌పేట పోలీసులను ఆశ్రయించారు. నాలుగు బృందాలతో నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు, సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు డీఐ జయశంకర్ చెప్పారు.



కమల దళపతి.. గద ఎత్తి..

భాగ్యలక్ష్మి అమ్మవారికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ప్రత్యేక పూజలు

చార్మినార్: తెలంగాణ ప్రజలకు బీజేపీ ఎప్పుడూ అండగా ఉంటుందని.. అందుకు అవసరమైన శక్తిని ఇవ్వాలని భాగ్యలక్ష్మి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నానని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. పార్టీ ప్రధాన కార్యాలయంలో అధికారికంగా బాధ్యతలు చేపట్టబోయే ముందు శనివారం ఉదయం చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి రాంచందర్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా రాంచందర్ రావుకు మాజీ మేయర్ బండా కార్తీకరెడ్డి, చంద్రారెడ్డి, కాసం వెంకటేశ్వర్లు గదను బహూకరించారు.

నగరంలో అత్యాధునిక వైద్యసేవలు భేష్

సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ స్థాయిలో శిక్షణ పొందిన, అత్యున్నత అర్హతలు కలిగిన వైద్యులు నగరంలో అత్యాధునిక సేవలందించడం శుభ పరిణామమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. డెర్మా 360 ఆధ్వర్యంలో నగరంలోని కావూరి హిల్స్ వేదికగా నూతనంగా ఏర్పాటు చేసిన సర్జికల్, నాన్-సర్జికల్ ఈస్తటిక్ కేంద్రాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అమెరికాలో 35 ఏళ్ల వైద్య సేవలందించిన డాక్టర్ బాల కె.రవి ఇక్కడికి వచ్చి నగరవాసులకు సేవలందించడం అభినందనీయమని పేర్కొన్నారు. క్లినిక్ నిర్వాహకులు ఉత్తమ సేవలందించి ప్రజల మెప్పు పొందాలన్నారు.

నేరస్తులూ.. ఖబడ్దార్!

నాన్ బెయిలబుల్ వారెంట్లపై కట్టుదిట్టమైన చర్యలు

- ఎస్ఐ, నలుగురు కానిస్టేబుళ్లతో ప్రత్యేక బృందాలు
- 40 రోజుల్లో 2024 ఎన్‌బీడబ్ల్యూల అమలు
- రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్ బాబు వెల్లడి



సాక్షి, సిటీబ్యూరో: నాన్ బెయిలబుల్ వారెంట్ల(ఎన్‌బీడబ్ల్యూ) అమలుపై రాచకొండ పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. వారెంట్లను వేగంగా అమలు చేసేందుకు ప్రత్యేక వ్యూహాన్ని అనుసరిస్తున్నారు. ఇందుకోసం కమిషనరేట్‌లోని సీసీఆర్బీలో ప్రత్యేకంగా నియంత్రణ, పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటైంది. ఎన్‌బీడబ్ల్యూలను అమలు చేసేందుకు 14 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ సుధీర్ బాబు శనివారం మీడియాకు వెల్లడించారు. ఒక్కో టీమ్‌లో ఒక ఎస్ఐ, నలుగురు కానిస్టేబుళ్లు ఉంటారని పేర్కొన్నారు. ఎన్‌బీడబ్ల్యూ పెండింగ్‌లను తగ్గించి, జీరో స్థాయికి తీసుకురావడంతో పాటు మెరుగైన శిక్షా రేటును సాధించడం ఈ బృందం ప్రధాన లక్ష్యం. ఈ బృందం దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వారెంట్లను గ్రేవ్, నాన్ గ్రేవ్ నేరాల తీరు, అలాగే ఇతర రాష్ట్రాలు, మన రాష్ట్రం, గ్రేటర్‌లోని ట్రై కమిషనరేట్, రాచకొండ కమిషనరేట్ ఇలా ప్రాంతాల వారీగా క్షుణ్ణంగా విశ్లేషిస్తుంది. ఈ ఏడాది ప్రారంభంలో 1,088 ఎన్‌బీడబ్ల్యూలు పెండింగ్‌లో ఉండగా..మే నాటికి వీటి సంఖ్య 2,847కు పెరిగింది. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, కర్నాటక, గుజరాత్, తమిళనాడు, మధ్యప్రదేశ్ వంటి ఇతర రాష్ట్రాలలో ఉన్న ఎన్‌బీడబ్ల్యూలను అమలు చేయడానికి ఈ బృందాలను మోహరించారు. దీంతో కేవలం 40 రోజుల్లో 2024 ఎన్‌బీడబ్ల్యూలను అమలు చేశారు. మిగిలిన 823 ఎన్‌బీడబ్ల్యూలను పూచీదారులకు నోటీసులు జారీ చేయడం, ఆస్తి అటాచ్‌మెంట్ కోసం న్యాయస్థానానికి సమర్పించారు. ఎన్‌బీడబ్ల్యూల పటిష్ట అమలుతో పరారీలో ఉన్న నిందితులను విచారణకు రావడంతో పాటు నేరారోపణ రేటు మెరుగవుతుంది. అలాగే చట్టం నుంచి తప్పించుకోలేమనే భయం నేరస్తులకు కలుగుతుందని కమిషనర్ సుధీర్ బాబు వివరించారు.

మద్యం మత్తులో భార్యను చంపిన భర్త

రహమత్‌నగర్: మద్యం మత్తులో కట్టుకున్న భార్యనే దారుణంగా హింసించి కడతేర్చాడో కిరాతకుడు. బోరబండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బాలాజీనగర్‌కు చెందిన నర్సింహ కూలి పనిచేస్తుంటాడు. మొదటి భార్య వదిలి వేయడంతో ఫతే నగర్‌కు చెందిన సోని(26)ని ఏడేళ్లక్రితం పెళ్లి చేసుకున్నాడు. వీరు రెండు నెలల క్రితం బోరబండ డివిజన్ సాయిబాబానగర్‌కు వచ్చి అద్దెకు ఉంటున్నారు. సోని హౌస్ కీపింగ్ పని చేస్తుండగా..కుమారుడిని గురుకుల పాఠశాలలో చేర్పించారు. మద్యానికి బానిసైన నర్సింహ దొంగతనాలు చేశాడు. ఇతనిపై పలు పోలీస్ స్టేషన్లలో 16 కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో సోనీ ఇటీవల నర్సింహకు చెప్పకుండా పుట్టింటికి వెళ్లి వచ్చింది. దీంతో కోపం పెంచుకున్న నర్సింహ శుక్రవారం రాత్రి మద్యం తాగి వచ్చి సోనిని తీవ్రంగా కొట్టాడు. దీంతో ఆమె అపస్మారక స్థితికి చేరింది. అరుపులు, కేకలు విన్న పొరుగింటి వారు 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వగా..బోరబండ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకని సోనిని పరిశీలించగా అప్పటికే మృతి చెందింది. నర్సింహను అదుపులోకి తీసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు.



సోని(ఫైల్)

ఢిల్లీ డీసీపీ పేరుతో సైబర్ మోసం

- మనీ లాండరింగ్ కేసంటూ వల
- రూ.53 లక్షలు కొట్టేసిన కేటుగాళ్లు

సాక్షి, సిటీబ్యూరో: సూడో పోలీసుగా అవతారమెత్తి..నగరానికి చెందిన ఓ సీనియర్ సిటిజన్‌ను రూ.53 లక్షలు మోసం చేశారు సైబర్ కేటుగాళ్లు. వివరాలు ఇలా ఉన్నాయి. అమీర్‌పేటకు చెందిన 77 ఏళ్ల వృద్ధుడికి గత నెల 18న వాట్సాప్‌లో వీడియో కాల్ వచ్చింది. రాజ్‌వీర్ కుమార్ అనే సైబర్ నేరస్తుడు తనను ఢిల్లీ డీసీపీగా పరిచయం చేసుకున్నాడు. వీడియో కాల్‌లో పోలీసు యూనిఫాంలో కనిపించే సరికి బాధితుడు నిజమేనని విశ్వసించాడు. మనీ లాండరింగ్ కేసు నమోదయిందని, బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ.53 లక్షల సొమ్ము స్తంభింపజేస్తామని బాధితుడిని భయభ్రాంతులకు గురి చేశారు. బాధితుడిని నమ్మించేందుకు నకిలీ ఆర్థిక శాఖ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)ల నుంచి రసీదులు, సుప్రీంకోర్టు ఫ్రీజింగ్ ఆర్డర్, ఫండ్ సూపర్‌విజన్ సర్టిఫికెట్, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీ నోటీసులను పంపించారు. ఇప్పటికే అరెస్టు వారెంట్ జారీ చేశామని, కేసు దర్యాప్తు జరుగుతుందని తెలిపారు. దీంతో భయాందోళనకు గురైన బాధితుడు తాను ఎలాంటి మనీ లాండరింగ్ మోసాలకు పాల్పడలేదని వివరించాడు. అయితే బ్యాంక్ ఖాతాలను ధృవీకరించేందుకు తాను సూచించిన బ్యాంక్ ఖాతాలకు అకౌంట్‌లోని పొదుపు సొమ్ము బదిలీ చేయమని సూచించాడు. ఆర్బీఐ ధృవీకరణ అనంతరం ఆయా సొమ్ము తిరిగి జమ అవుతుందని నమ్మించారు. దీంతో బాధితుడు రూ.53 లక్షల సొమ్మును బదిలీ చేశాడు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

కేసీఆర్‌పై తప్పుడు వ్యాఖ్యలు చేశారంటూ

బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు

బంజారాహిల్స్: ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై తప్పుడు వ్యాఖ్యలు చేసిన ఐడ్రీమ్స్ చానల్ యాంకర్ సౌమ్యారెడ్డి, అడ్వొకేట్ అరుణ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నేతలు శనివారం బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గత నెల 25వ తేదీన అరుణ్‌కుమార్ అనే అడ్వొకేట్‌తో సదరు ఛానల్ యాంకర్ ఇంటర్వ్యూ చేసి ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ పేరును వాడుతూ..అబద్ధపు మాటలతో తప్పుడు ఆరోపణలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. యాంకర్‌తో పాటు అడ్వొకేట్, చానల్ యాజమాన్యం మీద చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో నేతలు వాసుదేవరెడ్డి, గాంధీనాయక్, బమ్మెర రామ్మూర్తి, కురువ పల్లయ్య తదితరులు ఉన్నారు. బంజారాహిల్స్ పోలీసులు ఫిర్యాదును స్వీకరించి దర్యాప్తు చేపట్టారు.



పోలీసులకు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నేతలు

చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎన్నికల్లో వెలిగిన 'దీపం'

- విజయ బావుటా ఎగురవేసిన దీపం ప్యానెల్
- ఐలా అధ్యక్షుడిగా గోవిందరెడ్డి
- సీఐఏ అధ్యక్షుడిగా డీఎస్ రెడ్డి ఎన్నిక



గోవిందరెడ్డి



డీఎస్. రెడ్డి

కుషాయిగూడ: చర్లపల్లి నోటిఫైడ్ మునిసిపల్ ఇండస్ట్రియల్ ఏరియాస్ సర్వీస్ సొసైటీకి జరిగిన ఎన్నికల్లో దీపం ప్యానల్ ఘన విజయం సాధించింది. ఐలా చైర్మన్‌గా గోవిందరెడ్డి తన సమీప ప్రత్యర్థి రోషిరెడ్డిపైన, సీఐఏ అధ్యక్షుడిగా డీఎస్ రెడ్డి తన ప్రత్యర్థి నాగరాజుపై గెలుపొందారు. ఐలాలో 798 ఓట్లకు గాను 714 మంది పారిశ్రామికవేత్తలు ఓటు హక్కును వినియోగించుకోగా.. సీఐఏలో 495 ఓట్లకు గాను 436 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఐలా చైర్మన్‌గా గోవిందరెడ్డి తోపాటు దీపం ప్యానల్‌కు చెందిన ఉపాధ్యక్షుడిగా టి.శ్రీనివాస్, సెక్రటరీగా జి.రాఘవయ్య, జాయింట్ సెక్రెటరీగా పి.సురేష్, ట్రెజరర్‌గా మల్లికార్జున్ రెడ్డి విజయం సాధించారు. సీఐఏ అధ్యక్షుడిగా డీఎస్ రెడ్డితో పాటు ఉపాధ్యక్షుడిగా వై.సుధాకర్ రెడ్డి, సెక్రటరీగా పీఎస్ మోహన్, జాయింట్ సెక్రటరీగా గంగాధర బాబు, ట్రెజరర్‌గా ఎస్.శ్రీనివాస్ గెలుపొందారు. ఐలా, సీఐఏ లో ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా పోటీ చేసిన దీపం ప్యానల్ అభ్యర్థులంతా గెలుపొందడంతో సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన గోవిందరెడ్డి, డీఎస్‌రెడ్డిలు మీడియాతో మాట్లాడుతూ..చర్లపల్లి పారిశ్రామిక వాడను ప్రగతి పథంలో నిలిపేందుకు తమ శాయశక్తులా కృషి చేస్తామని చెప్పారు. దీపం ప్యానెల్ విజయానికి మద్దతు తెలిపిన పారిశ్రామికవేత్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

మీర్‌పేట: షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని సామగ్రి కాలి బూడిదైన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాజశేఖర్ కథనం ప్రకారం.. మీర్‌పేట మారుతీనగర్‌లో నివాసముండే వరప్రసాద్.. భార్య లక్ష్మీప్రసన్నతో కలిసి మూడు రోజుల క్రితం బెంగళూరుకు వెళ్లాడు. ఇంట్లో ఉన్న కుమారుడు శనివారం సాయంత్రం తాళం వేసి, బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా మొదటి అంతస్తు బెడ్‌రూములో నుంచి మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా, వారు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే గదిలోని వస్తువులు, విలువైన పత్రాలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ఏసీ ఆన్ చేసి ఉంచడం వలనే ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బస్సు ఢీకొని యువకుడి మృతి

కుత్బుల్లాపూర్: వేగంగా వచ్చిన బస్సు ఢీకొట్టడంతో ఓ బైకిస్టు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుండిగల్‌కు చెందిన జహంగీర్ కుమారుడు మనోహర్ (22) యశోద ఆస్పత్రిలో ట్రైనింగ్ నిమిత్తం శనివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో దూలపల్లి మీదుగా బైక్‌పై వస్తున్నారు. ఈ క్రమంలో దూలపల్లి- కొంపల్లి సర్వీసు రోడ్డులోని అశోక్ లైలాండ్ సర్వీస్ సెంటర్ ఎదురుగా రైట్ టర్న్ తీసుకున్న ఓ బస్సు ముందు వెళ్తున్న మనోహర్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో అతని తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మనోహర్ (ఫైల్)

ఘనంగా ముగిసిన వారాహిదేవి నవరాత్రులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలోని కుర్తాళం పీఠం శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి దేవాలయంలో ఉత్తర పీఠాధిపతి దత్తేశ్వరానంద భారతి మహాస్వామి వారి సమక్షంలో వారాహి దేవి నవరాత్రులు తొమ్మిది రోజులు ఘనంగా నిర్వహించారు. లోక కల్యాణం, ధర్మ పరిరక్షణ కోసం ఈ నవరాత్రులు నిర్వహించినట్లు దత్తేశ్వరానంద భారతి మహాస్వామి తెలిపారు. పూర్ణాహుతితో శనివారం ఉత్సవాలు ముగిశాయన్నారు. కాగా డిప్యూటీ సీఎం సతీమణి నందిని, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషనర్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి దంపతులు శనివారం వారాహి దేవి పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ వారాహి నవరాత్రులు తొమ్మిది రోజులు ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలను నుండి భక్తులు తరలివచ్చి పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు విఠల్ శర్మ, రామకృష్ణ, విజయలక్ష్మి, నీలిమ, నిఖిల్, మహేష్, కృష్ణ, రామకృష్ణ, అరుణ, హేమ తదితరులు పాల్గొన్నారు.



పూర్ణాహుతి కార్యక్రమం



దత్తేశ్వరానంద భారతి స్వామి ఆశీర్వాదం తీసుకుంటున్న డిప్యూటీ సీఎం సతీమణి నందిని తదితరులు

భక్తిశ్రద్ధలతో జగన్నాథ రథయాత్ర



రథయాత్రలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

బంజారాహిల్స్: ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ రోడ్ నెం:45లో నిర్వహించిన జగన్నాథ రథయాత్రలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అడుగడుగునా జై జగన్నాథ నినాదల మధ్య స్వామివారి రథయాత్ర వైభవంగా ముందుకుసాగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు బోజిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ బ్రహ్మోత్సవాలు



ధ్వజారోహణ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.10లోని గౌరీశంకర్ కాలనీలో ఉన్న సీతా రామాంజనేయ స్వామి, భవానీ రామలింగేశ్వరస్వామి దేవస్థానం 25వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలి రోజు స్వామివారికి సుప్రభాతసేవ, భగవతారాధన, ఆరగింపు, మంగళాశాసనము, శాత్తుమురై, తీర్థ ప్రసాదగోష్ఠి, విశ్వక్సేనారాధన, అగ్నిప్రతిష్ఠ, గరుడపటాదివాసం, ధ్వజారోహణము, రాజభోగము నిర్వహించారు. ఈనెల 9వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రత్యేక ప్రార్థనలు



ఎర్రమంజిల్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేసిన విజయారెడ్డి

పంజగుట్ట: మొహర్రంను పురస్కరించుకుని ఎర్రమంజిల్ కాలనీలో ఏర్పాటు చేసిన పీర్లను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు.

సన్మానం



రాంచందర్‌రావును సన్మానిస్తున్న భార్గవి రెడ్డి

హిమాయత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర బీజేపీ నూతన అధ్యక్షుడు రాంచందర్ రావును శనివారం బీజేపీ రాష్ట్ర నాయకురాలు భార్గవి రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఆయన నాయకత్వంలో పార్టీ మరింత ఉత్సాహంతో ముందుకు సాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మోదీ నాయకత్వంలో తెలంగాణలో అధికారమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని అన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.33, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 55, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 35, క్యాప్సికం 60, పచ్చకాకర 45, పందిరి బీర 45, క్యాబేజీ 18, క్యారెట్ 37, దొండ 28, గుండుబీన్స్ 95, గింజ చిక్కుడు 60, గోకరకాయ 40, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 24, చామగడ్డ 31, మొరంగడ్డ 28, కందగడ్డ 55, సొరకాయ 11, పొట్లకాయ 23, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 5–6. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

నేడు తొలి ఏకాదశి పూజలు

సనత్‌నగర్: తొలి ఏకాదశి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవాలయం (సెవన్ టెంపుల్స్) ప్రాంగణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈఓ సత్యనారాయణనాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు స్వామివారికి అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకం (108 లీటర్ల పాలతో), లక్ష తులసీ దళములతో విశేష అర్చన, ఫల పుష్ప అలంకరణ జరుగుతాయని పేర్కొన్నారు.

బల్దియా ఖజానాకు భారీగా గండి..!

- రెన్యువల్ కాని ట్రేడ్ లైసెన్స్‌లు..
- గతంలో లైసెన్స్ ఫీజులు నొక్కేసిన పారిశుద్ధ్య విభాగం సిబ్బంది
- ఏడు నెలలు కావస్తున్నా ఇంకా రెన్యువల్ కాని లైసెన్స్‌లు
- సర్కిల్–17, 18 పరిధిల్లో ముమ్మరంగా తనిఖీలు



అమీర్‌పేటలో గార్మెంట్ షాపును సీజ్ చేస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు



రాజ్‌భవన్ రోడ్డులో హోటల్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

బంజారాహిల్స్: ప్రతియేటా వ్యాపారాలు నిర్వహించే ప్రతి ఒక్క యజమాని తమ షాపులకు ట్రేడ్ లైసెన్స్‌ను తీసుకోవాల్సి ఉంటుంది. ప్రతి ఏడాది తగిన ఫీజు చెల్లించి ట్రేడ్ లైసెన్స్‌ను పునరుద్ధరించుకోవాల్సి ఉంటుంది. అయితే చాలా మంది వ్యాపారులు అవగాహన లేక కొందరు, దురుద్దేశపూర్వకంగా మరికొందరు తమ ట్రేడ్ లైసెన్స్‌లను రెన్యువల్ చేసుకోకపోవడంతో జీహెచ్‌ఎంసీ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. దీంతో బల్దియా ఖజానా ఖాళీ అవుతుండగా గతంలో ఈ ట్రేడ్ లైసెన్స్‌ల వ్యవహారాలను చూసే జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య విభాగం అధికారులు, సిబ్బంది అందినకాడికి దండుకుని లక్షల రూపాయలు జేబుల్లో వేసుకుని జీహెచ్‌ఎంసీ ఆదాయానికి చిల్లులు పెట్టారు. ఈ అక్రమాలను గమనించిన జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు ఈ ఏడాది ట్రేడ్ లైసెన్స్ వ్యవహారాన్ని జీహెచ్‌ఎంసీ ఏఎంఒహెచ్‌లు, ఎస్‌ఎఫ్‌ఏలు, జవాన్ల చేతుల్లో నుంచి తొలగించి ఏఎంసీలు, బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లకు అప్పగించారు. గత కొన్నేళ్లుగా ట్రేడ్ లైసెన్స్‌ల రెన్యువల్, ఫీజుల వసూళ్లలో ఏఎంఒహెచ్‌లు, ఎస్‌ఎఫ్‌ఏలు, జవాన్లు అందినకాడికి దండుకోవడమే కాకుండా జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధిలో ఏసీబీకి కూడా పట్టుబడ్డారు. జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్–17 పరిధి కిందికి సోమాజీగూడ, ఖైరతాబాద్, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్లు వస్తుండగా వీటి పరిధిలో హోటళ్లు, దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థలు 10 వేలకు పైగా ఉన్నాయి.

- ఇందులో ఇప్పటి వరకు 6 వేల మంది మాత్రమే లైసెన్స్ ఫీజులు చెల్లించి రెన్యువల్ చేసుకున్నారు.
- ఏడు నెలలు కావస్తోన్నా ఇంకో 4 వేల మంది ఇంకా రెన్యువల్‌కు దూరంగానే ఉన్నారు.
- జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధిలో 15 వేల పైచిలుకు వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్‌లు ఉండగా ఇందులో ఇప్పటి వరకు 7 వేల మంది వరకు మాత్రమే తమ లైసెన్స్‌లను పునరుద్ధరించుకున్నారు. ఏడు నెలలు దాటుతున్నా ఇంకా వేలాది మంది వ్యాపారులు లైసెన్స్ రెన్యువల్‌కు దూరంగానే ఉండిపోయారు.
- ట్రేడ్ లైసెన్స్‌ల రెన్యువల్ రూపేణా జీహెచ్‌ఎంసీకి కోట్లాది రూపాయల ఆదాయం లభిస్తుంది. అయితే లైసెన్స్ రెన్యువల్ చేయించడంలో మొన్నటి వరకు ఏఎంఒహెచ్‌లు, ఎస్‌ఎఫ్‌ఏలు చేతివాటం ప్రదర్శించారు.
- బల్దియాకు చెల్లించాల్సిన సొమ్మును వీరే జేబుల్లో వేసుకున్నారు. వీరిపై అధికారులకు ఎన్నో ఫిర్యాదులు అందాయి.
- ముఖ్యంగా జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధిలో ట్రేడ్ లైసెన్స్‌ల పేరుతో సంబంధిత అధికారులు పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.
- ఇప్పుడు తాజాగా ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లకు అప్పగించారు.

అవగాహన కలిగిస్తోన్న అధికారులు...

చాలామంది వ్యాపారులు దురుద్దేశపూర్వకంగానే లైసెన్స్ రెన్యువల్ ఫీజును ఎగవేస్తున్నట్లు అధికారుల తనిఖీల్లో వెల్లడవుతుంది. రెండు రోజుల క్రితం బంజారాహిల్స్ రోడ్డునెంబర్–2లోని వరుణ్ మోటార్స్‌లో అధికారులు తనిఖీలు నిర్వహించగా గత రెండేళ్లుగా ఈ సంస్థ యాజమాన్యం ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేసుకోలేదని తేలింది. అలాగే నాగార్జునహిల్స్‌లోని ఓ సెల్లార్‌లో వ్యాపారి కూడా ట్రేడ్ లైసెన్స్ క్రమబద్ధీకరించుకోవాలని ఎన్నిమార్లు చెప్పినా పట్టించుకోకపోవడంతో సీజ్ చేశారు. ఇలా ట్రేడ్ లైసెన్స్‌లు లేని వ్యాపార సంస్థలను సీజ్ చేస్తుండడమే కాకుండా దీనిపై అవగాహన కూడా కలిగిస్తున్నారు. లైసెన్స్‌ను పునరుద్ధరించుకోకుంటే ఎదుర్కొనే పరిణామాలపై జాగ్రత్తలు సూచిస్తున్నారు. ట్రేడ్ లైసెన్స్ లేని వ్యాపార కేంద్రాలపై ఇలాంటి తనిఖీలు నిర్వహిస్తామని అధికారులు పేర్కొన్నారు.

ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చు..

ప్రతి వ్యాపార సంస్థ డిసెంబర్ 31వ తేదీ లోపు తమ ట్రేడ్ లైసెన్స్‌లను పునరుద్ధరించుకోవాలి. జనవరి 1 నుంచి డిసెంబర్ 31వ తేదీ లోపు ఈ ట్రేడ్ లైసెన్స్ కాల పరిమితి ఉంటుంది. తమ వ్యాపార సంస్థల విస్తీర్ణాన్ని బట్టి ఆన్‌లైన్‌లో ఫీజులు చెల్లించవచ్చు. పాన్‌కార్డు, ఆధార్‌కార్డు, లీజు అగ్రిమెంట్ అప్‌లోడ్ చేసి ఫీజు చెల్లిస్తే తాత్కాలిక లైసెన్స్ జారీ చేస్తారు. ఆ తర్వాత అధికారులు చెక్ చేసి పర్మినెంట్ లైసెన్స్ ఇస్తారు. డబుల్ రోడ్డులో వ్యాపార సంస్థ ఉంటే చదరపు అడుగుకు రూ.6, ఇంటర్నల్ రోడ్డులో ఉంటే రూ.4, సింగిల్ రోడ్డులో ఉంటే రూ.3 చొప్పున లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఏఎంసీ, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్, బిల్ కలెక్టర్ మాత్రమే ట్రేడ్ లైసెన్స్‌లను తనిఖీ చేస్తారు.

– రజనీకాంత్‌రెడ్డి, డీసీ, ఖైరతాబాద్ సర్కిల్–17

సోమాజిగూడలో హోటళ్ల సీజ్



హోటల్‌ను సీజ్ చేస్తున్న ఖైరతాబాద్ సర్కిల్ రెవెన్యూ అధికారులు

బంజారాహిల్స్: ట్రేడ్ లైసెన్స్‌ను రెన్యువల్ చేసుకోకుండా నడిపిస్తున్న హోటల్‌ను ఖైరతాబాద్ సర్కిల్–17 అధికారులు శనివారం సీజ్ చేశారు. ఖైరతాబాద్ సర్కిల్ డీసీ రజనీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఎంసీలు, బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు సోమాజిగూడలోని కృతుంగ రెస్టారెంట్‌లో తనిఖీలు నిర్వహించగా సదరు హోటల్ యాజమాన్యం ట్రేడ్ లైసెన్స్‌ను రెన్యువల్ చేసుకోకుండా నడిపిస్తున్నట్లుగా గుర్తించారు. దీంతో హోటల్‌ను సీజ్ చేశారు. స్పందించిన హోటల్ యజమాని వెంటనే ఫీజు చెల్లించి లైసెన్స్‌ను పునరుద్ధరించుకున్నారు. అలాగే అమీర్‌పేటలోని ఓ కలర్ జిరాక్స్ సెంటర్‌తో పాటు ఓ బట్టల షాపును, సోమాజిగూడలో అక్షిత హోటల్‌ను ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేసుకోని కారణంగా సీజ్ చేశారు. ఎవరైతే ట్రేడ్ లైసెన్స్ ఈ ఏడాది రెన్యువల్ చేసుకోలేదో వారంతా వెంటనే ఫీజులు చెల్లించాలని, లేకపోతే షాపులు సీజ్ చేయాల్సివస్తుందని అధికారులు హెచ్చరించారు.

బీసీలు ఐక్యంగా ఉంటే సీఎం పదవి దక్కుతుంది: వీహెచ్

హిమాయత్‌నగర్: బీసీలంతా ఒకే తాటిపై నిలిస్తే సీఎం పదవి దక్కుతుందని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంత రావు స్పష్టం చేశారు. శనివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో మున్నూరు కాపు విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో మున్నూరు కాపు నేత, పాండిచ్చేరి రాష్ట్ర మొదటి లెఫ్టినెంట్ గవర్నర్ శీలం లక్ష్మణ్ వర్ధంతి సందర్భంగా ఆయన జీవిత చరిత్రపై రూపొందించిన బ్రోచర్‌ను వీహెచ్ ఆవిష్కరించి మాట్లాడారు. శీలం లక్ష్మణ్ జీవితాన్ని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన జీవిత చరిత్రను పుస్తక రూపంలో తీసుకురావాలని పిలుపునిచ్చారు. మహారాష్ట్ర ఎమ్మెల్యేగా, అసెంబ్లీ స్పీకర్‌గా పని చేసి దేశ సేవకు జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. మున్నూరు కాపులతో పాటు బీసీ కులాలలో ఐక్యత లేకపోవడం వల్లనే రాజ్యాధికారానికి దూరం అవుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యకుడు ఎస్.మల్లికార్జున్ పటేల్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రుద్ర సంతోష్, హైకోర్టు న్యాయవాది ఎడ్ల రవి, మున్నూరుకాపు మహాసభ రాష్ట్ర అధ్యకుడు పుటం పురుషోత్తం, ప్రధానకార్యదర్శి పెద్ది పెంటయ్య, డాక్టర్ పర్వతం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ తొలగింపు



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని కమాన్ ఎదురుగా బద్రుకా అపార్ట్‌మెంట్‌ను ఆనుకుని ఓ ఇంటి యజమాని ఫుట్‌పాత్‌పై అక్రమంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశాడు. దీంతో జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 అధికారులు శనివారం తొలగించారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం తగదు



సమస్యలపై అధికారులతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

వెంగళరావునగర్: ప్రజా సమస్యలపై అధికారుల నిర్లక్ష్యం తగదని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణానగర్‌లో శనివారం సాయంత్రం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు పెద్ద సంఖ్యలో ఆయనను కలిసి తాగు, వరద నీరు, డ్రైనేజీ సమస్యలపై తమ గోడు వెళ్లగక్కారు. స్పందించిన కేంద్రమంత్రి అధికారులను పిలిపించి మాట్లాడారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్–19 ఉప కమిషనర్ జకియా సుల్తానా, ఇంజినీరింగ్ శాఖ డీఈఈ రాజేంద్రకుమార్ మాట్లాడుతూ..శాశ్వత పరిష్కారానికి ఎస్టిమేట్లు కూడా వేయడం జరిగిందని, త్వరలోనే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీజేపీ నేతలు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, బీజేపీ నేతలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

రోటరీ డిస్ట్రిక్ట్ బెస్ట్ ప్రెసిడెంట్‌గా బాల కోటిరెడ్డి



రోటరీ డిస్ట్రిక్ట్ బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు అందుకుంటున్న బాల కోటిరెడ్డి

బంజారాహిల్స్: రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ 2024–25 ప్రెసిడెంట్ రోటరీ డిస్ట్రిక్ట్–3150 బెస్ట్ ప్రెసిడెంట్‌గా అవార్డు అందుకున్నారు. రోటరీ జిల్లా గవర్నర్ శరత్‌చౌదరి చేతుల మీదుగా ఆయన చేసిన సేవలకు గుర్తింపునకు ఈ అవార్డు లభించింది. రోటరీ డిస్ట్రిక్ట్–3150 పరిధిలో 100 క్లబ్‌లు ఉండగా అందులో రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ప్రెసిడెంట్ బాల కోటిరెడ్డిని ఈ అత్యుత్తమ సేవా అవార్డు వరించింది. ఏడాది వ్యవధిలో ఆయన 235 సర్వీసు ప్రాజెక్టులు చేసి దాతల నుంచి రూ.7.15 కోట్లు సేకరించి సేవల కోసం ఖర్చు చేశారు. ఇందులో పేద మహిళలకు కుట్టుమిషన్లు, స్కూల్ విద్యార్థులకు బ్యాగ్‌లు, కిట్‌లు, బాలికలకు సైకిళ్లు, దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు అందజేశారు. ఈ సేవలకు ఆయనకు బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు లభించింది.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎంసీ జకియా సుల్తానా

వెంగళరావునగర్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎంటమాలజీ శాఖ అప్రమత్తంగా ఉండాలని జీహెచ్‌ఎంసీ సర్కిల్–19 ఉప కమిషనర్ జకియా సుల్తానా సూచించారు. యూసుఫ్‌గూడ సర్కిల్ కార్యాలయంలో శనివారం ఆమె ఎంటమాలజీ, రీసోర్స్ పర్సన్స్‌తో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..స్వయం సహాయక సంఘాల్లో ఉన్న సభ్యులు ఇలాంటి విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సర్కిల్ పరిధిలో జాగ్రత్తలపై పోస్టర్లు, బ్యానర్లు, ప్రచారాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్–19 డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకట కిషన్, ఎంటమాలజీ ఏఈ సావిత్రి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, టీఎల్‌ఎఫ్, ఎస్‌ఎల్‌ఎఫ్ అధ్యక్షుడు, రీసోర్స్ పర్సన్లు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతు



హిమాయత్‌నగర్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, విద్యార్థి వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తామని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శిలు మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు తెలిపారు. జులై 9న దేశ వ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెకు వామపక్ష విద్యార్థి సంఘాల మద్దతు తెలుపుతూ శనివారం హిమాయత్‌నగర్ ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో సార్వత్రిక సమ్మె మద్దతు పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. సమ్మెలో వామపక్ష విద్యార్థి సంఘాలు ప్రత్యక్షంగా పాల్గొంటాయని తెలిపారు. నాయకులు రెహమాన్, హరీష్, ఎస్‌ఎఫ్‌ఐ లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

పంజగుట్టలో పాయల్ రాధాకృష్ణన్ సందడి



ఆభరణాలు ప్రదర్శిస్తున్న పాయల్ రాధాకృష్ణన్

పంజగుట్ట: తనకు బంగారు ఆభరణాలంటే ఎంతో మక్కువ అని, తన మొదటి పేమెంట్‌తో ఒక చిన్న బంగారు చైన్ కొనుగోలు చేశానని సినీ నటి పాయల్ రాధాకృష్ణన్ తెలిపారు. పంజగుట్టలోని ఓ జ్యువెలరీ షోరూంలో ఆషాఢ మాసం పురస్కరించుకుని ప్రత్యేకంగా రూపొందించిన కలెక్షన్స్‌ను ఆమె ప్రదర్శించి, ధరించి సందడి చేశారు. నిజామాబాద్‌లో ఆదివారం షోరూం మరో నూతన బ్రాంచ్ ప్రారంభం కానున్నదని సినీనటి అనసూయా ఈ షోరూంను ప్రారంభిస్తున్నట్లు ఆమె తెలిపారు.

డెబిట్ కార్డు మార్చి..డబ్బులు కాజేసి..

నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

సనత్‌నగర్: డెబిట్ కార్డు చోరీ చేసి నగదు కాజేసిన ఆగంతకుడిపై సనత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మూసాపేటకు చెందిన వి.వెంకటేశ్వరరావు ఈనెల 2న సాయంత్రం నగదు తీసుకునేందుకు భరత్‌నగర్‌లోని ఎస్‌బీఐ ఏటీఎంకు వెళ్లాడు. డెబిట్‌కార్డును ఏటీఎంలో పెట్టి పిన్ నెంబర్ ఎంటర్ చేశాడు. నగదు రాకపోవడంతో మరో రెండు, మూడుసార్లు ప్రయత్నించాడు. అయినా డబ్బులు రాకపోవడంతో వెనుకాల ఉన్న వ్యక్తి తాను ప్రయత్నిస్తానని చెప్పి వెంకటేశ్వరరావు వద్ద డెబిట్‌కార్డు తీసుకుని ఏటీఎంలో పెట్టి ప్రయత్నించాడు. నగదు రావడం లేదని చెప్పి కార్డును తిరిగి ఇచ్చి వెళ్లిపోయాడు. వెంకటేశ్వరరావు కూడా ఇంటికి వెళ్లాడు. అతని సెల్‌ఫోన్‌కు మూడు దఫాలుగా మొత్తం రూ.40 వేలు డబ్బు డ్రా చేసినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో కంగుతున్న బాధితుడు తన డెబిట్‌కార్డు చూసుకోగా అది తనది కాదని గ్రహించాడు. దీంతో సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు గొలుసు చోరీ

అమీర్‌పేట: వృద్ధురాలి మెడలోని 55 గ్రాముల బంగారు గొలుసు చోరీకి గురైంది. ఎస్‌ఆర్‌నగర్ పోలీసుల వివరాల ప్రకారం.. మియాపూర్‌కు చెందిన ఎన్.కమల (62) ఈనెల 2న అమీర్‌పేటలోని కనకదుర్గా ఆలయానికి వచ్చింది. పూజలు చేసిన అనంతరం ప్రధాన ద్వారం వద్ద ప్రసాదం కోసం వెళ్లింది. కొద్దిసేపటి తర్వాత మెడలోని గొలుసు కనిపించలేదు. ఇదే విషయాన్ని ఆలయ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లి ఇంటికి వెళ్లి పోయింది. శుక్రవారం ఎస్‌ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనకు బాగా జ్వరం రావడంతో గొలుసు చోరీ అయిన రోజు స్టేషన్‌కు రాలేకపోయాయని ఫిర్యాదులో తెలిపింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'జూబ్లీహిల్స్ బరిలో ఉంటా'



కరపత్రం ఆవిష్కరిస్తున్న యుగ తులసి పార్టీ అధ్యక్షుడు శివకుమార్

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఎన్నిక అనివార్యమైనందున తాను యుగ తులసి పార్టీ నుంచి బరిలో ఉంటానని ఆ పార్టీ అధ్యక్షుడు శివకుమార్ తెలిపారు. శనివారం ఆయన జూబ్లీహిల్స్‌లోని టీటీడీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జూబ్లీహిల్స్ ఓటర్లకు గోమాత ఆవేదన పేరుతో ముద్రించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి పోటీ చేసే వారు ఎవరైనా కూడా గోమాతను జాతీయ జంతువుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. గోమాత రక్షణ కోసం విశిష్టంగా పని చేస్తూ తమ వాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తామని ఆయన అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గడపను తడతామన్నారు.

ఆకట్టుకున్న ప్రతిభా దర్శన్





ప్రతిభా దర్శన్‌లో విద్యార్థుల నృత్య ప్రదర్శనలు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో 'ప్రగతి–టువర్డ్స్ ది బ్రైట్ ఫ్యూచర్' పేరిట శనివారం నాలుగో తరగతి నిర్వహించిన ప్రతిభా దర్శన్ కార్యక్రమం అద్యంతం ఆకట్టుకుంది. వివిధ అంశాల్లో విద్యార్థులు ప్రతిభను చాటారు. నృత్యం, సంగీతం, నాటకం, నృత్యనాటకాలు ఉల్లాసభరితంగా సాగాయి. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ఎం.వరలక్ష్మి మాట్లాడుతూ..విద్యార్థులకు సృజనాత్మకత, విలువలతో కూడిన విద్యనందించడమే తమ లక్ష్యమన్నారు. విద్యార్థులకు విమర్శనాత్మక, విశ్లేషణాత్మక ఆలోచనలను మెరుగుపరచాలని, ప్రస్తుత వ్యవహారాల గురించి తెలుసుకునేవిధంగా ప్రోత్సహించాలన్నారు. పిల్లలకు మంచి ఆలోచనలు పెంపొందిస్తూ ఉన్నత విలువల ప్రాముఖ్యతను తెలియజెప్పాలన్నారు. ప్రతి జీవరాశి అనేక దశలను దాటుకుంటూ ప్రగతి మార్గం వైపు అడుగులు వేస్తారన్నారు. ప్రెసిడెంట్ మురళీముకుంద్ మాట్లాడుతూ..విద్యార్థుల విలువ ఆధారిత ప్రదర్శనలు కనబర్చారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కాంచనవల్లి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- మాదాపూర్‌లోని శిల్పారామంలో హస్తకళా మ్యూజియం.. ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు
- గచ్చిబౌలిలోని శరత్‌చంద్ర గార్డెన్‌లో ఎగ్జిబిషన్.. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు
- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమగమంలో ఉదయం 10గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు న్యూ క్రాఫ్ట్స్ సిల్క్ ఇండియా ఎగ్జిబిషన్ కమ్ సేల్
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో డిజిటల్ ఆర్ట్, పెయింటింగ్ ఎగ్జిబిషన్ ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మైత్రేయి కళాకారుల ఆధ్వర్యంలో మాదాపూర్ శిల్పారామంలో మండల పెయింటింగ్‌పై ఉచిత శిక్షణ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఉంటుంది.
- జైసార టూలింగ్ సిస్టమ్స్ చైర్మన్ మనోహర్ రావు వంగూరి రచించిన హౌ ఐ బిల్ట్ ఇట్ పుస్తకావిష్కరణ కార్యక్రమం ఉదయం 11.30గంటలకు తాజ్ దక్కన్‌లో జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

భరోసా ఇవ్వని సర్కారు వైద్యం

- తెలంగాణ డయాగ్నోస్టిక్స్‌లో అధికారుల నిర్లక్ష్యం
- సిటీ జనాభాలో 20 శాతం మందికి పైగా బాధితులు
- ప్రైవేటు నిర్ధారణ కేంద్రాలకు వెళ్తున్న ప్రజలు
- పేదలపై రూ.40 కోట్లు భారం

ప్రభుత్వ ఆస్పత్రులు పేదలకు ఓ భరోసా.. అనారోగ్యం వస్తే పేదవాడు ముందుగా చూసేది సర్కారు ఆస్పత్రి వైపే.. ప్రైవేటు ఆస్పత్రికి వెళితే వైద్యం సంగతి పక్కన పెట్టి టెస్టుల పేరుతో వేలకు వేల రూపాయలు దోచుకుంటున్నారు. అందుకే సగటు జీవి ప్రభుత్వ ఆస్పత్రి వైపే మొగ్గు చూపుతున్నాడు. అయితే రాష్ట్ర ప్రభుత్వం కూడా సర్కారు దవాఖానాలను పట్టించుకోవడం లేదు.దీంతో అక్కడ వైద్యం, వైద్య పరీక్షలు నామమాత్రంగా నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా థైరాయిడ్ టెస్టులను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది.

-సాక్షి, సిటీబ్యూరో

నెలరోజులుగా నిలిచిన థైరాయిడ్ టెస్టులు



హిమాయత్‌నగర్ లోని సెంట్రల్ ల్యాబ్

పేదలకు ఉత్తమ వైద్య సేవలందించేందుకు గత ప్రభుత్వం ప్రభుత్వం 290 తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్లను నగర వ్యాప్తంగా ఏర్పాటు చేసింది. వాటిలో సుమారు 150 పరీక్షలు చేస్తామని ప్రకటించింది. వైద్య పరీక్షలు కొద్ది రోజుల పాటుసాఫీగా సాగినా ఆ తరువాత నిర్లక్ష్యానిదే రాజ్యమైంది. ముఖ్యంగా థైరాయిడ్ టెస్ట్ అంటేనే ఇప్పుడు కాదు.. తరువాత రండి అని నిర్మొహమాటంగా చెబుతున్నారు. నెల రోజులుగా థైరాయిడ్ టెస్ట్‌కు నమూనాలే సేకరించడం లేదు. దీంతో ప్రజలు ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళుతున్నారు. ఫలితంగా గ్రేటర్ ప్రజలపై సుమారు రూ.40 కోట్లకుపైగా అదనపు భారం పడుతోంది. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

- మహానగరంలో 290 బస్తీదవాఖానాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, క్లస్టర్లు, జిల్లా ఆసుపత్రుల్లో రోజుకు సరాసరిన 40 నుంచి 50 మంది వరకు థైరాయిడ్ టెస్టుల కోసం వస్తుంటారు. థైరాయిడ్ అని చెప్పగానే తరువాత అని చెబుతున్నారు.గట్టిగా అడిగితే నమూనాలు తీసుకున్నా, పరీక్షలు చేసేది మేము కాదు. సెంట్రల్ ఆఫీస్ నుంచి పరీక్షలు నడవడం లేదు. నమూనాలు తీసుకోవద్దని చెబుతున్నారంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. ఉదయం 7 గంటలకు వచ్చి లైన్‌లో నిలబడితే వైద్య సిబ్బంది వచ్చి, పరీక్షలు కావని చెప్పడంతో ఉసూరుమంటూ ప్రైవేటు ల్యాబ్‌లకు వెళ్లి జేబులు ఖాళీ చేయించుకుంటున్నారు.
- ఒక్కో టెస్టుకు ప్రైవేటులో రూ.800 నుంచి రూ.వెయ్యి వరకు వసూలు చేస్తున్నారు. ఇలా రోజుకు సుమారు 15 వేల మంది అంటే నెలలో 4.50 లక్షల మంది ప్రభుత్వ ఉచిత సేవలు దూరమవుతున్నాయి.దీంతో రూ.40 కోట్ల వరకు ప్రజలకు అదనపు భారం పడుతోంది. ఈ పరిస్థితులకు ప్రభుత్వ ఉన్నతాధికారుల నిర్లక్ష్యమే కారణమని పలువురు పేర్కొంటున్నారు. డ్రగ్స్ సరఫరాదారులకు బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో థైరాయిడ్ టెస్ట్‌కు సంబంధించిన నిల్వలు పూర్తిగా నిండుకున్నాయని, సరఫరాదారుడు చేతులెత్తేయడంతో ఈ పరిస్థితులు దాపురించాయని ఆరోపిస్తున్నారు.

20 శాతం మందిలో థైరాయిడ్ !

- థైరాయిడ్ బాధితుల్లో తెలంగాణ దేశంలోనే ఐదో స్థానంలో నిలిచింది. తెలంగాణ వ్యాప్తంగా 17 శాతం మంది థైరాయిడ్ బాధితులేనని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. విషయం ఉన్నతాధికారులకు తెలుసు, వారికి మేం చెప్పలేం కదా అని కొందరు అధికారులు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు.

రెండు రోజుల్లో పునఃప్రారంభిస్తాం



కొన్ని సమస్యల వల్ల థైరాయిడ్ పరీక్షలు పాక్షికంగా నిలిచిపోయాయి. రెండు రోజుల్లో తిరిగి పునఃప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తాం. అన్ని వైద్య పరీక్షలు అందుబాటులో ఉండేలా చూస్తాం.

-వెంకటి, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి, హైదరాబాద్

నకిలీ వైద్యులపై కేసులు నమోదు



తనిఖీల్లో పాల్గొన్న తెలంగాణ మెడికల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్, అధికారుల

దుండిగల్: తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో తనిఖీలు నిర్వహించి ఎనిమిది మంది నకిలీ వైద్యులపై కేసులు నమోదు చేశారు. బౌరంపేట్, దుండిగల్, సూరారం పరిసర ప్రాంతాల్లో అర్హతలేని వ్యక్తులు నకిలీ వైద్యుల అవతారమెత్తి అల్లోపతి వైద్యం చేస్తున్నట్లు తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌కి సమాచారం అందింది.తెలంగాణ మెడికల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్, కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ విష్ణు, పబ్లిక్ రిలేషన్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ నరేష్ కుమార్ దాడులు నిర్వహించి ఎటువంటి గుర్తింపు పత్రాలు లేకుండా వైద్యం చేస్తున్న ఎనిమిది మందిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆరేంజ్ క్లినిక్‌ను నడుపుతున్న నగులమీరా, గండిమైసమ్మలో బీఎల్ క్లినిక్ నడుపుతున్న సూర్యలత, సూరారంలోని నాని మినీ హాస్పిటల్‌లో వెంకటేష్, దుండిగల్‌లో శ్రీ సాయి ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో సూర్యనారాయణ, శ్రీ శ్రీనివాస ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో శివ శంకర్, బాలాజీ క్లినిక్ ను నడుపుతున్న విఠల్, నందుశ్వర్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో శంకర్ గౌడ్, మస్తాన్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నడుపుతున్న మస్తాన్‌లపై కేసులు నమోదు చేయనున్నట్లు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

వ్యవసాయాన్ని విచ్ఛిన్నం చేసే కుట్ర



మాట్లాడుతున్న ప్రొఫెసర్ డి. నరసింహారెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పాలమూరు జిల్లాలో వ్యవసాయ పంటలను విచ్ఛిన్నం చేయడానికే పరిశ్రమలు వస్తున్నాయని ప్రొఫెసర్ డి. నరసింహారెడ్డి అన్నారు. పంజాబ్‌లో పదేపదే వరి పండించడం వల్ల భూమి సహజసారాన్ని కోల్పోయి, రసాయన ఎరువులు వాడకం వల్ల ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో మాట్లాడారు. నరసింహారెడ్డి మాట్లాడుతూ... పాలమూరు జిల్లా అత్యంత వెనుకబడి ఉన్నప్పటికీ ఆ జిల్లా అభివృద్ధి కోసం పాలకులు ప్రయత్నాలు చేయడం లేదన్నారు. ప్రజల ఆరోగ్యాలు దెబ్బ తీసే పరిశ్రమలకు అనుమతులు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ కొదండరాం మాట్లాడుతూ... పాలమూరు జిల్లా సమస్యలను పాలమూరు అధ్యయన వేదిక ప్రజల ముందుకు తీసుకురావడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో పాలమూరు అధ్యయన వేదిక ప్రతినిధులు రెహమాన్, రాంచంద్రయ్య, డి. చంద్రశేఖర్ , డాక్టర్ బాబురావు పాల్గొన్నారు.

రోస్టర్ పాయింట్ల కేటాయింపులో అన్యాయం



కార్యక్రమంలో మాల సంఘాల నాయకులు

పంజగుట్ట: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చట్టం 2025లో మాలలకు రోస్టర్ పాయింట్లు కేటాయింపు విధానంలో జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో నిరసన వ్యక్తం చేస్తామని మాల సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. అనంతరం ఆగస్టు 1న హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు.శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఎస్సీ ఉప వర్గీకరణ చట్టం 2025 రోస్టర్ విధానంవల్ల మాలలకు జరుగుతున్న అన్యాయం- భవిష్యత్ కార్యాచరణ అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. బత్తుల రాంప్రసాద్ కన్వీనర్‌గా వ్యవహరించిన ఈ సమావేశానికి, డాక్టర్ మంచాల లింగస్వామి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. మాలలను గ్రూప్ – 3లో చేర్చి రోస్టర్ పాయింట్లు 22 కేటాయించడంద్వారా తీవ్ర అన్యాయం జరుగుతుందని, శాతవాహన యూనివర్సిటీలో జరిగిన నియామకాల్లో, కరీంనగర్ 35 పార్ట్‌టైమ్ లెక్చరర్‌ల ఉద్యోగాల నోటిఫికేషన్‌లో ఎస్సీలకు వచ్చే 6 ఉద్యోగాల్లో ఒక్క ఉద్యోగం కూడా మాలలకు రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నవలలు, కథలు వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తాయి

చిక్కడపల్లి: నవలలు, కథలు వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తాయని ప్రముఖ సాహితీ వేత్త నందిని సిధారెడ్డి అన్నారు. కొలకలూరి ఇనాక్ రచించిన రంధి నవల ఆత్మ విశ్వాసానికి ప్రతీక అన్నారు. త్యాగరాయగానసభలో శనివారం సాయంత్రం కళా సుబ్బారావు కళా వేదికపై జరుగుతున్న ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తాహంలో భాగంగా రంధి నవల – అవలోకన గ్రంథ ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నందిని సిధారెడ్డి గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఇనాక్ రచనలు అన్నింటిలో మనుషుల మధ్య ప్రేమ తత్వం ఆత్మ విశ్వాసం ధిక్కారం అంశాలుగా ఉంటాయని వివరించారు.

అమ్మవారిని దర్శించుకున్న విదేశీయులు



గోల్కొండ: గోల్కొండ కోటలో విదేశీ పర్యాటకులు శనివారం సందడి చేశారు. వివిధ దేశాల నుంచి విదేశీ పర్యాటకులు గోల్కొండ కోటను చూడడానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఇదిలా ఉండగా పలువురు విదేశీ పర్యాటకులు భారతీయ సంస్కృతిక సాంప్రదాయాలను చూసి ముగ్ధులయ్యారు. చాలా మంది విదేశీ పర్యాటకులు శ్రీ జగదాంబిక అమ్మవారిని దర్శించుకున్నారు.

రమణీయం అనన్య నాట్యం



గన్‌ఫౌండ్రీ: శ్రీవేంకటేశ కూచిపూడి అకాడమి ఆధ్వర్యంలో ప్రముఖ నాట్య గురువు కుబేరిణి శిషురాలు అనన్య పర్సా కూచిపూడి నాట్య ఆరంగేట్రం శనివారం రవీంద్రభారతిలో ఆకట్టుకుంది. చక్కటి హావాభావాలతో సాగిన నృత్య ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సినీనటి బి.సంధ్యారాజు మాట్లాడుతూ.. విదేశాల్లో ఉంటున్నా మన దేశ ప్రాచీన నృత్యమైన కూచిపూడి నృత్యాన్ని అభ్యసించడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావు, మాజీ ఎమ్మెల్యే ఒడిదల సతీష్‌కుమార్, ట్రాన్స్ కో మాజీ సీఎండీ ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

వీసీగా నియమితులైన హెచ్‌సీయూ పూర్వ విద్యార్థి



ప్రొ.ఉమాకాంత్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ పూర్వ విద్యార్థి వైస్‌చాన్స్‌లర్‌గా నియమితులయ్యారు. పూర్వ విద్యార్థి ప్రొఫెసర్ ఉమాకాంత్‌దాస్ ప్రతిష్టాత్మకమైన పూణేలోని గోఖలే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాలిటిక్స్ అండ్ ఎకనామిక్స్(జీఐపీఈ) వైస్‌చాన్స్‌లర్‌గా నియమితులయ్యారు. ఆయన 1990–92లో హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో పోస్టుగాడ్యుయేషన్ కోర్సు చేశారు. దేశంలోని పురాతన ఉన్నత విద్యాసంస్థలలో జీఐపీఈ ఒకటిగా గుర్తింపు పొందింది. ఉమాకాంత్ దాస్ వీసీగా నియామకం కావడం పట్ల హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు, రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్, ఫ్యాకల్టీ ప్రతినిధులు హర్షం వ్యక్తంచేశారు.

నైపుణ్యం ఉంటేనే రాణింపు

ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బీఎస్ మూర్తి



గ్రాడ్యుయేషన్ డే లో పాల్గొన్న అధ్యాపకులు

మణికొండ: పారిశ్రామిక సంస్థలు విద్యార్థుల పట్టాలను చూసి ఉద్యోగాలు ఇవ్వటం లేదని, వాటితో పాటు పనిచేసే విధానంలో నైపుణ్యత ఉన్నప్పుడే అవకాశం కల్పిస్తున్నాయని, అందుకు అనుగుణంగా ఇంజనీర్లు తమను తాము తీర్చుదిద్దుకోవాలని ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బీఎస్ మూర్తి అన్నారు. గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో శనివారం సాయంత్రం నిర్వహించిన 5వ గ్రాడ్యుయేషన్ డేకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలు, అంతర శాఖలలో సమన్వయంతో అభ్యాసం, నైతిక నాయకత్వం, సమాజానికి ఉపయోగపడేలా జీవించాల్సిన అవసరం యువ ఇంజనీర్లకు ఉందన్నారు. పట్టభద్రత చదువులో అంతిమం కాదని జీవిత ప్రయాణానికి ఆరంభం మాత్రమేనన్నారు. ఉస్మానియా యూనివర్శిటీ పరీక్షల నియంత్రణాధికారి కె. శశికాంత్, ఇన్ఫోసిస్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ విద్యాసాగర్ నరసింహన్‌లు మాట్లాడుతూ నిరంతరం విద్యార్థులుగా కొనసాగినపుడే జీవితంలో రాణింపు ఉంటుందన్నారు. సీబీఐటీ ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

యువ శాస్త్రవేత్తలకు 'డాక్టర్ ఎల్లాప్రగడ' అవార్డులు

రాయదుర్గం: యువ శాస్త్రవేత్తలకు డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు అవార్డులను అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్స్ (ఎఫ్ఏబీఏ) కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రొఫెసర్ పల్లు రెడ్డన్న శనివారం తెలిపారు. బయోటెక్నాలజీలో ఆవిష్కరణలు చేసిన యువ శాస్త్రవేత్తలను గుర్తించి ప్రోత్సహించేందుకు ఈ అవార్డులు అందిస్తున్నామని, జులై 1 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించామని, ఆగస్టులో అవార్డులు అందచేస్తామని ఒక ప్రకటనలో తెలిపారు.

ఉత్సాహంగా జాతీయ స్థాయి ఉషు క్రీడా పోటీలు



మెడల్స్ అందించిన సినీనటుడు సుమన్

గచ్చిబౌలి: 24వ జూనియర్ జాతీయ స్థాయి ఉషు క్రీడా పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. గచ్చిబౌలిలోని జీఎంసీబాలయోగి స్టేడియంలో ఈ పోటీలు ఆదివారం వరకు ఉంటాయి. శనివారం జరిగిన కార్యక్రమంలో సినీనటుడు సుమన్, తెలంగాణ రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ తారీఖ్ అన్సారీ, సయ్యద్ కేసర్, ఉషు అసోసియేషన్ ఆఫ్ ఇండియా సోహెల్ అహ్మద్ విజేతలకు పతకాలను అందించారు. ఈ పోటీలకు దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి 1000 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు.

ప్రీమియం ల్యాండ్ పార్శిల్స్ వేలం

లక్డీకాపూల్ : మహానగర పరిధిలోని కేపీహెచ్‌బీ హైటెక్ సిటీ కారిడార్‌కు ఆనుకుని సుమారు 7.3 ఎకరాల సిగ్నేచర్ ల్యాండ్ పార్శిల్స్‌లను వేలం వేయనున్నట్లు తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్‌-చైర్మన్ వి.పి. గౌతమ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రేడ్-ఎ ఆఫీస్ టవర్లు ,లగ్జరీ హోటళ్ళు ఇన్నోవేషన్ హబ్‌లకు ల్యాండ్ పార్శిల్స్ ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఇ-వేలం ప్రక్రియ ద్వారా ఈనెల 30న నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జేఎన్‌టియులో ఎంటెక్ పాఠ్యాంశాల ఖరారు

బాలానగర్: ఇంజినీరింగ్ విద్యలో సిలబస్ మార్పులపై జేఎన్‌టీయు అధికారులు నిర్ణయం తీసుకున్నారు.ఎంటెక్ పాఠ్యాంశాలను శనివారం ఖరారు చేశారు. విద్యారంగం పరిశోధన, పరిశ్రమల అవసరాలను సమన్వయం చేస్తూ విద్యార్థులకు మౌలికమైన అవగాహన కలిగించే కోర్ సబ్జెక్టులలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను జోడించారు. విద్యార్థులకు ఉన్నత విద్యతో పాటు పరిశ్రమల అవసరాలకు సరిపోయే శిక్షణను అందించనున్నారు.

ఓయూలో పోటీ పరీక్షలకు శిక్షణ తరగతులు ప్రారంభం



ఆర్.నారాయణమూర్తిని సత్కరిస్తున్న వీసీ ప్రొ.కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ సివిల్ సర్వీస్ అకాడమి ఆధ్వర్యంలో వివిధ ఉద్యోగ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. శనివారం సివిల్ అకాడమీ తరగతి గదిలో వీసీ ప్రొ. కుమార్ శిక్షణా తరగతులను ప్రారంభించారు. విద్యార్థులు కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని వీసీ సూచించారు. సివిల్ శిక్షణ నిపుణురాలు ఎం. బాలలత వివిధ ఉద్యోగ పోటీ పరీక్షలలో చదవాల్సిన తీరు, అనుసరించాల్సిన మెలకువల గురించి వివరించారు. విప్లవ నటుడు, సినీ దర్శకులు ఆర్ నారాయణ మూర్తి మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో కీలకమని సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదవాలని విద్యార్థులను ఉత్తేజపరిచారు. అనంతరం ఆర్ నారాయణమూర్తిని వీసి ప్రొ. కుమార్ ఘనంగా సన్మానించారు.

కూడళ్లలో కమ్యూనిటీ సర్వీసు చేయండి..

డ్రంకన్ డ్రైవ్‌లో రెండోసారి పట్టుబడ్డ వారికి వినూత్న శిక్ష

బంజారాహిల్స్: మోతాదుకు మించి మద్యంతాగి వాహనాలు నడుపుతూ రెండోసారి పట్టుబడ్డ వాహనదారులకు న్యాయస్థానం వినూత్న శిక్షణ విధించింది. మద్యంతాగి వాహనాలు నడపడం వల్ల ఏర్పడే అనర్థాలను వివరిస్తూ పంజగుట్ట ప్రధాన కూడళ్లలో ప్లకార్డులు ప్రదర్శించి సమాజసేవ చేయాలని ఆదేశించింది. దీంతో పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో 17 మంది, ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏడుగురు శనివారం ఉదయం కూడళ్లలో డ్రింక్ చేసి డ్రైవ్ చేయవద్దంటూ ప్లకార్డులు ప్రదర్శించి వాహనదారులను అప్రమత్తం చేశారు. రెండు గంటల పాటు వీరంతా డోండ్ డ్రింక్ అండ్ డ్రైవ్ అనే ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిలబడ్డారు. ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 65 మంది డ్రంక్ అండ డ్రైవ్‌లో పట్టుబడగా ఏడుగురు రెండోసారి తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వీరికి ఒక రోజు కమ్యూనిటీ సర్వీసు చేయాలంటూ నాంపల్లిలోని 12వ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఆదేశించారు.

పెంపుడు జంతువులతో జాగ్రత్త

- వ్యాధులు సంక్రమించే ప్రమాదం
- నేడు జునోసిస్ డే



డా.రాంసింగ్

సాక్షి, సిటీ బ్యూరో: పెంపుడు జంతువుల నుంచి మనుషులకు 190 రకాల వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందని పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డా.లకావత్ రామ్‌సింగ్ తెలిపారు. జులై 6న జునోసిస్‌డే సందర్భంగా పెంపుడు జంతువులతో జాగ్రత్తగా ఉండాలని ఆయన తెలిపారు. మనుషుల్లో కనిపించే 70 శాతం అంటు వ్యాధుల్లో 60 శాతం జంతువుల నుంచే వస్తున్నాయని స్పష్టం చేశారు. కుక్కల నుంచి రేబిస్, పందుల నుంచి మెదడువాపు, మేకల నుంచి ఆంత్రాక్స్, ఆవులు, గేదెల నుంచి క్షయ, పాల ద్వారా బ్రుసోలసిస్ వ్యాపిస్తుందన్నారు. పక్షుల వల్ల సిటకో సిస్, ఎలుకలతో ప్లేగు, పిల్లుల నుంచి ఫాక్సో ప్లాస్మో కాండ్రిఐ, కోళ్ల ద్వారా బర్డ్ ఫ్లూ, కుందేళ్ళ ద్వారా టాక్స్ ప్లాస్మోసిస్ వంటి రోగాలు సోకే ప్రమాదం ఉందన్నారు. అందుకే పెంపుడు జంతువులతో జాగ్రత్తగా వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు.

మహిళా స్వాట్‌కు కొత్త యూనిఫాం



సాక్షి, సిటీబ్యూరో: ధర్నాలు, ర్యాలీలు, ఇతర బహిరంగ సభలలో మహిళా నిరసనకారులను సమర్థవంతంగా నిర్వహణ చేయడానికి ఏర్పాటైన స్విఫ్ట్ ఉమెన్ యాక్షన్ టీం (స్వాట్)కు కొత్త యూనిఫాంలను అందించారు. తొలిసారిగా హైదరాబాద్ కమిషనరేట్‌లో ఈ ఏడాది జూన్ 3న కమిషనర్ సీవీ ఆనంద్ ఈ బృందాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. 35 మంది మహిళా సిబ్బంది ఉన్న స్వాట్ పోలీసులకు రెండు నెలల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కొత్త దుస్తులలో ఈ బృందం తొలిసారిగా తెలంగాణ సచివాలయం వద్ద విధులను నిర్వహించారు.

ఒక్కొక్కరు..ఒక్క రూపాయి

యోగా సిందూర్ పేరిట భారత జవాన్లకు విరాళాల సేకరణ

- స్పందించిన యోగా సాధకులు.. రూ.3.40 లక్షలు విరాళం..
- గచ్చిబౌలి టి-హబ్ వేదికగా నేడు ఆర్మీకి అందజేత..



యోగాపై అవగాహన కలిగిస్తున్న వాలంటీర్లు (ఫైల్)

సనత్‌నగర్: యోగా నా కోసం...నేను దేశం కోసం ..నినాదంతో జాతిని మేల్కొల్పే మహా యజ్ఞానికి వారు పూనుకోవడమే కాదు..వారు ఎంచుకున్న టాస్క్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. ఒకవైపు ప్రాచీన యోగా విద్యను విస్తృతం చేస్తూనే మరోవైపు జవాన్ల సంక్షేమంలో యోగా సాధకులను భాగస్వాములను చేసిన ప్రయత్నం నిజంగా అద్భుతం. ఒక్కొక్కరు ఒక్కరూపాయి విరాళం పిలుపుతో జాతిని జాగృతం చేశారు. అలా సేకరించిన రూ.3.40 లక్షల విరాళాలను దేశ సైనికులకు అందించనున్నారు. ఈ సక్సెస్ మీట్‌ను ఈ నెల 6న ఆదివారం గచ్చిబౌలి టి-హబ్ వేదికగా నిర్వహించి ఆ మొత్తాన్ని ఆర్మీ అధికారులకు అందించనున్నారు. యోగా సిందూర్ పేరిట సక్సెస్ లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత నెలలో యోగా ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఒక యజ్ఞంలా ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ యోగ నారాయణ, యోగ సిందూర్ ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షుడు కే శివదుర్గాప్రసాద్‌ల బృందం జూన్ 1 నుంచి 21 యోగా సాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే దేశవ్యాప్తంగా పేరెన్నికగన్న 21 మంది వక్తలు తమ జ్ఞానాన్ని పంచుకున్నారు. 250 మందికి పైగా వాలంటీర్లు ఈ ఉద్యమానికి నిస్వార్థంగా సేవ చేశారు. ఇంటర్నేషనల్ యోగా డే అనంతరం జూన్ 22న యూట్యూబ్ లైవ్ ద్వారా లక్ష మందితో యోగా ఉత్సవాన్ని నిర్వహించి రికార్డు నెలకొల్పారు. అంతేకాదు ఈ ఉత్సవంలో పాల్గొన్న ప్రతిఒక్కరూ భారత జవాన్లకు మద్దతుగా నిలుస్తూ వారి సంక్షేమం కోసం ఒక్కొక్కరూ రూ.1 విరాళం అందించాలని ఇచ్చిన పిలుపునకు అనూహ్య స్పందన లభించింది. ఆ రోజు జరిగిన యోగా ఉత్సవంలో లక్ష మంది సాధకులను లక్ష్యంగా చేసుకోగా అంతకమించి పాల్గొని మొత్తం రూ.3.40 లక్షల విరాళాలను అందించి సైనికులకు మద్దతుగా నిలిచారు.

సక్సెస్‌మీట్‌లో నేడు నేషనల్ డిఫెన్స్ అకాడమీకి విరాళాల అందజేత..

యోగాసిందూర్ విజయవంతంగా పూర్తిచేసుకున్న సందర్భంగా ఈ నెల 6న ఆదివారం గచ్చిబౌలి టీ-హబ్ వేదికగా సక్సెస్‌మీట్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో యోగా సాధకులతో పాటు వాలంటీర్లు హాజరుకానున్నారు. దేశ జవాన్ల కోసం సేకరించిన విరాళాల్లో కొంత భాగాన్ని 'ఆపరేషన్ సిందూర్'లో దేశం కోసం ప్రాణత్యాగం చేసిన సైనికుడు మురళినాయక్ కుటుంబానికి, మిగిలిన విరాళాలను నేషనల్ డిఫెన్స్ అకాడమీకి అందజేయనున్నారు. తద్వారా భవిష్యత్తు భారత రక్షకులకు మద్దతుగా నిలవనున్నారు. ఈ యజ్ఞంలో భాగస్వాములుగా నిలిచిన వారితో పాటు వాలంటీర్లకు సర్టిఫికెట్లను ప్రదానం చేయనున్నారు. ఇది యోగాకు సంబంధించినది మాత్రమే కాదు..ఇదొక ధ్యాన యజ్ఞం అని యోగా సిందూర్ ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షులు శివదుర్గాప్రసాద్ పేర్కొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, ఆదివారం, 6, జూలై, 2025



కె-బాంబ్.. అనన్య బ్రాండ్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో కొరియన్ పాప్ నుంచి కొరియన్ ఫుడ్ దాకా ఇష్టపడే యువత పెరిగిపోతున్న నేపథ్యంలో నగర యువతను మరింతగా ఆకట్టుకునేందుకు సినీ నటి అనన్య పాండేను టూ యమ్మీ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకుంది. ఈ విషయాన్ని బ్రాండ్ ప్రతినిధి యోగేష్ తివారీ తెలిపారు. నూడుల్స్ రంగంలోకి ప్రవేశించిన ఏడాది లోనే కె-బాంబ్ ద్వారా కొరియన్ నూడుల్స్‌ను ఇష్టపడే నగర యువతను ఆకట్టుకోగలిగామని, యూత్ ఫేవరెట్ యాక్టర్ అనన్య ద్వారా ఆ ఆదర ణను మరింత పెంచుకోగలుగు తామన్నారు. యువతను మెప్పించే ప్రచారాలతో ఆమె అలరించను న్నారని వివరించారు.



నగర చరిత్ర, సంస్కృతి వైవిధ్యమైన వంటకాలకు కూడా ప్రసిద్ధి చెందింది. అందరికీ తెలిసిన హైదరాబాద్ బిర్యానీ, హలీమ్‌లు మాత్రమే కాకుండా మొఘలాయి, పర్షియన్ తెలుగు ప్రభావాలు కలగలిసిన మరికొన్ని అచ్చమైన హైదరాబాదీ రుచులివి. అంబానీల పెళ్లి వేడుకల్లో అయినా.. అమెరికా రెస్టారెంట్లలోనైనా హైదరాబాదీ క్యుజిన్‌కు పెద్దపీట వేసేలా చేస్తున్న ఆ వంటకాల జాబితాలో.. ఎన్నో రుచులు.. వాటిలో కొన్నింటి విశేషాలు..

– సాక్షి, సిటీబ్యూరో

హిస్టార్‌కల్.. టేస్ట్

- సిసలైన సిటీ రుచులకు సెలబ్రిటీలు సైతం ఫిదా..
- ఘన వారసత్వాన్ని చాటే నగర వంటకాలు
- బిర్యానీ, హలీమ్‌లతో పాటే దజనుకుపైగా..
- దేశవ్యాప్తంగా ప్రముఖుల వేడుకల్లో సిటీ వంటకాలు



కబాబ్‌లు: మ్యారినేట్ చేసిన మాంసంతో వండుతారు. నూనె రహితంగా, ఆరోగ్యకరమైన వంటలు ఇష్టపడేవారిని ఆకట్టుకుంటాయి.



దమ్ కా ఖీమా: సుగంధ ద్రవ్యాలు, పెరుగు, టొమాటోల మిశ్రమంతో వండిన ఒక సువాసన కలిగిన మాంసపు వంటకం, నెమ్మదిగా వండే ప్రక్రియ, 'రుచులను మెరుగుపరుస్తుంది.

బగారా ఖానా: సువాసనగల సుగంధ ద్రవ్యాలతో కూడిన అన్నం సాధారణంగా నెయ్యి, సుగంధ ద్రవ్యాలతో వండుతారు. కొన్నిసార్లు కూరగాయలు లేదా మాంసంతో కలిపి కూడా.



లుఖ్మీ: మాంసం. మసాలా దినుసులతో కలగలసిన రుచికరమైన పేస్ట్రీ, తరచుగా స్టార్టర్‌గా వినియోగిస్తారు.



దాల్చా బగారా ఖానా: సిటీలో అత్యంత ఇష్టమైన కాంబో సాధారణంగా శుక్రవారం వండుతారు. దాల్చా కాయధాన్యాలు మాంసంతో తయారు చేసిన స్పైసీ వంటకం, సుగంధ ద్రవ్యాలు, చింతపండు కూరగాయల మిశ్రమంతో వండుతారు. ఇది గొప్ప ఘాటైన రుచిని అందిస్తుంది.



కచ్చి గోష్ట్‌కి బిర్యానీ: హైదరాబాదీ బిర్యానీలో ఇది ఒక వైవిధ్యం. పచ్చి మాంసంతో మసాలా దినుసులలో మెరినేట్ చేసి బాస్మతి బియ్యంతో వండుతారు.



మరాగ్: మీడియం స్పైసీ, సుగంధ మటన్ సూప్. సుగంధ ద్రవ్యాలు మూలికల మిశ్రమంతో నిదానంగా వండుతారు. ఇది లేత మాంసాన్ని కలిగి ఉంటుంది.



మిర్చి కా సాలన్: పచ్చి మిరపకాయలు, వేరుశెనగలు, కొబ్బరి పాలతో తయారు చేసిన కారపు కూర, తరచుగా బిర్యానీ లేదా అన్నంతో వడ్డిస్తారు.

నగరంలో అచ్చమైన హైదరాబాదీ వంటకాలను ఆస్వాదించాలంటే.. చార్మినార్, టోలిచౌకిలలో ఉన్న షాగౌస్, పలు ప్రాంతాల్లో ఉన్న పిస్తాహౌస్, మల్లేపల్లి, మెహదీపట్నంలో ఉన్న ఆల్ బేక్, మదీనాలో ఉన్న హోటల్ షాదాబ్, కేఫ్ బహార్, తదితర రెస్టారెంట్స్, మండీలను సందర్శించాల్సిందే.



షికంపూరి కబాబ్: మాంసం సుగంధ ద్రవ్యాలతో తయారు చేసిన హైదరాబాదీ కబాబ్‌ల వైవిధ్యం, వేయించిన గుడ్డుతో కలిపి వడ్డిస్తారు.


- **పాయాసూప్:** పులుసులో వండిన గొర్రె కాళ్లతో తయారు చేసే బలవర్ధకమైన సూప్. సంప్రదాయ హైదరాబాదీ అల్పాహార వంటకం, తరచుగా నాన్ లేదా అన్నంతో వడ్డిస్తారు.
- **భేజా ఫ్రై:** క్రిస్పీ ఫ్రైడ్ బ్రెయిన్ డిష్ తరచుగా సుగంధద్రవ్యాలు నిమ్మకాయ పిండి వడ్డిస్తారు.
- **గుర్దా పాలక్:** సుగంధ ద్రవ్యాలతో కలిపి వండిన గుర్దా బచ్చలికూర, సంప్రదాయ కూరలపై గొప్ప, రుచికరమైన రుచి పోషకాలను అందిస్తాయి.
- **ఖాగినా:** మసాలా గిలకొట్టిన గుడ్లు, సన్నగా తరిగిన ఉల్లిపాయలతో తయారు చేయబడిన వంటకం. బలమైన అల్పాహారం లేదా సైడ్‌గా వినియోగిస్తారు.
- **ఖుబానీ కా మీఠా:** కుబానీ కా మీఠా, ఒక తీపి మరియు చిక్కని ఆప్రికాట్ డెజర్ట్, ఇది హైదరాబాదీ క్లాసిక్. ఈ రిఫ్రెష్ డెజర్ట్ మసాలా భోజనానికి సరైన ముగింపు.
- **డబుల్ కా మీఠా:** రొట్టె, పాలు, గింజలతో చేసిన తీపి డెజర్ట్, తరచుగా ప్రత్యేక సందర్భాలలో వడ్డిస్తారు.

హైదరాబాదీ నాష్తా ..

- **షీర్ ఖుర్మా:** పాలు, పంచదార, గింజలతో తయారు చేయబడిన ఒక తీపి వెర్మిసెల్లీ పుడ్డింగ్, తరచుగా ఈద్ వేడుకల సమయంలో వడ్డిస్తారు.
- **కద్దు కీ ఖీర్:** గుమ్మడికాయ, పాలు, పంచదారతో తయారు చేయబడిన తీపి, క్రీమ్ డెజర్ట్, ఏలకులతో రుచిగా మరియు గింజలతో అలంకరిస్తారు.
- **తాలావా గోష్ట్:** డ్రై మటన్ ఫ్రై, బాగా వేయించిన మసాలా మాంసం.
- **మిర్చి కా సాలన్:** బిర్యానీతో పాటు ఇచ్చే గ్రేవీ.
- **ఖటా మిటాదాల్(ఖట్టి దాల్):** నిమ్మరసం లేదా తామరిందతో రుచికరమైన పప్పు.




బగారే బైగాన్: కాల్చిన వంకాయలు, వేరుశెనగలు కొబ్బరి పాలతో చేసిన రుచికరమైన కర్రీ..




తమటే కా కుట్: టొమాటోలు, ఉల్లిపాయలు సుగంధ ద్రవ్యాలతో తయారు చేసిన స్పైసీ సూప్.. టమాటో రసం తరహాలో ఉంటుంది.

అవధి.. రుచుల వారధి

- సిటీలో రాజవంశం రుచుల సమ్మేళనం
- నోవాటెల్ వేదికగా లక్నో నవాబుల వంటకాలు
- ప్రతి వంటకం వెనుక ఒక కథ






సాక్షి, సిటీబ్యూరో: నగరం ప్రతిరోజూ కొత్త ఫుడ్ అనుభవాలకు వేదికవుతోంది. అందులో భాగంగా నోవాటెల్ హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ అవధి ఫుడ్ ఫెస్టివల్ పేరుతో ఒక ప్రత్యేక, సంప్రదాయభరితమైన రాత్రి విందుకు ఆతిథ్యం ఇస్తోంది. ఈ ఈవెంట్, లక్నో నవాబుల వంటల మాధుర్యాన్ని హైదరాబాద్ ఫుడ్ లవర్స్‌కు మరింత దగ్గర చేస్తోంది. లక్నోకు చెందిన ప్రముఖ చెఫ్ సుభమ్ కుమార్ తన పాక శాస్త్ర నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారు. ఈ ఫెస్టివల్‌ను కేవలం ఫుడ్ ప్రెజెంటేషన్‌గా కాకుండా, ఓ కులినరీ జర్నీగా తీర్చిదిద్దారని, ప్రతి వంటకం వెనుక కథ ఉంది, ఆ కథని రుచిలోనే వినిపించాలన్నదే మా ప్రయత్నమని ఆయన తెలిపారు.

ఫుల్లీ లోడెడ్ కెమెరా

- అందుబాటులోకి అధునాతన పరికరాలు
- ఆకట్టుకుంటున్న కెమెరా ఎక్స్‌పో



సాక్షి, సిటీబ్యూరో: ఈ తరం యువత ప్రతి సన్నివేశాన్ని కెమెరాల్లో బంధిస్తోంది. సెల్ఫీలు, ఫొటోలు, వీడియోలతో సామాజిక మాధ్యమాల్లో నిత్యం దుమ్మురేపుతున్నారు. పిన్ పాయింట్‌గా అప్‌డేట్‌లో ఉంటున్నారు. అయితే ఒకప్పుడు ఫొటో తీయాలంటే దానికొక రీల్, కడిగి ఇవ్వడానికి ఫొటో స్టూడియో, కడిగిన ఫిల్మ్‌ను ఎండలో ఆరబెట్టి ఇవ్వడానికి సమయం పట్టేది. వీడియో అంటే పెద్ద కెమెరా భుజాన వేసుకుని వెళ్లే రోజులు, ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. కాలం మారింది. సాంకేతిక విప్లవం వచ్చింది. దీని ప్రభావం ఇప్పుడు ఫొటో, వీడియో కెమెరాలపైనా స్పష్టంగా కనిపిస్తోంది. సెల్ ఫోన్‌లో కెమెరాలు వచ్చిన తరువాత ఫొటో కెమెరాల మనుగడేంటనే ప్రశ్న ఉత్పన్నమైంది. వాటన్నింటిని పటాపంచలు చేస్తూ అత్యాధునిక పరికరాలు ప్రజలను అబ్బురపరుస్తున్నాయి. ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, ఫ్రేమ్, ఆల్బమ్ ఇండస్ట్రీ నగరంలోని నాంపల్లి సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో మూడు రోజుల పాటు ఇంటర్నేషనల్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నారు. ఇక్కడ అధునాతన పరికరాలు అందుబాటులో ఉంచారు. నగరంలోని పలువురు వ్యాపారులు, ఆసక్తి కలిగిన వ్యక్తులు స్టాల్స్‌ను సందర్శించి నచ్చిన వస్తువులను కొనుగోలు చేసుకుంటున్నారు. సరసమైన ధరల్లో అప్‌డేటెడ్ వెర్షన్లు లభిస్తుండటంతో సందర్శకులు సైతం సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



ప్రింటింగ్‌లో విప్లవాత్మక మార్పులు

పాస్‌పోర్టు సైజు ఫొటో దిగి, కడిగించి తీసుకోవడానికి రోజుల తరబడి ఎదురుచూసే రోజుల నుంచి క్షణంలో ఫొటో వచ్చేశాం. అప్పట్లో నెగిటివ్ కడిగి ఇవ్వడానికి సమయం పట్టేది. ఇప్పుడే ఫోన్ నుంచి నేరుగా ప్రింట్ ఇచ్చేస్తున్నారు. క్షణంలో ప్రింట్ వస్తోంది. ఇందులోనూ రకరకాల క్వాలిటీ గల ప్రింటింగ్ పేపర్లు అందుబాటులోకి వచ్చాయి. నాన్‌టెరబుల్, గ్లోసీ, లెనిన్, ఫెదర్, 3డి, గ్లిట్టర్, శాండ్ అంటూ ఒక్కో పేపర్‌ది ఒక్కో ప్రత్యేకత. కళ్లు మిరుమిట్లు గొలిపే విధంగా ఫొటోలను తీర్చిదిద్దుతున్నారు.

భుజంపై నుంచి అరచేతిలోకి..

రెండు దశాబ్దాల క్రితం వివాహాలు, గృహ ప్రవేశం, మీడియా ప్రతినిధులు, రాజకీయ సభలు, సమావేశాలు తదితర సందర్భాల్లో వీడియో తీయాలంటే పెద్దపెద్ద కెమెరాలను, కనెక్టివ్ కేబుళ్లతో బ్యాగుల్లో పెట్టుకుని భుజాన వేసుకుని వెళ్లేది. ఇప్పుడు అంతకంటే అధునాతన టెక్నాలజీతో అరచేతిలో ఇమిడిపోయే వీడియో కెమెరాలు అందుబాటులోకి వచ్చాయి. ఇవి వైర్‌లెస్‌గా పనిచేస్తాయి. క్లారిటీ విషయంలోనూ అద్భుతమైన హెచ్‌డీ ప్రింట్‌ను అందిస్తున్నాయి.

అబ్బురపరిచే స్టాండ్

ఫొటో, వీడియోలు తీయాలంటే కెమెరాలు పుట్టుకుని ఎన్నో ఫీట్లు చేసే కెమెరామెన్లను చాలా సందర్భాల్లో చూస్తుంటాం. అయితే ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన కెమెరా స్టాండ్ కెమెరామెన్ పనిని పూర్తిగా తగ్గిస్తోంది. కెమెరాను స్టాండ్‌కు ఫిక్స్ చేసి, మనం ఏ వ్యక్తిని అయితే వీడియో తీయాలన్నామో వారి కళ్లు, ముఖాన్ని కెమెరాకు అనుసంధానం చేస్తే చాలు. సదరు వ్యక్తి ఎన్ని వైపులు తిరిగినా, ఎన్ని డిగ్రీల కోణంలో తిరిగినా స్టాండ్ కెమెరాను అలా తిప్పుడూ, ఫొటో, వీడియో క్లారిటీలో బ్లర్ కాకుండా ఖచ్చితమైన ప్రింట్‌ను అందిస్తుంది. ఈ స్టాండ్ అనేది కెమెరా సామర్థ్యాన్ని బట్టి రూ.50 వేల నుంచి రూ.90 వేల వరకు అందుబటులో ఉన్నాయి.



వందేళ్లు ఉంటాయి

1980 నుంచి మేము ఇదే వ్యాపారంలో ఉన్నాం. ఫొటో, వీడియో రంగంలో సమూలంగా మారిపోయాయి. గతంలో కడిగిన ఫొటోలు లైఫ్ టైం పదేళ్లు. ప్రస్తుతం వందేళ్లు ఉండే విధంగా ఫొటో షీట్‌లు అందుబాటులోకి వచ్చాయి. వర్షంలో తడిచినా ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఒక్కో షీట్ రకం, క్వాలిటీని బట్టి రూ.40 నుంచి రూ.15 వరకు ఉంటాయి.

– రంజిత్ కుమార్, ఫొటో ఫ్లాష్ డిజిటల్ కలర్ ల్యాబ్, చిక్కడపల్లి



సాంస్కృతిక నృత్య వైభవం

సాక్షి, సిటీబ్యూరో: బాచుపల్లిలోని గోకరాజు లైలావతి ఇంజనీరింగ్ కళాశాల వేదికగా శనివారం నిర్వహించిన శాస్త్రీయ నృత్య, సంగీత విభావరి విశేషంగా అలరించింది. విద్యార్థినులు అన్నమాచార్య, రామదాసు, త్యాగరాజ కీర్తనలతో పాటు భరతనాట్యం, కూచిపూడి, పేర్ని వంటి నృత్యాలతో ఆకట్టుకున్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సాయి హనుమాన్, జీఆర్ ఐఈటీ డైరెక్టర్ డాక్టర్ జంధ్యాల నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చేనేత కళాకారులకు చేయూత



శ్రీనగర్‌కాలనీ: సత్య సాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరిట ఏర్పాటు చేసిన సిల్క్ ఎగ్జిబిషన్‌ను శనివారం మంత్రి సీతక్క ప్రారంభించారు. ఇక్కడి చీరలు చాలా అందంగా ఆకట్టుకునేలా ఉన్నాయని, చేనేతకారుల ఉత్పత్తులను తిలకించి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కళాకారులకు చేయూత అందిస్తూ వారి అభ్యున్నతికి తోడ్పడుతోందని అన్నారు. దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన చేనేత కళాకారులు వారి ఉత్పత్తులను సుమారు 70స్టాల్స్‌లో ఏర్పాటు చేశామని సిల్క్ ఇండియా సీఈఓ వినయ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 13 వరకు ఎగ్జిబిషన్ వినియోగదారులకు అందుబాటులో ఉంటుందన్నారు.

ఎదురులేని నీరజ్



బెంగళూరు: భారత్‌లో నిర్వహించిన తొలి అంతర్జాతీయ జావెలిన్ త్రో ఈవెంట్... 'నీరజ్ చోప్రా క్లాసిక్'లో భారత స్టార్ నీరజ్ చోప్రా విజేతగా నిలిచాడు. ప్రపంచ అథ్లెటిక్స్ సమాఖ్య 'ఎ' కేటగిరీ గుర్తింపు నిచ్చిన ఈ టోర్నీలో శనివారం నీరజ్ జావెలిన్‌ను 86.18 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానం దక్కించుకున్నాడు. ఇటీవల పారిస్ డైమండ్ లీగ్, ఒస్ట్రావా గోల్డెన్ స్పైక్ టోర్నీల్లో టైటిల్స్ నెగ్గిన 27 ఏళ్ల నీరజ్ చోప్రాకు ఇది 'హ్యాట్రిక్' టైటిల్ కావడం విశేషం. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో పసిడి, 2024 పారిస్ ఒలింపిక్స్‌లో రజతం నెగ్గిన నీరజ్... సొంతగడ్డపై అంచనాలను అందుకుంటూ అదరగొట్టాడు. ప్రపంచ మాజీ చాంపియన్ జూలియస్ యెగో (84.51 మీటర్లు; కెన్యా), రమేశ్ పతిరగే (84.34 మీటర్లు; శ్రీలంక) వరుసగా రెండో, మూడో స్థానాల్లో నిలిచారు. భారత అథ్లెటిక్స్ సమాఖ్య, ప్రపంచ అథ్లెటిక్స్ సమాఖ్య, జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో నీరజ్ చోప్రా పర్యవేక్షణలో జరిగిన ఈ ఈవెంట్ విజయవంతం కాగా... విజేతలకు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య బహుమతులు అందజేశారు. తొలి ప్రయత్నంలో ఫౌల్ చేసిన నీరజ్... రెండో త్రోలో జావెలిన్‌ను 82.99 మీటర్ల దూరం విసిరాడు. ఇక మూడో ప్రయత్నంలో ఈటెను 86.18 మీటర్ల దూరం విసిరి అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసిన నీరజ్ విజయనాదం చేశాడు. ఆ తర్వాత నాలుగో ప్రయత్నంలో మరోసారి ఫౌల్ చేసిన నీరజ్.. ఐదో ప్రయత్నంలో 84.07 మీటర్లు, ఆరో త్రోలో 82.22 మీటర్ల దూరం నమోదు చేసుకున్నాడు. మిగిలిన అథ్లెట్లెవరూ నీరజ్ దరిదాపుల్లోకి చేరుకోలేకపోవడంతో భారత స్టార్ విజేతగా నిలిచాడు.

ఉత్కంఠ పోరులో భారత్ ఓటమి

మూడో టి20లో ఇంగ్లండ్ మహిళల జట్టు విజయం

లండన్: ఇంగ్లండ్ పర్యటనలో భారత మహిళల జట్టుకు తొలి పరాజయం ఎదురైంది. ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి దాటాక జరిగిన మూడో మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు 5 పరుగుల తేడాతో ఇంగ్లండ్ చేతిలో ఓడింది. దీంతో టీమిండియా సిరీస్‌లో 2–1తో నిలిచింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 171 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సోఫియా డంక్లీ (53 బంతుల్లో 75; 7 ఫోర్లు, 1 సిక్స్), డానీ వ్యాట్ హాడ్జ్ (42 బంతుల్లో 66; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ శతకాలు సాధించారు. అరుంధతి రెడ్డి, దీప్తి శర్మ చెరో 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో భారత్ 20 ఓవర్లలో 5



వికెట్లు కోల్పోయి 166 పరుగులు చేసింది. స్మృతి మంధాన (49 బంతుల్లో 56; 10 ఫోర్లు), షఫాలీ వర్మ (25 బంతుల్లో 47; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) పోరాడినా ఫలితం లేకపోయింది. ఇరు జట్ల మధ్య బుధవారం నాలుగో టి20 జరగనుంది.

ఇంగ్లండ్‌తో రెండో టెస్టులో టీమిండియా విజయం వాకిట్లో నిలిచింది. బ్యాటర్ల అసమాన ప్రదర్శనకు బౌలర్ల సహకారం తోడవడంతో భారీ విజయంపై కన్నేసింది. గిల్ రికార్డు శతకానికి పంత్, జడేజా, రాహుల్ హాఫ్ సెంచరీలు జతవడంతో ఆతిథ్య జట్టు ముందు కొండంత లక్ష్యం నిలవగా... 608 పరుగుల ఛేదనలో ఇంగ్లండ్ టాపార్డర్ తడబడింది. 72 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. విజయానికి ఇంకా 536 పరుగులు చేయాల్సి ఉండగా... ఇక్కడి నుంచి ఆ జట్టు గెలవాలంటే మహాద్భుతం జరగాల్సిందే! భారత బౌలర్ల జోరు చూస్తుంటే ఆదివారం వేగంగా ఏడు వికెట్లు తీయడం ఖాయంగా అనిపిస్తుండగా... రోజంతా వర్షం కురవాలని ప్రార్థించడం తప్ప ఇంగ్లండ్ ముందు మరో అవకాశం కనిపించడం లేదు!

విజయం వాకిట్లో...

గిల్ రికార్డు సెంచరీ


గిల్

7 వికెట్ల దూరంలో టీమిండియా

- రెండో ఇన్నింగ్స్‌లో 427/6 డిక్లేర్డ్
- మెరిసిన పంత్, జడేజా, ఆకాశ్‌దీప్
- ఇంగ్లండ్ లక్ష్యం 608... ప్రస్తుతం 72/3

బర్మింగ్‌హామ్: ఇంగ్లండ్‌తో రెండో టెస్టులో భారత క్రికెట్ జట్టు సంపూర్ణ ఆధిపత్యం కనబరుస్తూ విజయానికి చేరువైంది. రెండో ఇన్నింగ్స్‌లో దంచి కొట్టిన టీమిండియా... ప్రత్యర్థి ముందు ఏకంగా 608 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. కొండంత స్కోరును చేరుకునే క్రమంలో నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 16 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 72 పరుగులు చేసింది. క్రాలీ (0), డకెట్ (15 బంతుల్లో 25; 5 ఫోర్లు), రూట్ (6) పెవిలియన్ చేరగా... పోప్ (24 బ్యాటింగ్; 3 ఫోర్లు), బ్రూక్ (15 బ్యాటింగ్; 2 ఫోర్లు) పోరాడుతున్నారు. భారత బౌలర్లలో ఆకాశ్‌దీప్ 2, సిరాజ్ ఒక వికెట్ పడగొట్టారు. ఆదివారం ఆటకు చివరి రోజు కాగా... చేతిలో 7 వికెట్లు ఉన్న ఆతిథ్య ఇంగ్లండ్ జట్టు... విజయానికి ఇంకా 536 పరుగులు చేయాల్సి ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 64/1తో శనివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన టీమిండియా 83 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 427 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్ డబుల్ సెంచరీ హీరో, యువ సారథి శుబ్‌మన్ గిల్ (162 బంతుల్లో 161; 13 ఫోర్లు, 8 సిక్స్‌లు) మరో శతకంతో కదం తొక్కాడు. రవీంద్ర జడేజా (118 బంతుల్లో 69 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్), రిషభ్ పంత్ (58 బంతుల్లో 65; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు), కేఎల్ రాహుల్ (84 బంతుల్లో 55; 10 ఫోర్లు) అర్ధ శతకాలు సాధించారు. ఈ క్రమంలో టీమిండియా రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి తమ టెస్టు క్రికెట్ చరిత్రలో అత్యధిక (1014) స్కోరు నమోదు చేసుకోగా... గిల్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 430 పరుగులతో విజృంభించాడు.

పంత్ ఫటాఫట్...

గత మ్యాచ్‌లో ఇంగ్లండ్ ముందు భారీ లక్ష్యాన్ని నిర్దేశించినా... పరాజయం పాలైన టీమిండియా ఈసారి ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకూడదనే ఉద్దేశంతో కనిపించింది. నాలుగో రోజు తొలి సెషన్ ఆరంభంలో కొన్ని ఉత్కంఠ క్షణాలు ఎదురైనా... వాటిని అధిగమించి భారీ స్కోరు చేసింది. ఇంగ్లండ్ పేసర్లు కట్టుదిట్టంగా బంతులేస్తుండటంతో పరుగుల రాక కష్టం కాగా... కరుణ్ నాయర్ (26; 5 ఫోర్లు) మరోసారి మంచి ఆరంభాన్ని వృథా చేసుకున్నాడు. కాసేపటికి అర్ధశతకం అనంతరం రాహుల్ కూడా వెనుదిరగగా... పంత్ వచ్చీరావడంతో విరుచుకుపడ్డాడు. ఎదుర్కొన్న మూడో నాలుగు బంతులకు వరుసగా 4, 6 కొట్టి తన ఉద్దేశం చాటాడు. అతడి దూకుడుకు ఇంగ్లండ్ పేలవ ఫీల్డింగ్ కూడా తోడ్పడింది. 10 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద పంత్ ఇచ్చిన క్యాచ్‌ను క్రాలీ అందుకోలేకపోయాడు. దీన్ని సద్వినియోగం చేసుకున్న అతడు... తదుపరి ఓవర్‌లో మరో 4, 6 బాదాడు. బషీర్‌కు రెండు ఫోర్లతో స్వాగతం పలికిన పంత్... చిత్రవిచిత్రమైన షాట్లతో చెలరేగిపోయాడు. దీంతో తొలి సెషన్‌లో భారత్ 25 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 113 పరుగులు చేసింది.

గిల్ నిలకడ...

రెండో సెషన్‌లో పంత్‌తో పాటు గిల్ కూడా దంచి కొట్టడంతో స్కోరుబోర్డు పరుగులు పెట్టింది. టంగ్ బౌలింగ్‌లో 6, 4, 4 కొట్టిన గిల్.. అతడి తదుపరి ఓవర్‌లో మరో 6, 4తో 57 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. మరోవైపు పంత్ 48 బంతుల్లో ఫిఫ్టీ మార్క్ అందుకున్నాడు. స్కోరు పెంచే క్రమంలో పంత్ ఔట్ కాగా... జడేజా రాకతో పరుగుల వేగం మందగించింది. ఈ మధ్యలో కొన్ని చక్కటి షాట్లతో అలరించిన గిల్ 129 బంతుల్లో మ్యాచ్‌లో రెండో సెంచరీ తన పేరిట లిఖించుకున్నాడు. రెండో సెషన్‌లో టీమిండియా 30 ఓవర్లు ఆడి ఒక వికెట్ నష్టానికి 127 పరుగులు చేసింది. ఇక మూడో సెషన్‌లో గిల్, జడేజా దుమ్మురేపారు. బంతి తమ పరిధిలో ఉంటే చాలు దానిపై విరుచుకుపడిన ఈ జంట స్కోరు బోర్డుకు రాకెట్ వేగాన్నిచ్చింది. వోక్స్ ఓవర్‌లో గిల్ 6, 4, 4తో చెలరేగాడు. మరోవైపు జడేజా కూడా మ్యాచ్‌లో రెండో అర్ధశతకం తన పేరిట లిఖించుకున్నాడు. రూట్ బౌలింగ్ 6, 4తో గిల్ 150 పరుగుల మార్క్ అందుకున్నాడు. పంత్‌తో నాలుగో వికెట్‌కు 110 పరుగులు జోడించిన గిల్... జడేజాతో ఐదో వికెట్‌కు 175 పరుగులు జతచేశాడు. ఎట్టకేలకు బషీర్ బౌలింగ్‌లో గిల్ ఔట్ కాగా... ఆంధ్రప్రదేశ్ ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి (1) ఇలా వచ్చి అలా వెళ్లాడు. వాషింగ్టన్ సుందర్ (12 నాటౌట్) అండతో జడేజా జట్టు ఆధిక్యాన్ని 607కు చేర్చాడు.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 587; **ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్:** 407; **భారత్ రెండో ఇన్నింగ్స్:** జైస్వాల్ (ఎల్బీ) (బి) టంగ్ 28; రాహుల్ (బి) టంగ్ 55; నాయర్ (సి) స్మిత్ (బి) కార్స్ 26; గిల్ (సి అండ్ బి) బషీర్ 161; పంత్ (సి) డకెట్ (బి) బషీర్ 65; జడేజా (నాటౌట్) 69; నితీశ్ రెడ్డి (సి) క్రాలీ (బి) రూట్ 1; సుందర్ (నాటౌట్) 12; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (83 ఓవర్లలో 6 వికెట్లకు డిక్లేర్డ్) 427. వికెట్ల పతనం:** 1–51, 2–96, 3–126, 4–236, 5–411, 6–412. **బౌలింగ్:** వోక్స్ 14–3–61–0; కార్స్ 12–2–56–1; టంగ్ 15–2–93–2; స్టోక్స్ 7–1–26–0; బషీర్ 26–1–119–2; రూట్ 9–1–65–1.

ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: డకెట్ (బి) ఆకాశ్‌దీప్ 25; క్రాలీ (సి) (సబ్) సుదర్శన్ (బి) సిరాజ్ 0; పోప్ (బ్యాటింగ్) 24; రూట్ (బి) ఆకాశ్‌దీప్ 6; బ్రూక్ (బ్యాటింగ్) 15; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (16 ఓవర్లలో 3 వికెట్లకు) 72. వికెట్ల పతనం:** 1–11, 2–30, 3–50, **బౌలింగ్:** ఆకాశ్‌దీప్ 8–1–36–2; సిరాజ్ 5–1–29–1; ప్రసిధ్ కృష్ణ 3–0–6–0.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో


పంత్

430 ఈ మ్యాచ్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి గిల్ చేసిన పరుగులు. భారత్ తరఫున ఇదే అత్యధికం. సునీల్ గావస్కర్ (344 : 1971లో వెస్టిండీస్‌పై)ను అతను అధిగమించాడు. ఓవరాల్‌గా గూచ్ (456 : 1990లో భారత్‌పై) అగ్రస్థానంలో ఉండగా... గిల్ రెండో స్థానంలో నిలిచాడు.

1014 ఈ మ్యాచ్‌లో భారత్ చేసిన పరుగులు. మన టెస్టు క్రికెట్ చరిత్రలో ఇదే అత్యధికం. 2004లో ఆస్ట్రేలియాపై చేసిన 916 పరుగుల స్కోరును టీమ్ దాటింది.

2 ఒక టెస్టు రెండు ఇన్నింగ్స్‌ల్లో డబుల్ సెంచరీ, సెంచరీ చేసిన రెండో భారత ప్లేయర్‌గా గిల్ నిలిచాడు. గతంలో సునీల్ గావస్కర్ ఒక్కడే ఈ ఘనత సాధించాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో 150+స్కోర్లు చేసిన రెండో బ్యాటర్‌గాను గిల్ నిలిచాడు. గతంలో అలెన్ బోర్డర్ ఈ ఫీట్ నమోదు చేశాడు.

సాక్షి సినిమా

ఫారిన్‌లో జోరుగా...


● వరుణ్ తేజ్

వరుణ్ తేజ్ హీరోగా రూపొందుతోన్న తాజా చిత్రం 'వీటీ 15' (వర్కింగ్ టైటిల్). మేర్లపాక గాంధీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రితికా నాయక్ కథానాయికగా నటిస్తున్నారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు నిర్మిస్తున్నాయి. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం ఫారిన్‌లో జోరుగా జరుగుతోంది. ''ఇండో-కొరియన్ హారర్ కామెడీగా రూపొందుతోన్న చిత్రం 'వీటీ 15'. ఈ సినిమా తొలి షెడ్యూల్‌ను హైదరాబాద్‌లో, ద్వితీయ షెడ్యూల్‌ను అనంతపురంలో విజయవంతంగా పూర్తి చేశాం. ఫారిన్‌లో జరుగుతున్న తాజా షెడ్యూల్‌లో వరుణ్ తేజ్‌తో పాటు ప్రధాన తారాగణం పాల్గొంటున్నారు. హై ఎనర్జీ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్నాం. ఈ షెడ్యూల్‌తో 80 శాతం షూటింగ్ పూర్తవుతుంది. భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ సినిమాకు తమన్ సంగీతం అందిస్తున్నారు'' అని మేకర్స్ తెలిపారు.

ఘాటీ వాయిదా


● అనుష్క

''సినిమా అనేది జీవనది లాంటిది. కొన్నిసార్లు అది వేగంగా ముందుకు వెళుతుంది. కొన్నిసార్లు లోతు పెంచుకోవడానికి ఆగుతుంది. 'ఘాటీ' అనేది కేవలం సినిమా మాత్రమే కాదు... అది పర్వతాల ప్రతిధ్వని, అడవిలోని చల్లటి గాలి. మట్టి నుంచి, రాతి నుంచి చెక్కిన కథ. ప్రతి ఫ్రేమ్‌ని అద్భుతంగా ఆవిష్కరించడం కోసం మేం మరికొంత సమయం వెచ్చించాలనుకున్నాం'' అని 'ఘాటీ' చిత్రబృందం ఓ లేఖ విడుదల చేసింది. అనుష్క లీడ్ రోల్‌లో క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ సమర్పణలో రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించిన చిత్రం 'ఘాటీ'. ఈ నెల 11న ఈ చిత్రాన్ని విడుదల చేయాలనుకున్నారు. అయితే వాయిదా వేసినట్లు పేర్కొని, శనివారం ఓ లేఖ విడుదల చేశారు. ''మా సినిమా కోసం ఎదురు చూసే ప్రేక్షకుల నిరీక్షణకు తగ్గట్టు ఓ అద్భుతమైన, ఎప్పటికీ మరచిపోలేని అనుభూతి దక్కుతుంది'' అని యూనిట్ పేర్కొంది. బాధితురాలైన ఓ మహిళ పగ తీర్చుకునే క్రమంలో నేరస్థురాలిగా ఎలా మారింది? ఆ తర్వాత ఎలా లెజెండ్ అయింది? అనేది 'ఘాటీ' చిత్రం ప్రధానాంశం. విజువల్ ఎఫెక్ట్స్‌కి ప్రాధాన్యం ఉన్న చిత్రం కావడంతో, ఆ పనులు పూర్తి కాకపోవడం వల్లే రిలీజ్‌ను వాయిదా వేశారట.

సితారకు వార్ 2


● ఎన్టీఆర్

హీరో ఎన్టీఆర్ బాలీవుడ్‌లో ఎంట్రీ ఇస్తున్న చిత్రం 'వార్ 2'. హృతిక్ రోషన్, కియారా అద్వానీ జంటగా నటించారు. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో యశ్ రాజ్ ఫిల్మ్స్‌పై ఆదిత్య చోప్రా నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 14న హిందీ, తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. ఈ సినిమా తెలుగు విడుదల హక్కులను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ సొంతం చేసుకుంది. ఈ విషయాన్ని ఆ సంస్థ అధికారికంగా ప్రకటించింది. ''భారీ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'వార్ 2'. ఇండియన్ సినీ హిస్టరీలో ఇద్దరు బిగ్ స్టార్స్ అయిన హృతిక్ రోషన్, ఎన్టీఆర్ మధ్య ఉండే పోటీ ప్రేక్షకులకు ఓ విజువల్ ఫీస్ట్‌లా ఉంటుంది. ఈ సినిమా కోసం ప్రేక్షకులందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. యశ్ రాజ్ ఫిల్మ్స్ సక్సెస్‌ఫుల్ ఫ్రాంచైజీ స్పై యూనివర్స్‌లో భాగంగా మరో అధ్యాయంగా ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. 'పఠాన్, టైగర్ 3, వార్' వంటి గ్లోబల్ హిట్ మూవీస్ తర్వాత వస్తోన్న 'వార్ 2'పై భారీ అంచనాలున్నాయి. ఈ సినిమాని తెలుగు రాష్ట్రాల్లో రిలీజ్ చేయనుండటం హ్యాపీగా ఉంది. ఆగస్టు 14న థియేటర్స్‌లో ఈ ఉత్సవం మొదలు కానుంది. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఐమ్యాక్స్ ఫార్మాట్‌లోనూ రిలీజ్ కానుంది'' అని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ పేర్కొంది.

ఆగస్టులో ఓం శాంతి


● తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బా

'పెళ్ళిచూపులు' మూవీ ఫేమ్ డైరెక్టర్ తరుణ్ భాస్కర్ ఇప్పటికే పలు సినిమాల్లో తన నటనతో ఆకట్టుకున్నారు. తాజాగా ఆయన లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'ఓం శాంతి శాంతి శాంతిః'. ఈషా రెబ్బా కథానాయికగా నటించారు. నూతన దర్శకుడు ఏఆర్ సజీవ్ దర్శకత్వంలో సృజన్ యరబోలు, ఆదిత్య పిట్టీ, వివేక్ కృష్ణని, అనూప్ చంద్రశేఖరన్, సాధిక్ షేక్, నవీన్ సనివరపు నిర్మించారు. ఈ సినిమాని ఆగస్టు 1న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించి, కాన్సెప్ట్ వీడియోను విడుదల చేశారు. తరుణ్ భాస్కర్ వ్యాన్ యజమాని అంబటి ఓంకార్ నాయుడుగా, ఈషా రెబ్బాని కొండవీటి ప్రశాంతి అనే పల్లెటూరి అమ్మాయిగా పరిచయం చేశారు. ''గ్రామీణ నేపథ్యంలో వినోదాత్మకంగా రూపొందిన చిత్రం 'ఓం శాంతి శాంతి శాంతిః'. అంబటి, ప్రశాంతిల పెళ్లి తర్వాత ఇద్దరి మధ్య వాగ్వాదాలు, గొడవలు ఆరంభమవుతాయి. ఆ తర్వాత కథ ఎలాంటి మలుపు తిరుగుతుంది?'' అనేది మా సినిమాలో ఆసక్తిగా ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.ఈ చిత్రానికి సంగీతం: జై క్రిష్, కెమెరా: దీపక్ యెరగరా.

ప్రేక్షకులపై కాసుల వర్షం!

గీతానంద్, మిత్రా శర్మ, శ్రీహాస్, జెన్నిఫర్ ఇమాన్యుయల్, రోనిత్, అన్షుల ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'వర్జిన్ బాయ్స్'. దయానంద్ గడ్డం దర్శకత్వంలో రాజా దారపునేని నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న విడుదలవుతోంది. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో రాజా దారపునేని మాట్లాడుతూ– ''వర్జిన్ బాయ్స్' అనే టైటిల్ సినిమాకి కచ్చితంగా సరిపోతుంది. ఇప్పటికే విడుదలైన టీజర్, పాట బాగా వైరల్ అయ్యాయి. ఎన్నో సర్‌ప్రైజ్‌లతో ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నాం. ఈ సినిమా టికెట్స్ కొన్న వారిలో 11 మందిని ఎంపిక చేసి ఐఫోన్లు బహుమతిగా ఇస్తాం. అలాగే 'మనీ రైన్ ఇన్ థియేటర్స్' అనే కాన్సెప్ట్‌తో కొన్ని థియేటర్లలో కాసుల వర్షం కురిపిస్తాం... ఆ డబ్బు ప్రేక్షకులు సొంతం చేసుకోవచ్చు'' అన్నారు. దయానంద్ గడ్డం మాట్లాడుతూ– ''మేము కాలేజీ రోజుల్లో చేసిన కొన్ని ఘటనలను ఆధారంగా చేసుకుని ఈ సినిమా తీశాం. ఇటువంటి చిత్రాలు చాలా అరుదుగా వస్తాయి. స్మరణ్ సాయి సంగీతం మా మూవీకి బోనస్‌గా నిలుస్తుంది. మా అన్నయ్య గీతానంద్‌తో నాకు ఇది రెండవ చిత్రం. గీతానంద్, మిత్రా శర్మ మధ్య సన్నివేశాలు అద్భుతంగా వచ్చాయి'' అని తెలిపారు. ''ఈ సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు రోనిత్, శ్రీహాస్, గీతానంద్, మిత్రా శర్మ.


● మిత్రా శర్మ, గీతానంద్

గర్ల్ ఫ్రెండ్ ఆటా పాటా

ఓ వైపు హీరోయిన్‌గా, మరోవైపు లేడీ ఓరియంటెడ్ సినిమాలతో బిజీగా దూసుకెళుతున్నారు రష్మికా మందన్న. ఆమె ప్రధాన పాత్రలో రూపొందుతోన్న తాజా చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్'. నటుడు, దర్శకుడు రాహుల్ రవీంద్రన్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో దీక్షిత్ శెట్టి హీరోగా నటిస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్స్‌పై ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మిస్తున్నారు.

ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుందని ప్రకటించింది యూనిట్. ''అందమైన ప్రేమకథతో రాహుల్ రవీంద్రన్ అద్భుతంగా రూపొందిస్తున్న చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్'. ప్రస్తుతం హైదరాబాద్‌లో రష్మిక, దీక్షిత్ శెట్టిపై ఓ పాట చిత్రీకరిస్తున్నాం. టాకీ పార్ట్ దాదాపుగా పూర్తయింది. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం. అలాగే ఈ చిత్రంలోని పాటలను ఈ నెలలోనే రిలీజ్ చేయనున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: కృష్ణన్ వసంత్, సంగీతం: హేషమ్ అబ్దుల్ వాహబ్.


● రష్మిక

కంటెంటే హీరో - గౌతమ్ కృష్ణ


● నవీన్‌కుమార్, శ్వేత, గౌతమ్ కృష్ణ, సెవెన్ హిల్స్ సతీష్

''మా 'సోలో బాయ్' చూసిన ఒక పెద్దావిడ ఒక మంచి సినిమా చూశానని చెప్పే ఓ వీడియో చూసి చాలా సంతోషించాను. ఒక మంచి సినిమాను చూశామనే ఫీల్‌తో ప్రేక్షకులు థియేటర్స్ నుంచి బయటకు వస్తున్నారని తెలిసి ఎమోషనల్‌గా అనిపించింది. ఈ సినిమాలో కంటెంటే హీరో'' అన్నారు గౌతమ్ కృష్ణ. నవీన్ కుమార్ దర్శకత్వంలో గౌతమ్ కృష్ణ హీరోగా రమ్య పసుపులేటి, శ్వేత అవస్తి హీరోయిన్లుగా నటించిన చిత్రం 'సోలోబాయ్'. సెవెన్ హిల్స్ సతీష్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 4న విడుదలైంది. ఈ సినిమా థ్యాంక్స్ మీట్‌లో నటుడు గౌతమ్ కృష్ణ మాట్లాడుతూ– ''మా సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు'' అన్నారు. ''గౌతమ్ మంచి పెర్ఫార్మెన్స్ ఇచ్చారు'' అని తెలిపారు నవీన్‌కుమార్. ''భవిష్యత్‌లో కూడా 'సోలో బాయ్' వంటి మంచి చిత్రాలు చేస్తాను'' అన్నారు సెవెన్ హిల్స్ సతీష్.


● ప్రవీణ్, అనిల్ రావిపూడి

త్వరలో థియేటర్లకు రెస్టారెంట్

క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, కమెడియన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్న ప్రవీణ్ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'బకాసుర రెస్టారెంట్'. వైవా హర్ష టైటిల్ రోల్‌లో, కృష్ణభగవాన్, షైనింగ్ ఫణి, కేజీఎఫ్ గరుడరామ్ ఇతర ముఖ్య పాత్రల్లో నటించారు. ఎస్‌జే శివ దర్శకత్వంలో లక్ష్మయ్య ఆచారి, జనార్థన్ ఆచారి నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ చిత్రంలోని 'బకాసుర...' టైటిల్ ర్యాప్ సాంగ్‌ను దర్శకుడు అనిల్ రావిపూడి విడుదల చేశారు. వికాస బడిస స్వరాలు సమకూర్చిన ఈ పాటను ర్యాప్ సింగర్ రోల్ రైడా, వికాస బడిస ఆలపించారు. ఈ సందర్భంగా అనిల్ రావిపూడి మాట్లాడుతూ– ''ఈ పాట, సినిమా ఐడియా బాగున్నాయి. ప్రవీణ్ హీరోగా రాబోతున్న ఈ చిత్రం మంచి సక్సెస్ కావాలి. తొలి చిత్ర దర్శకుడు ఎస్‌జే శివతో పాటు అందరికీ ఈ చిత్రం మంచి పేరు తీసుకురావాలి'' అన్నారు. ''హంగర్ ఎంటర్‌టైనర్‌గా రూపొందించిన ఈ చిత్రంలోని ప్రతి సన్నివేశం ప్రేక్షకులకు వినోదం ఇవ్వడంతో పాటు థ్రిల్‌కి గురి చేసేలా ఉంటుంది'' అని దర్శకుడు ఎస్‌జే శివ తెలిపారు.

సాక్షి పెళ్ళిచూపులు

ఆదివారం 6-7-2025

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



SC మాల & క్రిస్టియన్/కట్నప్రసక్తి లేదు/ M.Tech EEE/C.Govt. డిప్యూటీ మేనేజర్ /SBI/80,000/-PM/5'8"ఎత్తు/28 సం॥ల వరుడికి వధువు కావలెను. Ph: 9676995093 [HA-16207]

ముదిరాజ్/B.Tech/C.Govt.J.E/రైల్వే/ 78000/- PM / 5'10"ఎత్తు / 28 సం॥ల వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9515942275 [HA-16207]

SC హిందూ మాల/ఏకైక కుమారుడు/ MBA / C.Govt. రిజినల్ ఆఫీసర్ / FCI/16 Lakhs.PA / 5'11" ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9908222406 [HA-16207]

SC హిందూ మాదిగ/B.Tech, VIT/C. Govt. Jr. స్టాటిస్టికల్ ఆఫీసర్/NSO/1 Lakh. PM/5'10"ఎత్తు/30 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-16207]

క్రిస్టియన్ మాల/కట్నప్రసక్తి లేదు/B.Tech, Civil/Govt. Asst. ఇంజినీర్/ఎలక్ట్రికల్ Dept/ 85000/-PM / 6'ఎత్తు /30 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9908222406 [HA-16207]

2వ పెళ్లి/కుల ప్రసక్తి లేదు/50y/Govt. ఇరిగేషన్ ఆఫీసర్ 5 లక్షలు(PM)/ సొంత ఇండ్లు/రెంట్స్ & కోట్ల ఆస్తి ఏ బాదరాబందీలేని వరుడికి వధువు కావలెను. (పిల్లలున్నా OK) ఫోన్: 8341454870 [HA-16212]

కుల పట్టింపు లేదు/Recentగా రిటైర్డ్ గవర్నమెంట్ బ్యాంక్ మేనేజర్/పెన్షనర్‌కి ఫ్యామిలీ పెన్షనర్ విడో వధువు కావలెను (LR కొరకు) వయస్సు 40-50 సం. నో బ్రోకర్స్. సంప్ర : 8985761118 [HA-16212]

★

బ్రాహ్మణ/45y, B.Com, SWE, 2nd మ్యారేజ్ వరునికి బ్రాహ్మణ 40y లోపు పిల్లలు లేని ఇంటర్ చదివి మధ్య తరగతి వధువు కావలెను. నో బ్రోకర్స్ డైరెక్ట్. 9030137017 [H-783629]

నో బ్రోకర్స్: డైవర్స్, 43, BC-D, M.A, B.Ed, ప్రైౖ॥టీచర్, 30K, పిల్లలు లేరు. ఒక షటర్ ఉన్న వరునికి పిల్లలు లేని 2వ వధువు కావలెను. NCB WGL 9392850846. [SCA25005987]

SC-Mala-Hindu/ 2nd Marriage/ PG/ 5'10"/ 40Y / SWE / 1,60,000/- PM Wants Good Hindu Bride only. Cont: 8187861989 (No Brokers) [H-821064]

★★

గవర్నమెంట్ ఉద్యోగం, సొంత ఇల్లు, 2వ పెళ్ళి, 46 సం॥ కలిగిన వెల్ సెటిల్డ్ వరునకు మంచి గుణం, సంప్రదాయం గల వధువు కావలెను. 9573428169. [B-1275578]

డైరెక్ట్/45/ ప్రభుత్వ ఉద్యోగము చేయు చున్న వరుడికి కుల, మత, వయసు, ఆస్తి ప్రసక్తి లేని వధువు పెళ్ళి కొరకు కావలెను. డైరెక్ట్–Ph: 83417 12438. [SCA25005966]

గవర్నమెంట్ ఉద్యోగి - క్రిస్టియన్ (BC-D) వయస్సు 42 సం॥, ఎత్తు 5'6", కట్నం కులం, పట్టింపులేని వరునకు మంచి గుణవంతురాలు, వయస్సు కలిగిన క్రిస్టియన్ వధువు కావలెను. విడో, సం॥ లోపు పిల్లలు ఉన్నా పర్వాలేదు. "నో బ్రోకర్స్" డైరెక్ట్ ✆ : 99632 18801 [R-7448]

వరుడు కావలెను



రెడ్డి/2nd (విడో) కుల, ఆస్తి ప్రసక్తి లేదు/32Y, Degree / బిజినెస్ గల అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం OK) అన్ని కులాలు వారికి 1వ లేదా 2వ సంబంధములు మా వద్ద కలవు. Ph: 9121516873 [H-783630]

రెడ్డి/విడో/కుల,ఆస్తి ప్రసక్తి లేదు/Age: 35/ B.Com. Own Business గల అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం ఐనా OK) అన్ని కులాల వారికి వివాహాలు చూడబడును. Ph: 7207510801 [H-783630]

కుల ప్రసక్తి లేదు/విడో/50y/Fair/ కరీంనగర్ Govt. Job Own House (Rents) పిల్లలు లేని ఏ బాదరబందీలేని అందమైన ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను. 8519803423 [H-783630]

రెడ్డి/2nd మ్యారేజ్, కుల-ఆస్తి ప్రసక్తి లేదు, 30Y, Own Business & Properties గల అందమైన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం OK) అన్ని వయస్సుల & కులాల వారికి 1st లేదా 2వ సంబంధాలు కలవు. Ph: 9069607176 [H-783630]

కాపు/48y/విడో/Govt.Job/90L PM/Medical Factory/ ఫైనాన్స్ / 30Lac Income/ 20ఎ పొలాలు/40 కోట్ల ప్రాపర్టీ ఉన్న వధువుకు ఇల్లరికం వరుడు కావలెను/పిల్లలు ఉన్నా ఓకే. 8106967428 [H-783630]

వడ్డెర/B.Tech / C.Govt. బ్యాంక్ P.O/ SBI / 55000/-PM / 5'4"ఎత్తు /25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-16207]

SC మాదిగ & క్రిస్టియన్/ B.Tech EEE / C. Govt.Asst. మేనేజర్/యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా/ 55000/-PM / 5'4"ఎత్తు /25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9676995093, 9515755529 [HA-16207]

క్రిస్టియన్ మాల/M.Com/ C.Govt. బ్యాంక్ P.O / SBI / 70,000/-PM / 5'5" ఎత్తు /25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9908222406 [HA-16207]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Contact : K.C. Reddy, Hyderabad. Ph : 9849321309 / 9347807015. Please Check my Whatsapp Status. Email: kcreddy43@gmail.com, Facebook.com / Subscribe Telegram Channel- kcreddymarriagebureau

వధువు కావలెను

Reddy/BIG-Business Hyd / B.Tech / 1982 / 5'8" / Very Handsome Person /400Cr-Need any Compatible. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015

Reddy/Very Good Business Hyd/ B.Tech / MBA-Very Handsome Boy / 1994 / 6'/ 800Cr- * Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/Very Big Business / Hyd / Very Handsome Boy / B.Tech / MS / 1998 / 6'/ 400Cr. * Cont: K.C. Reddy. Hyd. Ph: 9347807015/9849321309

Reddy/B.Tech / MS / Job-Hyd / Very Handsome Boy/1997/ 5'9"/ 5L/M/ 100Cr - Needs - Compatible. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/Good/Business/Hyd/1995/5'8" / 250Cr *94/5'11"/150Cr *91/ 5'11"/ 400 Cr *90/6'/1000Cr. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/ IIT/ B.Tech/ MS/USA/H1 /1997/ 5'6"/ 300K/ 15Cr *98/5'11"/230K/30Cr *95/5'8"/ 125K / 20Cr *96/6'/200K/10Cr.* Cont: K.C. Reddy- Hyd. Ph: 9849321309

Reddy/ IIT/ India/2000/5'11"/55L/yr/* 35L/yr/97/5'10"/30Cr *94/5'9"/1 Cr/yr/ 30Cr *94/5'11"/70L/yr/25Cr. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015

Reddy/MBBS/MD/Very Handsome Boy/ 1996/ 6'/ 50Cr *95/5'10"/200Cr *93/5'10"/ 20Cr * Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/B.Tech /MBA / Very Hand some Boy- Rich & Royal Family - Working /1994 / 6'/ 50Cr. * Cont: K.C.Reddy-Hyd. Ph: 9849321309

Reddy/Catholic/Rich & Royal Family/ Divorcee/B.Tech/MBA-SWE-Hyd-Very Handsome Boy-1987 / 5'11"/ * Cont: K.C. Reddy -Hyd. Ph: 9347807015

వరుడు కావలెను

Reddy/Rich & Royal Family/ B.Tech (CBIT)/MERIT/MS/USA/Most Beautiful / 2000 / 5'2"/ 6Cr. * Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015

Reddy/ MBBS / MS (Ent) Most Beautiful / 1999/5'7"/5Cr * MD (Gen-Med) 1998 / 5'5"/ 50Cr. * Cont: K.C. Reddy-Hyd-Ph: 9849321309/ 9347807015

Reddy/ Divorcee / B.Tech/MS/USA/ Green Card / 1991 / 5'2"/ 20Cr/140K/ Needs-USA or India-Alliance. * Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015

Reddy / B.Arc / Most Beautiful/ 1998 / 5'8"/25Cr - Needs any Well Settled-Hyd. * Cont: K.C. Reddy-Hyd-Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/Own Business/ 1995/ 5'5"/ 50L/M Income / 50Cr-Prop- Needs -any Well Settled * Cont: K.C.Reddy-Hyd-Ph: 9347807015

Reddy/Aus- Citizen/B.Tech/MS/Most Beautiful / Rich/1994/5'4"/150K/20Cr- Needs- USA or Aus. * Cont: K.C. Reddy -Hyd-Ph: 9849321309

Reddy/B.Tech/OU-Campous/ MBA (IIM) Most Beautiful/ 1997/5'4"/ 25L/yr/ 6Cr. * Cont: K.C. Reddy-Hyd-Ph: 9849321309/9347807015

Reddy/ B.Tech / MS / USA/Most Beautiful/1997/5'4"/100Cr-Needs- USA or India-alliances. * Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015

Reddy/USA- Citizen / 1989/ 5'4"/ Most Beautiful / Rich Family- Needs any Well Settled. * Cont: K.C. Reddy - Hyd-Ph:9347807015

Reddy/ B.Tech / MS / USA / Most Beautiful /1998/5'4"/10Cr *B.S-USA Citizen/1999/5'5"/100Cr. * Cont: K.C. Reddy -Hyd-Ph: 9849321309

[D-575]

క్రిస్టియన్ మాదిగ/M.Tech, NIT/C.Govt. డిప్యూటీ మేనేజర్/రైల్వే/60,000/-PM/ 5'4"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [HA-16207]

క్రిస్టియన్ మాల/25/5'4"/ B.Tech/ C.Govt. బ్యాంక్ PO/SBI/45000/-PM/ అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 9963150162 [HA-16212]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

D.V.Koti Reddy, 690,Road No:3,Banjara Hills (TV- 9, Opp: Colony)(Near The Leela Hotel) Hyd. (Tuesday & Wednesday Holiday) Timings: 10 AM - 5PM. www.avinashreddy.com + 91 9848011818/ + 91 9393311818

వధువు కావలెను

రెడ్డి Business, BS, MBA, 30, 5' 7", Very Rich Family, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 6', AI, 140 K, 10 Crores, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Govt Officer, BE, 28, 5' 11", Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి Citizen, BS, MS, 28, 5' 7", 120 K, Rich Family, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 26, 5' 4", Developer, 22 L P/A, 10 Crores, Hyderabad, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5' 6", SWE, 100 K, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి BE, MS, 30, 6' 1", Data Engineer, 200 K, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 32, 6' 1", SWE, 180 K, 10 Crores, H1, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 27, 5' 11", Rich Family, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 32, 5' 11", Manager, 36 L P/A, Hyd, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 29, 5' 4", 28 L P/A, 10 Crores, Hyd, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5' 7", SWE, 101 K, 8 Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MS, 29, 5' 4", 20 Crores, Hyd, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBA, 26, 5' 4", 12 L P/A, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

కుల పట్టింపు లేదు/21y&22y&24y& 25y & 26y&27y&28y&29y&30y&31y&33y&34y&36y&37 y&39y&40y&41y& 42y&43y&45y&47y&48y&49y &50y/"మా సేవ" (Since 1998) PH: 9291503949 [HA-16212]

వైశ్య/50y / విడో / సెంట్రల్ గవర్నమెంట్ జాబ్ /టూ వీలర్ షో రూం/26 Lac Income/ ఫైనాన్స్ బిజినెస్/సొంత విల్లా/99 Acres Land గల వధువుకి వరుడు కావలెను. 8522098546 [H-783547]

నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో (Since 25 Years)

నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో గత 25 సంవత్సరాలుగా అన్ని ప్రాంతాలవారికి కేవలం రెడ్డి సంబంధాలు మాత్రమే చూస్తూ 4 బ్రాంచీలు కలిగి ఉన్నటువంటి ఏకైక అగ్రగామి సంస్థ మీ నవీన్‌రెడ్డి మ్యారేజ్ బ్యూరో Timings 10.30 AM to 6.30 PM

వధువు కావలెను

రెడ్డి / 1999 / 5'11"/ MBBS / MD Pediatrics 2nd year / 50Cr. Property. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 8885559579 / 9848221166

రెడ్డి / Elite : 1997 / 5'8"/ B.Tech (IIT) /Business Own Company CEO. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys Ph : 9505551788 / 9848221166

రెడ్డి / 1992/ 5'7"/ B.Tech/ MS/ Business Hyd 200Cr Property. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 7893333726 / 9848221166

రెడ్డి / 1995 / 6'2" / LLB / LLM / MMF USA Rich Family. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 8885559579 / 9848221166

రెడ్డి / Elite : 1998 /5'8" / B.Tech / MS / USA/ Business / Rental Income 8 L PM. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 9505551788 / 9848221166

రెడ్డి / Elite: 1997 / 5'11"/ MBBS / MS / General Surgery Final year. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 7893333726 / 9848221166

రెడ్డి / Elite : 1997 / 5'11" / B.Tech/ MS/ USA/100K PA/ Rental Income 6L PM. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 8885559579 / 9848221166

రెడ్డి / Elite : 1993 / 5'5"/ B.Tech / MS/ USA / 200K PA. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 9505551788 / 9848221166

రెడ్డి / 1995 / 5'11" / B.Tech / MS / 100K PA/ Full Time Job / Australia PR. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 7893333726 / 9848221166

రెడ్డి /1995 / 5'11"/ B.Tech / MS / Australia PR Holder 60L PA. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 8885559579 / 9848221166

వరుడు కావలెను

రెడ్డి / Elite: 1999 / 5'4" / B.Tech / MS/ USA/H1B/200K PA. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 8885559579 / 9848221166

రెడ్డి / 1991 / 5'6" / B.Tech / MS / 200K / Microsoft/H1B-I-140. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys Ph : 9505551788 / 9848221166

రెడ్డి / Elite: 2000 / 5'5" / M.Sc / Very Fair. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 7893333726 / 9848221166

రెడ్డి / 1998 / 5'4"/ B.Tech / MS / SWE /28L PA/Hyderabad. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 8885559579 / 9848221166

రెడ్డి / 1996/ 5'4"/ MBBS / MS / Gynecologist/ Rental Income 24L PA/24 L PA Salary. Very Rich. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 9505551788 / 9848221166

రెడ్డి / Elite: 1995 / 5'5" / BBA / MBA/ Very Fair/Genpact Hyd. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 7893333726 / 9848221166

రెడ్డి / 1995 / 5'7"/ MBBS / MS / General Surgery / 18L PA / Fair & Rich సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 8885559579 / 9848221166

రెడ్డి / 1998 / 5'8" / B.Tech / SWE Hyd/ Very Fair/50Cr Property. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 9505551788 / 9848221166

రెడ్డి / 1994 /5'2" / B.Tech / TCS / 12L PA / Very Fiar. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 7893333726 / 9848221166

రెడ్డి / 1992 / 5'4" / MBBS / MD / Radiology / Salary 60L PA/Rental Income 18L PA/ 50Cr Property. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో. Only for Reddys. Ph : 8885559579 / 9848221166

LETTER

కమ్మ/50y/విడో / Govt. Job / Mobile Showroom/Bar&Restaurant/150 Acres Land/కోట్ల ప్రాపర్టీ గల వధువుకు కుల ప్రసక్తిలేని వరుడు కావలెను. 9100808546 [H-783547]

రెడ్డి/విడో/50Y/ ప్రావర్ Nellor / Hyd lo సొంత అపార్ట్ మెంట్స్/సొంత shops/రెంట్స్ మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను (అర్జెంట్) (నో బ్రోకర్స్) (ఇల్లరికం OK) ఫోన్ : 7799083500, 7386680643 [H-783547]

కమ్మ/విడో/Govt. Rtd / రైల్వే పెన్షనర్/48/ సొంత అపార్ట్‌మెంట్స్/28 ఎకరాల పొలం గ్రానైట్ బిజినెస్/4L/-PM కలిగిన వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తి లేదు. 7732054195 [H-783547]

యాదవ/ఎర్రగొల్ల / అప్పర్ మిడిల్ క్లాస్ / 37Y/ 5'4"ఎత్తు/M.ఫార్మసీ వధువుకి Hydలో జాబ్ కలిగిన లక్ష రూ॥ PM ఆపై ఆదాయం కలిగిన యాదవ వరుడు మాత్రమే కావలెను. డైరెక్ట్ Father నెంబర్ : 9989597799 [H-783625]

Reddy/Divorcee / Most Beautiful/ Govt - Doctor-Hyd / Very-Rich- Family / MBBS/ MD/DM/ 1986/ 5'4"/ Needs any Well Settled. Cont. Sunder Reddy. Ph: 9515790337 [HA-16044]

వేదికలు



రెడ్డి & BC, ఇతర అన్ని కులాలకు సంవత్సరాల నుండి సంబంధాలు చూస్తున్నాం. కాబట్టి మీకు కావాలనుకుంటే మంచి సంబంధాలు కొరకు సంప్ర: Ph: 9502732389 [HA-16207]

శ్రీ రాజ రాజేశ్వరి మ్యారేజ్ బ్యూరో ఓన్లీ గౌడ్స్ కులాల వారికి 1వ, 2వ లేట్, విడో సంబంధాలు చూడబడును. సంప్రదించండి : 9959333807/6302346361 [HA-16212]

శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM/ Est : 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st/ 2nd లేట్/విడో సంబంధాలకై సం॥ S.రాములు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకురాలు: స్వర్గీయ S.శారదాగౌడ్, Ph: 8790690909 [H-783547]

శ్రీరామ–అన్ని కులములకు, సాఫ్ట్‌వేర్స్, డాక్టర్స్, VIP, అబ్రాడ్, 1st, 2nd వారికి పెళ్లి సంబంధాలు వ్యక్తిగత శ్రద్ధతో చూడబడును. పూర్ణ మ్యాట్రిమోని, తిరుపతి, ✆ 70937 22724. [T-3274]

వాసవి విజయవాడ వారి ఆధ్వర్యంలో 13.07.2025వ తేదీ ఉ॥ 10 గం॥లకు 67వ ఆర్య వైశ్య వధూవరుల ఉచిత వివాహ పరిచయ వేదిక మరియు మ॥ 2 గం॥లకు 22వ పునర్వివాహ పరిచయ వేదిక విజయవాడ KBN కాలేజీలో జరుగును. ✆ 99895 00130, 81064 54284 [B-333]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt. Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి. 9704656103, 9533608887 (Whatsapp) [HA-1549]



రైతులకు అందుబాటులో ఏఐ టెక్నాలజీ

మంత్రి తుమ్మలతో సమావేశమైన కృషివాస్ సంస్థ



సాక్షి, హైదరాబాద్: ఏఐ టెక్నాలజీతో శాటిలైట్ ఇమేజింగ్ ద్వారా ముందస్తుగానే పంటలకు వచ్చే చీడపీడలను నివారించడం, రసం పీల్చే పురుగులను గుర్తించి నాశనం చేయడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభిప్రాయపడ్డారు. ఈ టెక్నాలజీని రూపొందించిన కృషివాస్ ప్రతినిధులు శనివారం మంత్రితో సమావేశమయ్యారు. పొలంలో ఎక్కడ ఏ మొక్కకు తెగులు సోకిందో ముందే గుర్తించి, దానికి పిచికారీ చేయాల్సిన మందును కూడా యాప్ చెబుతుందని సంస్థ ప్రతినిధులు మంత్రికి వివరించారు. పొలం వద్దకు వెళ్లకుండానే యాప్ ద్వారా పంట స్థితిగతులను తెలుసుకోవచ్చని చెప్పారు. పంట ఎన్ని ఎకరాల్లో వేశారు అన్న డేటా కూడా రియల్ టైంలో అధికారులకు లభిస్తుందన్నారు. తెగుళ్లను ముందే గుర్తించి, నివారణ దిశగా చర్యలు తీసుకోవడం వల్ల రైతులు మిగతా పొలానికి తెగులు ఏర్పడకుండా నివారించవచ్చని తెలిపారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఇలాంటి యాప్‌లు వినియోగించడం వల్ల రైతుల విలువైన సమయం ఆదా అవడంతో పాటు, రైతులు తమ పంటలకు కచ్చితమైన నివారణ చర్యలు తీసుకునే వీలు కలుగుతుందన్నారు. యాప్ ద్వారా పత్తి, మొక్క జొన్న, వరి, మిరప, కూరగాయలు, ఆయిల్‌పామ్ వంటి 60కి పైగా పంటలను పరీక్షించే అవకాశం ఉందని తెలిపారు.

అమ్మకానికి స్వగృహ ఫ్లాట్లు, టవర్లు

పోచారం, బండ్లగూడ, గాజులరామారం ఇళ్లు లాటరీలో విక్రయానికి నోటిఫికేషన్ జారీ



సాక్షి, హైదరాబాద్: గతంలో నిర్మించి అమ్ముడుకాకుండా మిగిలిపోయిన ఫ్లాట్లను రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ మరోసారి వేలంలో ఉంచింది. సాధారణ ఫ్లాట్లతోపాటు, అసంపూర్తిగా ఉండిపోయిన ఫ్లాట్లతో కూడిన టవర్లను ఉన్నవి ఉన్నట్టుగా అమ్మకానికి ఉంచింది. గాజులరామారంలో 14 అంతస్తులతో ఉన్న రెండు టవర్లు, పోచారంలో 9 అంతస్తులతో ఉన్న రెండు టవర్లు, బండ్లగూడలో వివిధ కేటగిరీలకు చెందిన 159 ఫ్లాట్లు, పోచారంలో 607 ఫ్లాట్లను లాటరీ ద్వారా విక్రయించనుంది.

పోచారంలో టవర్లు ఇలా....

- పోచారంలో 1,470–1,606 చదరపు అడుగుల విస్తీర్ణంతో కూడిన 122 ఫ్లాట్లున్న 3,287 చదరపు గజాల విస్తీర్ణంలో నిర్మించిన 9 అంతస్తుల టవర్‌ను రూ.30 కోట్ల ధరకు (ధరావతు రూ.2 కోట్లు) విక్రయించనుంది.
- 1,125–1,261 చ.అ. విస్తీర్ణంతో కూడిన 72 ఫ్లాట్లున్న 1,396 చ.గ. విస్తీర్ణంలో నిర్మించిన మరో టవర్‌ను రూ.13.78 కోట్లకు (ధరావతు రూ.కోటి) అమ్మకానికి ఉంచింది.
- 1,150–1,232 చ.అ. విస్తీర్ణంతో వివిధ కేటగిరీలతో కూడిన 112 ఫ్లాట్లున్న 6,720 చ.గ. విస్తీర్ణంలో నిర్మించిన టవర్‌ను రూ.26.33 కోట్లకు (ధరావతు రూ.2 కోట్లు), 1,150–1,232 చ.అ. విస్తీర్ణం, వివిధ కేటగిరీలతో కూడిన 112 ఫ్లాట్లున్న 6847 చ.గ. విస్తీర్ణంలో నిర్మించిన మరో టవర్‌ను రూ.26.33 కోట్లకు (ధరావతు రూ.2 కోట్లు) విక్రయించనుంది. గాజులరామారం, పోచారం టవర్లకు ఆగస్టు 19లోపు ధరావతు చెల్లించాల్సి ఉంటుంది. ఆగస్టు 20న హిమాయత్‌నగర్‌లోని గృహనిర్మాణ సంస్థ కార్యాలయంలో లాటరీ నిర్వహిస్తారు.

బండ్లగూడలో ఫ్లాట్లు ఇలా...

బండ్లగూడలోని సహభావన టౌన్‌షిప్‌లో 1,487, 1,617 చ.అ. విస్తీర్ణంలో ఉన్న 3 బీహెచ్‌కే డీలక్స్ ఫ్లాట్లు రూ.49 లక్షల కనీస ధరకు అమ్మబోతోంది.

- 1,141, 1,266 చ.అ. విస్తీర్ణంలోని 3 బీహెచ్‌కే ఫ్లాట్లను రూ.38 లక్షల కనీస ధరకు, 798 చ.అ. విస్తీర్ణంలోని 2 బీహెచ్‌కే కనీస ధర రూ.22 లక్షలు, 545 చ.అ. విస్తీర్ణంలోని 1 బీహెచ్‌కే కనీస ధర రూ.15 లక్షలు, 645 చ.అ. విస్తీర్ణంలోని సీనియర్ సిటిజన్ ఫ్లాట్ కనీస ధర రూ.18 లక్షలుగా నిర్ధారించారు. బండ్లగూడ ఫ్లాట్లకు ధరావతును జూలై 29లోపు చెల్లించాల్సి ఉంటుంది. లాటరీ 30న ఉంటుంది.

పోచారంలో ఫ్లాట్లు ఇలా...

- పోచారంలో1,400–1,600 చ.అ. 3 బీహెచ్‌కే డీలక్స్ ఫ్లాట్ల కనీసం ధర రూ.34 లక్షలు, 1,150–1,250 చ.అ. 3 బీహెచ్‌కే ఫ్లాట్లకు కనీస ధర రూ.27 లక్షలు, 761 చ.అ. 2 బీహెచ్‌కే ఫ్లాట్ల కనీస ధర రూ.19 లక్షలు, 523 చ.అ. 1బీహెచ్‌కే ఫ్లాట్ల కనీస ధర రూ.13 లక్షలుగా నిర్ధారించారు. పోచారం ఫ్లాట్లకు జూలై 31లోపు ధరావతు చెల్లించాల్సి ఉంటుంది. లాటరీ ఆగస్టు 1న ఉంటుంది.

కేపీహెచ్‌బీ–హైటెక్‌సిటీ కారిడార్‌లో అమ్మకానికి 7.3 ఎకరాల భూమి

భారీ ఆకాశహర్మ్య నిర్మాణానికి అనువైన ఏడెకరాల భూమిని తెలంగాణ గృహనిర్మాణ మండలి అమ్మకానికి ఉంచింది. గతంలో కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు కాలనీకి భూములు కేటాయించగా మిగిలిన ఏడెకరాల భూమిని గృహనిర్మాణ మండలి అలాగే కాపాడుకుంటూ వచ్చింది. ఆ ప్రాంతంలో భారీ ఆకాశహర్మ్యాలు వెలుస్తున్న తరుణంలో, అలాంటి ప్రాజెక్టు చేపట్టే సంస్థకు భూమిని వీలైనంత ఎక్కువ ధరకు కట్టబెట్టాలని బోర్డు నిర్ణయించింది. ఈ మేరకు దాన్ని వేలంలో ఉంచుతూ శనివారం నోటిఫికేషన్ జారీ చేసింది. దీని విక్రయం ద్వారా దాదాపు రూ.650 కోట్ల వరకు సమకూరుతుందని గృహనిర్మాణ మండలి అంచనా వేస్తోంది. ఇక్కడ గజం ధర రూ.1.75 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు పలుకుతోంది. ఇలాంటి కీలక ప్రాంతంలో ఉన్న ఈ 7.3 ఎకరాల భూమి కోసం బడా సంస్థలు బిడ్లు దాఖలు చేసే వీలుంది.

- కేపీహెచ్‌బీలో 4,598, 2,420 చదరపు గజాల రెండు కమర్షియల్ ప్లాట్లు, నాంపల్లిలో 1,148.30 చదరపు గజాల ప్లాట్‌ను కూడా వేలంలో ఉంచింది. వీటికి ఈ నెల 30న వేలం జరగనుంది. పూర్తి వివరాలను తెలంగాణ గృహనిర్మాణ మండలి(హౌసింగ్‌బోర్డు) వెబ్‌సైట్‌లో పొందుపరిచింది.

యాదగిరి క్షేత్రంలో గిరిప్రదక్షిణ



యాదగిరికొండ చుట్టూ గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని శనివారం భక్తులు, ఆలయాధికారులు, స్థానికులు గిరి ప్రదక్షిణ చేపట్టారు. ఉదయం 5 గంటలకు కొండ కిందగల వైకుంఠద్వారం వద్ద ప్రత్యేక పూజలు చేసి గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. ఆలయ ముఖ మండపంలో స్వాతి హోమాన్ని నిర్వహించి, పంచామృతాలు, శుద్ధ జలాలు, పుష్పాలు, సుగంధ ద్రవ్యాలతో నింపిన బంగారు, వెండి కలశాలకు ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్టాలంకార మూర్తులకు అష్టోతర శతఘటాభిషేకం చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో నిత్య పూజలు విశేషంగా కొనసాగాయి.

హిందువులారా ఏకం కండి: బండి సంజయ్



రథం లాగుతున్న బండి సంజయ్

కరీంనగర్ కల్చరల్: హిందువులంతా ఏకమై ఓటుబ్యాంకుగా మారాల్సిన అవసరం ఉందని కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. పెహల్గాం ఘటన తరువాత హిందువుల ఆలోచనలో మార్పు వచ్చిందన్నారు. కరీంనగర్‌లో శనివారం నిర్వహించిన జగన్నాథ రథయాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కరీంనగర్‌లో జగన్నాథ ఆలయాన్ని నిర్మించాలని నిర్ణయించామన్నారు. ఆయన వెంట మాజీ మేయర్ సునీల్‌రావు, గుగ్గిళ్లపు రమేశ్, నిజామాబాద్ జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఉన్నారు.

కృష్ణమ్మ దూకుడు

▶ మొదటి పేజీ తరువాయి

కొనసాగుతోంది. ఆల్మట్టి డ్యామ్‌లోకి 1.02 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. గరిష్ట నిల్వ సామర్థ్యం 129.72 టీఎంసీలకు గానూ 91 టీఎంసీలను నిల్వ చేస్తూ విద్యుత్ ఉత్పత్తి, గేట్ల ద్వారా లక్ష క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. నారాయణపూర్ డ్యామ్‌లోకి 99.9 వేల క్యూసెక్కులు చేరుతుండగా.. గరిష్ఠ నిల్వ సామర్థ్యం 37.64కు గానూ 30.85 టీఎంసీలను నిల్వ చేస్తూ వచ్చిన వరదను వచ్చినట్టు విద్యుత్ ఉత్పత్తి, గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. దానికి దిగువన తెలంగాణలో ఉన్న జూరాల ప్రాజెక్టులోకి 1.2 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. గరిష్ఠ నిల్వ సామర్థ్యం 9.66 టీఎంసీలకు గానూ 7.44 టీఎంసీలను నిల్వ చేస్తూ 1.24 లక్షల క్యూసెక్కులను గేట్లు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా దిగువకు వదులుతున్నారు.

తగ్గని తుంగభద్ర జోరు

మరోవైపు కృష్ణా ప్రధాన ఉపనది తుంగభద్రలో వరద ఉధృతి కొనసాగుతోంది. తుంగభద్ర డ్యామ్‌లోకి 72 వేల క్యూసెక్కుల నీరు చేరుతుండగా 65 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలేస్తున్నారు. జూరాల, తుంగభద్ర నుంచి విడుదల చేస్తున్న వరద శ్రీశైలం ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుండడంతో జలాశయం వేగంగా నిండుతోంది. ఇక్కడ విద్యుదుత్పత్తి ద్వారా నీళ్ల విడుదల చేస్తుండడంతో దిగువన ఉన్న నాగార్జునసాగర్‌లోనూ క్రమంగా నిల్వలు పెరుగుతున్నాయి. సాగర్‌కి 56.6 వేల క్యూసెక్కులు వస్తుండగా, నీటిమట్టం 524.1 అడుగులకు చేరింది. ప్రస్తుతం నిల్వలు 156.86 టీఎంసీలకు చేరాయి.

వచ్చే వారం గోదావరికి వరద!

మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలో వచ్చే వారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించింది. ప్రస్తుతం గోదావరి, ప్రాణహిత నదుల్లో ఇంకా వరదలు ప్రారంభం కాలేదు. అయితే ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లో కురుస్తున్న వర్షాలతో ఇంద్రావతి, శబరి ఉప నదుల్లో వరద ఉధృతి క్రమంగా పెరుగుతోంది. దీంతో తుపాకుల గూడెం (సమ్మక్క సాగర్) బరాజ్‌లోకి 11,13,750 క్యూసెక్కులు చేరుతుండగా అంతే స్థాయిలో దిగువకు విడుదల చేస్తున్నారు. సీతమ్మసాగర్ (దుమ్ముగూడెం బరాజ్)లోకి చేరుతున్న 1,65,714 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు.

శనివారం సాయంత్రం 6 గంటలకు కృష్ణా ప్రధాన ప్రాజెక్టుల్లోకి వరద ప్రవాహాలు, నీటి నిల్వ ఇలా..

ప్రాజెక్టు	గరిష్ఠ మట్టం (అడుగుల్లో)	గరిష్ఠ నిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత మట్టం (అడుగుల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)
ఆల్మట్టి	1705	129.72	1697	91.08	102140	100670
నారాయణపూర్	1615	37.64	1609	30.85	99,933	99,933
ఉజ్జయిని	1630	117.64	1626.77	105.98	13493	3321
జూరాల	1045	9.66	1041.3	7.44	120000	120000
తుంగభద్ర	1633	105.79	1625	76.51	72,931	65,098
శ్రీశైలం	885	215.81	877.4	175.1	1,95,894	67,019
నాగార్జునసాగర్	590	312.05	524.1	156.86	56,607	4385
పులిచింతల	175	45.77	155.2	20.36	0	5000



సాగునీటి సరఫరాపై 11న సమావేశం

ఈ నెల 11న రాష్ట్ర నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలోని రాష్ట్ర స్థాయి నీటి ప్రణాళిక, నిర్వహణ కమిటీ (స్కివం) సమావేశం కానుంది. కృష్ణా, గోదావరి పరీవాహకంలోని రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టుల కింద ఆయకట్టుకు నీటి సరఫరా అంశంపై చర్చించి నిర్ణయం తీసుకోనుంది.

ధర్మయుద్ధం ప్రారంభిస్తున్నాం

▶ మొదటి పేజీ తరువాయి

అప్పుల కుప్పలా మార్చింది. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిన్నరలోనే రాష్ట్రం పరువును బజారుకీడ్చింది. అప్పులపాలైందంటూ ప్రపంచమంతటా ప్రచారం చేస్తోంది. హామీలు అమలు చేయాలని అడిగితే ఆర్థిక పరిస్థితి బాగోలేదంటూ ప్రజలను మోసగిస్తోంది. ఆర్థిక పరిస్థితి బాగోలేదని తెలిసినప్పుడు హామీలు ఎందుకివ్వాలి? కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తెలంగాణకు అన్నివిధాలా సాయం అందిస్తోంది. 11 ఏళ్లలో రూ. 12 లక్షల కోట్లు రాష్ట్రానికి ఇచ్చింది. దీనిపై బహిరంగ చర్చకు సిద్ధం' అని రాంచందర్‌రావు చెప్పారు.

యూరియా కొరత పట్టదా?

కాంగ్రెస్ పార్టీ ఎల్బీ స్టేడియంలో సామాజిక న్యాయ సదస్సు అంటూ బహిరంగ సభ పెట్టి ప్రధాని మోదీ, బీజేపీని తిట్టడాన్ని రాంచందర్‌రావు తప్పుబట్టారు. సామాజిక న్యాయమంటే మోదీని, బీజేపీని తిట్టడం కాదన్నారు. రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రంగా ఉందని.. కేంద్రం దాదాపు 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా పంపినా రాష్ట్ర ప్రభుత్వ అసమర్థత వల్ల, అధికార యంత్రాంగం చేతులెత్తేయడం వల్ల రైతులకు యూరియా అందడంలేదని విమర్శించారు.

ఏఐసీసీ అంటే ఆలిండియా చీటింగ్ కమిటీ

బీజేపీ ప్రజల కోసం పనిచేసే పార్టీ అని, కాంగ్రెస్ అధికారం కోసం, అవినీతి కోసం పనిచేసే పార్టీ అని రాంచందర్‌రావు ఆరోపించారు. ఏఐసీసీ అంటే ఆల్ ఇండియా చీటింగ్ కమిటీ అని ప్రజలు మాట్లాడుకుంటున్నారని చెప్పారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోపే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుందని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలను చూసిన ప్రజలు... ఈసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలని నిర్ణయించుకున్నారని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగడుతూ ధర్మ యుద్ధం చేసి ప్రభుత్వం మెడలు వంచుతామని ఆయన వ్యాఖ్యానించారు.

సీఎంకు బహిరంగ లేఖ..

ఎన్నికల హామీలను కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయిలో అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి శనివారం బహిరంగ లేఖ రాసి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విడుదల చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి గ్యారెంటీని అమలు చేయాలని.. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు.

క్లుప్తంగా...

అమరావతిలో మరో 20,494 ఎకరాల భూసమీకరణకు గ్రీన్ సిగ్నల్

సాక్షి, అమరావతి: ఏపీ రాజధాని అమరావతి పరిధిలో మరో 20,494 ఎకరాల భూసమీకరణకు సీఆర్‌డీఏ అథారిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పల్నాడు జిల్లా అమరావతి మండలంలోని వైకుంఠపురం, పెదమద్దూరు, యండ్రాయి, కార్లపూడి, గుంటూరు జిల్లా తుళ్లూరు మండలంలోని వడ్డమాను, హరిశ్చంద్రపురం, పెదపరిమి గ్రామాల్లో భూసమీకరణకు ఆమోదం తెలిపింది. శనివారం ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన సీఆర్‌డీఏ అథారిటీ 50వ సమావేశం జరిగింది. 7 అంశాలను సీఆర్‌డీఏ అథారిటీ ఆమోదించింది. మందడం, రాయపూడి, పిచుకలపాలెంలలో ఫైనాన్స్, స్పోర్ట్స్ సిటీల్లోని దాదాపు 58 ఎకరాల్లో హైడెన్సిటీ రెసిడెన్షియల్ జోన్, మిశ్రమ అభివృద్ధి ప్రాజెక్టుల నిర్మాణానికి ఆర్‌ఎఫ్‌పీ(ఆసక్తి వ్యక్తీకరణ ప్రతిపాదన)ను ఆహ్వానించేందుకు అనుమతి ఇచ్చింది. రాజధానిలో నిర్మించే ఫైవ్ స్టార్ హోటళ్లకు సమీపంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కన్వెన్షన్ సెంటర్లు నిర్మించే ప్రతిపాదనలను అథారిటీ ఆమోదించింది. మందడంలో వివాంతా, హిల్టన్ హోటల్స్, తుళ్లూరులో హయత్ రీజెన్సీ, లింగాయపాలెం నోవోటెల్ సమీపంలో ఈ కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణానికి 2.5 ఎకరాల చొప్పున కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది.

భూములివ్వం.. గోబ్యాక్.. గోబ్యాక్

ఏపీ రాజధాని భూ సమీకరణ సభలలో ఎమ్మెల్యే, అధికారులను తరిమికొట్టిన పొన్నెకల్లు రైతులు

తాడికొండ: 'గోబ్యాక్ గోబ్యాక్.. మా భూములిచ్చేది లేదు.. గోబ్యాక్ గోబ్యాక్'.. అంటూ ఏపీ రాజధాని భూసమీకరణ గ్రామసభలలో రైతులు పార్టీలకు అతీతంగా శనివారం కూడా పెద్దఎత్తున నిరసన గళం వినిపించారు. సభ జరిగిన ప్రతీచోటా స్థానిక టీడీపీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, అధికారులను ఉక్కిరిబిక్కిరి చేశారు. ప్రశ్నలతో హోరెత్తించారు. భూములిచ్చేందుకూ ఎవరూ సిద్ధంగా లేరని తెగేసి చెప్పారు. లక్షల ఎకరాలు తీసుకుని ఏం చేస్తారంటూ వారిపై విరుచుకుపడ్డారు. రాజధాని భూసమీకరణ సమాయత్త సభలలో భాగంగా గుంటూరు జిల్లా తాడికొండ మండలం గరికపాడులో గ్రామసభ నిర్వహించిన అనంతరం తాడికొండ విచ్చేసిన ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, అధికారులు సభ మొదలు పెట్టేందుకు మైకు అందుకోగానే రైతులు వారిని అడుగడుగునా అడ్డుకుంటూ నినాదాలతో హోరెత్తించారు. భూసమీకరణ పేరుతో రైతుల పొట్టగొట్టేందుకు టీడీపీ కూటమి ప్రభుత్వం యత్నిస్తోందని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 'అసలు మా ప్రాణ సమానమైన భూములు ఎందుకివ్వాలి'.. అని పలువురు సూటిగా ప్రశ్నించారు. గతంలో 33 వేల ఎకరాలు ఇచ్చిన రైతులకు న్యాయం చేయలేదుగానీ.. ఇప్పుడు ప్రైవేటు కంపెనీలకు మా భూములు ధారాదత్తం చేసి మమ్మల్ని రోడ్డున పడేసేందుకు వచ్చారా.. భూములు ఇవ్వమంటే ఇవ్వమని రైతులు తెగేసి చెప్పారు. పొన్నెకల్లు సభలోనూ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, ఆర్డీఓ శ్రీనివాసరావు తదితర అధికారులను రైతులు తరిమికొట్టి సభ జరగకుండా అడ్డుకున్నారు.

రిమాండ్లకీ రూల్సున్నాయ్!

ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు..

మేజిస్ట్రేట్‌లకు ఏపీ హైకోర్టు సంచలన ఆదేశాలు


- శాఖాపరమైన విచారణలతో పాటు కోర్టు ధిక్కార చర్యలు చేపడతాం.. స్పష్టమైన మార్గదర్శకాలతో సర్క్యులర్ జారీ
- సుప్రీం ఆదేశాలను తప్పక పాటించాలి.. ఉల్లంఘిస్తే తీవ్ర పర్యవసానాలు తప్పవ్
- సోషల్ మీడియా కేసుల్లో కూడా యాంత్రికంగా వ్యవహరించొద్దు
- ఏడేళ్ల కన్నా తక్కువ శిక్షపడే నేరాల్లో ఎలాపడితే అలా రిమాండ్ ఇవ్వడానికి వీల్లేదు
- సోషల్ మీడియా పోస్టుల కేసుల్లో రిమాండ్‌పై స్పష్టమైన ఆదేశాలు
- రిమాండ్ విధించేటప్పుడు మార్గదర్శకాలు పాటించాలి
- పోలీసులు చట్టాన్ని పాటించారా? లేదా? చూడాలి
- చాలా కేసుల్లో సుప్రీం నిర్దేశించిన సూత్రాలను పాటించకుండా రిమాండ్ విధిస్తున్నారు
- ఇది అనవసరమైన అరెస్టులు, శిక్షా నిబంధనల దుర్వినియోగానికి దారితీస్తోంది

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

మా కాలంలో ఇలా లేదమ్మా..

మీ పిల్లలు ఫోన్లలో లేదా రీల్స్‌లో మునిగిపోయినప్పుడు.. ఈ స్మార్ట్ ఫోన్ అన్నదే లేకుంటే బాగుణ్ను.. వీళ్లు బాగుపడేవాళ్లు అని అనుకున్నారా? లేదా మా కాలంలో ఇలాంటి అడిక్షన్లు ఉండేవి కావు.. చక్కగా బయట ఆడుకునేవాళ్లం అని క్లాసులు పీకారా?

● అలాగే మీ పిల్లలు ఎదిగే క్రమంలో సోషల్ మీడియా కావొచ్చు.. వీడియో గేమ్స్ కావచ్చు.. ఇవన్నీ వాళ్ల భవిష్యత్తుకు ప్రతిబంధకాలు అని అనుకుంటున్నారా? చాలామంది అనుకునే ఉంటారు.. మనమే కాదు.. అమెరికాలోనూ ఇదే పరిస్థితి.. ఇటీవల అమెరికాలో ఓ సర్వే జరిగింది. అందులో 18 ఏళ్ల కన్నా తక్కువ వయసున్న పిల్లలు కలిగిన తల్లిదండ్రులు పాల్గొన్నారు. మీ పిల్లల ఎదుగుదల లేదా భవిష్యత్తును దృష్టిలో పెట్టుకున్నప్పుడు.. వీటిని కనిపెట్టకుండా ఉంటే బాగుణ్ను అని వేటి గురించి అనుకున్నారు అని ప్రశ్నించారు. ఎక్కువ మంది ఆన్‌లైన్లోని అడల్ట్ కంటెంట్ గురించి ఆందోళన వ్యక్తం చేశారు. ఇంతకీ వారేమన్నారంటే..



ప్రత్యేకంగా ఒక్కొక్కటిగా ప్రశ్నించినప్పుడు టిక్‌టాక్ కనిపెట్టకుండా ఉంటే బాగుణ్ను అని సర్వేలో పాల్గొన్న వారిలో 62 శాతం మంది అన్నారు. ఇంతే శాతం మంది 'ఎక్స్'(ట్విట్టర్) విషయంలోనూ చెప్పారు. ఇన్‌స్ట్రాగాం లేకుండా ఉంటే బాగుండేదని 56 శాతం మంది అన్నారు.

ఆధారం: ది హారిస్ పోల్-మార్కెట్ రీసెర్చ్ కంపెనీ..

- సాక్షి సెంట్రల్ డెస్క్..

త్రీడీ.. రెడీ!



సాక్షి, హైదరాబాద్: నిర్మాణ రంగంలో త్రీడీ వినియోగం పెరుగుతోంది. ఇల్లు, ఆఫీస్, ఆలయం, వంతెన.. ఇలా అన్నిరకాల నిర్మాణాలను త్రీడీ ప్రింటింగ్‌లో ముద్రిస్తున్నారు. సాధారణంగా ఏదైనా భవనం కట్టాలంటే ఇటుకలు, ఇసుక, సిమెంటు, స్టీల్ వంటి సామగ్రితోపాటు బోలెడంత మంది కార్మికులు అవసరం. కానీ, టెక్నాలజీ విరివిగా అందుబాటులోకి వచ్చాక చిటికేసినంత సులువుగా భవనాలు కట్టేస్తున్నారు. కాదు కాదు.. ముద్రించేస్తున్నారు.

నిర్మాణం ఇలా..

- సాధారణ ఇంటి నిర్మాణంలాగే త్రీడీ ప్రింటింగ్ నిర్మాణం కూడా సాగుతుంది. కాకపోతే ఇందులో కార్మికులకు బదులుగా యంత్రం పనిచేస్తుంది. ఇంటిని ఎక్కడ కట్టాలో నిర్ణయించాక, అవసరమైన ప్లాన్ (బ్లూ ప్రింట్)ను రూపొందిస్తారు. గోడలు, గదులు ఎలా ఉండాలో నిర్ణయించి ఇంటి బ్లూప్రింట్ మోడలింగ్ సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్ ద్వారా సిద్ధం చేస్తారు. తర్వాత ప్లాన్‌ను కంప్యూటర్ ద్వారా భారీస్థాయిలో ఉండే త్రీడీ ప్రింటర్‌కు పంపిస్తారు.
- అన్నీ సరిచూసుకున్నాక యంత్రం 'ప్రింట్'బటన్ నొక్కగానే ప్లాన్ ప్రకారం ప్రింటర్‌లోని నాజిల్ ద్వారా కాంక్రీట్ మెటీరియల్ బయటకు వచ్చి నిర్దేశిత ప్రదేశంలో వరుసగా పడుతుంది. దాన్ని మరో కాంక్రీట్ డ్రయర్ త్వరగా గట్టిపడేలా చేస్తుంది. ఆ వెంటనే దానిపై మరో పొర కాంక్రీట్ వేస్తుంది. ఇలా పొరలు పొరలుగా ప్లాన్‌లో ఉన్నట్లుగా నిర్మాణం పూర్తవుతుంది. ఆ తర్వాత కిటికీలు, తలుపులు, ప్లంబింగ్, ఎలక్ట్రికల్ వంటి పనులను కార్మికులతో పూర్తి చేస్తారు.
- ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ మద్రాస్ వంటి ఉన్నత విద్యాసంస్థలు, బహుళ జాతి కంపెనీలు, స్టార్టప్‌లు నిర్మాణ రంగంలో త్రీడీ సాంకేతికత వినియోగానికి మద్దతిస్తున్నాయి. త్వస్తా, సింప్లిఫోర్జ్, గోద్రెజ్ ప్రాపర్టీస్, ఎల్అండ్‌టీ, డెల్టాసిస్ ఈ-ఫార్మింగ్, ఫ్యాబ్‌హెడ్స్ ఆటోమేషన్, సీఓబీఓడీ ఇంటర్నేషనల్ ఇండియా డివిజన్ వంటి సంస్థలు ఇప్పటికే మనదేశంలో పలు త్రీడీ నిర్మాణాలను పూర్తిచేశాయి. ఢిల్లీ, ముంబై, బెంగళూరు, హైదరాబాద్, పుణే వంటి మెట్రో నగరాల్లో నివాస, వాణిజ్య, మౌలిక సదుపాయాల వంటి నిర్మాణాల్లో త్రీడీ ప్రింటింగ్ సాంకేతికత వినియోగం పెరుగుతోంది.
- దేశంలో త్రీడీ ప్రింటింగ్ మార్కెట్ గణనీయమైన వృద్ధిని సాధిస్తోంది. గతేడాది దీని మార్కెట్ పరిమాణం 707 మిలియన్ అమెరికన్ డాలర్లుగా ఉండగా.. 2033 నాటికి 4,033 మిలియన్ డాలర్లకు చేరుతుందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. 2025-2033 మధ్య కాలంలో 21.70 శాతం వార్షిక వృద్ధి రేటును నమోదు చేస్తుందని అంచనా. త్రీడీ ప్రింటింగ్ విధానంతో కార్మికుల వ్యయంతో పోలిస్తే 30 శాతం భారం తగ్గుతుంది. నిర్మాణంలో వ్యర్థాల విడుదల గణనీయంగా తగ్గుతుంది. ఇది పర్యావరణహితం కూడా. రీసైకిల్ చేసిన కాంక్రీట్, ఫ్లయాష్, జీజీబీఎస్, జియోపాలిమర్ మిశ్రమాలను కూడా త్రీడీ ప్రింటింగ్‌లో వినియోగించే వీలుంటుంది.



నిర్మాణ రంగంలో త్రీడీ టెక్నాలజీ వినియోగం

- బిల్డ్ కాంక్రీట్‌తో పొరలు పొరలుగా నిర్మించడమే దీని ప్రత్యేకత
- ఇళ్లు, ఆఫీసులు, వంతెనలు, ఆలయాలు, ఆర్మీ బంకర్లు సైతం నిర్మాణం
- నిర్మాణంలో కచ్చితత్వం, వేగంతో పాటు వ్యర్థాల విడుదల తగ్గుదల
- ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ మద్రాస్ సాంకేతిక సహకారం
- నిర్మాణాలను ముద్రిస్తున్న సింప్లిఫోర్జ్, త్వస్తా, ఎల్అండ్‌టీ వంటి సంస్థలు

ఆర్మీ భవనం..

దేశంలో తొలిసారి జవాన్ల కోసం మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్‌లోని మోరార్ కంటోన్మెంట్‌లో త్రీడీ ప్రింటింగ్ భవనాన్ని నిర్మించారు. మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీసెస్ (ఎంఈఎస్)తో కలిసి సింప్లిఫోర్జ్, ఐఐటీ హైదరాబాద్ సంయుక్తంగా దీన్ని నిర్మించాయి. ఇందులో 14 మంది జవాన్లు నివసించే వీలుంది. 11-11.5 అడుగుల పొడవైన ఈ త్రీడీ నిర్మాణం కోసం తొలుత 2,500 చ.అ. విస్తీర్ణంలో పునాదిని సంప్రదాయ పద్ధతిలో నిర్మించారు. బీమ్ మినహా మిగిలిన నిర్మాణ భాగాలను నెల రోజుల్లో త్రీడీతో ముద్రించారు. సంప్రదాయ నిర్మాణాలు సాధ్యం కాని ప్రాంతాలలో ఈ బ్యారక్‌లు సైన్యానికి ఎంతో ఉపయుక్తం.

కోవిడ్ తర్వాత త్రీడీ అవసరం పెరిగింది



కరోనా వల్ల నిర్మాణ రంగంలో కార్మికుల కొరత అధికమైంది. ఆ సమయంలో త్రీడీ ప్రింటింగ్ అవసరం పెరిగింది. ఇది కార్మికుల కొరత, నిర్మాణ సవాళ్లను అధిగమించడంలో ఎంతో ఉపయుక్తం. కార్మికులపై వ్యయం, నిర్మాణ సామగ్రి ధరల భారం తగ్గిస్తుంది.

- హరికృష్ణ, ఎండీ, సింప్లిఫోర్జ్ త్రీడీ క్రియేషన్స్

నిర్మాణ రంగంలో త్రీడీ పురోగతి..



త్రీడీ కాంక్రీట్ ప్రింటింగ్ అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ. ఇది వేగవంతమైన, సమర్థవంతమైన సాంకేతిక సాధనం. నిర్మాణ రంగంలో డిజైనింగ్, మెటీరియల్ ప్రాసెసింగ్, డెలివరీ వ్యవస్థలో పురోగతి అవసరం.

- నరేంద్ర కుమార్, డైరెక్టర్, ప్రణీత్ గ్రూప్

:.. ఆర్మీ బంకర్ :..

లదాఖ్‌లోని లేహ్‌లో సముద్ర మట్టానికి 11 వేల అడుగుల ఎత్తులో దేశంలోనే తొలి ఆన్‌సైట్ త్రీడీ మిలిటరీ బంకర్‌ను నిర్మించారు. హైదరాబాద్‌కు చెందిన డీప్‌టెక్ కంపెనీ సింప్లిఫోర్జ్, ఐఐటీ హైదరాబాద్ కలిసి దీన్ని నిర్మించాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ పనిచేయగల ప్రత్యేక త్రీడీ ప్రింటింగ్ సాంకేతికతతో 4 రోజుల్లో దీన్ని నిర్మించారు. సంప్రదాయ పద్ధతిలో ఇదే బంకర్ నిర్మాణానికి 2-3 వారాలు పడుతుంది.




:.. వంతెన :..

సిద్దిపేటలో పాదచారుల కోసం త్రీడీ ప్రింటింగ్ వంతెనను నిర్మించారు. ఐఐటీ హైదరాబాద్, సింప్లిఫోర్జ్ కలిసి కేవలం రెండు గంటల్లో ఐఐటీ హైదరాబాద్‌లో ఈ వంతెనను ముద్రించారు. ఆ తర్వాత సిద్దిపేటలోని చార్విత మెడోస్‌లోని సైట్‌లో అసెంబుల్ చేశారు. సంప్రదాయ పద్ధతిలో అయితే ఇదే బ్రిడ్జ్ నిర్మాణానికి 30 రోజుల సమయం పడుతుంది.



:.. విల్లా :..

దేశంలోనే తొలి త్రీడీ విల్లాను త్వస్తా అనే స్టార్టప్ సంస్థ పుణే హింజెవాడిలోని గోద్రెజ్ ఈడెన్ ఎస్టేట్ ప్రాజెక్ట్‌లో నిర్మించింది. 2,200 చదరపు అడుగుల ఈ విల్లాను ప్రత్యేక కాంక్రీట్ త్రీడీ ప్రింటర్‌ను ఉపయోగించి నిర్మించారు. త్రీడీ ప్రింటింగ్ గోడలు మెరుగైన ఇన్సులేషన్‌తో ఉండటంతో భవనంలో విద్యుత్ వినియోగం తగ్గుతుంది.




:.. పోస్టాఫీసు :..

దేశంలో తొలి త్రీడీ ప్రింటింగ్ పోస్టాఫీసు బెంగళూరులోని హలసూరు కేంబ్రిడ్జ్ లేఅవుట్‌లో నిర్మించారు. 1,021 చ.అ. బిల్టప్ ఏరియాలో ఐఐటీ మద్రాస్, ఎల్అండ్‌టీ సంయుక్తంగా దీన్ని నిర్మించాయి. రూ.23 లక్షలతో 43 రోజుల్లో నిర్మాణం పూర్తయింది. సంప్రదాయ నిర్మాణ పద్ధతిలో అయితే ఈ పోస్టాఫీసు నిర్మాణానికి 10 నెలల సమయం పడుతుంది.



:.. ఆలయం :..

ప్రపంచంలోని తొలి త్రీడీ ప్రింటింగ్ దేవాలయాన్ని సిద్దిపేటలోని చార్విత మెడోస్‌లో అప్సుజా ఇన్‌ఫ్రాటెక్, సింప్లిఫోర్జ్ నిర్మించాయి. 35.5 అడుగుల ఎత్తు, 4 వేల చ.అ. విస్తీర్ణంలో ఈ ఆలయాన్ని నిర్మించారు. ఆలయ మండపం, పైకప్పు సంప్రదాయ పద్ధతిలో నిర్మించగా.. కమలం పువ్వు ఆకారంలో గర్భగుడి, గోపురం స్తంభాలు, ఇతర నిర్మాణ భాగాలను 3 నెలల్లో త్రీడీతో నిర్మించారు. సంప్రదాయ పద్ధతిలో అయితే ఇదే గుడి నిర్మాణానికి 9-12 నెలల సమయం పడుతుంది. పూరీ జగన్నాథ ఆలయ శైలిని ప్రేరణగా తీసుకొని దీని నిర్మాణం సాగింది.



సీట్ల పెంపు.. ఫ్యాకల్టీ సమస్యకు చెక్

- వైద్య విద్యలో విప్లవాత్మక మార్పులకు ఎన్‌ఎంసీ శ్రీకారం
- మెడికల్ ఇన్‌స్టిట్యూషన్స్ రెగ్యులేషన్స్-2025 విడుదల
- దేశవ్యాప్తంగా 75 వేల వైద్య సీట్ల లక్ష్యం నెరవేరే దిశగా కొత్త నిబంధనలు
- బోధనా సిబ్బంది అర్హతలకు సంబంధించి కీలక మార్పులు
- గెజిట్ విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: దేశంలో వైద్య విద్య సామర్థ్యాన్ని విస్తరించి, బోధనా సిబ్బంది (ఫ్యాకల్టీ) కొరతను అధిగమించే దిశగా నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) కీలక నిర్ణయం తీసుకుంది. మెడికల్ ఇన్‌స్టిట్యూషన్స్ (ఫ్యాకల్టీ అర్హతలు) రెగ్యులేషన్స్-2025 పేరుతో రూపొందించిన కొత్త నిబంధనలను శనివారం ఢిల్లీలో విడుదల చేసింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం గెజిట్ కూడా విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 75 వేల కొత్త వైద్య సీట్ల లక్ష్యాన్ని నెరవేర్చేందుకు ఈ నిబంధనలు ఉపయోగపడనున్నాయి. ముఖ్యంగా బోధనా సిబ్బంది కొరత కారణంగా కొత్త కాలేజీలకు అనుమతులు నిలిచిపోతున్న నేపథ్యంలో ఎన్‌ఎంసీ తీసుకున్న నిర్ణయం దేశవ్యాప్తంగా వైద్య విద్యా వ్యవస్థను తిరుగులేని దిశగా నడిపిస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొత్త నిబంధనలలో ముఖ్యమైన మార్పులు ఇలా..

ఆ ప్రభుత్వ దవాఖానాలకూ బోధనా హోదా

దేశవ్యాప్తంగా 220 పడకల కంటే ఎక్కువ ఉన్న నాన్-టీచింగ్ ప్రభుత్వ దవాఖానలను కూడా బోధనా ఆసుపత్రులుగా గుర్తించవచ్చు. ఇక్కడ పనిచేస్తున్న 10 సంవత్సరాల అనుభవం ఉన్న నిపుణులను అసోసియేట్ ప్రొఫెసర్, 2 సంవత్సరాల అనుభవం ఉన్నవారిని అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమించుకోవచ్చు. కానీ వీరు రెండేళ్లలో 'బేసిక్ కోర్స్ ఇన్ బయోమెడికల్ రీసెర్చ్ (బీసీబీఆర్)'పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ నిబంధనతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న అనుభవజ్ఞులైన నిపుణుల సేవలు విద్యారంగానికి కూడా అందుబాటులోకి వస్తాయి. తాజా నిబంధనలతో ఇకపై దేశ వ్యాప్తంగా అధికారికంగా ప్రభుత్వ దవాఖానాలు బోధనాసుపత్రులుగా మారేందుకు అవకాశం ఏర్పడింది.

యూజీ, పీజీ కోర్సులు ఒకేసారి ప్రారంభించుకునే చాన్స్

ఇప్పటివరకు మెడికల్ కాలేజీలు తొలుత ఎంబీబీఎస్ కోర్సు ప్రారంభించిన తర్వాతే ఎండీ/ఎంఎస్ వంటి పీజీ కోర్సులను ప్రారంభించేవి. ఇకపై నూతన ప్రభుత్వ మెడికల్ కళాశాలలు యూజీతో పాటు పీజీ కోర్సులను కూడా ఒకేసారి ప్రారంభించవచ్చు. ఇది వైద్యుల కొరత తీర్చడంలో సహాయపడుతుందని ఎన్‌ఎంసీ పేర్కొంది.

పీజీకి కొన్ని మినహాయింపులు

ఇప్పటివరకు పీజీ కోర్సు ప్రారంభించాలంటే ముగ్గురు ఫ్యాకల్టీ, ఒక సీనియర్ రెసిడెంట్ ఉండాలి. కొత్త నిబంధనల ప్రకారం, కేవలం ఇద్దరు ఫ్యాకల్టీ, 2 సీట్లతో కోర్సును ప్రారంభించవచ్చు. కొన్ని స్పెషాలిటీ విభాగాల్లో బెడ్ అవసరాలు కూడా తగ్గించారు, తద్వారా చిన్న ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా పీజీ కోర్సుల నిర్వహణ సాధ్యమవుతుంది. సూపర్ స్పెషాలిటీ కోర్సులకు అనువైన బ్రాడ్ స్పెషాలిటీ విభాగాల పరిధి పెంచారు. దీని ద్వారా ఇప్పటికే ఉన్న ఫ్యాకల్టీని సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో వినియోగించుకోవడం సులభమవుతుంది.

ఎంఎస్సీ-పీహెచ్‌డీ అర్హత గల వారు ఇతర విభాగాలకు..

ఇప్పటివరకు అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ విభాగాల్లో మాత్రమే ఎంఎస్సీ - పీహెచ్‌డీ విద్యార్హత గల వారిని ఫ్యాకల్టీగా నియమించేవారు. ఇప్పుడు మైక్రోబయాలజీ, ఫార్మకాలజీ విభాగాలకూ ఇది వర్తిస్తుందని ఎన్‌ఎంసీ తెలిపింది. అలాగే అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, ఫార్మకాలజీ, పాథాలజీ, మైక్రోబయాలజీ, కమ్యూనిటీ మెడిసిన్ వంటి ప్రీ క్లినికల్, పారా క్లినికల్ విభాగాల్లో సీనియర్ రెసిడెంట్ పదవికి గరిష్ఠ వయో పరిమితిని 50 ఏళ్లకు పెంచారు.

దేశ వ్యాప్తంగా వైద్య విద్య విస్తరణకు దోహదం

'ఈ నూతన నిబంధనలు వైద్యుల నైపుణ్యాన్ని, అనుభవాన్ని, విద్యార్హతను ప్రధానంగా తీసుకొని రూపుదిద్దుకున్నాయి. కఠినమైన సేవా ప్రమాణాలకు బదులుగా ఫ్యాకల్టీ ఎంపికలో ప్రామాణికత, అనుభవానికి ప్రాధాన్యత ఇవ్వడం ఈ నిబంధనల మార్పులోని ప్రధాన, బలమైన అంశం. ఇది మెడికల్ విద్యా రంగంలో గొప్ప విప్లవానికి నాంది పలకనుంది. ప్రస్తుతం దేశంలో పట్టణాలకే పరిమితమైన వైద్య విద్య అవకాశాలు, నూతన నిబంధనల వల్ల వెనుకబడిన ప్రాంతాల్లో కూడా విస్తరించనున్నాయి. ప్రజలకు సమగ్ర ఆరోగ్య సేవలు అందించేందుకు ఇది పునాది అవుతుంది..'అని ఎన్‌ఎంసీ పేర్కొంది.

ముందు మీ ఇల్లు చక్కదిద్దుకోండి!

▶ మొదటి పేజీ తరువాయి

వైఫల్యాలు, లోపాలు, అవినీతి తాండవిస్తోందన్న ఆరోపణల నేపథ్యంలో వాటిని సరిదిద్దుకోవాలంటూ హితవు పలికింది. అలాగే ఒలింపిక్స్‌లో భారత ఆటగాళ్ల పేలవ ప్రదర్శనలు, డోపింగ్‌లో వారు పట్టుబడుతున్న వ్యవహారాలపైనా దృష్టిసారించాలని సూచించింది. స్విట్జర్లాండ్‌లోని లుసానేలో ఇటీవల నిర్వహించిన సమావేశానికి హాజరైన గుజరాత్ హోం, క్రీడల మంత్రి హర్ష్ సంఘ్వీ, ఒకప్పటి భారత పరుగుల రాణి, ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష నేతృత్వంలోని భారత ప్రతినిధి బృందానికి ఐఓసీ ఈ మేరకు తేల్చిచెప్పింది. ఐఓసీతో చర్చల్లో పాల్గొన్న ఓ ఉన్నతాధికారిని ఉటంకిస్తూ ఓ ప్రముఖ ఆంగ్ల దినపత్రికతో పాటు పలు ఆంగ్ల వార్తా వెబ్‌సైట్లు ఈ మేరకు కథనాలు ప్రచురించాయి. అయితే భవిష్యత్తులో విశ్వక్రీడల నిర్వహణ కోసం భారత్ తన ప్రయత్నాలను కొనసాగించొచ్చని ఐఓసీ సూచించింది. 2024లో జరిగిన పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ రూ. 470 కోట్లు ఖర్చుచేసి 117 మంది క్రీడాకారులను పంపినప్పటికీ మనకు కేవలం 6 పతకాలే లభించాయి. దీనికితోడు స్పాన్సర్‌షిప్ ఒప్పందాలు, ఆర్థిక అవకతవకల ఆరోపణల నేపథ్యంలో ఐఓఏకు అందించే గ్రాంట్లను ఐఓసీ గతేడాది అక్టోబర్ నుంచి నిలిపేసింది. మరోవైపు ఐఓఏ సీఈవోగా రఘురాం అయ్యర్ నియామకంపై కుమ్ములాటలు నెలకొన్నాయి. కాగా, ప్రపంచ యాంటీ డోపింగ్ ఏజెన్సీ 2023 నాటి గణాంకాల ప్రకారం డోపింగ్ కేసుల్లో అత్యధికం భారత్‌వే.

అర్హతలు ఉన్నా ఇవేం వ్యాఖ్యలు..

భారత్‌లో ఒలింపిక్స్ నిర్వహించేందుకు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ ఐఓసీ కావాలనే ఈ రకమైన వ్యాఖ్యలు చేస్తోందని భారత ప్రతినిధి బృందం వ్యాఖ్యానిస్తోంది. భారత్‌లో వందలాది మంది క్రీడాకారులు ఒలింపిక్స్ కోసం ఎదురుచూస్తున్నారని.. వారంతా ప్రతిభావంతులేనని స్పష్టం చేస్తోంది. అంతర్జాతీయ క్రీడలకు ప్రాతినిధ్యం వహించే క్రమంలో మరింత పకడ్బందీ ఏర్పాట్లు చేసేందుకు భారత ప్రభుత్వం సిద్ధంగా ఉందనే విషయాన్ని కూడా అంతర్జాతీయ కమిటీ దృష్టికి ఐఓఏ తీసికెళ్లినట్లు తెలిసింది. మరోసారి జరిగే సమావేశంలో ఈ అంశంపై తాము చర్చిస్తామని భారత కమిటీ పేర్కొంది.

వారానికి ఒకరోజు స్వచ్ఛంద సేవ చేయాలి

వైద్యులకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూచన

102 మంది వైద్యులకు సన్మానం



డాక్టర్ ఎంఎస్ గౌడ్‌కు పురస్కారం అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

పంజగుట్ట (హైదరాబాద్): వైద్య సమాజం తమ నైపుణ్యాన్ని పేదల ప్రయోజనం కోసం స్వచ్ఛందంగా విస్తరించాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) హైదరాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం రాజ్‌భవన్‌లో రోగులకు విశేష సేవలందిస్తున్న 102 మంది వైద్యులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందనతో కలసి గవర్నర్ వైద్యులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు తమ వృత్తిని సేవా భావంతో నిర్వహించాలని సూచించారు. మొబైల్ మెడికల్ యూనిట్లు, రక్తదాన ప్రచారాలు, సీపీఆర్ శిక్షణ, వృద్ధుల సంరక్షణ, వికలాంగులకు సేవలు చేస్తున్న రెడ్‌క్రాస్‌ను ఆయన అభినందించారు. త్వరలోనే మాసబ్‌ట్యాంక్‌లో అన్ని సదుపాయాలతో కొత్త బ్లడ్ సెంటర్, జనరిక్ మెడిసిన్ కేంద్రాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. వారానికి ఒకరోజు స్వచ్ఛంద సేవకు కేటాయించాలని గవర్నర్ వైద్యులకు సూచించారు.

భర్తను, ఇద్దరు పిల్లల్ని కడతేర్చాలని..

ప్రియుడితో కలిసి ఓ మహిళ విఫలయత్నాలు

సంభాల్: అక్రమ సంబంధం సాగిస్తున్న ఓ మహిళ తాళికట్టిన భర్తను, కన్నబిడ్డలను కడతేర్చేందుకు తెగించింది. ప్రియుడితో కలిసి చేసిన రెండు ప్రయత్నాలూ విఫలమై చివరికి కటకటాలు లెక్కపెట్టాల్సి వచ్చింది. ఉత్తరప్రదేశ్‌లోని బహ్‌జోయి ప్రాంతానికి చెందిన నైనా శర్మ, గోపాల్ మిశ్రా దంపతులకు నాలుగేళ్ల చిరాగ్, ఏడాదిన్నర వయస్సున్న కృష్ణ అనే సంతానం ఉన్నారు. నైనా కొంతకాలంగా ఆశిష్ మిశ్రా అనే వ్యక్తితో సంబంధం కొనసాగిస్తోంది. తమ వ్యవహారానికి భర్త, పిల్లలు అడ్డుగా ఉన్నారని నైనా భావించింది. వీరిని చంపేందుకు ప్రియుడు ఆశిష్‌తో కలిసి పథకం వేసింది. దీని ప్రకారం జూన్ 30వ తేదీన రాత్రి విషం కలిపిన పాలను వీరికి అందించింది. అదృష్టవశాత్తూ ముగ్గురూ పాలను తాగకపోవడంతో పథకం బెడిసికొట్టింది. దీంతో, ఈసారి కత్తితో పొడిచి చంపాలని ప్లాన్ వేశారు. ఆ మేరకు ఈ నెల 2వ తేదీ రాత్రి పడుకుని ఉన్న గోపాల్‌పై కత్తితో దాడి చేశారు. అతడు త్రుటిలో తప్పించుకున్నాడు. కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు అక్కడికి రాగా నైనా, ఆశిష్ పారిపోయారు. బాధితుడు గోపాల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నైనా, ఆశిష్‌లను శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
ఆదివారం । 6-7-2025

స'జీవ' శిల్పాలు!

- కిన్నెరసాని మ్యూజియంలో కొలువుదీరిన వన్యప్రాణులు
- జీవకళ ఉట్టిపడేలా బొమ్మల ఏర్పాటు
- నానాటికీ పెరుగుతున్న పర్యాటకుల ఆదరణ



మొసలి



మ్యూజియంలోని జంతువుల బొమ్మలు



చెట్లపై నెమలి, కొంగలు.. కింద అనకొండ బొమ్మ

పాల్వంచ రూరల్: మొసళ్లు, అడవి దున్నలు, కణుజులు, కోతులు.. ఇలా వన్యప్రాణులను చూడాలంటే అటవీ ప్రాంతానికి వెళ్లాలి లేదా జూలో చూడాలి. కానీ భద్రాద్రి జిల్లా పాల్వంచ మండలం కిన్నెరసానికి వెళ్తే ఇవన్నీ కళ్ల ముందే కనిపిస్తాయి. వీటిలో జీవం ఉండదు.. కానీ జీవకళ ఉట్టిపడుతుంటుంది. అంతలా ఆకట్టుకునేలా వన్యప్రాణుల బొమ్మలను ఏర్పాటు చేసిన ఇక్కడి మ్యూజియానికి పర్యాటకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది.

పర్యాటక ప్రాంతం..

పాల్వంచకు 12 కిలోమీటర్ల దూరాన కిన్నెరసాని కేంద్రంగా అభయారణ్యం ఉండగా.. నిర్వహణ కోసం ప్రత్యేకంగా వన్యప్రాణుల సంరక్షణ విభాగం (వైల్డ్‌లైఫ్‌) ఏర్పాటు చేశారు. అంతేకాక కిన్నెరసాని రిజర్వాయర్, ఇక్కడి డీర్‌ పార్క్‌లోని చుక్కల దుప్పులను వీక్షించేందుకు వారాంతాల్లోనే కాక ఇతర రోజుల్లోనూ పెద్దసంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. రిజర్వాయర్‌లో బోటు షికారు చేసి చుక్కల దుప్పులను వీక్షించాక.. ఇంకాస్త సమయం గడపడానికి తొలినాళ్లలో ఎలాంటి ఏర్పాట్లు ఉండేవి కావు. దీంతో అధికారులు ఇక్కడ చిన్నపిల్లలు ఆడుకునేలా పరికరాలతో ప్రత్యేక పార్క్‌ ఏర్పాటు చేశారు. ఆతర్వాత మ్యూజియం కూడా ఏర్పాటుచేసి అందులో నిజమైన జంతువులను తలపించేలా బొమ్మలు ఏర్పాటు చేశారు. వన్యప్రాణుల సంరక్షణ విభాగం (వైల్డ్‌లైఫ్‌) ఆధ్వర్యాన రాజస్తాన్‌కు చెందిన కళాకారులు ఈ బొమ్మలను రూపొందించారు.

రూ.20 లక్షలతో..

కిన్నెరసాని డీర్‌ పార్క్‌ సమీపాన రూ.20 లక్షల వ్యయంతో పర్యావరణ విద్యాకేంద్రం, మ్యూజియాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో కిన్నెరసాని అభయారణ్యంలో సంచరించే వన్యప్రాణుల బొమ్మలను అచ్చం అలాగే చేయించారు. వీటిని వీక్షించేందుకు తెలంగాణ నలుమూలల నుంచే కాక ఒడిశా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌ మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్‌ తదితర రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు వస్తున్నారు. ఈ విద్యాకేంద్రాన్ని సందర్శించి వన్యప్రాణుల బొమ్మల వద్ద ఫొటోలు దిగుతుంటారు. రూ.6.50 లక్షల వ్యయంతో డీర్‌పార్క్‌ వద్ద చిన్నారులు ఆడుకునే సామగ్రిని ఏర్పాటు చేయడంతో సందడిగా ఉంటోంది.

అరుపు వినిపిస్తే.. సమాచారం

చెట్లపై పక్షులు, నేలపై అనకొండ, నెమళ్లు, కొంగలే కాక.. మొసళ్లు, అడవి దున్నలు, చిరుతపులులు, కణుజులు, కోతుల బొమ్మలు మ్యూజియంలో కొలువుదీరాయి. ప్రతీ వన్యప్రాణి బొమ్మ వద్ద దాని అరుపులు వినిపించేలా సౌండ్‌ సిస్టం ఏర్పాటు చేశారు. ఆ ప్రాణి ప్రత్యేకతలు, వివరాలతో ఈ మ్యూజియం పర్యావరణ విద్యాకేంద్రంగా విలసిల్లుతోంది.



జిరాఫీ బొమ్మల వద్ద పర్యాటకుల ఫొటో షూట్



ఆట వస్తువుల వద్ద చిన్నారుల సందడి



మ్యూజియం ఎదుట అడవిదున్న రూపం

రేషన్‌ కార్డుల ఏరివేతకు ప్రయత్నాలు

'సాక్షి'కథనాన్ని ట్యాగ్‌ చేస్తూ 'ఎక్స్‌'లో కవితపోస్ట్‌

సిద్దిపేట జోన్‌: రాష్ట్రవ్యాప్తంగా రేషన్‌ కార్డులను తొలగించే ప్రయత్నాలకు కాంగ్రెస్‌ ప్రభుత్వం పాల్పడుతోందని బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. 'రేషన్‌ బియ్యానికి 7.24 లక్షల మంది దూరం' శీర్షికతో 'సాక్షి'లో శనివారం ప్రచురించిన కథనాన్ని.. ఆమె తన 'ఎక్స్‌' ఖాతాలో ట్యాగ్‌ చేస్తూ పోస్ట్‌ చేశారు. రేషన్‌ తీసుకోకపోవడాన్ని సాకుగా చూపుతూ కార్డులను తొలగించే దుర్మార్గపు ఆలోచనలో ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. అర్హులందరికీ కార్డులిస్తామని చెప్పి కార్డుల ఏరివేత ప్రయత్నాలు ఎందుకని ప్రశ్నించారు. రేషన్‌ కార్డుల రద్దు ఆలోచన వెంటనే విరమించుకోవాలని, కొత్త రేషన్‌ కార్డులను ఇవ్వాలని డిమాండ్‌ చేశారు.



కవిత 'ఎక్స్‌'ఖాతాలో ట్యాగ్‌చేసిన 'సాక్షి'కథనం

తొలి త్రైమాసికంలోనే నూరు శాతం బొగ్గు రవాణా

సింగరేణి సీఎండీ ఎన్‌.బలరామ్‌ హర్షం



సాక్షి, హైదరాబాద్‌: సింగరేణి కాలరీస్‌ కంపెనీ లిమిటెడ్‌ 2025–26 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలోనే బొగ్గు రవాణాలో వంద శాతం, బొగ్గు ఉత్పత్తిలో 99 శాతం లక్ష్యాలను సాధించిందని సీఎండీ ఎన్‌.బలరామ్‌ శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఏప్రిల్‌ నుంచి జూన్‌ వరకు బొగ్గు రవాణా లక్ష్యం 160 లక్షల టన్నులు కాగా 166 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసి 103 శాతం పురోగతి సాధించిందని, అదేవిధంగా బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 160 లక్షల టన్నులు కాగా, 159.9 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసి 99 శాతం సాధించిందన్నారు. శనివారం సింగరేణి భవన్‌లో సీఎండీ ఎన్‌.బలరామ్‌ సంస్థ డైరెక్టర్లు, అన్ని ఏరియాల్లోని జీఎంలతో త్రైమాసిక ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో కూడా ఓపెన్‌ కాస్ట్‌ గనుల్లో ఉత్పత్తి కుంటుపడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉత్పత్తికి అవరోధంగా ఉన్న అంశాలపైన అప్పటికప్పుడే ఆదేశాలు జారీ చేశారు. కొత్తగూడెంలో అన్ని అనుమతులు మంజూరైన వీకే ఓపెన్‌ కాస్ట్‌ గని భూమి పూజ కార్యక్రమాన్ని ఈ నెలాఖరులో నిర్వహించాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రక్షణకు సంబంధించి ప్రతి గనిలో లోపాలు లేకుండా సవరించాలని సేఫ్టీ విభాగాన్ని ఆదేశించారు. ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్‌లో ప్రారంభమైన బొగ్గు ఉత్పత్తిపై కూడా సీఎండీ సమీక్షించారు.

ఎరువులు అడిగితే రాజకీయాలా?

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రానికి కేంద్రం కేటాయించిన ఎరువులనే సకాలంలో ఇవ్వాలని కోరుతుంటే.. బీజేపీ నేతలు దాన్ని కూడా రాజకీయం చేస్తున్నారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌ రావు ఒక ప్రకటనలో విమర్శించారు. ఖరీఫ్‌లో రాష్ట్రానికి రావలసిన ఎరువుల గురించి తాము మాట్లాడుతుంటే, వారు గత రబీ సీజన్‌ గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. ఖరీఫ్‌కు, రబీకి తేడా తెలుసుకోవాలని సూచించారు. లెక్కలతో సహా కేంద్ర మంత్రులకు లేఖలు రాస్తుంటే, అవి చూడకుండా.. ఎక్కువ ఎరువులు ఇచ్చామనడం ఏ రాజకీయ ప్రయోజనాలకో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. ఈ వానాకాలానికి 9.8 లక్షల మెట్రిక్‌ టన్నులు కేటాయించిన ప్రభుత్వం.. దానికి తగ్గట్టు నెలవారీ కేటాయింపులు చేసి.. జూలై వరకు 6.60 లక్షల మెట్రిక్‌ టన్నులు కేటాయించాల్సి ఉందని గుర్తు చేశారు. ఇప్పటి వరకు 3.18 లక్షల మెట్రిక్‌ టన్నులు మాత్రమే సరఫరా చేశారని మరోసారి కేంద్ర మంత్రులకు, బీజేపీ ఎంపీలకు తెలియజేస్తున్నట్లు స్పష్టం చేశారు. మిగతా 2.42 లక్షల మెట్రిక్‌ టన్నుల యూరియా వెంటనే సరఫరా చేయాలని తుమ్మల కోరారు.




అనారోగ్యంతో ఉప్పల్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నటుడు ఫిష్‌ వెంకట్‌ను పరామర్శిస్తున్న ఫిషరీస్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ మెట్టు సాయికుమార్‌. ఈ సందర్భంగా వెంకట్‌కు ఆయన ఆర్థికసాయం చేశారు

ఈ చెరువు అలుగు భిన్నం!

బీబీపేటలో 145 మీటర్ల అలుగుకు ఐరన్‌ షట్టర్లు
నీటి నిల్వ సామర్థ్యం పెంచుకునేలా నిర్మాణం
128 ఏళ్ల కిందట నిర్మించిన కట్టడం



చెరువు నిండి అలుగు పారుతున్న దృశ్యం (ఫైల్‌)



బీబీపేట పెద్ద చెరువు అలుగుపై ఉన్న ఇనుప షట్టర్లు. వాటిని పైకి లేపితే నీటి నిల్వ సామర్థ్యం దాదాపు 30 శాతం పెరుగుతుంది.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: ఏడు ఊళ్లకు సాగునీరందించే బీబీపేట పెద్ద చెరువు అలుగును చూస్తే ఆశ్చర్యపోవాల్సిందే. 1897లో అప్పటి నిజాం పాలకులు నిర్మించిన చెరువు కట్ట పొడవు 1.8 కిలోమీటర్లు కాగా, అలుగు 145 మీటర్ల మేర ఉంటుంది. అలుగు పొడవునా ప్రత్యేకంగా ఇనుప షట్టర్లు ఉంటాయి. చెరువు నిండిన తరువాత నీటి నిల్వను పెంచుకునేందుకు ఇనుప షట్టర్లు పైకి లేపాల్సి ఉంటుంది. పూర్వ కాలంలో భారీ వర్షాలు కురిసినప్పుడు నీటి నిల్వ కోసం షట్టర్లను పైకి లేపి కొంత కాలం నీటిని నిల్వ చేసుకునేవారు. షట్టర్లు పైకి లేపితే దాదాపు ముప్పై శాతం మేర నీటి నిల్వ పెరుగుతుంది. అయితే 1995 నుంచి వరుస కరువులతో చెరువు నిండడమే గగనమైపోయి చెరువు కింద ఆయకట్టు చాలా కాలం బీడువారిపోయి ఉంది. గడిచిన నాలుగైదేళ్లుగా చెరువులోకి వరద పెరిగి నిండి అలుగు పారుతోంది. అయితే షట్టర్లు పైకి మాత్రం లేపడం లేదు. ఏడు గ్రామాల పరిధిలోని దాదాపు 618 ఎకరాల ఆయకట్టుకు నీరందించే బీబీపేట పెద్ద చెరువు నీటితో నిండుగా ఉంటే ఓ ప్రాజెక్టును తలపిస్తుంది. దాదాపు 128 ఏళ్ల కిందట నిర్మించిన అలుగు, అలుగుకు బిగించిన షట్టర్లు ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉండటం విశేషం. గోదావరి జలాలతో బీబీపేట చెరువును నింపుతామని ప్రతిసారీ ఎన్నికల్లో ఆయా పార్టీల నాయకులు హామీ ఇవ్వడం, తరువాత విస్మరించడం పరిపాటిగా మారింది. బీబీపేట ప్రాంత రైతాంగం గోదావరి జలాల సాధన కోసం ఐక్య కార్యాచరణ కమిటీ ఏర్పాటు చేసుకుని అనేక ఉద్యమాలు కూడా చేశాయి.

ప్రతి మంగళవారం జాతరే!

- మెట్‌పల్లి మండలం వెల్లుల ఎల్లమ్మ ఆలయానికి భక్తుల తాకిడి
- ప్రసిద్ధ ఆలయంగా పేరు
- ఇతర జిల్లాలతోపాటు మహారాష్ట్ర నుంచి తరలి వస్తున్న భక్తులు

మెట్‌పల్లి రూరల్‌: మంగళవారం వస్తే చాలు.. ఆ ఆలయంలో భక్తుల సందడి ఉంటుంది. ఆ రోజు జరిగే జాతరకు భక్తజనకోటి తరలి వస్తుంది. ఆ విశిష్ట ఆలయం మెట్‌పల్లి మండలం వెల్లుల గ్రామంలో ఉంది. ఇక్కడి ఎల్లమ్మ తల్లి ఆలయం వద్ద ప్రతి మంగళవారం జరిగే జాతరకు విశేషంగా భక్తులు తరలి వస్తున్నారు. గ్రామ శివారులో రహదారి పక్కనే చెట్టు రూపంలో ఉన్న ఈ ఆలయానికి.. ఇటీవలి కాలంలో భక్తుల తాకిడి పెరిగింది. ప్రతి మంగళవారం ఇక్కడ జాతర జరగడం విశేషం. ఇక్కడి ఎల్లమ్మకు ఎన్నో మహిమలు ఉన్నాయని భక్తులు విశ్వసిస్తుంటారు. ప్రతి వారం జరిగే జాతరకు చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా.. ఇతర జిల్లాలు, మహారాష్ట్ర నుంచి భక్తులు భారీగా తరలివస్తున్నారు.

సుమారు 300 ఏళ్ల క్రితం..

ఎక్కడైనా ఆలయంలో దేవుడు, దేవత ఉండడం.. భక్తులు పూజిస్తుండటం సహజం. కానీ ఇక్కడ చెట్టునే దైవంగా భావించి పూజలు చేస్తున్నారు. మెట్‌పల్లి మండలం వెల్లుల గ్రామ శివారులోని ఒక చెట్టు కింద.. సుమారు 300 ఏళ్ల క్రితం ఎల్లమ్మ తల్లి వెలసింది. ప్రసిద్ధిగాంచిన ఈ ఆలయం వద్ద ప్రతి మంగళవారం జాతర జరుగుతోంది. ప్రతి వారం జరిగే జాతర సందర్భంగా మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు భారీగా తరలి వస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా వివిధ జిల్లాలు, మహారాష్ట్ర నుంచి తరలి వస్తున్నారు. అమ్మవారికి బెల్లం, పుట్నాలు, కల్లు సమర్పించి కోళ్లు, పొట్టేళ్లను బలిస్తున్నారు. కుటుంబ సమేతంగా వంటలు చేసుకొని సహపంక్తి భోజనం చేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే జనాలతో ఈ ప్రాంతమంతా ప్రతి మంగళవారం సందడిగా మారుతుంది.

బావినీటితో స్నానం ఆరోగ్యకరం

ఎల్లమ్మ ఆలయానికి వచ్చే భక్తులు అక్కడి బావి నీటితో స్నానం చేస్తారు. ఈ బావిలోని నీటితో స్నానం చేస్తే చర్మవ్యాధులు తొలగిపోతాయని నమ్మకం. పురాతన కాలం నుంచి వస్తున్న ఈ ఆచారాన్ని ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్న తర్వాత.. తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో భక్తులు బావిలోని నీటిని వెంట తీసుకెళ్తారు. పంటలు వేసే ముందు అమ్మవారిని దర్శించుకొని వెళ్తే బాగా పండుతాయని రైతులు నమ్ముతుంటారు.

దేవాదాయశాఖ పరిధిలోకి..

సుమారు 40 ఏళ్లుగా వీడీసీ ఆధ్వర్యంలో కొనసాగిన ఎల్లమ్మ ఆలయాన్ని కొన్ని నెలల క్రితం ప్రభుత్వం దేవాదాయశాఖలోకి విలీనం చేసింది. దీంతో ప్రతి మంగళవారం జరగనున్న జాతర రోజు దేవాదాయశాఖ అధికారులు అక్కడ అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడుతున్నారు. మరోవైపు భక్తుల సంఖ్య పెరగడంతో ప్రతి మంగళవారం మెట్‌పల్లి–వెల్లుల రహదారిలో వాహనాల సంఖ్య సైతం పెరిగింది. దీంతో పోలీసులు సిబ్బందిని ఏర్పాటు చేసి రాకపోకలు సాఫీగా జరిగేలా చూస్తున్నారు.



ఎల్లమ్మను దర్శించుకుంటున్న భక్తులు

క్లుప్తంగా...

మెల్బోర్న్‌లో ఘనంగా వైఎస్సార్ జయంతి



మెల్బోర్న్‌లో జరిగిన వైఎస్సార్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ప్రవాసాంధ్రులు

సాక్షి, అమరావతి : దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను ఆస్ట్రేలియాలోని మెల్బోర్న్ నగరంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవాసాంధ్రులు వైఎస్సార్ చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. వైఎస్సార్ అమర్ రహే, వైఎస్సార్ ఆశయాలను నెరవేరుస్తాం అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియా వైఎస్సార్‌సీపీ విక్టోరియా కన్వీనర్ కృష్ణారెడ్డి, సహ కన్వీనర్ భరత్‌లు మాట్లాడుతూ.. ప్రజాసేవకు నిలువెత్తు సాక్ష్యం డాక్టర్ వైఎస్సార్ అని కొనియాడారు. తెలుగు ప్రజల హృదయాల్లో వైఎస్సార్ చిరస్మరణీయులుగా ఉండిపోతారన్నారు. వైఎస్సార్ చూపిన మార్గంలోనే వైఎస్ జగన్ పాలన సాగించి సంక్షేమాన్ని కొనసాగించారని గుర్తుచేశారు. వ్యవసాయం, విద్య, వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐలు బ్రహ్మారెడ్డి, సురేష్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రామాంజి, నాగార్జునలు పాల్గొన్నారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎన్ఆర్ఐ గ్లోబల్ కోఆర్డినేటర్ ఎ. సాంబశివారెడ్డి, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, పార్టీ నేతలు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

కనీస ధరకు మామిడిని కొనుగోలు చేయాలి

రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ చిరంజీవి చౌదరి

చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు జిల్లాలోని ప్రాసెసింగ్ యూనిట్లు రైతుల నుంచి కనీస ధరకు మామిడిని కొనుగోలు చేయాలని రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ చిరంజీవి చౌదరి సూచించారు. శనివారం ఆయన చిత్తూరు కలెక్టరేట్‌లో ప్రాసెసింగ్ యూనిట్ల నిర్వాహకులతో సమావేశమయ్యారు. మ్యాంగో బోర్డును చిత్తూరులో ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్రానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. పల్ప్ ప్రాసెసింగ్ లో రూ.8 కోట్లు బకాయిలు విడుదల చేసే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు.

10 వరకు అన్నదాత సుఖీభవ ఫిర్యాదుల స్వీకరణ

వ్యవసాయ సంచాలకులు ఢిల్లీ రావు

సాక్షి, అమరావతి: అన్నదాత సుఖీభవ పోర్టల్‌లో ప్రవేశపెట్టిన ఫిర్యాదుల స్వీకరణను ఈ నెల 10లోగా పూర్తి చేయాలని వ్యవసాయ సంచాలకులు ఎస్.ఢిల్లీరావు ఆ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శనివారం ఆయన అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఫిర్యాదుల మాడ్యూల్, గ్రీవెన్స్ మాడ్యూల్ విధానంపై జిల్లా స్థాయి వ్యవసాయ అధికారుల నుంచి రైతు సేవా కేంద్రం గ్రామ వ్యవసాయ సహాయకుల వరకూ ప్రతి ఒక్కరికీ పూర్తి స్థాయి అవగాహన ఉండాలన్నారు.

ఫ్రీ హోల్డ్ భూముల జాబితాను బయటపెట్టాలి

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

సాక్షి, అమరావతి: నిషిద్ధ జాబితా నుంచి తప్పించిన ఫ్రీ హోల్డ్ భూముల జాబితాను అన్ని గ్రామ సచివాలయాల్లోనూ బహిరంగపర్చాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి.వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 1926 నుంచి లక్షలాది మంది సన్న, చిన్నకారు రైతుల భూములు అనేక కారణాలతో 22ఎ నిషిద్ధ జాబితాల్లో ఉన్నట్టు రాష్ట్ర ప్రభుత్వమే ప్రకటించిందని గుర్తు చేశారు.

గిరిజన సంక్షేమం, అభివృద్ధికి 'ఆది కర్మయోగి'

ఏపీలో కేంద్ర బృందం పర్యటన

సాక్షి, అమరావతి: గిరిజన ప్రాంతాల్లోని ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందేలా ఆది కర్మయోగి (మిషన్ కర్మయోగి) కార్యాచరణపై కేంద్రం దృష్టి సారించింది. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు చెందిన మాస్టర్ ట్రైనర్ల ఎంపిక కార్యక్రమం చేపట్టింది. ఈ రాష్ట్రాల్లో కేంద్ర బృందాలు పర్యటిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో కేంద్ర గిరిజన సంక్షేమ మంత్రిత్వశాఖ (మోటా) అదనపు కార్యదర్శి మనీష్ ఠాకూర్ ఇటీవల విజయవాడలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం.ఎం.నాయక్‌తోపాటు పలు శాఖల అధికారులతో సమావేశమయ్యారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ నుంచి ఇద్దరు అధికారులు, వైద్య ఆరోగ్య, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ, గ్రామీణ నీటి సరఫరా (జేజేఎం), అటవీ, పాఠశాల విద్యా శాఖలకు చెందిన ఒక్కొక్క అధికారిని మాస్టర్ ట్రైనర్లుగా ఎంపిక చేయాలని మనీష్ ఠాకూర్ ఆదేశించారు. మాస్టర్ ట్రైనర్ల (అధికారులు)కు బెంగళూరులో ఈనెల 10 నుంచి 16వరకు శిక్షణ ఇస్తారు. మిషన్ కర్మయోగి తొలి దశ(ఫేజ్-1)కార్యక్రమంలో రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు, ఏలూరు, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన 751 గ్రామాలను ఎంపిక చేశారు.

దేశంలో 8 శాతం ▶ ఇన్ఫెక్షన్లకే సరైన చికిత్స

యాంటిబయోటిక్స్ అతి వినియోగంతో రోగనిరోధకత పెంచుకుంటున్న చెడు బ్యాక్టీరియా

ఫలితంగా చికిత్సల్లో పనిచేయని యాంటిబయోటిక్స్
గ్లోబల్ యాంటిబయోటిక్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ పార్టనర్‌షిప్ అధ్యయనంలో వెల్లడి



సాక్షి, అమరావతి: దేశంలో యాంటిబయోటిక్స్ అతి వినియోగం కొంప ముంచుతోంది. ఏ చిన్న అనారోగ్య సమస్యకైనా ప్రస్తుతం యాంటిబయోటిక్స్ వాడకం పెరిగిపోయింది. దీంతో శరీరంలోని వ్యాధి కారకాలు రోగనిరోధక శక్తి పెంచుకొని తీవ్ర సమస్యగా మారుతున్నాయి. చివరకు వివిధ ఇన్ఫెక్షన్లు.. వైద్య చికిత్సలకు లొంగని పరిస్థితి తలెత్తింది. ఈ సమస్య భారత్ వంటి మధ్య ఆదాయ దేశాలను వేధిస్తోందని గ్లోబల్ యాంటిబయోటిక్ రీసెర్చ్, డెవలప్‌మెంట్ పార్టనర్‌షిప్(జీఏఆర్‌డీపీ) చేపట్టిన అధ్యయనం వెల్లడించింది. భారత్‌లో 90 శాతానికి పైగా బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లకు తగిన చికిత్సలు అందడం లేదని తెలిపింది. 2019లో భారత్, బ్రెజిల్, దక్షిణాఫ్రికా సహా ఎనిమిది మధ్య ఆదాయ దేశాల్లోని 15 లక్షల కార్బపెనెం–రెసిస్టెంట్ గ్రామ్–నెగిటివ్(సీఆర్‌జీఎన్) ఇన్ఫెక్షన్ కేసుల్లో.. చికిత్సలకు యాంటిబయోటిక్స్ వినియోగంపై అధ్యయనం చేసింది. ఈ క్రమంలో భారత్‌లో కేవలం 8 శాతం కేసుల్లోనే సరైన యాంటిబయోటిక్స్ కోర్సులతో కూడిన చికిత్సలు అందాయని గుర్తించింది. న్యూమోనియా, యూరిన్ ఇతర ఇన్ఫెక్షన్లు సీఆర్‌జీఎన్ విభాగంలోకి వస్తాయి.

అడ్డుకట్ట వేయాలి..

ప్రాణాంతక ఇన్ఫెక్షన్ల బారినపడి సరైన యాంటిబయోటిక్స్ మందులు అందక రోగులు ప్రాణాలు కోల్పోతున్నారని జీఏఆర్‌డీపీ డైరెక్టర్ డాక్టర్ జెన్నిఫర్ కోన్ ఆందోళన వ్యక్తం చేశారు. రోగులు అధునాతన మౌలిక సదుపాయాలున్న ఆస్పత్రుల్లో చేరకపోవడం, కచ్చితమైన రోగనిర్ధారణ లేకపోవడం వంటివి కారణాలుగా గుర్తించామన్నారు. అలాగే భారత్‌లో కొత్త యాంటి బయోటిక్స్ అందుబాటులోకి రాకపోవడం కూడా సవాల్‌గా మారిందన్నారు. అందుబాటులో ఉన్న మందుల అతి వినియోగాన్ని కట్టడి చేసేలా ప్రభుత్వాలు పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు.

మందులకు లొంగని ఇన్ఫెక్షన్లు..

యాంటిబయోటిక్స్ అతిగా వినియోగించడం వల్ల శరీరంలోని వ్యాధి కారకాలు రోగనిరోధక శక్తిని పెంచుకోవడంతో యాంటి మైక్రోబియల్ రెసిస్టెన్స్ తీవ్ర సమస్యగా మారుతోంది. ఫలితంగా యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్, బ్లడ్ ఇన్ఫెక్షన్, న్యూమోనియా, టైఫాయిడ్ వంటి వ్యాధులకు సాధారణ యాంటిబయోటిక్ మందులతో చికిత్సలు కష్టతరంగా మారాయని గతేడాది ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్(ఐసీఎంఆర్) స్పష్టం చేసింది. సెఫోటాక్సిమ్, సెఫ్టాజిడిమ్, సిప్రోఫ్లోక్సాసిన్, లెవోఫ్లాక్ససిన్ వంటి కీలక యాంటి బయోటిక్స్.. బ్యాక్టీరియాతో కలిగే ఇన్ఫెక్షన్లను నయం చేయడంలో 20 శాతం తక్కువ ప్రభావాన్ని చూపినట్టు నిర్ధారించింది. యాంటిబయోటిక్స్ విక్రయాలు, వినియోగంపై కఠిన నిబంధనలు అమలు చేయాలని సూచించింది.


విద్యాపురోగతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ్ రామరాజు

సాక్షి, అమరావతి: పాఠశాల, విద్యార్థుల అభివృద్ధికి ఉపాధ్యాయులు, అధికారులు ప్రతి ఒక్కరూ అంకిత భావంతో కృషి చేయాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ్ రామరాజు అన్నారు. పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో శనివారం విజయవాడలో రాష్ట్ర స్థాయి విద్యా సమీక్ష నిర్వహించారు. ఇందులో ఆర్జేడీలు, అన్ని జిల్లాల డీఈవోలు, ఏపీసీలు, ఎంఈవోలు, ఏఎంవోలు, విద్యాశాఖ, సమగ్ర శిక్షలో వివిధ విభాగాల సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయ్ రామరాజు మాట్లాడుతూ.. మెగా పీటీఎంను కేవలం ఒక సాధారణ సమావేశంలా కాకుండా పండుగలా జరపాలన్నారు. అన్ని పాఠశాలల్లో పిల్లల విద్యా పురోగతి గురించిన చర్చల్లో తల్లిదండ్రులను భాగస్వాములను చేయాలన్నారు. పూర్వ విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంఘ నాయకులను ఆహ్వానించాలని సూచించారు.

తూర్పు తీరంలో పగడపు దిబ్బలు

- అంతర్జాతీయంగా అధికారిక గుర్తింపు
- ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అర్కైవ్స్‌లో ప్రచురణ
- చింతపల్లిలో అత్యధిక పగడపు దిబ్బలున్నట్టు గుర్తింపు
- పూడిమడక వద్ద ఉన్న పగడపు దిబ్బలను తరలించేందుకూ అవకాశం





విశాఖ సముద్ర గర్భంలో జీవ వైవిధ్యానికి ఈ జలచరాలే నిదర్శనం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: విశాఖ తీరంలోని పూడిమడక, రుషికొండ, మంగమారిపేట, విజయనగరం జిల్లా చింతపల్లి వద్ద అరుదైన పగడపు దిబ్బలకు అంతర్జాతీయంగా గుర్తింపు లభించింది. ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అర్కైవ్స్‌లో ప్రచురితమైన 'డైవర్సిటీ అండ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫ్ కోరల్ కమ్యూనిటీ ఫ్రం విశాఖపట్నం కోస్ట్, ఏపీ' అనే ఆర్టికల్‌లో ఈ విషయం స్పష్టమైంది. జూలై 1న ప్రచురితమైన ఈ నివేదిక, ఆంధ్రప్రదేశ్ తూర్పు తీరం కూడా పగడపు దిబ్బలకు నెలవుగా ఉందని తేటతెల్లం చేసింది. తద్వారా ఇప్పటివరకు పగడపు దిబ్బలు ఉన్నాయని పేర్కొంటూ వచ్చిన నివేదికలకు అంతర్జాతీయంగా గుర్తింపు లభించిందని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) చేసిన సర్వేలో పాల్గొన్న లివిన్ అడ్వెంచర్స్ ఫౌండర్ బలరాం 'సాక్షి'కి తెలిపారు. ఇప్పటివరకు పగడపు దిబ్బలు భారతదేశంలో లక్షద్వీప్, అండమాన్–నికోబార్, గల్ఫ్ ఆఫ్ మన్నార్, గల్ఫ్ ఆఫ్ కచ్‌లకే పరిమితమని భావించేవారు. ఇందుకు భిన్నంగా ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు తీరం కూడా పగడపు దిబ్బలకు నెలవుగా ఉందని అంతర్జాతీయ తేటతెల్లమయింది.

2019 నుంచి 2023 వరకు...!

వాస్తవానికి పగడపు దిబ్బల ఉనికి కోసం డేటాను సేకరించేందుకు, పరిశోధన చేసేందుకు 2019 నుంచి 2023 వరకు విజయనగరం జిల్లాలోని చింతపల్లి నుంచి పూడిమడక వరకూ సర్వే చేశారు. మొత్తం 15 ప్రదేశాల్లో ఈ అధ్యయనం సాగింది. ఈ అధ్యయన నివేదికలు పలుమార్లు వెలువరించారు. అయితే అంతర్జాతీయ గుర్తింపు లభించడం ఇదే మొదటిసారి. తద్వారా ఆంధ్రా తీరం సముద్ర జీవ వైవిధ్యానికి నెలవుగా ఉందని అధికారికంగా గుర్తింపు లభించిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. చింతపల్లి నుంచి పూడిమడక వరకు 15 ప్రదేశాల్లో జరిపిన అధ్యయనం సందర్భంగా సాగర గర్భంలో 30 మీటర్ల లోతుల వరకు అన్వేషణ సాగించారు. స్థానిక స్కూబా డైవింగ్ సంస్థ లివిన్ అడ్వెంచర్స్‌తో కూడిన నలుగురు శాస్త్రవేత్తల బృందం ఈ అధ్యయనాన్ని చేపట్టింది. పోరిటిడే, అగారిసిడె, డెండ్రోఫిలిడే వంటి అరుదైన పగడపు దిబ్బలున్నట్టు గుర్తించారు. వాస్తవానికి చింతపల్లి వద్ద 12 రకాల పగడపు దిబ్బలు, రుషికొండ వద్ద 6, పూడిమడక వద్ద 5, మంగమారిపేట వద్ద 3 రకాల పగడపు దిబ్బలు ఉన్నట్లు గుర్తించారు. చింతపల్లి వద్ద ఎక్కువగా పగడపు దిబ్బలు ఉన్నట్టు తెలుస్తోంది. అయితే, పూడిమడక వద్ద ఉన్న పగడపు దిబ్బల్లో కొంతభాగం తీసి మరో చోటికి తరలించి పెంచేందుకూ అవకాశం ఉందని తేలింది.

యాంటీ క్యాన్సర్ మందుల తయారీకీ...!

సముద్ర గర్భంలో ఉండే ఈ పగడపు దిబ్బలు సముద్ర పర్యావరణ పరిరక్షణకు ఎంతో ఉపయోగమనే అభిప్రాయం ఉంది. పగడాల ద్వారా వచ్చే కాల్షియం కార్బొనేట్ వల్ల ఇవి ఏర్పడతాయి. వీటిలో కొన్ని పోషకాలు ఉంటాయి. ఈ పగడపు దిబ్బల ద్వారా సముద్రంలో ఉండే జీవరాశులు మరింతగా పెరిగేందుకు దోహదం చేస్తాయనేది శాస్త్రవేత్తల అభిప్రాయం. ఈ పగడపు దిబ్బలను యాంటీ బయోటిక్స్, యాంటీ క్యాన్సర్ వంటి మెడిసిన్స్ తయారీలోనూ ఉపయోగిస్తారని తెలుస్తోంది. అంతేకాకుండా సముద్రతీరం కోతకు గురికాకుండా సహజసిద్ధంగా ఇవి కాపాడతాయని కూడా అధ్యయనాల్లో తేలింది. మరోవైపు అలల తీవ్రతను కూడా తగ్గించేందుకు ఇవి దోహదం చేస్తాయి. ఈ నేపథ్యంల ఈ పగడపు దిబ్బలు స్కూబా డైవింగ్, స్నోర్కింగ్ ద్వారా టూరిజం అభివృద్ధికి కూడా దోహదం చేస్తాయి.

అంతర్జాతీయంగా తొలిసారి గుర్తింపు

మన సముద్ర తీరంలో పగడపు దిబ్బలు ఉన్నట్టు గతంలో మేం జీఎస్ఐతో కలిపి జరిపిన అధ్యయనంలో తేలింది. అయితే, ఈ అధ్యయనానికి తొలిసారిగా ఈ నెల 1వ తేదీన ప్రచురణ ద్వారా అంతర్జాతీయ గుర్తింపు లభించింది. పగడపు దిబ్బల ద్వారా మత్స్య సంపదకు ఎంతో ఉపయోగం. కాలుష్యం బారిన పడకుండా వీటిని కాపాడుకోవాల్సిన అవసరం మాత్రం ఎంతో ఉంది.

– బలరాం, లివిన్ అడ్వెంచర్స్, ఫౌండర్

మదపుటేనుగుల కట్టడి ఇప్పట్లో లేనట్టే!

- క్యాంపునకు ఏడు కుంకీ ఏనుగులు
- వీటిలో రెండు యాక్టివ్‌గా లేనివి
- పూర్తి స్థాయి శిక్షణకే ఆరు నెలలు దాకా పట్టే అవకాశం



మొసలిమడుగు ఎలిఫెంట్ క్యాంపులో శిక్షణ పొందుతున్న ఏనుగులు

పలమనేరు: చిత్తూరు జిల్లాలోని కౌండిన్య అభయారణ్యంలో ఏనుగుల సమస్య దశాబ్దాలుగా ఉంది. కూటమి ప్రభుత్వం కుంకీ ఏనుగుల ద్వారా ఇక్కడి ఏనుగులను కట్టడి చేసేందుకు పలమనేరు మండలంలోని మొసలిమడుగు వద్ద కుంకీ ఎలిఫెంట్ ప్రాజెక్టు పనులను చేపడుతోంది. ప్రస్తుతానికి వీటికి మేతపెట్టి అవసరమైన శిక్షణతో పాటు కౌండిన్య అడవి లో తిప్పుతున్నారు. ఈ శిక్షణ మరో ఆరు నెలలు దాకా జరిగి ఆపై కౌండిన్యలోని మదపుటేనుగులను లొంగదీసుకునే పనులు జరగనున్నాయి. అప్పటిదాకా అడవిలోంచి పంటలపైకి వస్తున్న ఏనుగుల మాటేమిటని బాధిత రైతులు ప్రశ్నిస్తున్నారు.

క్యాంపులో ఏడు ఏనుగులు

కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చిన నాలుగు కుంకీలతో పాటు రామకుప్పం మండలంలోని ననియాల క్యాంపు నుంచి రెండు, తిరుపతి జూ నుంచి ఓ ఏనుగును ఇక్కడికి తరలించారు. వీటిలో ఒక్కటి గుడ్డి, మరొకటి కాలు దెబ్బతిని వృద్ధాప్యంలో ఉన్నాయి. వీటికి ట్రైనర్స్ ఆరు నెలలపాటు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది.

కౌండిన్యలో ఏనుగుల పరిస్థితి ఇదీ

పలమనేరు, కుప్పం పరిధిల్లోని కౌండిన్య అభయారణ్యంలో 120 దాకా ఏనుగులు ఉన్నాయి. తమిళనాడులోని మోర్ధన ఫారెస్ట్ నుంచి, ననియాల, కర్ణాటకలోని బన్నేరుగట్ట, బంగారుపేట, కేజీఎఫ్, తమిళనాడులోని క్రిష్ణగిరి, హోసూరు, కావేరిపట్నం తదితర ప్రాంతాల నుంచి కౌండిన్యలోకి తరచూ ఏనుగులు వస్తున్నాయి. గత పదేళ్లలో 16 ఏనుగులు చనిపోయాయి. ఏనుగుల కారణంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 14 మంది మృతి చెందగా 26 మందిదాకా గాయపడ్డారు.

మదపుటేనుగులను కట్టడికి ఏర్పాట్లు

మండలంలోని మొసలిమడుగు వద్ద రూ.12 లక్షలతో కుంకీ ఎలిఫెంట్ క్యాంపును 50 ఎకరాల్లో ఏర్పాటు చేశారు. ఏనుగుల కోసం కర్రల కంచెతో విడిది, చిన్నపాటి చెరువు, శిక్షణాస్థలం, క్రాల్స్ (మదపుటేనుగుల ను మచ్చిక చేసుకొనే చెక్క గది)ని ఏర్పాటు చేశారు. రోజూ వీటికి మేత పెట్టి అడవిలోకి పంపుతున్నారు.

సంరక్షణ భారమే

సాధారణంగా ఓ ఏనుగుకు రోజుకి 900 లీటర్ల నీరు, 10 హెక్టార్లలో ఫీడింగ్ అవసరముంది. మరోవైపు వంద ముద్దల రాగి సంగటి, బెల్లంతో కలిపిన వరిధాన్యం, వరిగడ్డి ఉండలను పొద్దున పెట్టాలి. నెలకు ఓ ఏనుగుకు రూ.లక్ష ఇలా ఏడు ఏనుగులకు ఏడు లక్షలు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

మదపుటేనుగుల కట్టడి ఎలాగంటే!

క్యాంపులోని ఏనుగులను అడవిలోకి తరలించి నాలుగు దిక్కుల్లో నాలుగు ఏనుగులను పెట్టి మధ్య లోని బలమైన కుంకీ ద్వారా మదపుటేనుగు సమీపంలోకి వెళ్లాలి. కుంకీపై ఉన్న మావటి మత్తుసూదిని మదపుటేనుగుకు వేసి అది స్పృహ కోల్పోయాక దాన్ని అక్కడున్న ఏనుగులు ముసలిమొడుగు క్యాంపుకు తరలిస్తారు. ఆపై కుంకీ ద్వారా ఏనుగుకు శిక్షణనిచ్చి దాన్ని క్యాంపులోనే కుంకీలా మార్చేస్తారు.

కుంకీలతో ఏనుగుల కట్టడి సాధ్యమే



పలమనేరులో కుంకీ ఎలిఫెంట్ క్యాంపులోని ఏనుగులకు శిక్షణ సాగుతోంది. ఆపై వీటిని అడవిలోకితీసుకెళ్లి మదపుటేనుగులను బంధించి వాటికి క్యాంపులో శిక్షణ ఇవ్వాలి. ఇదంతా త్వరగా జరిగే పనులు కావు. కానీ కొన్నాళ్ల తర్వాత కుంకీల ద్వారా మదపుటేనుగులను పట్టుకోవడంతో ఈ సమస్యకు పరిష్కారం దొరకుతుంది.

– భరణి, డీఎఫ్వో, చిత్తూరు

నిమ్మ రైతు కంట చెమ్మ

నెలరోజులుగా తగ్గిన ఎగుమతులు



తోటల్లో కాయలు వదిలేస్తున్న రైతులు

ఎన్నడూ లేని విధంగా ధరలు పతనం

తోటల లీజుదారులకు తీవ్ర నష్టాలు

ఈ ఏడాది నిమ్మ రైతుల కంట చెమ్మ ఆరడం లేదు. నెలరోజులుగా తీవ్ర నష్టాలను చవిచూస్తూ తోటల్లో కాయలను కోయాలంటేనే భయపడుతున్నారు. ఒకవేళ కోసినా కూలీలు, ఆటో బాడుగలకు సరిపోతుండటంతో కష్టమే మిగులుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెటింగ్ శాఖ అధికారులైనా పట్టించుకుని ధరలు పెరిగేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు. మార్కెట్‌కు వచ్చే కాయలను వ్యాపారులు ఏమి చేసుకోవాలో అర్థ కాని పరిస్థితిలో ఉన్నారు. -పొదలకూరు

దశాబ్దాలుగా..

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పొదలకూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో సుమారు 4,500 హెక్టార్లలోనిమ్మతోటలున్నాయి. దానినే జీవనాధారంగా చేసుకుని చిన్న, సన్నకారు రైతులు జీవిస్తున్నారు. దశాబ్దాలుగా నిమ్మను మెట్టరైతుల నుంచి వేరు చేయలేని పరిస్థితి ఏర్పడింది. అయితే సాగు, అమ్మకాల్లో ఒడిదుడుకులున్నా ఈ ఏడాది నిమ్మ మార్కెట్ అతలాకుతలమైంది. తోటలను లీజుకు తీసుకున్న వారు సైతం తీ వ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. సీజన్‌లో కాయలు లేవు. ఇప్పుడు విరగ్గాస్తుండటంతో రైతుల ఆవేదన వర్ణనాతీతంగా ఉంది. ఉత్తరాదిన వర్షాల కారణంగా డిమాండ్ తగ్గిందని చెబుతున్నారు.

వచ్చిన నగదు కూలీలకే..

సీజన్‌లో నిమ్మ తోటలో బస్తా కాయలు కోస్తే రైతుకు రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు ఆదాయం ఉంటుంది. అయితే ఇప్పుడు కాయలు కోస్తే బస్తాకు రూ.300 నుంచి రూ.500 కూడా ఆదా యం ఉండటం లేదు. దీంతో చాలామంది తోటల్లో కాయలను వదిలివేస్తున్నారు. ఒక కూలీ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కాయలు కోస్తే ప్రస్తుతం రూ.250 నుంచి రూ.300 వరకు ఇస్తున్నారు. రోజుకు ఒక కూలీ టిక్కీ (45 కిలోలు) కాయలు మాత్రమే కోస్తున్నారు. ప్రస్తుతం కిలో కాయలు రూ.16 కూడా అమ్ముడుపోవడం లేదు. ఆటో బాడుగ బస్తాకు రూ.60 చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన రైతులకు 45 కిలోల బస్తాకు ఇప్పుడు ధరల ప్రకారం కనీసం రూ.500 కూడా గిట్టుబాటు కాదు. దీంతో కాయలు కోయించేందుకు ఆసక్తి లేక చాలామంది వదిలేస్తున్నారు. కొందరు రైతులు మాత్రం కాయలు చెట్లకింద రాలిపోతే తెగుళ్ల పడతాయని కూలీలనే కోసుకుని అమ్ముకుని వచ్చే నగదును తీసుకోవాల్సిందిగా సూచిస్తున్నారు. ఫలితంగా నిమ్మ రైతు చేసిన అప్పులు తీర్చుకోలేక ఇబ్బందులు పడుతున్నారు.

అడిగే వారు లేరు



నిమ్మకాయలను అడిగే వారు లేరు. కాయలు కోయించడం వల్ల శ్రమ, నష్టం తప్పించి ఎలాంటి ఆదాయం ఉండటం లేదు. వ్యాపారులు సైతం కాయలు కొనేందుకు ఆసక్తి చూపడం లేదు. దశాబ్దాలుగా నిమ్మపై ఆధారపడుతున్న రైతులకు పెద్ద కష్టం వచ్చింది.

– వి.దయాకర్‌రెడ్డి, రైతు, కల్యాణపురం

లీజుదారులకు నష్టం



తోటలను లీజుకు తీసుకున్న వారు సైతం నష్టపోయారు. గతంలో నిమ్మకు ఇంత పెద్ద కష్టం ఎప్పుడూ రాలేదు. ఈ ప్రాంతంలో నిమ్మ రైతులు సుభిక్షంగా ఉండేవారు. సీజన్‌లో కాయలున్న వారు కొంత కోలుకున్నా, మిగిలిన వారు తీవ్రంగా నష్టపోయారు.

– జి.రామయ్య, రైతు, చెర్లోపల్లి

కోలుకోలేని దెబ్బ



నిమ్మ రైతులకు ఈ ఏడాది కోలుకోలేని దెబ్బ తగిలింది. ఉత్తరాదిన వర్షాలు తదితర కారణాలతో డిమాండ్ బాగా తగ్గింది. దీంతో ఎగుమతులు పడిపోయి కాయలు అడిగేవారు లేరు. తోటల్లో కాయలు కోస్తే నష్టపోవాల్సి వస్తోంది.

– పెంచల నారాయణరెడ్డి, రైతు, అంకుపల్లి

ఫ్యాక్టరీలకు పంపే ప్రయత్నం చేస్తాం



తమిళనాడు, గూడూరు సిట్రస్ ఫ్యాక్టరీలకు ఇక్కడి కాయలను పంపే ప్రయత్నం చేస్తాం. అయితే రైతులు ఇందుకు ఒప్పుకోవాల్సి ఉంటుంది. కాయలు నాణ్యత లేకపోవడంతో ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతులు తగ్గినట్టుగా తెలుస్తోంది. అక్టోబర్ వరకు రైతులకు ఇలాంటి ఇబ్బందులు తప్పేలా లేవు.

– అనితా కుమారి, మార్కెటింగ్ ఏడీ, నెల్లూరు

సాక్షి సినిమా



● వెంకటేశ్ ● చిరంజీవి ● ప్రభాస్

ఫ్యామిలీ మేన్

ఇటీవలి కాలంలో వెండితెరపై యాక్షన్ సినిమాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. రక్తంతో వెండితెర ఎర్రబడింది. కానీ ఈ సంక్రాంతి పండక్కి స్క్రీన్‌పై వచ్చిన ఫ్యామిలీ డ్రామా మూవీ 'సంక్రాంతికి వస్తున్నాం' థియేటర్స్‌లో నవ్వులు నింపింది. ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ కావడంతో ఫ్యామిలీ సినిమాలకు ప్రేక్షకుల్లో ఏ మాత్రం ఆదరణ తగ్గలేదని, సరైన ఫ్యామిలీ కథా కథనాలతో వస్తే బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ అవుతుందని మరోసారి నిరూపితమైంది. 'సంక్రాంతికి వస్తున్నాం, కోర్ట్' వంటి చిత్రాలు ఇందుకు తాజా ఉదాహరణలుగా నిలిచాయి. దీంతో ఇన్ని రోజులు యాక్షన్ మూవీస్ చేసిన స్టార్స్ ఇప్పుడు 'ఫ్యామిలీ మేన్'గా మారిపోయారు. కుటుంబ అనుబంధాలు, కథలతో సినిమాలు చేస్తున్నారు. ఇలా ఫ్యామిలీ సినిమాలతో ఫ్యామిలీ మేన్‌గా మారిపోయి, ఫ్యామిలీ స్టార్స్‌గా సిల్వర్ స్క్రీన్‌పైకి రానున్న కొందరు హీరోల గురించి తెలుసుకుందాం.



● రవితేజ ● రామ్ చరణ్ ● సూర్య



● నవీన్ పొలిశెట్టి ● శర్వానంద్

డ్రిల్ మాస్టర్ శివశంకర వరప్రసాద్

'రౌడీ అల్లుడు, బావగారూ.. బాగున్నారా!, శంకర్‌దాదా ఎమ్‌బీబీఎస్' వంటి చిత్రాల్లో చిరంజీవి చేసిన ఫన్ పెర్ఫార్మెన్స్ ప్రేక్షకులను అలరించింది. ఆ తరహా వింటేజ్ చిరంజీవిని మళ్లీ వెండితెరపైకి తీసుకువచ్చే పనిలో ఉన్నారు దర్శకుడు అనిల్ రావిపూడి. వెంకటేశ్‌తో 'సంక్రాంతికి వస్తున్నాం' వంటి బ్లాక్‌బస్టర్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రాన్ని తీసిన అనిల్ రావిపూడి ప్రస్తుతం చిరంజీవితో ఓ సినిమా చేస్తున్నారు. 'సంక్రాంతికి వస్తున్నాం' తరహాలోనే ఈ మూవీ కూడా మంచి ఫ్యామిలీ డ్రామా. ఈ చిత్రంలో చిరంజీవి సరసన నయనతార నటిస్తున్నారు. ఈ సినిమా ఇప్పటికే రెండు షెడ్యూల్స్ పూర్తి చేసుకుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ జరుగుతోందని తెలిసింది. కాగా ఈ సినిమాలో శివశంకర వరప్రసాద్ అనే డ్రిల్ మాస్టర్ పాత్రలో చిరంజీవి కనిపిస్తారని, చిరంజీవి–నయనతార ఈ చిత్రంలో భార్యాభర్తలుగా నటిస్తున్నారని తెలిసింది. ఇంకా ఈ సినిమాలో వెంకటేశ్, క్యాథరిన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారని, ఇటీవల జరిగిన ముస్సోరి షూటింగ్ షెడ్యూల్‌లో క్యాథరిన్ పాల్గొన్నారని, నెక్ట్స్ జరగబోయే ఈ సినిమా షూటింగ్ షెడ్యూల్‌లో వెంకటేశ్ సైతం పాల్గొంటారని తెలిసింది. ఇక ఈ సినిమాలో వింటేజ్ చిరంజీవిని ఆడియన్స్ స్క్రీన్‌పై చూస్తారని, ఈ సినిమాలో 70 శాతం వినోదం, 30 శాతం ఎమోషన్ ఉంటుందని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పారు దర్శకుడు అనిల్ రావిపూడి. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది సంక్రాంతికి రిలీజ్ కానుంది.

తాత-మనవడి కథ

ప్రభాస్ చేతిలో ప్రస్తుతం నాలుగైదు సినిమాలు ఉన్నాయి. వీటిలో 'ది రాజాసాబ్' కూడా ఒకటి. ఈ సినిమాకు మారుతి దర్శకుడు. ఈ సినిమా హారర్ కామెడీ జానర్ నేపథ్యంలో సాగుతుంది. కానీ ఈ సినిమా ప్రధాన కథాంశం మాత్రం తాత-మనవడి నేపథ్యంలో సాగుతుందని, ఈ సినిమా టీజర్ లాంచ్ సందర్భంగా దర్శకుడు మారుతి కన్ఫార్మ్ చేశారు. ఈ చిత్రంలో ప్రభాస్ తాతయ్య పాత్రలో సంజయ్ దత్ కనిపిస్తారని సమాచారం. అంతేకాదు... ఈ సినిమాలో ప్రభాస్ క్యారెక్టర్‌లో డిఫరెంట్ షేడ్స్ ఉంటాయని తెలిసింది. నిధీ అగర్వాల్, రిద్ధీ కుమార్, మాళవికా మోహనన్ ఈ చిత్రంలో హీరోయిన్లుగా నటిస్తున్నారు. సంజయ్ దత్, అనుపమ్ ఖేర్, సముద్రఖని, వీటీవీ గణేశ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న 'ది రాజాసాబ్' సినిమా డిసెంబరు 5న విడుదల కానుంది.

ఆనంద నిలయం

ఈ ఏడాది సంక్రాంతి పండక్కి, 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్నారు హీరో వెంకటేశ్. ఈ సినిమా దాదాపు రూ. 300 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించిందని, చిత్రయూనిట్ పేర్కొంది. వెంకటేశ్ కెరీర్‌లో ప్రస్తుతానికి టాప్ కలెక్షన్ మూవీ ఇది. ఇక 'సంక్రాంతికి వస్తున్నాం' తర్వాత మళ్లీ ఇదే తరహా సినిమా చేయాలని వెంకటేశ్ భావిస్తున్నారట. ఈ తరుణంలో దర్శకుడు త్రివిక్రమ్ చెప్పిన ఓ కథకు వెంకటేశ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, ఈ ఆగస్టు నుంచి ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఈ చిత్రంలో ఇద్దరు హీరోయిన్లు ఉంటారనే టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతానికి నిధీ అగర్వాల్, త్రిష, రుక్మిణీ వసంత్ వంటి హీరోయిన్ల పేర్లను పరిశీలిస్తున్నారట మేకర్స్. అంతేకాదు... ఈ సినిమాకు 'కేరాఫ్ ఆనందనిలయం', 'వెంకటరమణ', 'ఆనందరామయ్య' అనే టైటిల్స్‌ని పరిశీలిస్తున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. ఇక వెంకటేశ్ కెరీర్‌లో సూపర్‌హిట్ సినిమాలైన 'నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి'లకు త్రివిక్రమ్ ఓ రైటర్‌గా వర్క్ చేశారు. ఇప్పుడు వెంకటేశ్ హీరోగా ఆయన డైరెక్షన్‌లో ఓ సినిమా రానుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమాపై అంచనాలు ఉన్నాయి. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై సూర్యదేవర రాధాకృష్ణ ఈ సినిమాను నిర్మించనున్నారని సమాచారం. నిజానికి వెంకటేశ్ హీరోగా త్రివిక్రమ్ డైరెక్షన్‌లో ఓ సినిమా ఎప్పుడో రావాల్సింది. కానీ కొన్ని కారణాల వల్ల వాయిదా పడుతూ వస్తోంది. మరి... ఈసారి వీరి కాంబినేషన్‌లోని సినిమా సెట్స్‌కు వెళ్తుందా? లెట్స్ వెయిట్ అండ్ సీ.

అనార్కలి

'రావణాసుర, టైగర్ నాగేశ్వరరావు, ఈగల్, మిస్టర్ బచ్చన్, మాస్ జాతర' (రిలీజ్ కావాల్సి ఉంది)... ఇలా వరుసగా యాక్షన్ సినిమాలు చేస్తున్నారు హీరో రవితేజ. ఈ యాక్షన్‌కు కాస్త బ్రేక్ ఇచ్చి, ప్రజెంట్ 'అనార్కలి' (ప్రచారంలో ఉన్న టైటిల్) అనే ఓ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీ చేస్తున్నారాయన. 'నేను... శైలజ, ఆడవాళ్ళు మీకు జోహార్లు, చిత్రలహరి' వంటి సినిమాలను తీసిన కిశోర్ తిరుమల ఈ 'అనార్కలి' సినిమాకు దర్శకుడు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. నెక్ట్స్ షెడ్యూల్‌ను స్పెయిన్‌లో ప్లాన్ చేశారని ఫిల్మ్‌నగర్ సమాచారం. అయితే ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రలను ఎవరు చేస్తున్నారనే విషయంపై ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. ఆషికా రంగనాథ్, కేతికా శర్మ, మమితా బైజు వంటి వార్ల పేర్లు తెరపైకి వచ్చాయి. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల కానుంది.

కాస్త ఆలస్యంగా...

'గోవిందుడు అందరివాడేలే, బ్రూస్ లీ: ది ఫైటర్' వంటి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సినిమాలు రామ్ చరణ్ కెరీర్‌లో ఉన్నాయి. కానీ ఈ మధ్య ఫ్యామిలీ సినిమాలకు రామ్ చరణ్ కాస్త దూరమైపోయారని ఆయన అభిమానులు ఫీల్ అవుతున్నారు. ఈ క్రమంలో రామ్‌చరణ్ ఓ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సినిమాను ఓకే చేశారని, ఈ సినిమాకు త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ఈ సినిమాకు పవన్ కల్యాణ్ ఓ నిర్మాతగా ఉంటారనే ప్రచారం సాగుతోంది. అయితే వెంకటేశ్‌తో త్రివిక్రమ్ ఓ సినిమా చేయాల్సి ఉంది. ఆ తర్వాత ఎన్టీఆర్‌తో కూడా త్రివిక్రమ్ ఓ సినిమా చేస్తారని తెలిసింది. ఈ రెండు సినిమాలను పూర్తి చేసిన తర్వాత రామ్ చరణ్‌తో సినిమాను సెట్స్‌కు తీసుకువెళ్తారట త్రివిక్రమ్. ఈలోపు ప్రస్తుతం 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబుతో చేస్తున్న 'పెద్ది' సినిమా చిత్రీకరణను రామ్‌చరణ్ పూర్తి చేస్తారు. ఆ తర్వాత సుకుమార్‌తో సినిమా చేస్తారు రామ్ చరణ్. ఈ నేపథ్యంలో త్రివిక్రమ్‌తో రామ్ చరణ్ సినిమాపై ఓ క్లారిటీ రావడానికి మరింత సమయం పట్టేలా ఉందని తెలుస్తోంది.

విశ్వనాథన్ అండ్ సన్స్

'రంగ్ దే, లక్కీ భాస్కర్' వంటి ఫ్యామిలీ ఫీల్ ఉన్న సినిమాలను తీసిన దర్శకుడు వెంకీ అట్లూరి తాజాగా హీరో సూర్యతో సినిమా చేస్తున్నారు. తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతున్న ఈ ద్విభాషా చిత్రంలో మమితా బైజు హీరోయిన్‌గా చేస్తుండగా, రవీనా టాండన్, రాధికా శరత్ కుమార్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం కంప్లీట్ ఫ్యామిలీ డ్రామా అని, ఇందులో ఉన్న కుటుంబ భావోద్వేగాలు ప్రేక్షకులను అలరిస్తాయని ఇటీవల దర్శకుడు వెంకీ అట్లూరి చెప్పుకొచ్చారు. వెంకీ అట్లూరి మాటలకు తగ్గట్లే సూర్య కెరీర్‌లోని ఈ 46వ సినిమాకు 'విశ్వనాథన్ అండ్ సన్స్' అనే టైటిల్‌ని మేకర్స్ పరిశీలిస్తున్నారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది వేసవిలో రిలీజ్ కానుంది.

మూడు తరాల కథ

ఓ కుటుంబంలోని మూడు తరాల కథను వెండితెరపై చూపించనున్నారు హీరో శర్వానంద్. అభిలాష్ కంకర దర్శకత్వంలో శర్వానంద్ హీరోగా ఓ స్పోర్ట్స్ డ్రామా సినిమా రానుంది. ఈ సినిమా ప్రధాన నేపథ్యం మూడు తరాల కథ అని మేకర్స్ ఆల్రెడీ తెలిపారు. 1990, 2020... ఇలా డిఫరెంట్ టైమ్‌లైన్స్‌తో ఈ సినిమా కథనం ఉంటుందని తెలుస్తోంది. మాళవికా నాయర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో బ్రహ్మాజీ, అతుల్ కులకర్ణి ఇతర కీలక పాత్రల్లో కనిపిస్తారు. యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ – ప్రమోద్ నిర్మిస్తున్న ఈ సినిమాకు 'రేస్ రాజా' టైటిల్‌ను అనుకుంటున్నారని, షూటింగ్ దాదాపు పూర్తి కావొచ్చిందని, త్వరలోనే ఈ సినిమా రిలీజ్ డేట్‌పై ఓ స్పష్టత రానుందని సమాచారం. ఇంకా శర్వానంద్ హీరోగా చేస్తున్న మరో చిత్రం 'నారీ నారీ నడుమ మురారి'. ఈ చిత్రంలో సంయుక్త, సాక్షి వైద్య హీరోయిన్లు. ఫ్యామిలీ ఎమోషన్స్, లవ్ ప్రధానాంశాలుగా తెరకెక్కుతున్న ఈ సినిమాను రామ్ అబ్బరాజు దర్శకత్వంలో అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు.

రాజు కథ

'అనగనగా ఒక రాజు' కథను ఈ ఏడాది థియేటర్స్‌లో చూడమంటున్నారు యువ హీరో నవీన్ పొలిశెట్టి. మారి దర్శకత్వంలో నవీన్ పొలిశెట్టి, మీనాక్షీ చౌదరి హీరో హీరోయిన్లుగా చేస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం 'అనగనగా ఒక రాజు'. ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ఓ పెళ్లి నేపథ్యంలో సాగే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం ప్రేక్షకులను నవ్విస్తుందని, అలాగే హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాలు కూడా ఉంటాయని తెలిసింది. శ్రీకర స్టూడియో సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే సంక్రాంతికి విడుదల కానుంది.

ఇంకా తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బా జంటగా చేస్తున్న 'ఓం శాంతి శాంతి శాంతిః' (మలయాళ హిట్ 'జయ జయ జయ జయహే' తెలుగు రీమేక్), సుహాస్ – మాళవిక మనోజ్‌లు నటించిన 'ఓ భామ అయ్యో రామ' చిత్రాలు కూడా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ నేపథ్యంలో ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. రామ్ గోధల దర్శకత్వంలో హరీష్ నల్ల నిర్మించిన 'ఓ భామ అయ్యో రామ' చిత్రం ఈ నెల 11న, ఏఆర్ సజీవ్ డైరెక్షన్‌లోని 'ఓం శాంతి శాంతి శాంతిః' సినిమా ఆగస్టు 1న రిలీజ్‌కి రెడీ అయ్యాయి. ఇంకా ప్రేక్షకుల ముందుకు రానున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రాలు మరికొన్ని ఉన్నాయి.

– ముసిమి శివాంజనేయులు

వెండితెరపై ఎంట్రీ



● సురేష్ రైనా

టీమిండియా మాజీ క్రికెటర్ సురేష్ రైనా వెండితెరపై ఎంట్రీ ఇస్తున్నారు. ఈ చిత్రానికి లోగన్ దర్శకత్వం వహించనున్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సురేష్ రైనా క్రికెట్ నేపథ్యంలో రానున్న ఈ తమిళ చిత్రం ద్వారా నటుడిగా అరంగేట్రం చేయనున్నారు. డ్రీమ్ నైట్ స్టోరీస్ బ్యానర్‌పై శ్రవణ కుమార్ ఈ సినిమా నిర్మించనున్నారు. చెన్నైలో జరిగిన వేడుకలో ఈ చిత్రాన్ని ప్రకటించారు. క్రికెటర్ శివమ్ దూబే నిర్మాణ సంస్థ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సురేష్ రైనా ట్విట్టర్ వేదికగా ఓ పోస్ట్ చేశారు. ''క్రికెట్ మైదానం నుంచి కోలీవుడ్ ఫ్రేమ్స్ దాకా.. చెన్నై నాలో నిండి నన్ను ముందుకు నడిపిస్తోంది. నా ఈ కొత్త ప్రయాణంలో డీకేఎస్ సంస్థతో జట్టుకట్టడం ఎంతో గర్వంగా ఉంది'' అని పేర్కొన్నారు. ప్రస్తుతం కుటుంబంతో కలిసి నెదర్లాండ్స్ పర్యటనలో ఉన్న సురేష్ రైనా వర్చ్యువల్‌గా ఈ ఈవెంట్‌లో పాల్గొని, తన సంతోషం వ్యక్తం చేశారు. ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహించిన రైనా చిన్న తల (చిన్న నాయకుడు)గా తమిళనాడులో విశేష అభిమానులను సంపాదించుకున్నారు.


డెకాయిట్ కోసం..



● మృణాల్ ఠాకూర్

'డెకాయిట్' కోసం హైదరాబాద్ చేరుకున్నారు మృణాల్ ఠాకూర్. అడివి శేష్, మృణాల్ ఠాకూర్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఇంటెన్స్ యాక్షన్ లవ్‌స్టోరీ చిత్రం 'డెకాయిట్'. 'ఏక్ ప్రేమ్ కథ' అనేది ట్యాగ్‌లైన్. షనీల్ డియో డైరెక్షన్‌లో రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. తాజాగా ఈ సినిమా సెట్స్‌లోకి అడుగుపెట్టారు మృణాల్ ఠాకూర్. 'డెకాయిట్' సినిమా సెట్స్‌లోకి జాయిన్ అయినట్లుగా తన ఇన్‌స్టా అకౌంట్‌లో కన్ఫార్మ్ చేశారీ బ్యూటీ. ఈ కీలక షెడ్యూల్‌తో ఈ సినిమా చిత్రీకరణ దాదాపు తుది దశకు చేరుకుంటుందట. ఇద్దరు మాజీ ప్రేమికులు తమకు ఇష్టం లేకపోయినా ఓ క్రైమ్‌ను కలిసి చేయాల్సి వస్తే ఏం జరుగుతుంది? అన్నదే ఈ సినిమా కథాంశమనే ప్రచారం సాగుతోంది. అంతేకాదు... ఈ సినిమాలోని కొంత భాగం రాయలసీమ నేపథ్యంలో ఉంటుందని, మదనపల్లె యాసలో అడివి శేష్ క్యారెక్టర్ ఉంటుందని ఫిల్మ్‌నగర్ భోగట్టా. ఇక ఈ సినిమాలో బాలీవుడ్ దర్శక–నిర్మాత–నటుడు అనురాగ్ కశ్యప్ పోలీస్ ఆఫీసర్‌గా చేస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్న ఈ సినిమా డిసెంబరు 25న విడుదల కానుంది.

కచ్చితంగా ఆపగలం



● ఆర్‌కే సాగర్

'మొగలి రేకులు' సీరియల్ ఫేమ్ ఆర్‌కే సాగర్ హీరోగా నటించిన చిత్రం 'ది 100'. రాఘవ్ ఓంకార్ శశిధర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మిషా నారంగ్ కథానాయికగా నటించగా, ధన్యా బాలకృష్ణ కీలక పాత్ర పోషించారు. కేఆర్‌ఐఏ ఫిల్మ్ కార్ప్, దమ్మ ప్రొడక్షన్స్ బ్యానర్లపై రమేష్ కరుటూరి, వెంకీ పుషదపు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, హీరో పవన్ కల్యాణ్ ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేసి, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. 'జీవితంలో జరిగిపోయినది మనం మార్చలేం... కానీ జరగబోయేదాన్ని కచ్చితంగా ఆపగలం' అనే విక్రాంత్ ఐపీఎస్ వాయిస్ ఓవర్‌తో ట్రైలర్ ప్రారంభమవుతుంది. ''యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రంలో విక్రాంత్ ఐపీఎస్‌గా ఆర్‌కే సాగర్ అద్భుతంగా నటించారు. మిషా నారంగ్ పాత్ర కథకు రొమాంటిక్ టచ్‌ను యాడ్ చేస్తుంది'' అని పేర్కొన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, కెమెరా: శ్యామ్ కె. నాయుడు.

బిజినెస్ రీల్

టీసీఎస్ ఇన్‌క్విజిటివ్ 2025 పోటీలకు రిజిస్ట్రేషన్ షురూ



ముంబై: ఐటీ సేవల దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) హై స్కూల్ విద్యార్థుల కోసం ఉద్దేశించిన ఇన్‌క్విజిటివ్ 2025 ఇంటర్–స్కూల్ క్విజ్ పోటీలకు రిజిస్ట్రేషన్లు ప్రారంభించినట్లు తెలిపింది. 8–12 తరగతుల విద్యార్థులు ఇందులో పాల్గొనవచ్చు. కరెంట్ అఫైర్స్, సైన్స్, టెక్నాలజీ, బిజినెస్, కళలు, సంస్కృతి, క్లౌడ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తదితర అంశాలు ఇందులో ఉంటాయి. ప్రాంతీయ రౌండ్లను హైదరాబాద్, చెన్నై తదితర 12 నగరాల్లో, సెమీ–ఫైనల్స్, గ్రాండ్ ఫినాలేని ముంబైలోను నిర్వహిస్తారు. రిజిస్ట్రేషన్ ఉచితమని సంస్థ వీపీ (హెచ్ఆర్) కె. సుదీప్ తెలిపారు.

అర్థ గ్లోబల్ రూ. 700 కోట్ల పెట్టుబడులు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రత్యామ్నాయ పెట్టుబడి ఫండ్స్‌లో మూడో కేటగిరీకి చెందిన అర్థ గ్లోబల్ ఆపర్చూనిటీస్ ఫండ్ తాజాగా భారత్‌లో తొలి ఇన్వెస్ట్‌మెంట్ చేసింది. హైదరాబాద్‌లోని ఫీనిక్స్ ట్రైటాన్ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు రూ. 700 కోట్లు పెట్టుబడి పెట్టింది. ఇందుకోసం నాలుగేళ్ల నాన్–కన్వర్టబుల్ డిబెంచర్లలో ఇన్వెస్ట్ చేసింది. ప్రాజెక్ట్ అమ్మకాల పనితీరు ఆధారంగా దీనిపై రాబడులు ఉంటాయని సంస్థ వెల్లడించింది.

హైదరాబాద్‌లో గుడ్‌వర్క్స్ కోవర్క్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రీమియం మేనేజ్డ్ ఆఫీస్ ప్లాట్‌ఫాం గుడ్‌వర్క్స్ కోవర్క్ సంస్థ హైదరాబాద్ మార్కెట్లోకి అడుగుపెట్టింది. ఇందుకోసం రియల్ ఎస్టేట్ డెవలపర్ ఏక్తా గ్రూప్‌తో జట్టు కట్టింది. ఈ ఒప్పందంలో భాగంగా హైదరాబాద్‌లో సుమారు 1,50,000 చ.అ. విస్తీర్ణంతో గుడ్‌వర్క్స్ రెండు సెంటర్లను ఆవిష్కరిస్తుంది. అంకుర సంస్థలు, భారీ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ) మొదలైన వాటి అవసరాలను తీర్చే విధంగా ఇవి ఉంటాయి. భారత్‌లో కార్యకలాపాలు ప్రారంభించాలనుకునే విదేశీ సంస్థలకు మౌలిక సదుపాయాలు, సిబ్బంది, సలహా సేవలు మొదలైనవి కూడా అందించే సాన్‌సోవీజీసీసీ ప్లాట్‌ఫాంను కూడా ప్రారంభిస్తున్నట్లు సంస్థ సహ–వ్యవస్థాపకుడు విశ్వాస్ ముద్గల్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో వైజాగ్, విజయవాడ నగరాలకు కూడా ఈ భాగస్వామ్యాన్ని విస్తరించనున్నట్లు ఏక్తా గ్రూప్ సీఎండీ శ్రీనివాస ముసాని తెలిపారు.

బీఎల్‌డీసీ ఫ్యాన్స్ మార్కెట్లోకి నిప్పో



బెంగళూరు: నిప్పో బ్రాండ్ కింద కన్జూమర్ ఎలక్ట్రికల్ ఉత్పత్తులు తయారు చేసే ఇండో నేషనల్ లిమిటెడ్ తమ హోమ్ సొల్యూషన్స్ పోర్ట్‌ఫోలియోను విస్తరించింది. కొత్తగా రెండు బీఎల్‌డీసీ (బ్రష్‌లెస్ డైరెక్ట్ కరెంట్) సీలింగ్ ఫ్యాన్స్‌ను ప్రవేశపెట్టింది. తక్కువ విద్యుత్ వినియోగించి, అత్యుత్తమ పనితీరు కనపర్చేవిగా ఇవి ఉంటాయని సంస్థ సీఈవో బీవీఎస్ పవన్ కుమార్ తెలిపారు. ఏటా ఒక్కో ఫ్యాన్‌తో రూ. 1,870 మేర విద్యుత్ బిల్లు ఆదా అవుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశీయంగా బీఎల్‌డీసీ ఫ్యాన్ల మార్కెట్ సుమారు రూ. 1,000 కోట్ల స్థాయిలో ఉందని, వచ్చే అయిదేళ్లలో 10 శాతం మార్కెట్ వాటా దక్కించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

6-7-2025

విశాఖ	560–00
చిత్తూరు	633–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	535–00
విజయవాడ	570–00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	560–00
వరంగల్	562–00
రిటైల్ ధర	6.20

కెమికల్స్ దిగ్గజంగా భారత్!!

ప్రపంచ స్థాయి రసాయన హబ్‌లు నెలకొల్పాలి

- 8 పోర్ట్–ఇన్‌ఫ్రా క్లస్టర్లు ఏర్పాటు చేయాలి
- అప్పుడే అగ్రగామిగా ఎదుగుతాం
- నీతి ఆయోగ్ నివేదిక



న్యూఢిల్లీ: దేశీయంగా ప్రపంచ స్థాయి కెమికల్ హబ్స్‌ను నెలకొల్పడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని నీతి ఆయోగ్ ఒక నివేదికలో సూచించింది. అలాగే అత్యధిక సామర్థ్యాలుండే ఎనిమిది పోర్ట్–ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ క్లస్టర్లను ఏర్పాటు చేయాలని పేర్కొంది. అప్పుడే గ్లోబల్ కెమికల్ తయారీ దిగ్గజంగా భారత్ ఎదగగలదని పేర్కొంది. ''రసాయనాల పరిశ్రమ: అంతర్జాతీయ వేల్యూ చెయిన్‌లో (జీవీసీ) భారత భాగస్వామ్యానికి దన్ను'' పేరిట రూపొందించిన నివేదికలో ఈ విషయాలు వివరించింది. 2040 నాటికి భారత్ 1 లక్ష కోట్ల డాలర్ల రసాయనాల ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నట్లు నీతి ఆయోగ్ తెలిపింది. నివేదిక ప్రకారం.. 2023లో జీవీసీలో 3.5 శాతంగా ఉన్న భారత్ వాటా 2040 నాటికి 5–6 శాతానికి పెరగనుందని, 2030 నాటికి అదనంగా 7 లక్షల ఉద్యోగాల కల్పన జరుగుతుందని వివరించింది. గ్లోబల్ కెమికల్ వేల్యూ చెయిన్‌లో భారత్ వాటా 3.5 శాతమే ఉండటం, 2023లో రసాయనాల వాణిజ్య లోటు 31 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉండటమనేది ముడి సరుకు, ఇతరత్రా స్పెషాలిటీ రసాయనాల కోసం ఎక్కువగా దిగుమతులపైనే ఆధారపడాల్సి వస్తున్న విషయాన్ని తెలియజేస్తోందని రిపోర్ట్ పేర్కొంది.

నివేదికలోని మరిన్ని విశేషాలు..

- సమగ్ర ఆర్థిక, ఆర్థికేతర సంస్కరణలు అమలు చేస్తే భారత రసాయనాల పరిశ్రమ 2040 నాటికి 1 లక్ష కోట్ల డాలర్ల స్థాయికి చేరేందుకు, జీవీసీలో వాటాను 12 శాతానికి పెంచుకునేందుకు దోహదపడుతుంది. తద్వారా శక్తివంతమైన గ్లోబల్ కెమికల్ కేంద్రంగా భారత్ ఎదగవచ్చు.
- కేంద్ర స్థాయిలో ఒక సాధికారిక కమిటీని వేయాలి. ఉమ్మడిగా మౌలిక సదుపాయాల అభివృద్ధి, వీజీఎఫ్ మొదలైన వాటి కోసం బడ్జెట్ కేటాయింపులతో సాధికారిక కమిటీ కింద కెమికల్ ఫండ్ ఏర్పాటు చేయాలి. హబ్ స్థాయిలోని అడ్మినిస్ట్రేటివ్ యంత్రాంగం, మొత్తం హబ్ నిర్వహణను పర్యవేక్షించాలి.
- పోర్టుల్లో రసాయనాల ట్రేడింగ్‌కు సవాలుగా ఉంటున్న మౌలిక సదుపాయాల అంతరాలను పరిష్కరించడంలో పోర్టులకు తగు సూచనలివ్వగలిగేలా కెమికల్ కమిటీ కూర్పు ఉండాలి. అత్యధిక సామర్థ్యాలున్న 8 పోర్ట్ క్లస్టర్స్‌ను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.
- దిగుమతులు, ఎగుమతి సామర్థ్యాలు, సోర్సింగ్ కోసం ఒకే దేశంపై ఆధారపడటం, మార్కెట్ ప్రాధాన్యత తదితర అంశాల ఆధారంగా అదనంగా రసాయనాలను ఉత్పత్తి చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలివ్వాలి.
- పారదర్శకంగా, జవాబుదారీతనంతో ఉండేలా పర్యావరణ అనుమతుల (ఈసీ) ప్రక్రియను వేగవంతం చేయాలి. కాల పరిమితులు, నిబంధనల అమలును పర్యవేక్షించేలా పరిశ్రమలు, అంతర్గత వాణిజ్యం ప్రోత్సాహక విభాగం డీపీఐఐటీ కింద ఆడిట్ కమిటీని ఏర్పాటు చేయడం ద్వారా ఈసీ క్లియరెన్స్ ప్రక్రియలను సరళతరం, వేగవంతం చేయాలి. తరచుగా నివేదికలను ప్రచురించాలి. ఈఏసీకి మరింత స్వయం ప్రతిపత్తినివ్వాలి.
- స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల్లో (ఎఫ్‌టీఏ) రసాయనాల పరిశ్రమ కోసం నిర్దిష్ట నిబంధనలను చేర్చేలా భారత్ చర్చలు జరపవచ్చు. పరిశ్రమ ప్రయోజనాలను పరిరక్షించేలా టారిఫ్ కోటాలు లేదా కీలకమైన ముడిసరుకు, పెట్రోకెమికల్ ఫీడ్‌స్టాక్‌లపై సుంకాలపరంగా మినహాయింపులులాంటివి చేర్చే అవకాశాలను పరిశీలించవచ్చు.
- అంతర్జాతీయంగా పోటీపడటంలో భారత రసాయన రంగం పలు సవాళ్లను ఎదుర్కొంటోంది. ముఖ్యంగా ఫీడ్‌స్టాక్ కోసం ఎక్కువగా దిగుమతులపై ఆధారపడటం పెద్ద సవాలుగా ఉంటోంది. ఫలితంగా 2023లో 31 బిలియన్ డాలర్ల మేర వాణిజ్య లోటు నమోదైంది.
- అంతర్జాతీయంగా పోటీ సంస్థలతో పోల్చి చూసినప్పుడు మౌలిక సదుపాయాల్లో అంతరాలు, కాలం చెల్లిన పారిశ్రామిక క్లస్టర్లు, భారీ స్థాయి లాజిస్టిక్స్ వ్యయాలు మొదలైనవి దేశీ సంస్థలకు ప్రతికూలంగా ఉంటున్నాయి.
- దీనికి తోడు పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలపై భారత్ పెట్టే పెట్టుబడులు కూడా చాలా తక్కువగా ఉంటున్నాయి. అంతర్జాతీయంగా ఇది సగటున 2.3 శాతంగా ఉండగా, భారత్‌లో 0.7 శాతంగానే ఉంది. అత్యంత విలువైన రసాయనాలను దేశీయంగా ఆవిష్కరించడానికి ఇది ఆటంకంగా ఉంటోంది.
- నియంత్రణ సంస్థలపరమైన జాప్యాలు, ముఖ్యంగా పర్యావరణ అనుమతులపరంగా నెలకొన్న సవాళ్లు, పరిస్థితులకు తగ్గట్లు పరిశ్రమ ఎదగడంలో అవరోధాలుగా ఉంటున్నాయి.
- పరిశ్రమలో నైపుణ్యాలున్న ప్రొఫెషనల్స్ కొరత 30 శాతం మేర ఉంది. ముఖ్యంగా గ్రీన్ కెమిస్ట్రీ, నానోటెక్నాలజీ, ప్రాసెస్ సేఫ్టీ లాంటి కొత్త విభాగాల్లో ఇది మరింత తీవ్రంగా ఉంది.
- ప్రస్తుత సవాళ్లను పరిష్కరించి, ప్రతిపాదిత సంస్కరణలను అమలు చేస్తే, భారత్ అంతర్జాతీయంగా పోటీ పడే సామర్థ్యాలను పెంచుకోవచ్చు. పెట్టుబడులను ఆకర్షించవచ్చు. గ్లోబల్ వేల్యూ చెయిన్‌కి సారథ్యం వహించేలా రసాయనాల రంగాన్ని పటిష్టంగా తీర్చిదిద్దుకోవచ్చు.

సారస్వత్ బ్యాంక్‌లో న్యూ ఇండియా కోపరేటివ్ విలీనం



ముంబై: సంక్షోభం ఎదుర్కొంటున్న న్యూ ఇండియా కోపరేటివ్ బ్యాంక్ (ఎన్ఐసీబీ)ను విలీనం చేసుకుంటున్నట్లు దేశంలోనే అతిపెద్ద పట్టణ సహకార బ్యాంక్ అయిన సారస్వత్ కోపరేటివ్ బ్యాంక్ ప్రకటించింది. దీంతో ఎన్ఐసీబీకి చెందిన 1.22 లక్షల మంది డిపాజిటర్లు ఎలాంటి నష్టాన్ని ఎదుర్కోవాల్సిన అవసరం లేదని.. వారి పొదుపు నిధులన్నీ భద్రంగా ఉంటాయని సారస్వత్ బ్యాంక్ చైర్మన్ గౌతమ్ ఠాకూర్ తెలిపారు. ప్రస్తుతం ఎన్ఐసీబీ ఒక్కో కస్టమర్ గరిష్ఠంగా రూ.25,000 ఉపసంహరణకు పరిమితం చేయగా.. విలీనం తర్వాత వారి పూర్తి డిపాజిట్ మొత్తాన్ని వెనక్కి తీసుకునేందుకు వీలుంటుందని చెప్పారు. ఈ విలీనం సెప్టెంబర్ చివరికి ముగుస్తుందన్నారు. ఎన్ఐసీబీ విలీనం కోసం తామే స్వచ్ఛందంగా ఆర్‌బీఐని సంప్రదించినట్టు చెప్పారు. సంక్షోభంలో పడిన ఏడు బ్యాంక్‌లను గతంలో విలీనం చేసుకున్నట్టు గుర్తు చేస్తూ.. ఇదే మాదిరి ఎన్ఐసీబీ విలీనంపైనా నమ్మకం వ్య క్తం చేశారు. ఎన్ఐసీబీలో యాజమాన్యం రూ.122 కోట్ల నిధులను దుర్వినియోగం చేసిన విషయం ఇటీవలే వెలుగులోకి రావడం గమనార్హం.

ఎఫ్‌ఎంసీజీ కంపెనీలపై వాతావరణ ప్రభావం

- ఆదాయ వృద్ధి ప్రభావితం కావొచ్చు
- సీక్వెన్షియల్‌గా చూస్తే కోలుకున్న డిమాండ్



న్యూఢిల్లీ: జూన్ త్రైమాసికంలో తమ ఆదాయం వృద్ధిపై వాతావరణ మార్పులు ప్రభావం చూపించి ఉండొచ్చని ప్రముఖ ఎఫ్‌ఎంసీజీ కంపెనీలు పేర్కొన్నాయి. అకాల వర్షాలు, వేసవి సీజన్ స్వల్పకాలం పాటే ఉండడం, కీలక ముడి సరుకులపై ద్రవ్యోల్బణం ప్రభావం ఆదాయం వృద్ధిపై ఉంటుందని తెలిపాయి. దీంతో సింగిల్ డిజిట్‌కే ఆదాయం వృద్ధి పరిమితం కావొచ్చని అంచనా వేశాయి. అయితే సీక్వెన్సియల్‌గా చూస్తే (మార్చి త్రైమాసికం నుంచి) డిమాండ్ జూన్ త్రైమాసికంలో కోలుకున్నట్టు చెప్పాయి. ముఖ్యంగా పట్టణ మార్కెట్లలో అమ్మకాలు పుంజుకున్నట్టు వెల్లడించాయి. భారత వ్యాపారం జూన్ త్రైమాసికంలో సాధారణం కంటే తక్కువ పనితీరును చూపించినట్టు గోద్రేజ్ కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ తెలిపింది. అయినప్పటికీ అమ్మకాల్లో అధిక సింగిల్ డిజిట్ వృద్ధిని సాధిస్తామని పేర్కొంది. స్టాండలోన్ వ్యాపారం ఎబిట్డా మార్జిన్ క్యూ1లో సాధారణ స్థాయి కంటే దిగువనే ఉండొచ్చని తెలిపింది. భారత్ తర్వాత తమకు అతిపెద్ద మార్కెట్‌గా ఉన్న ఇండోనేషియాలో ధరల పరమైన ఒత్తిళ్లు ఎదురైనట్టు గ్రోద్రేజ్ కన్జ్యూమర్ వెల్లడించింది. దీంతో అమ్మకాల్లో వృద్ధి ఫ్లాట్‌గా ఉండొచ్చని అంచనా వేసింది. తమ కన్సాలిడేటెడ్ ఆదాయం జూన్ త్రైమాసికలో తక్కువ సింగిల్ డిజిట్‌కు పరిమితం కావొచ్చని డాబర్ సైతం తెలిపింది. ఇక కన్సాలిడేటెడ్ ఆపరేటింగ్ మార్జిన్ ఆదాయ వృద్ధి కంటే తక్కువకే పరిమితం కావొచ్చొని పేర్కొంది. వ్యక్తిగత సంరక్షణ, గృహ ఉత్పత్తుల అమ్మకాలు మంచి పనితీరు చూపించొచ్చని తెలిపింది. అంతర్జాతీయ వ్యాపారం మాత్రం డబుల్ డిజిట్ వృద్ధిని (స్థిర కరెన్సీ మారకంలో) నమోదు చేయొచ్చని పేర్కొంది.

మోస్తరు వృద్ధి..

జూన్ త్రైమాసికంలో తమ నిర్వహణ లాభం మోస్తరు వృద్ధిని చూపించొచ్చని మారికో అంచనా వేసింది. కీలక ముడి సరుకు అయిన కొబ్బరి ధరలు అధికంగా ఉండడానికి తోడు అసాధారణ వర్షాలు ప్రభావం చూపించినట్టు తెలిపింది. స్థూల మార్జిన్లపై ఒత్తిడి ఉంటుందని వివరించింది. గ్రామీణ మార్కెట్ నుంచి జూన్ క్వార్టర్‌లో స్థిరమైన డిమాండ్ కనిపించినట్టు వెల్లడించింది. ఈ–కామర్స్, క్విక్ కామర్స్ తదితర ఛానళ్ల ద్వారా స్థిరమైన వృద్ధి కొనసాగినట్టు తెలిపింది.

బ్యాంకుల మెరుగైన పనితీరుతో పరపతి మెరుగు

- భవిష్యత్ వృద్ధికి అనుకూలం
- ఫిచ్ రేటింగ్స్ నివేదిక

న్యూఢిల్లీ: గడిచిన ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్‌లు మెరుగైన పనితీరు నమోదు చేయడం వాటి పరపతి ప్రొఫైల్‌కు, భవిష్యత్ వృద్ధికి అనుకూలమని ఫిచ్ రేటింగ్స్ తెలిపింది. నాలుగేళ్లలో తక్కువ రుణ వృద్ధి నమోదు అయినప్పటికీ.. మెరుగైన ఆస్తుల నాణ్యత, పటిష్టమైన నగదు నిల్వలు, స్థిరమైన లాభాలను చూపించినట్టు పేర్కొంది. ''ఇక ముందూ స్థిరమైన పనితీరు కొనసాగుతుందని అంచనా వేస్తున్నాం. ఆర్థిక మూలాలు పటిష్టంగా ఉండడం, మిగులు నిల్వలతో నష్టాలను సర్దుబాటు చేసుకోగల సామర్థ్యం ఉండడం, గత సైకిల్‌తో పోల్చితే ఆర్థిక షాక్‌లను తట్టుకుని నిలబడే సామర్థ్యం.. ఇవన్నీ రేటెడ్ బ్యాంకుల స్టాండలోన్ రుణ పరపతికి సానుకూలం''అని ఫిచ్ రేటింగ్స్ వివరించింది. 2025–26లో రుణ పరపతి పరంగా బ్యాంక్‌లు స్థిరమైన పనితీరు చూపిస్తాయని పేర్కొంది. 2024–25లో ప్రభుత్వ బ్యాంకులు రికార్డు స్థాయిలో రూ.1.78 లక్షల కోట్ల లాభాన్ని నమోదు చేయడం గమనార్హం. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో లాభం రూ.1.41 లక్షల కోట్లతో పోల్చి చూస్తే 26 శాతం ఎక్కువ.

సిమెంట్ కంపెనీలకు సీసీఐ ఆదేశాలు

ఆర్థిక ఫలితాల డాక్యుమెంట్ల పరిశీలన

- పోటీ నిబంధనల ఉల్లంఘన నేపథ్యం
- జాబితాలో ఇండియా సిమెంట్స్
- దాల్మియా భారత్ సిమెంట్స్, శ్రీ దిగ్విజయ్



న్యూఢిల్లీ: పోటీ నిబంధనల ఉల్లంఘన దర్యాప్తులో భాగంగా ఆర్థిక ఫలితాల వివరాలను దాఖలు చేయమంటూ సిమెంట్ రంగ దిగ్గజాలు అల్ట్రాటెక్, దాల్మియా భారత్, శ్రీ దిగ్విజయ్‌ను కాంపిటీషన్ కమిషన్(సీసీఐ) ఆదేశించింది. ఆడిటెడ్ ఆర్థిక ఫలితాలతోపాటు.. బ్యాలన్స్ షీట్, లాభనష్టాల ఖాతా వివరాలను 8 వారాలలోగా అందించాలని పేర్కొంది. పోటీ నిబంధనలు ఉల్లంఘించినట్లు డైరెక్టర్ జనరల్ గుర్తించిన నేపథ్యంలో మూడు సిమెంట్ రంగ కంపెనీలను సీసీఐ తాజాగా ఆదేశించింది. అయితే అనుబంధ సంస్థగా వ్యవహరిస్తున్న ఇండియా సిమెంట్స్‌కు చెందిన ఐదేళ్ల వివరాల కోసం అల్ట్రాటెక్‌కు సీసీఐ ఆదేశాలు జారీ చేసింది. 2015–19 ఆర్థిక సంవత్సరాల ఖాతాల వివరాలను వెల్లడించవలసి ఉంటుందని పేర్కొంది. ఈ బాటలో దాల్మియా భారత్ సిమెంట్స్, శ్రీ దిగ్విజయ్ సిమెంట్స్‌ను 2011 నుంచి 2019వరకూ తొమ్మిదేళ్ల కాలానికి ఆర్థిక వివరాలను దాఖలు చేయవలసిందిగా ఆదేశించింది. అంతేకాకుండా ఐదేళ్ల కాలానికి ఆదాయపన్ను రికార్డులు, ఆర్థిక వివరాలను సమూలంగా తెలియజేయవలసిందిగా ఆయా కంపెనీల ఎగ్జిక్యూటివ్‌లను సైతం ఆదేశించింది. దర్యాప్తు నివేదికపై లాంచనప్రాయ సమాధానాలను సైతం సమర్పించమంటూ ఆదేశించింది. కాగా.. ఈ అంశాలపై అల్ట్రాటెక్, దాల్మియా భారత్ స్పందించలేదని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. తమ టెండర్లలో జట్టుకడుతున్నట్లు సిమెంట్ రంగ కంపెనీలపై ఇంధన రంగ పీఎస్‌యూ ఓఎన్‌జీసీ ఫిర్యాదు చేయడంతో సీసీఐ తాజా ఆదేశాలకు తెరతీసింది. ఈ నేపథ్యంలో 2020 నవంబర్ 18న సీసీఐ ఫిర్యాదుపై దర్యాప్తు చేపట్టవలసిందిగా డైరెక్టర్ జనరల్(డీజీ)ను ఆదేశించింది. 2025 ఫిబ్రవరి 18న డీజీ దర్యాప్తు నివేదికను సీసీఐకు అందించింది. తదుపరి 2025 మే 26న ఓఎన్‌జీసీకి సిమెంట్ అమ్మకాల ద్వారా అందుకున్న ఆదాయ వివరాలను దాఖలు చేయవలసిందిగా ఈ మూడు సిమెంట్ తయారీ కంపెనీలకు సూచించింది. 2024 డిసెంబర్‌లో ఇండియా సిమెంట్స్ ప్రమోటర్ల నుంచి 32.72 శాతం వాటాను అల్ట్రాటెక్ సిమెంట్స్ కొనుగోలు చేసిన విషయం విదితమే. మార్కెట్ నుంచి మరో 22.77 శాతం వాటా సైతం సొంతం చేసుకుంది. వెరసి ఇండియా సిమెంట్స్‌కు ప్రమోటర్‌గా అల్ట్రాటెక్ అవతరించింది.

డాట్ ఫ్రాడ్ టెక్నాలజీని ఉపయోగించండి...

బ్యాంకులకు ఆర్‌బీఐ సూచన

న్యూఢిల్లీ: ఆన్‌లైన్ ఆర్థిక మోసాలకు చెక్ పెట్టే దిశగా టెలికం శాఖ (డాట్)రూపొందించిన ఫైనాన్షియల్ ఫ్రాడ్ రిస్క్ ఇండికేటర్ (ఎఫ్ఆర్ఐ) ప్లాట్‌ఫాంను ఉపయోగించుకోవాలని బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు రిజర్వ్ బ్యాంక్ సూచించింది. మధ్యస్థ, అధిక, అత్యధిక ఆర్థిక మోసాలతో ముడిపడి ఉన్న మొబైల్ నంబర్లను ఇది రియల్ టైమ్‌లో వర్గీకరిస్తుందని పేర్కొంది. ఆర్‌బీఐ ఆదేశాలను స్వాగతిస్తున్నట్లు డాట్ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం చెల్లింపులకు యూపీఐ విధానాన్ని విరివిగా ఉపయోగిస్తున్న నేపథ్యంలో సైబర్ మోసాల బారిన పడకుండా కోట్ల మందిని ఈ సాంకేతికత కాపాడగలదని వివరించింది. డాట్‌లో భాగమైన డిజిటల్ ఇంటెలిజెన్స్ యూనిట్ (డీఐయూ) ఈ ఏడాది మే నెలలో ప్రవేశపెట్టిన ఎఫ్ఆర్ఐని ఇప్పటికే ఐసీఐసీఐ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఫోన్‌పే, పేటీఎం మొదలైన దిగ్గజ సంస్థలు ఉపయోగిస్తున్నాయి. ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్, నేషనల్ సైబర్‌క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్, డాట్‌కు చెందిన చక్షు ప్లాట్‌ఫాంలతో పాటు బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి వచ్చే డేటా ఆధారంగా ఎఫ్ఆర్ఐ పని చేస్తుంది.

డైట్‌లో తగ్గిన తృణధాన్యాలు

- పెరిగిన పాల ఉత్పత్తుల వినియోగం
- సర్వే నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ: ప్రజల ఆహార అలవాట్లలో గణనీయంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. 2023–24లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల వారు రోజువారీ తీసుకునే ఆహారంలో తృణధాన్యాలు, పప్పు ధాన్యాల వాటా తగ్గిపోయింది. అదే సమయంలో పాలు, పాల ఉత్పత్తుల వినియోగం పెరిగింది. కుటుంబాల వినియోగ వ్యయాలపై నిర్వహించిన సర్వే నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. 2022 ఆగస్టు – 2023 జూలై, 2023 ఆగస్టు – 2024 జూలై మధ్య కాలంలో ఈ సర్వే నిర్వహించారు. దీని ప్రకారం, పట్టణ ప్రాంతాల్లో గుడ్లు, చేపలు, మాంసం వినియోగంలో పెద్దగా మార్పు లేనప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం పెరిగింది. 2022–23లో పట్టణ ప్రాంతాల్లో ఆహారంలో తృణ ధాన్యాల వాటా 38.8 శాతంగా ఉండగా 2023–24లో 38.7 శాతానికి స్వల్పంగా తగ్గింది. గ్రామీణ భారతంలో ఇది 46.9 శాతం నుంచి 45.9 శాతానికి క్షీణించింది. అలాగే పప్పు ధాన్యాల విషయానికొస్తే పట్టణ ప్రాంతాల్లో వినియోగం 9.6 శాతం నుంచి 9.1 శాతానికి, గ్రామీణ ప్రాంతాల్లో 8.8 శాతం నుంచి 8.7 శాతానికి నెమ్మదించింది.

- మరోవైపు, పట్టణ ప్రాంతాల ప్రజల ఆహారంలో పాలు, పాల ఉత్పత్తుల వినియోగం 12.8 శాతం నుంచి 12.9 శాతానికి, గ్రామీణ ప్రాంతాల్లో 10.6 శాతం నుంచి 11 శాతానికి పెరిగింది.
- డైట్‌లో గుడ్లు, చేపలు, మాంసం వాటా గ్రామీణ ప్రాంతాల్లో 12.3 శాతం నుంచి 12.4 శాతానికి పెరగ్గా, పట్టణ ప్రాంతాల్లో ఎలాంటి మార్పు లేకుండా 14.1 శాతం స్థాయిలోనే ఉంది.
- గ్రామీణ ప్రాంతాల్లో 'ఇతర ఆహార' పదార్థాల వాటా 21.4 శాతం నుంచి 22 శాతానికి, పట్టణ ప్రాంతాల్లో 24.8 శాతం నుంచి 25.3 శాతానికి పెరిగింది.
- గ్రామాల్లో రోజుకు తలసరి కేలరీల సగటు వినియోగం, సర్వే నిర్వహించిన రెండేళ్లలో వరుసగా 2233 కిలోకేలరీలుగా, 2212 కిలోకేలరీలుగా ఉంది. పట్టణ ప్రాంతాల్లో ఇది 2250 కిలోకేలరీలు, 2240 కిలోకేలరీలుగా నమోదైంది.
- నెలవారీగా తలసరి వినియోగ వ్యయం (ఎంపీసీఈ) పెరిగే కొద్దీ ప్రాంతాలకతీతంగా సగటు కేలరీల వినియోగం కూడా పెరిగింది.

ప్యాసింజర్ వాహన విక్రయాలు తగ్గొచ్చు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో హోల్‌సేల్ అమ్మకాల వృద్ధి 1-4 శాతమే



న్యూఢిల్లీ: దేశీయ ప్యాసింజర్ వాహన హోల్‌సేల్(టోకు) అమ్మకాల వృద్ధి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26)లో 1–4 శాతంగా ఉండొచ్చని ఇక్రా రేటింగ్ సంస్థ అంచనా వేసింది. అధిక ఇన్వెంటరీ, ఎలక్ట్రిక్ వాహనాల్లో వాడే 'రేర్ ఎర్త్ మాగ్నెట్' వంటి కీలక ఉపకరణాల కొరత విక్రయాలపై ప్రభావాన్ని చూపొచ్చని పేర్కొంది. అంతకు ముందు.. ఇదే ఎఫ్‌వై 26లో అమ్మకాల వృద్ధి 4–7% ఉండొచ్చని అంచనా వేసింది. అయితే ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫ్యాక్చర్లు(ఓఈఎం)నుంచి స్థిరమైన మోడళ్ల ఆవిష్కరణలు పరిశ్రమ అమ్మకాలకు పాక్షిక మద్దతునిస్తాయని వివరించింది.

మే అమ్మకాలు డిమాండ్ క్షీణతకు సంకేతాలు

భారత్ – పాకిస్థాన్ యుద్ధంతో ఉత్తర భారతంలో నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కస్టమర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఫలితంగా ఈ ఏడాది మే నెలలో 3,02,214 ప్యాసింజర్ వాహనాలు అమ్ముడయ్యాయి. ఇదే ఏడాది ఏప్రిల్ అమ్ముడైన 3,49,939 యూనిట్లతో పోలిస్తే ఇవి 13.6% తక్కువ. ఈ అమ్మకాలు డిమాండ్ క్షీణతకు సంకేతాలని ఇక్రా తెలిపింది.

టూ వీలర్స్‌కు 'గ్రామీణం' దన్ను

ఇదే ఎఫ్‌వై 26లో ద్విచక్రవాహన అమ్మకాల వృద్ధి 6–9 శాతంగా ఉండొచ్చని తెలిపింది. స్థిరమైన గ్రామీణ ఆదాయాలు, సాధారణ వర్షపాత నమోదు, పట్టణ మార్కెట్ పెరగడం తదితర అంశాలు టూ వీలర్స్‌కు డిమాండ్‌ను పెంచుతాయి. గ్రామీణ డిమాండ్, మెరుగైన సాగుతో ద్విచక్రవాహన రిటైల్ అమ్మకాలు వార్షిక ప్రాతిపదిన 7% వృద్ధి సాధించాయి.



సత్తా చాటిన భారత అమ్మాయిలు

ఆసియా కప్ ఫుట్‌బాల్ టోర్నీకి క్వాలిఫై
- థాయిలాండ్‌పై 2–1తో విజయం

చియాంగ్ మై (థాయిలాండ్): భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు అసలు సమయంలో చెలరేగింది. క్వాలిఫయింగ్ టోర్నీలో సత్తా చాటి ఆసియా కప్‌కు అర్హత సాధించింది. 2003 తర్వాత మన మహిళలు ఆసియా కప్ నేరుగా అర్హత సాధించడం ఇదే తొలిసారి. శనివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 2–1 గోల్స్ తేడాతో ఆతిథ్య జట్టు థాయిలాండ్‌ను ఓడించింది. భారత్ తరఫున సంగీత బస్‌ఫోర్ రెండు గోల్స్ (28వ నిమిషం, 78వ నిమిషం) సాధించడం విశేషం. థాయిలాండ్ తరఫున చట్‌చవాన్ రాడ్‌థాంగ్ ఏకైక గోల్ (47వ నిమిషం) నమోదు చేసింది. ఈ మ్యాచ్‌కు ముందు ఇరు జట్ల మధ్య గోల్ వ్యత్యాసం కూడా (+22) కూడా సమానంగా ఉండటంతో ఇరు జట్లూ తప్పనిసరిగా గెలవాలనే లక్ష్యంతో బరిలోకి దిగాయి. 'ఫిఫా' ర్యాంకింగ్స్‌లో భారత్‌కంటే 24 స్థానాలు ముందున్న థాయిలాండ్ ఫేవరెట్‌గా బరిలోకి దిగింది. అయితే మన అమ్మాయిల పట్టుదలకు విజయం వరించింది. గతంలో భారత్ ఎప్పుడూ థాయిలాండ్‌ను ఓడించలేదు. క్వాలిఫయింగ్ టోర్నీలో గ్రూప్ 'బి' నుంచి ఆడిన నాలుగు మ్యాచ్‌లలోనూ భారత మహిళలు విజయం సాధించి అగ్రస్థానంతో ముందంజ వేయడం విశేషం. టోర్నీలో గత మూడు మ్యాచ్‌లలో ఇరాక్, మంగోలియా, తిమోర్ లెస్టెలను భారత్ ఓడించింది. ఆసియా కప్ టోర్నీ 2026లో ఆస్ట్రేలియాలో జరుగుతుంది.

అనిమేశ్, అఫ్సల్ కొత్త జాతీయ రికార్డులు





డ్రోమియా ఇంటర్నేషనల్ స్ప్రింట్

ఏథెన్స్ (గ్రీస్): భారత అథ్లెట్లు అనిమేశ్ కుజూర్, మొహమ్మద్ అఫ్సల్ డ్రోమియా ఇంటర్నేషనల్ స్ప్రింట్ అండ్ రిలేస్ ఈవెంట్‌లో సత్తా చాటారు. అద్భుత ప్రదర్శనతో చెలరేగిన వీరిద్దరు కొత్త జాతీయ రికార్డులు నెలకొల్పారు. 100 మీటర్ల పరుగులో అనిమేశ్ కుజూర్ 10.18 సెకన్లతో కొత్త రికార్డు నమోదు చేశాడు. ఈ ఈవెంట్‌లో గుర్విందర్‌వీర్ సింగ్ పేరిట ఉన్న 10.20 సెకన్ల రికార్డును అతను బద్దలు కొట్టాడు. ఇప్పుడు 100 మీ., 200 మీ. రెండు రికార్డులూ అనిమేశ్ పేరిటే ఉండటం విశేషం. మరో వైపు ఆసియా క్రీడల రజతపతక విజేత అఫ్సల్ 800 మీటర్ల పరుగులో కొత్త రికార్డు సాధించాడు. ఈ పరుగును అతను 1 నిమిషం 44.96 సెకన్లలో పూర్తి చేశాడు. ఇప్పటి వరకు తన పేరిటే ఉన్న 1 నిమిషం 45.61 సెకన్ల రికార్డును సవరించిన అఫ్సల్... 1.45 నిమిషాల లోపు పరుగు పూర్తి చేసిన తొలి భారత అథ్లెట్‌గా నిలిచాడు.

రెండో వన్డే బంగ్లాదేశ్‌దే

16 పరుగులతో ఓడిన శ్రీలంక

కొలంబో: లెఫ్టార్మ్ స్పిన్నర్ తన్వీర్ ఇస్లామ్ (5/39) ఐదు వికెట్లతో చెలరేగడంతో శ్రీలంకతో జరుగుతున్న వన్డే సిరీస్‌ను బంగ్లాదేశ్ 1–1తో సమం చేసింది. శనివారం జరిగిన రెండో వన్డే బంగ్లాదేశ్ 16 పరుగుల తేడాతో లంకను ఓడించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 45.5 ఓవర్లలో 248 పరుగులకు ఆలౌటైంది. పర్వేజ్ హుస్సేన్ (69 బంతుల్లో 67; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), తౌహీద్ హృదయ్ (69 బంతుల్లో 51; 2 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేయగా...తన్జీమ్ హసన్ (21 బంతుల్లో 33 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. లంక బౌలర్లలో అసిత ఫెర్నాండో 4, వనిందు హసరంగ 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం శ్రీలంక 48.5 ఓవర్లలో 232 పరుగులే చేయగలిగింది. జనిత్ లియనాగే (85 బంతుల్లో 78; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), కుశాల్ మెండిస్ (31 బంతుల్లో 56; 9 ఫోర్లు, 1 సిక్స్), కమిందు మెండిస్ (51 బంతుల్లో 33; 2 ఫోర్లు) రాణించినా...జట్టును గెలిపించడంలో విఫలమయ్యారు. తన్జీమ్ హసన్‌కు 2 వికెట్లు దక్కాయి. సిరీస్ ఫలితాన్ని తేల్చే చివరి వన్డే మంగళవారం పల్లెకెలెలో జరుగుతుంది.


తన్వీర్

బంగ్లాదేశ్‌లో భారత జట్టు పర్యటన వాయిదా!

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్‌లో భారత పర్యటన వాయిదా పడనుంది. అక్కడి భద్రతా పరిస్థితుల వల్లే భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఈ నిర్ణయం తీసుకోనుందని సమాచారం. మాజీ ప్రధాని షేక్ హసీనా ప్రభుత్వం కూలాక అక్కడ చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలతో దేశం అట్టుడికింది. ప్రస్తుతం తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటుతో పరిస్థితులు అదుపులో ఉన్నట్లు కనబడుతున్నప్పటికీ, నివురుగప్పిన నిప్పులా మళ్లీ ఉద్రిక్తతలు తలెత్తితే పరిస్థితి ఏంటని బోర్డు కలవరపడుతుంది. ఈ నేపథ్యంలోనే పర్యటనను రద్దు చేయకుండా వచ్చే ఏడాదికి వాయిదా వేయడమే ఉత్తమమని బీసీసీఐ భావించింది. బంగ్లాదేశ్ మాజీ మంత్రులు, రాజకీయ నేతలపై అక్కడ తరచూ మూకదాడులు జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. భద్రతా కారణాల వల్లే బోర్డు వాయిదాకు మొగ్గుచూపిందని బీసీసీఐ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. వచ్చే ఏడాదికల్లా ఎన్నికలు పూర్తయితే పరిస్థితిలో మార్పుంటుందని బోర్డు భావిస్తోంది. ప్రస్తుతం ఇంగ్లండ్ పర్యటనలో ఉన్న భారత్ అక్కడ ఐదు టెస్టుల సిరీస్‌ను ముగించుకున్న వెంటనే స్వల్ప విరామనంతరం ఆగస్టులో బంగ్లాకు బయల్దేరాల్సి వుంది. ముందనుకున్న షెడ్యూల్ ప్రకారం వచ్చేనెల 17 నుంచి 31 వరకు చిట్టగాంగ్, ఢాకా వేదికలపై మూడేసి చొప్పున వన్డేలు, టి20లు ఆడాల్సి ఉంది.

డిఫెండింగ్ చాంప్ క్రెజికోవా అవుట్


క్రెజికోవా

ప్రిక్వార్టర్స్‌లో స్వియాటెక్, సినెర్

- మూడో రౌండ్లో రిబాకినా ఓటమి
- వింబుల్డన్ టోర్నీ


సబలెంక

లండన్: ఈ వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో సీడెడ్ స్టార్ల పరాజయాల పరంపర కొనసాగుతోంది. మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్, 17వ సీడ్ బార్బర క్రెజికోవా (చెక్ రిపబ్లిక్)కు మూడో రౌండ్లోనే చుక్కెదురైంది. ఆమెతో పాటు 11వ సీడ్ రిబాకినా (కజకిస్తాన్), 16వ సీడ్ కసట్కినా (ఆస్ట్రేలియా), లోకల్ స్టార్ ఎమ్మా రాడుకాను (బ్రిటన్)ల ఆట కూడా ముగిసింది. టాప్‌సీడ్ సబలెంక, ఎనిమిదో సీడ్ స్వియాటెక్, ఏడో సీడ్ అండ్రీవా ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినెర్ సునాయాస విజయంతో ప్రిక్వార్టర్స్ చేరాడు. 11వ సీడ్ డిమినార్, 19వ సీడ్ దిమిత్రోవ్‌లు కూడా ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. మూడు గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల చాంపియన్, టాప్ సీడ్ సినెర్ (ఇటలీ) 6–1, 6–3, 6–1తో స్పెయిన్‌కు చెందిన మార్టినెజ్‌పై వరుస సెట్లలో గెలుపొందాడు. డిమినార్ (ఆస్ట్రేలియా) 6–4, 7–6 (7/5), 6–3తో హోల్మ్‌గ్రెన్ (డెన్మార్క్)పై, దిమిత్రోవ్ (బల్గేరియా) 6–3, 6–4, 7–6 (7/0)తో సెబాస్టియన్ అఫ్నెర్ (ఆస్ట్రియా)పై, మారిన్ సిలిచ్ (క్రొయేషియా) 6–3, 3–6, 6–2, 6–4 జేమే మునర్ (స్పెయిన్)పై విజయం సాధించారు. 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ లక్ష్యంతో బరిలోకి దిగిన సెర్బియన్ దిగ్గజం నొవాక్ జొకోవిచ్ సునాయాస విజయంతో ప్రిక్వార్టర్స్ చేరాడు. ఆరో సీడ్ జొకో 6–3, 6–0, 6–4తో కెక్మనోవిచ్ (సెర్బియా)పై విజయం సాధించాడు.

క్రెజికోవా మూడో రౌండ్లోనే...

చెక్ రిపబ్లిక్ స్టార్, 17వ సీడ్ క్రెజికోవా టైటిల్ నిలబెట్టుకునే పోరాటానికి పదో సీడ్ ఎమ్మా నవారో (అమెరికా) చెక్‌పెట్టింది. మూడో రౌండ్లో నవారో 2–6, 6–3, 6–4తో క్రెజికోవాను ఓడించింది. 2021 ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్ క్రెజికోవాకు ఈ ఏడాది కలిసిరావడం లేదు. ఈ సీజన్ ఆరంభ గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియా ఓపెన్‌కు గైర్హాజరైన ఆమె ఫ్రెంచ్ ఓపెన్‌లో రెండో రౌండ్లోనే వెనుదిరిగింది. ఇప్పుడు ఇక్కడా పేలవ ప్రదర్శనతోనే టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఏనాడు వింబుల్డన్‌లో తొలిరౌండ్ అడ్డంకిని దాటలేకపోయిన క్లారా టౌసన్ (డెన్మార్క్) ఈ సారి ప్రిక్వార్టర్స్ చేరింది. ఆమె 7–6 (8/6), 6–3తో వింబుల్డన్ (2022) మాజీ చాంపియన్, ఆస్ట్రేలియా ఓపెన్ (2023) మాజీ రన్నరప్ ఎలీనా రిబాకినా (కజకిస్తాన్)ను కంగుతినిపించింది. దీంతో గతేడాది సెమీఫైనలిస్ట్ అయిన రిబాకినా ఆట ఈ సీజన్‌లో మూడో రౌండ్‌తోనే ముగిసింది. ఈ ఏడాది ఆస్ట్రేలియా, ఫ్రెంచ్ ఓపెన్‌లలో ప్రిక్వార్టర్స్ చేరిన రిబాకినా... ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్‌లో నిరాశపరిచింది. ఓవరాల్‌గా వింబుల్డన్‌లోనే ఆమెకిది పేలవ ప్రదర్శన. ఇక్కడ 2021 నుంచి ఆడుతున్న ఆమె ఆ ఏడాది ప్రిక్వార్టర్స్ చేరింది. మరుసటి ఏడాది విజేతగా నిలిచింది. 2023, 2024లలో క్వార్టర్స్, సెమీస్ వరకు పోరాడింది.

స్వియాటెక్, అండ్రీవా అలవోకగా...

మహిళల సింగిల్స్‌లో ఎనిమిదో సీడ్ ఇగా స్వియాటెక్ (పోలండ్), అండ్రీవా (రష్యా) సునాయాస విజయాలతో ప్రిక్వార్టర్స్ చేరారు. ఐదు గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల చాంపియన్ స్వియాటెక్ 6–2, 6–3తో కొలిన్స్ (అమెరికా)పై విజయం సాధించగా, ఏడో సీడ్ మిర్ర అండ్రీవా (రష్యా) కూడా 6–1, 6–3తో హెయిలీ బాప్టిస్ట్ (అమెరికా)పై వరుస సెట్లలో నెగ్గింది. ఈ సీజన్ ఆస్ట్రేలియా, ఫ్రెంచ్ ఓపెన్‌ల రన్నరప్ ప్రపంచ నంబర్‌వన్ సబలెంక (బెలారస్) 7–6 (8/6), 6–4తో రాడుకానుపై గెలుపొందింది.

భారత జోడీలకు నిరాశ

పురుషుల డబుల్స్‌లో భారత ఆటగాళ్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. యూకీ బాంబ్రీ తన అమెరికా భాగస్వామితో కలిసి మూడో రౌండ్లోకి దూసుకెళ్లగా, రిత్విక్ బొల్లిపల్లి, శ్రీరామ్ బాలాజీ జోడీలకు రెండోరౌండ్లో చుక్కెదురైంది. యూకీ బాంబ్రీ–రాబర్ట్ గాలొవే (అమెరికా) ద్వయం 6–3, 7–6 (8/6)తో నునొ బోర్జెస్ (పోర్చుగల్)–మార్కస్ గిరోన్ (అమెరికా) జంటపై గెలిచింది. రిత్విక్–నికోలస్ బారియెంటోస్ (కొలంబియా) జోడీ 4–6, 6–7 (7/9)తో ఆరో సీడ్ జో సలిస్‌బురి–నియెల్ స్కుప్‌స్కీ (బ్రిటన్) జంట చేతిలో ఓటమి పాలైంది. శ్రీరామ్ బాలాజీ–మిగెల్ రెయిస్ (మెక్సికో) ద్వయం 4–6, 4–6తో నాలుగో సీడ్ మార్సెల్ గ్రెనొల్లర్స్ (స్పెయిన్)–హొరాసియో జెబొల్లస్ (అర్జెంటీనా) జోడీ చేతిలో పరాజయం చవిచూసింది.


సినెర్

వైభవ్ మెరుపు సెంచరీ

- నాలుగో వన్డేలో భారత అండర్–19 ఘన విజయం
- 3–1తో ఇంగ్లండ్ అండర్–19పై సిరీస్ సొంతం

వార్సెస్టర్: భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అండర్–19 క్రికెట్‌లో మరో సారి మెరుపు శతకంతో చెలరేగాడు. ఇంగ్లండ్ అండర్–19 జట్టుతో శనివారం జరిగిన నాలుగో వన్డేలో వైభవ్ 52 బంతుల్లోనే సెంచరీ సాధించి యూత్ వన్డేలో ఫాస్టెస్ట్ సెంచరీ సాధించిన ఆటగాడిగా కొత్త రికార్డు నెలకొల్పాడు. గతంలో కమ్రాన్ గులామ్ (పాకిస్తాన్ – 53) పేరిట ఉన్న రికార్డును అతను బద్దలు కొట్టాడు. వైభవ్ సూర్యవంశీ (78 బంతుల్లో 143; 13 ఫోర్లు, 10 సిక్స్‌లు), విహాన్ మల్హోత్రా (121 బంతుల్లో 129; 15 ఫోర్లు, 3 సిక్స్‌లు) శతకాలు బాదడంతో ఈ మ్యాచ్‌లో భారత్ 55 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 363 పరుగులు చేసింది. వైభవ్, విహాన్ రెండో వికెట్‌కు 219 పరుగులు జోడించారు. యూత్ వన్డేలో అత్యధిక సిక్సర్లు (10) ఆటగాడిగా కూడా వైభవ్ నిలిచాడు. ఇదే సిరీస్ గత మ్యాచ్‌లో తానే నెలకొలిన 9 సిక్సర్ల రికార్డును అతను సవరించాడు. ఇంగ్లండ్ బౌలర్లలో జాక్ హోమ్ 4, సెబాస్టియన్ మోర్గాన్ 3 వికెట్లు తీశారు. అనంతరం ఇంగ్లండ్ 45.3 ఓవర్లలో 308 పరుగులకు ఆలౌటైంది. రాకీ ఫ్లింటాఫ్ (91 బంతుల్లో 107; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీ సాధించగా...బీజే డాకిన్స్ (59 బంతుల్లో 67; 10 ఫోర్లు), జోసెఫ్ మూర్స్ (41 బంతుల్లో 52; 8 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. తాజా ఫలితంతో ఐదు వన్డేల సిరీస్‌ను భారత్ 3–1తో సొంతం చేసుకుంది. చివరి మ్యాచ్ రేపు ఇదే మైదానంలో జరుగుతుంది.



తుదిపోరుకు మీనాక్షి, సాక్షి

- పూజ, హితేశ్, జుగ్నూ కూడా
- ప్రపంచ బాక్సింగ్ కప్

అస్తానా (కజకిస్తాన్): ప్రపంచ బాక్సింగ్ కప్‌లో ఐదుగురు భారత బాక్సర్లు టైటిల్ పోరుకు అర్హత సాధించారు. మీనాక్షి (48 కేజీలు), సాక్షి (54 కేజీలు), ఒలింపియన్ పూజ రాణి (80 కేజీలు), పురుషుల విభాగంలో హితేశ్ గులియా (70 కేజీలు), జుగ్నూ (85 కేజీలు) ఫైనల్లోకి అడుగుపెట్టారు. నుపూర్ (80 ప్లస్ కేజీలు) ఇదివరకే ఫైనల్ చేరడంతో నలుగురు మహిళా బాక్సర్లు ఫైనల్ బౌట్‌కు సై అంటున్నారు. శనివారం జరిగిన సెమీ ఫైనల్ బౌట్‌లలో మీనాక్షి 5–0తో నుర్సెలిన్ యల్గెటెకిన్ (టర్కీ)పై గెలుపొందగా, సాక్షి 5–0తో ఫెరూజా కజకొవా (ఉజ్బెకిస్తాన్)పై నెగ్గింది. పూజా రాణి 3–2తో ఎలిఫ్ గునెరి (టర్కీ)ని ఓడించింది. సంజూ (60 కేజీలు) 0–5తో విక్టోరియా గ్రేఫెయెవా (కజకిస్తాన్) చేతిలో ఓడి కాంస్యంతో సరిపెట్టుకుంది. పురుషుల సెమీస్‌లో హితేశ్ 5–0తో మకన్ ట్రేవోర్ (ఫ్రాన్స్)పై, జుంగ్నూ 5–0తో టియన్ స్కాట్ (ఇంగ్లండ్)పై విజయం సాధించారు. ఈ ఏడాది ఆరంభంలో బ్రెజిల్‌లో జరిగిన తొలి అంచె ప్రపంచ బాక్సింగ్ కప్‌లోనూ భారత బాక్సర్లు ఆరు పతకాలు సాధించారు.

హంపికి నాలుగో సీడింగ్

ఫిడే ప్రపంచ మహిళల చెస్ కప్

బతుమి (జార్జియా): భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి ఫిడే ప్రపంచ మహిళల చెస్ కప్‌లో నాలుగో సీడ్‌గా బరిలోకి దిగుతోంది. క్యాండిడేట్స్ టోర్నమెంట్‌కు అర్హత సాధించడమే లక్ష్యంగా ఈ టోర్నీలో 'పావులు' కదిపేందుకు హంపి సిద్ధమైంది. చైనా ప్లేయర్లు లీ తింగ్జీ, జినెర్ జు, జోంగ్‌యి తన్‌లకు టాప్–3 సీడింగ్‌లు దక్కాయి. హంపితో పాటు టాప్–10 సీడెడ్లలో గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక పదో సీడ్‌గా టోర్నీని ప్రారంభించనుంది. వైశాలికి 11వ సీడ్ లభించింది. మిగతా భారత క్రీడాకారిణిల్లో ఇంటర్నేషనల్ మాస్టర్లు పద్మిని రౌత్, వంతిక అగర్వాల్, దివ్య దేశ్‌ముఖ్, మహిళా గ్రాండ్‌మాస్టర్లు పీవీ నందిద, కిరణ్ మనీషా, మహిళా ఇంటర్నేషనల్ మాస్టర్ ప్రియాంక ఈ ప్రపంచ చెస్ కప్ బరిలో ఉన్నారు. క్యాండిడేట్స్ టోర్నీలో అర్హత సాధించేందుకు ప్రపంచ మహిళా స్టార్లంతా ఈ టోర్నీ ఆడుతున్నారు. ఇందులో 107 మంది పోటీలో నిలువగా టాప్–21 సీడెడ్ ప్లేయర్లు నేరుగా రెండో రౌండ్ నుంచి ఆడతారు. మిగతా 86 మంది తొలి రౌండ్ నుంచి తలపడతారు. భారత్ నుంచి హంపి, హారిక, వైశాలి, దివ్య దేశ్‌ముఖ్ (15వ సీడ్)లు నేరుగా రెండో రౌండ్ ఆడతారు. నేడు జరిగే తొలిరౌండ్‌లో వంతిక... లాలా షోహ్రదొవా (తుర్క్‌మెనిస్తాన్)తో, పద్మిని రౌత్... జంగ్ లాన్‌లిన్ (చైనా)తో, నందిద... ఒర్టిజ్ వెర్దెజొతో (ఈక్వెడార్)తో, ప్రియాంక... సాక గాల్ (హంగేరి)తో, కిరణ్ మనీషా... యుజిన్ సాంగ్ (చైనా)తో తలపడతారు.



వెర్‌స్టాపెన్‌కు పోల్

బ్రిటన్ గ్రాండ్‌ప్రి

సిల్వర్‌స్టోన్ (ఇంగ్లండ్): ఫార్ములావన్ బ్రిటన్ గ్రాండ్‌ప్రి క్వాలిఫయింగ్ టోర్నీలో రెడ్‌బుల్ డ్రైవర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ పోల్ పొజిషన్ సాధించాడు. శనివారం జరిగిన క్వాలిఫయింగ్ రేసులో నాలుగు సార్లు ప్రపంచ చాంపియన్ వెర్‌స్టాపెన్ 1 నిమిషం 24.892 సెకన్లలో ల్యాప్‌ను పూర్తి చేసి అగ్రస్థానం దక్కించుకున్నాడు. ఆదివారం జరగనున్న ప్రధాన రేసును వెర్‌స్టాపెన్ పోల్ పొజిషన్ నుంచి ప్రారంభించనున్నాడు. మెక్‌లారెన్ డ్రైవర్ ఆస్కార్ పియాస్ట్రి (1 నిమిషం 24.995 సెకన్లు), లోండా నోరిస్ (1 నిమిషం 25.010 సెకన్లు; మెక్‌లారెన్) వరుసగా రెండో మూడో స్థానాల్లో నిలిచారు. మెర్సిడెస్‌కు చెందిన రసెల్ 1 నిమిషం 25.029 సెకన్లతో నాలుగో స్థానం దక్కించుకున్నాడు. గతంలో ఇక్కడ 9 సార్లు విజేతగా నిలిచిన బ్రిటన్ డ్రైవర్ లూయిస్ హామిల్టన్ (1 నిమిషం 25.095; ఫెరారీ) ఐదో 'ప్లేస్'తో సరిపెట్టుకున్నాడు. టాప్–5లో నిలిచిన డ్రైవర్లలో ముగ్గురు బ్రిటన్‌కు చెందినవారే కావడం విశేషం. 24 రేసుల తాజా సీజన్‌లో ఇప్పటి వరకు 11 రేసులు ముగిశాయి. డ్రైవర్స్ చాంపియన్‌షిప్‌లో 216 పాయింట్లతో ప్రియాస్ట్రి అగ్రస్థానంలో కొనసాగుతుండగా... 201 పాయింట్లతో నోరిస్ రెండో స్థానంలో, 155 పాయింట్లతో వెర్‌స్టాపెన్ మూడో స్థానంలో ఉన్నారు.

సెమీఫైనల్లో శ్రీకాంత్ ఓటమి

కాల్గరీ: భారత స్టార్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ కెనడా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ సెమీఫైనల్లో పరాజయం పాలయ్యాడు. వరల్డ్ టూర్ సూపర్–300 పురుషుల సెమీఫైనల్లో ప్రపంచ మాజీ నంబర్‌వన్ శ్రీకాంత్ శనివారం 21–19, 14–21, 18–21తో మూడో సీడ్ కెంటా నిషిమోటో (జపాన్) చేతిలో ఓడాడు. తొలి గేమ్‌లో చక్కటి ఆటతీరు కనబర్చిన శ్రీకాంత్... ఆ తర్వాత రెండు గేమ్‌ల్లో పోరాడినా కీలక సమయాల్లో పాయింట్లు కోల్పోయి పరాజయం పాలయ్యాడు. అంతకుముందు క్వార్టర్స్‌లో ప్రపంచ 49వ ర్యాంకర్ శ్రీకాంత్ 21–18, 21–9తో ఆరో ర్యాంకర్, టాప్ సీడ్ చౌ టైన్ చెన్ (చైనీస్ తైపీ)పై విజయం సాధించాడు. 43 నిమిషాల్లో ముగిసిన పోరులో సంపూర్ణ ఆధిపత్యం కనబర్చాడు. మరో క్వార్టర్ ఫైనల్లో భారత యువ ఆటగాడు శంకర్ ముత్తుస్వామి 15–21, 21–5, 17–21తో నిషిమోటో చేతిలో పోరాడి ఓడాడు. 79 నిమిషాల పాటు సాగిన హోరాహోరీ పోరులో... శంకర్ తన పోరాటంతో ఆకట్టుకున్నాడు. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో శ్రియాన్షి ఓటమి పాలైంది.



ఇండిపెండెన్స్ డేను పురస్కరించుకొని న్యూయార్క్ నగరంలోని ప్రఖ్యాత బ్రూక్లిన్ బ్రిడ్జ్ శుక్రవారం ఇలా బాణసంచా వెలుగు జిలుగులతో నిండిపోయింది.



రైతులు పొలాలను వరి నాట్లకు సిద్ధం చేస్తున్న వేళ.. శనివారం ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి ఉద్ధమ్ సింగ్ నగర్ జిల్లాలోని ఖటిమాలో హలధారిగా మారారు



మధ్యప్రదేశ్‌లో కురుస్తున్న భారీ వర్షాలకు నర్మదా నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. జబల్పూర్‌లోని ఓ ఆలయం వరదలో మునిగిన దృశ్యమిది

బిహార్ యువతపై ఎన్నికల గాలం..!

నగదు ప్రోత్సాహకాలు ప్రకటించిన నితీశ్ ప్రభుత్వం

- తేజస్వీ యాదవ్ వైపే యువత మొగ్గంటూ తేల్చిన సర్వేలు
- దీంతో అప్రమత్తమైన నితీశ్ కుమార్
- ఛత్ర యువ సంసద్ కార్యక్రమాలతో జనంలోకి తేజస్వీ

సాక్షి, న్యూఢిల్లీ: మరో మూడు, నాలుగు నెలల్లో జరుగనున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో యువ ఓటర్లు అత్యంత కీలకంగా మారారు. దీంతో, వారిని ఆకట్టుకునేందుకు అధికార జేడీయూతో పాటు ప్రతిపక్ష ఆర్జేడీ, కాంగ్రెస్‌లు పోటీ పడుతున్నాయి. ఎన్నికల తాయిలాలతో వారికి గాలం వేసేందుకు తాపత్రయపడుతున్నాయి. కోటిన్నర మందికి పైగా ఉన్న యువ ఓటర్లు ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్‌ను ముఖ్యమంత్రిగా చూడాలని అనుకుంటున్నట్లు కొన్ని సర్వేలు తేల్చాయి. ఈ నేపథ్యంలో అలెర్ట్ అయిన ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్‌ప్రభుత్వంయువతకు ప్రత్యేక నగదు ప్రోత్సాహకాలు ప్రకటించింది. వారిని తమవైపు తిప్పుకునే ప్రయత్నాలు మొదలు పెట్టింది.

యువతపై హామీల వాన

బిహార్‌లో ఉన్న 243 నియోజకవర్గాలు, 8 కోట్ల ఓటర్లలో యువత పాత్ర చాలా కీలకంగా ఉంది. కొత్తగా నమోదైన ఓటర్లే 18 లక్షల వరకు ఉన్నారు. 18–35 ఏళ్ల వయస్సున్న యువ ఓటర్ల సంఖ్య మొత్తం 1.60 కోట్ల వరకు ఉంది. ఇటీవల యువ ఓటర్లను లక్ష్యంగా చేసుకొని నిర్వహించిన సర్వేలో 18–29 ఏళ్ల వయస్సు వారిలో 44.6 శాతం మంది ఎన్డీయేకు ఓటు వేయడానికి ఇష్టపడుతున్నారని, 39.5 శాతం మంది మహాఘట్‌బంధన్‌కు ఓటు వేయడానికి ఇష్టపడుతున్నారని చెప్పారు. ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని జన్ సూరజ్ పార్టీ వైపు కేవలం 0.76 శాతం మంది మాత్రమే అనుకూలంగా చెప్పారు. అయితే ముఖ్యమంత్రి అభ్యర్థిగా తేజస్వీ యాదవ్ తన పోటీదారుల కంటే బలమైన ఆధిక్యంలో ఉన్నారు. సుమారు 42 శాతం మంది బిహార్ తదుపరి ముఖ్యమంత్రిగా తేజస్వీ యాదవ్‌ను ఇష్టపడుతున్నట్లు తేల్చారు. కేవలం 27.7 శాతం మంది మాత్రమే ప్రస్తుత ముఖ్యమంత్రి నితీశ్‌కు అనుకూలంగా ఓటు వేశారు. ఈ సర్వే ఫలితాలను దృష్టిలో పెట్టుకొనే ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ యువతకు నగదు ప్రోత్సాహకాలను ప్రకటించారు. 'ముఖ్యమంత్రి ప్రతిజ్ఞ యోజన' పథకం కింద, 12వ తరగతి అర్హత సాధించిన విద్యార్థులకు రూ.4.000, ఐటీఐ లేక డిప్లొమా ఉన్నవారికి రూ.5,000, ఇంటర్న్‌షిప్‌లు తీసుకుంటున్న గ్రాడ్యుయేట్లు లేక పోస్ట్ గ్రాడ్యుయేట్లకు నెలకు రూ.6,000 అందిస్తామని ప్రకటించారు. దీంతో పాటే 2025–26 నుంచి 2030–31 వరకు రాష్ట్రంలోని లక్ష మంది యువతకు వివిధ సంస్థలలో ఇంటర్న్‌షిప్‌లు అందిస్తామన్నారు. ఈ ప్రాజెక్టుకే ఏటా రూ.685 కోట్లు ఖర్చు చేస్తామని హామీ ఇచ్చారు. దీనికి అదనంగా యువతకు అధునాతన నైపుణ్యాలు, మెరుగైన ఉపాధి, నాయకత్వ అభివృద్ధి, బలమైన నెట్‌వర్కింగ్, కెరీర్ మెరుగుదలకు కొత్త అవకాశాలను అందించేందుకు అనేక పథకాలను ప్రకటించారు. ఇప్పటికే ముఖ్యమంత్రి రాష్ట్రంలోని వితంతువులు, వృద్ధాప్య పింఛన్‌ను రూ.400 నుంచి రూ.1,100కు పెంచారు. దీనిని ఎదుర్కొని యువతను తనవైపు తిప్పికునే లక్ష్యంతో ఆర్జేడీ నేత తేజస్వీయాదవ్ 'ఛత్ర యువ సంసద్' కార్యక్రమాలతో యువత మధ్యకు వెళుతున్నారు. తాము అధికారంలోకి వస్తే యువజన కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని, పోటీ పరీక్షలకు ఉచితంగా శిక్షణ ఇప్పిస్తామని, విద్యాపరంగా వెనుకబడ్డ విద్యార్థులకు ఇంటి నుంచి ట్యూటర్లను అందిస్తామని, పరీక్షా కేంద్రాలకు ఉచిత రవాణాను అందిస్తామని ప్రకటించారు. సైన్స్, గణితం, ఇంగ్లిష్‌లలో వెనుకబడ్డ ఉన్న విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు వెళ్లి వారికి అదనపు సమయం కేటాయిస్తామన్నారు. బిహార్ విశ్వవిద్యాలయాల నుంచి విద్యార్థులు మరోసారి ఉన్నత స్థానాలకు చేరుకునే విధంగా విద్యా వ్యవస్థను మెరుగు పరుస్తామని హామీ ఇస్తున్నారు. ఇలా రెండు పార్టీల కీలక నేతలు యువతను ఆకట్టుకునే ఏర్పాట్లలో ఉండగా, కాంగ్రెస్, బీజేపీలు సైతం యువ ఓటర్లకు గాలం వేసేందుకు తన ప్రయత్నాలను మొదలుపెట్టాయి.

పేదల సంఖ్య పెరుగుతోంది..

సంపద కొందరి వద్దే పోగుపడుతోంది: గడ్కరీ

ముంబై: దేశంలో పేదల సంఖ్య ఏటికేడు పెరుగుతూ పోతుండగా, సంపద మాత్రం కొందరు పలుకుబడి కలిగిన వ్యక్తుల వద్దే కేంద్రీకృతమవుతోందంటూ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటిది జరగరాదంటే సంపద వికేంద్రీకృతం కావాల్సిన అవసరముందన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ఉద్యోగాల కల్పన జరగాలని చెప్పారు. నాగ్‌పూర్‌లో శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి గడ్కరీ వివిధ సామాజిక అంశాలను ప్రస్తావించారు. గతంలో ప్రధానులు పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్ సరళీకృత ఆర్థిక విధానాలను అమలు చేశారేగాని, సంపద కేంద్రీకరణను ఆపే చర్యలను మాత్రం తీసుకోలేదని గడ్కరీ తెలిపారు. జీడీపీలో ఉత్పత్తి రంగం వాటా 22–24 శాతం, సేవా రంగం 52–54 శాతం వాటా కాగా, గ్రామీణ జనాభాలోని 65–70 శాతం మంది పాల్గొనే వ్యవసాయ రంగం వాటా కేవలం 12 శాతం మాత్రమేనని ఆయన వివరించారు. ఈ అసమతుల్యతను నివారించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నేడు ఆర్థిక రంగానికి చార్టెర్డ్ అకౌంటెంట్ల అవసరం ఎంతో ఉందని, వారు చోదకశక్తుల వంటివారని అభివర్ణించారు. రోడ్ల నిర్మాణం కోసం బీవోటీ(బిల్డ్–ఆపరేట్–ట్రాన్స్‌ఫర్)విధానాన్ని అమల్లోకి తెచ్చిన వారిలో తానూ ఉన్నానంటూ గడ్కరీ..ఇప్పుడిక రోడ్ల అభివృద్ధికి నిధుల కొరతనేదే లేదని వివరించారు. ప్రస్తుతం టోల్ ప్లాజాల నుంచి ఏడాదికి రూ.55 వేల కోట్ల ఆదాయం వస్తుండగా, వచ్చే రెండేళ్లలో ఇది రూ.1.40 లక్షల కోట్లకు పెరగనుందన్నారు.

బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక తనిఖీ వద్దు

సుప్రీంకోర్టులో ఏడీఆర్ పిటిషన్

న్యూఢిల్లీ: బిహార్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఓటర్ల జాబితాను ప్రత్యేకంగా తనిఖీ(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించడాన్ని అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) సంస్థ వ్యతిరేకించింది. ఎన్నికల సంఘం నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఏడీఆర్ తరఫున సీనియర్ అడ్వొకేట్ ప్రశాంత్ భూషణ్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జూన్ 24న ఎన్నికల సంఘం జారీ చేసిన ఉత్తర్వును కొట్టివేయాలని కోరారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) పేరుతో లక్షలాది మంది పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఎన్నికల ముందు ఓటర్ల జాబితాను ప్రత్యేకంగా తనిఖీ చేయడం, అనర్హుల సాకుతో కొందరి పేర్లు తొలగించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 19, 21, 325, 326తోపాటు ప్రజాప్రాతినిధ్య చట్టం–1950 నిబంధనలు, రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టోరల్ రూల్స్‌లోని రూల్ 21ఏను ఉల్లంఘించినట్లే అవుతుందని ప్రశాంత్ భూషణ్ తేల్చిచెప్పారు. స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికలు జరగకుండా ఈ ప్రక్రియ విఘాతం కలిగిస్తుందన్నారు.

సాక్ష్యాధారాలు సమర్పిస్తే భారత్‌కు అప్పగిస్తాం

- ఉగ్రవాదుల అప్పగింతపై బిలావల్
- మసూద్ గురించి సమాచారం ఇస్తే అరెస్టు చేస్తాం

ఇస్లామాబాద్: భారత్ కోరుకుంటున్న వ్యక్తులను, అవసరమైన వ్యక్తులను(ఉగ్రవాదులు) ఆ దేశానికి అప్పగించడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని పాకిస్తాన్ విదేశాంగ శాఖ మాజీ మంత్రి, పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ(పీపీపీ) చైర్మన్ బిలావల్ భుట్టో చెప్పారు. ఆయన శుక్రవారం అల్‌జజీరా వార్తా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. లష్కరే తోయిబా చీఫ్ హాఫీజ్ సయీద్, జైషే మొహమ్మద్ అధినేత మసూద్ అజార్‌ను భారత్‌కు అప్పస్తారా? అని ప్రశ్నించగా.. పొరుగు దేశంతో విశ్వాసం పెంపొందించుకొనే చర్యలకు సిద్ధంగా ఉన్నామని, ఇందుకు భారత్ సైతం సహకరిస్తే వారు కోరుకున్న వ్యక్తులను అప్పగిస్తామని బదులిచ్చారు. ఉగ్రవాద కార్యకలాపాలకు నిధులు అందించిన కేసులో హాఫీజ్ సయీద్, మసూద్ అజార్‌లపై తమ దేశంలో విచారణ కొనసాగుతోందని గుర్తుచేశారు. వీరిని ఇండియాలో విచారించాలంటే ఉగ్రవాద కార్యకలాపాల్లో వీరి హస్తం ఉన్నట్లు తగిన సాక్ష్యాధారాలు సమర్పించాలని స్పష్టంచేశారు. ఆ విషయంలో ఇండియా సహకరిస్తే హాఫీజ్ సయీద్, మసూద్ అజార్‌ల అప్పగింతకు అడ్డంకులు తొలగిపోతాయని తేల్చిచెప్పారు. హాఫీజ్ సయీద్ ప్రస్తుతం దర్యాప్తు అధికారుల కస్టడీలో ఉన్నాడని, మసూద్ అజార్ అఫ్గానిస్తాన్‌లో ఉన్నట్లు భావిస్తున్నామని బిలావల్ భుట్టో తెలిపారు. హాఫీజ్ సయీద్ పాకిస్తాన్‌లో స్వేచ్ఛగా తిరుగుతున్నాడన్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. మసూద్ అజార్‌ను అరెస్టు చేయలేకపోతున్నట్లు వెల్లడించారు. అతడు పాకిస్తాన్ గడ్డపైనే ఉన్నట్లు భారత ప్రభుత్వం సమాచారం ఇస్తే చాలా సంతోషిస్తామని, అతడిని అరెస్టు చేస్తామని వ్యాఖ్యానించారు.

రష్యా ఎయిర్‌బేస్‌పై ఉక్రెయిన్ దాడి

కీవ్: రష్యాలోని వైమానిక స్థావరంపై దాడి చేసినట్లు ఉక్రెయిన్ శుక్రవారం ప్రకటించింది. వొరొనెజ్ ప్రాంతంలోని బొరిసోగ్లెబ్స్క్ ఎయిర్‌బేస్‌ను ధ్వంసం చేశామని ఉక్రెయిన్ మిలటరీ తెలిపింది. యుద్ధ విమానాలతోపాటు గైడెడ్ బాంబుల గోదామును పేల్చేసినట్లు ప్రకటించింది. ఈ స్థావరంలో రష్యా ఎస్‌యూ–34, ఎస్‌యూ–35ఎస్, ఎస్‌యూ–30ఎస్ఎం వంటి యుద్ధ విమానాలుంటాయి. ఈ ప్రకటనపై రష్యా స్పందించలేదు. మరో వైపు రష్యా, శుక్రవారం రాత్రి కూడా డ్రోన్లతో ఉక్రెయిన్ భూభాగంపై దాడుల పరంపర కొనసాగించింది. ఖ్మెల్‌నిట్స్కియే ప్రాంతమే లక్ష్యంగా రష్యా ప్రయోగించిన 322 డ్రోన్లకుగాను 157 డ్రోన్లను కూల్చేశామని, మరో 135 డ్రోన్లను జామ్ చేశామని ఉక్రెయిన్ ఆర్మీ తెలిపింది. ఎటువంటి నష్టం సంభవించలేదంది.

అమెరికాతో కలిసి ఆయుధోత్పత్తి: జెలెన్‌స్కీ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో అతిముఖ్యమైన, ఫలవంతమైన ఫోన్ సంభాషణ జరిపినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ శుక్రవారం చెప్పారు. ఉక్రెయిన్ గగనతల రక్షణ వ్యవస్థలను బలోపేతం చేయడం, అమెరికాతో కలిసి ఆయుధ ఉత్పత్తిని చేపట్టడం, రష్యా జరిగే యుద్ధానికి ముగింపు పలికేలా చర్యలను వేగవంతం చేయడంపై చర్చించామన్నారు. జెలెన్‌స్కీతో సంభాషణ అనంతరం ట్రంప్ మీడియాతో మాట్లాడారు. రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు లభించనుందా అని అడగ్గా.. 'నాకు తెలియదు. యుద్ధం ఆగుతుందా లేదా అనే విషయం మీకు చెప్పను'అంటూ వ్యాఖ్యానించారు.

సుప్రీంకోర్టు అంతర్గత దర్యాప్తు నివేదికకు రాజ్యాంగబద్ధత లేదు

జస్టిస్ యశ్వంత్ శర్మపై చట్టప్రకారం దర్యాప్తు జరగాలి: సిబల్

న్యూఢిల్లీ: అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మపై సుప్రీంకోర్టు నిర్వహించిన అంతర్గత దర్యాప్తు నివేదికకు ఎలాంటి రాజ్యాంగబద్ధత లేదని రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ శనివారం స్పష్టంచేశారు. న్యాయమూర్తిపై జడ్జెస్ ఎంక్వైరీ చట్టం ప్రకారమే దర్యాప్తు జరగాలని అన్నారు. జస్టిస్ వర్మ ఢిల్లీ హైకోర్టులో న్యాయమూర్తిగా పని చేస్తున్న సమయంలో ఆయన ఇంట్లో అగ్నిప్రమాదం జరగ్గా, ఆ సమయంలో భారీగా నోట్ల కట్టలు బయటపడిన సంగతి తెలిసిందే. దీనిపై సుప్రీంకోర్టు అంతర్గత దర్యాప్తు చేపట్టింది. ఆయన అవినీతికి పాల్పడినట్లుగా గుర్తించింది. జస్టిస్ శర్మను పార్లమెంట్‌లో అభిశంసించాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఈ అంశంపై కపిల్ సిబల్ స్పందించారు. పార్లమెంట్‌లో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టడానికి నోటీసు ఇచ్చిన తర్వాత జడ్జెస్ ఎంక్వైరీ చట్టం ప్రకారం జడ్జెస్ ఎంక్వైరీ కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉంటుందని అన్నారు. ఈ కమిటీని ఏర్పాటు చేసే అధికారం పార్లమెంట్‌కు మాత్రమే ఉందని స్పష్టంచేశారు. కమిటీ ఆధ్వర్యంలో దర్యాప్తు పూర్తయిన తర్వాత పార్లమెంట్ ఉభయ సభల్లో అభిశంసన తీర్మానంపై ఓటింగ్ జరగాలని, మూడింట రెండొంతుల మంది ఆమోదిస్తే న్యాయమూర్తిని పదవి నుంచి తొలగించవచ్చని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు అంతర్గత దర్యాప్తును కపిల్ సిబల్ తప్పుపట్టారు. జస్టిస్ వర్మ అవినీతిపరుడని ఎలా అంటారని ప్రశ్నించారు.

అమర్‌నాథ్ యాత్రలో అపశృతి

- ఆగిన బస్సులను ఢీకొన్న మరో బస్సు
- 36 మంది యాత్రికులకు స్వల్ప గాయాలు

రాంబాన్/జమ్మూ: భక్తుల శివనామ స్మరణలతో మొదలైన అమర్‌నాథ్ యాత్రలో శనివారం చిన్నపాటి అపశృతి చోటుచేసుకుంది. ఆగి ఉన్న అమర్‌నాథ్ భక్తుల బస్సులను మరో బస్సు బ్రేక్ విఫలమవడంతో ఢీకొట్టింది. దీంతో మొత్తంగా ఐదు బస్సులు ఒకదానినొకటి వరసగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో 36 మంది భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. జమ్మూలోని భాగ్‌వతి నగర్ నుంచి దక్షిణ కశ్మీర్‌లోని పహల్గాం బేస్ క్యాంప్‌కు బస్సులు బయల్దేరగా రాంబాన్ జిల్లాలోని జమ్మూ–శ్రీనగర్ జాతీయరహదారిలో ఛందర్‌కోట్ వద్ద శనివారం ఉదయం 8 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. కాన్వాయ్‌లోని ఒక బస్సు బ్రేక్ ఫెయిల్‌కావడంతో ఈ ఘటన జరిగిందని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. స్వల్పగాయాలైన భక్తులందరకీ రాంబాన్ జిల్లా ఆస్పత్రిలో చికిత్సనందించారు. తర్వాత వారందరితో మళ్లీ యాత్ర మొదలైందని అధికారులు వెల్లడించారు.

ఆ ప్రబుద్ధుడిపై కోర్టు ధిక్కరణ చర్యలు!

- టాయిలెట్ సీటుపై కూర్చొని వర్చువల్‌గా హాజరైన వ్యక్తిపై సుమోటోగా విచారణ
- గుజరాత్ హైకోర్టు ఆదేశాలు

అహ్మదాబాద్: ఇంట్లో టాయిలెట్ సీటుపై కూర్చొని న్యాయస్థానంలో జరిగిన విచారణకు వర్చువల్‌గా హాజరైన వ్యక్తిపై గుజరాత్ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. కోర్టు ధిక్కరణ ఆరోపణల కింద ఆ ప్రబుద్ధుడిపై సుమోటోగా విచారణ ప్రారంభించింది. జూన్ 20వ తేదీన కోర్టులో జస్టిస్ నిర్జర్ ఎస్.దేశాయ్ ఓ కేసులో విచారణ చేపట్టారు. ఇందులో కక్షిదారుగా ఉన్న ఓ వ్యక్తి పసుపు రంగు టి–షర్టు ధరించి ఇంటి నుంచే వర్చువల్‌గా హాజరయ్యాడు. కానీ, టాయిలెట్ సీటుపై కూర్చొని మాట్లాడాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ వ్యక్తిని సూరత్ జిల్లాలోని కిమ్ గ్రామానికి చెందిన అబ్దుల్ సమద్‌గా గుర్తించారు. అతడి ప్రవర్తనపై జస్టిస్ ఏఎస్ సుపేహియా, జస్టిస్ ఆర్‌టీ వచానీతో కూడిన డివిజన్ బెంచ్ తీవ్రంగా స్పందించింది. వీడియోలో అభ్యంతరకరంగా కనిపించిన అబ్దుల్ సమద్‌పై సుమోటోగా విచారణ ప్రక్రియ ప్రారంభించాలని హైకోర్టు రిజిస్ట్రీని ఆదేశించింది. చట్టాన్ని ఉల్లంఘించినందుకు ఎందుకు విచారణ జరిపి శిక్షించకూడదో ప్రశ్నిస్తూ అతడికి నోటీసు జారీ చేయాలని పేర్కొంది. ఈ ఉత్తర్వును తాజాగా హైకోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. అబ్దుల్ సమద్ ప్రవర్తన దేశ ప్రతిష్టను దిగజార్చేలా ఉందని డివిజన్ బెంచ్ పేర్కొంది. సంబంధిత వీడియోను సోషల్ మీడియా నుంచి తొలగించాలని స్పష్టంచేసింది. కోవిడ్–19 మహమ్మారి ప్రభావం మొదలైనప్పటి నుంచి లాయర్లు, కక్షిదారులు వర్చువల్‌గా విచారణకు హాజరయ్యేందుకు గుజరాత్ హైకోర్టు అనుమతి ఇస్తోంది. అంతే కాకుండా హైకోర్టులో జరిగే విచారణను కోర్టు యూట్యూబ్ చానల్‌లో ప్రత్యక్ష ప్రసారం కూడా చేస్తున్నారు.

పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుడు సంజయ్ భండారీ

- ప్రకటించిన ఢిల్లీ కోర్టు
- భండారీ ఆస్తులను ఈడీ సీజ్ చేసే అవకాశం

న్యూఢిల్లీ: యునైటెడ్ కింగ్‌డమ్(యూకే)కు చెందిన ఆయుధాల కన్సల్టెంట్ సంజయ్ భండారీని ఢిల్లీ కోర్టు పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుడిగా ప్రకటించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులుజారీ చేసింది. ఢిల్లీ కోర్టు నిర్ణయంతో సంజయ్ భండారీకి సంబంధించిన రూ.కోట్ల ఆస్తులను సీజ్ చేసే అధికారం ఈడీకి లభించింది. సంజయ్ భండారీని ఇండియాకు అప్పగించేందుకు యూకే కోర్టు ఇటీవల నిరాకరించింది. దీంతో అతడిని రప్పించేందుకు అవకాశాలు సన్నగిల్లాయి. ఈ నేపథ్యంలో సంజయ్ భండారీని పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుడిగా ఢిల్లీ కోర్టు నిర్ధారించడం ఈడీకి పెద్ద ఊరటగా చెప్పొచ్చు. 63 ఏళ్ల భండారీ 2016లో లండన్‌కు పరారయ్యాడు. నల్లధన నిరోధక చట్టం కింద 2015లో అతడిపై ఐటీ విభాగం చార్జిషీట్ దాఖలు చేసింది. అనంతరం మనీ లాండరింగ్‌కు కూడా పాల్పడినట్లు తేలడంతో ఈడీ రంగంలోకి దిగింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్ఏ) కింద భండారీతో పాటు మరికొందరిపై 2017 ఫిబ్రవరిలో క్రిమినల్ కేసు నమోదు చేసింది. భండారీకి సంబంధించిన రూ.21 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. లండన్‌లో తలదాచుకుంటున్న భండారీని స్వదేశానికి రప్పించేందుకు ప్రయత్నిస్తోంది. ఆ ప్రయత్నాలు ఫలించకపోవడంతో భండారీని పరారీలో ఉన్న ఆర్థిక నేరగాడిగా గుర్తించాలని ఢిల్లీ కోర్టును కోరింది. మరోవైపు కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ భర్త రాబర్ట్ వాద్రాతో సంజయ్ భండారీ ఉన్న సంబంధాలపై ఈడీ దర్యాప్తు చేస్తోంది.

ట్రంప్ ముందు మోదీ సాగిలపడటం ఖాయం

రాహుల్‌గాంధీ జోస్యం

న్యూఢిల్లీ: తమతో వాణిజ్యం ఒప్పందం కుదుర్చుకోవాలని భారత్‌కు ట్రంప్ సర్కార్ ఇచ్చిన జూలై 9వ తేదీ గడువు మూడ్రోజుల్లో ముగుస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. గడువులు విధించినంత మాత్రాన భారత్ ఎప్పుడూ తొందరపడి నిర్ణయాలు తీసుకోబోదని వాణిజ్య మంత్రి పీయూశ్ గోయల్ శుక్రవారం చేసిన వ్యాఖ్యలను రాహుల్ ప్రస్తావిస్తూ.. ''పీయూశ్ గోయల్ గుండెలు బాదుకోవడం తప్ప చేసిందేమీ లేదు. నా మాటలు రాసిపెట్టుకోండి. టారిఫ్‌ల విధింపు గడువు జూలై 9 గడువు ముగిసేలోగా ప్రధాని మోదీ భారతకు అనుకూలంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోబోరు. ట్రంప్ అనుకున్నట్లే భారత్‌పై అధిక టారిఫ్‌లు విధించడం ఖాయం. ట్రంప్ ముందు మోదీ ఖచ్చితంగా తల వంచుతారు''అని రాహుల్ వ్యాఖ్యానించారు.

ఇజ్రాయెల్ కాల్పుల్లో మరో 34 మంది బలి

డెయిర్ అల్–బలాహ్: ఇజ్రాయెల్ ఆర్మీ గాజా ప్రాంతంపై జరిపిన వైమానిక దాడులు, ఆహార కేంద్రాల వద్ద జరిపిన కాల్పుల ఘటనల్లో మరో 34 మంది పాలస్తీనియన్లు అసువులు బాశారు. గాజా తీర ప్రాంతంలోని మువాసిపై జరిగిన దాడిలో ఒక వైద్యుడు, ఆయన ముగ్గురు పిల్లలు సహా ఏడుగురు చనిపోయినట్లు ఖాన్‌యూనిస్‌లోని నాస్సెర్ ఆస్పత్రి వర్గాలు శనివారం తెలిపాయి. దక్షిణ గాజాలోని బని సుహైలాలో మరో నలుగురు మృతి చెందారు. ఖాన్‌యూనిస్‌పై జరిపిన మూడు వేర్వేరు వైమానిక దాడుల్లో ముగ్గురు చనిపోయారు. అన్నార్తులపై.. రఫా నగరంలోని ఆహార పంపిణీ కేంద్రాల వద్ద కాల్పులకు దిగిన ఇజ్రాయెల్ ఆర్మీ మరో 9 మంది విగతజీవులుగా మారారు. ఇతరులతో కలిసి ఆహారం కోసం ఎదురుచూస్తూ ఖాన్‌యూనిస్‌లో ఒకరు ప్రాణాలొదిలారని నాస్సెర్ ఆస్పత్రి తెలిపింది.

చట్టం, రాజ్యాంగంపై వ్యాఖ్యానాలు ఆచరణాత్మకంగా ఉండాలి: సీజేఐ

ముంబై: చట్టం, రాజ్యాంగంపై చేసే వ్యాఖ్యా నాలు సమాజ అవసరాలకు అనుగుణంగా, ఆచరణాత్మకంగా ఉండాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. బాంబే హైకోర్టు శనివారం తనకు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో సీజేఐ మాట్లాడారు. ఇటీవల కొందరు సహోద్యోగుల దురుసు ప్రవర్తన గురించి తనకు ఫిర్యాదులు వచ్చాయని, సంస్థ ప్రతిష్టను కాపాడాలని న్యాయమూర్తులను కోరారు. 'చట్టం లేదా రాజ్యాంగాన్ని ప్రస్తుత తరం ఎదుర్కొంటున్న సమస్యల కోణంలోనే అర్థం చేసుకోవాలి. వాటిపై చేసే వ్యాఖ్యలు ఆచరణాత్మకంగానూ సమాజ అవసరాలకు తగినదిగానూ ఉండాలి' అని ఆయన అన్నారు. న్యాయమూర్తులు తమ మనస్సాక్షికి లోబడి, పదవీ ప్రమాణాన్ని అనుసరిస్తూ, చట్టానికి లోబడి పనిచేయాలని భావిస్తున్నారు. కానీ, ఈ విషయంలో నిర్ణయం జరిగిన తర్వాత కలవరపడడం తగదు'అని సీజేఐ తెలిపారు. జడ్జీల నియామకం గురించి ఆయన ప్రస్తావిస్తూ.. న్యాయవ్యవస్థ స్వతంత్రత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. సుప్రీ, హైకోర్టులకు న్యాయమూర్తుల ఎంపికలో యోగ్యతలతోపాటే వైవిధ్యం, సమ్మిళితత్వాన్ని సైతం పరిగణనలోకి తీసుకుంటామన్నారు. 'న్యాయమూర్తిగా ఉండటం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేసే ఉద్యోగం వంటిది కాదు. దేశానికి, సమాజానికి సేవ చేసేందుకు ఓ అవకాశం'అంటూ ఆయన.. నిబద్ధతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. న్యాయ వ్యవస్థకు అప్రతిష్ట కలిగించే ఎలాంటి పనులు చేయరాదని కోరారు.

'సమానత'లో భారత్ ఘనత

నాలుగో అత్యంత సమానతా దేశంగా ఆవిర్భవించిన భారత్

వెల్లడించిన ప్రపంచబ్యాంక్ నివేదిక

న్యూఢిల్లీ: 2011–12 కాలం నుంచి చూస్తే 2022–23 నాటికి భారత్‌లో అసమానతలు బాగా తగ్గుముఖం పట్టాయని ప్రపంచబ్యాంక్ కీర్తించింది. అత్యంత పేదరికం స్థాయిలు కూడా బాగా తగ్గిపోయాయని ప్రపంచ బ్యాంక్ నివేదిక పేర్కొంది. నివేదిక ప్రకారం భారత్‌లో 2011–12 కాలంలో 16.2 శాతంగా ఉన్న 'అత్యంత పేదరికం'.. 2022–23 ఏడాదికల్లా ఏకంగా 2.3 శాతానికి తగ్గిపోయింది. గత దశాబ్దకాలంలో భారత్‌లో చేపట్టిన పలు రకాల సంక్షేమ, అభివృద్ధి పథకాల కారణంగా ఇంతటి మార్పు సాధ్యమైందని నివేదిక వ్యాఖ్యానించింది. సమానత్వం విషయంలో స్లోవాక్ రిపబ్లిక్(24.1), స్లోవేనియా(24.3), బెలారస్ (24.4)దేశాలు తొలి మూడు స్థానాలను కైవసం చేసుకోవడం విశేషం. గినీ ఇండెక్స్ స్కోర్‌లో చైనా, అమెరికా, బ్రిటన్ కంటే భారత్ మెరుగైన స్థానాన్ని కైవసం చేసుకోవడం విశేషం. 25.5 స్కోర్‌తో భారత్ ప్రపంచంలో నాలుగో అత్యుత్తమ సమానత్వ దేశంగా ఆవిర్భవించిందని ప్రపంచబ్యాంక్ ఒక ప్రకటనలో పేర్కొంది. దేశ ఆదాయం, సంపద, వినియోగం దేశవ్యాప్తంగా అన్ని కుటుంబాలు, వ్యక్తులకు ఎంత సమస్థాయిలో పంపిణీ అవుతోందన్న దానిని పరిగణనలోకి సున్నా నుంచి 100 వరకు గినీ ఇండెక్స్ స్కోర్‌ను ఇస్తారు. ఇండెక్స్ స్కోర్‌గా సున్నా వస్తే ఆ దేశంలో సమానత్వం అత్యున్నత స్థాయిలో ఉందని అర్థం. 98 స్కోర్ వస్తే దేశ సంపద అంతా ఒక్కరిద్దరి చేతుల్లోనే ఉండి మిగతా వాళ్లు కడు పేదరికంలో ఉన్నట్లు అర్థం. 167 దేశాల స్కోర్‌లను ప్రపంచబ్యాంక్ ప్రకటించగా చైనా 35.7, అమెరికా 41.8 స్కోర్ సాధించాయి. 25.5 స్కోర్‌తో భారత్ అసమానత కేటగిరీ(25–30)లో దిగువ స్థాయిలో నిలిచింది. నివేదిక ప్రకారం గత దశాబ్దకాలంలో భారత్‌లో 17.1 కోట్ల మంది భారతీయులు దారిద్ర్యపు కోరల నుంచి బయటపడ్డారు. తక్కువ అసమానతల కేటగిరీలో దాదాపు 30 దేశాలున్నాయి. ఇందులో పటిష్టమైన సంక్షేమ పథకాలను అమలుచేస్తున్న కొన్ని యురోపియన్ దేశాలు సైతం ఉన్నాయి. వీటిలో ఐస్‌ల్యాండ్, నార్వే, ఫిన్లాండ్, బెల్జియంలతోపాటు అభివృద్ధిచెందుతున్న దేశం పోలండ్, సంపన్న దేశం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఉన్నాయి.

పట్నాలో ప్రముఖ వ్యాపారవేత్త కాల్చివేత

పట్నా: బిహార్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గోపాల్ ఖెమ్కా గుర్తు తెలియని వ్యక్తి జరిపిన కాల్పుల్లో చనిపోయారు. శుక్రవారం రాత్రి 11.40 గంటల సమయంలో పట్నాలోని గాంధీ మైదాన్ ప్రాంతంలోని తన నివాసం వద్ద కారు దిగుతున్న ఆయనపైకి బైక్‌పై వచ్చిన దుండగుడు కాల్పులు జరిపి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన ఖెమ్కాను వెంటనే ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పాత కక్షలే ఖెమ్కా హత్యకు కారణంగా భావిస్తున్నామని పోలీసులు తెలిపారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా దుండగుడికి సంబంధించిన ఆధారాలు దొరికాయ న్నారు. ఘటన నేపథ్యంలో పోలీసులు పట్నా లోని బ్యూర్ జైలులో సోదాలు జరిపి మూడు సెల్‌ఫోన్లు, పలు సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. కొందరిని ప్రశ్నిస్తున్నారు. ఖెమ్కాపై కాల్పులకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

గోడను ఢీకొట్టిన కారు..8 మంది మృతి

సంభాల్: మితిమీరిన వేగం 8 నిండు ప్రాణాలను బలి తీసుకుంది. ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ జిల్లా హర్‌గోవింద్‌పూర్‌కు చెందిన ఓ పెళ్లి బృందం బదౌన్ జిల్లాలోని సిర్తౌల్‌కు కారులో వెళుతోంది. వేగంగా వెళ్తున్న ఈ వాహనం అదుపుతప్పి జునావాయ్‌లోని జనతా ఇంటర్ కాలేజీ సమీపంలో గోడను బలంగా ఢీకొట్టింది. ఘటనలో వరుడు సూరజ్(24) సహా అతని కుటుంబీకులు 8 మంది అక్కడికక్కడే చనిపోయారు.

కూలిన అక్రమ బొగ్గు గని.. నలుగురు దుర్మరణం

రాంగఢ్: జార్ఖండ్‌లోని రాంగఢ్ జిల్లాలో అనధికారికంగా నడుస్తున్న బొగ్గు గని కూలిన ఘటనలో నలుగురు చనిపోగా మరో నలుగురు గాయపడ్డారు. కుజులోని కర్మ ప్రాంతంలో శనివారం ఉదయం జరిగింది. సెంట్రల్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ కంపెనీకి చెందిన ఈ గనిని మూసివేయగా, కొందరు అక్రమంగా తవ్వుతున్నారని ఎస్పీ అజయ్ కుమార్ చెప్పారు. గని కూలడంతో గాయాలపాలైన నలుగురిని బయటకు తీశామని ఆయన వివరించారు. సహాయక చర్యలు పూర్తయ్యాయని చెప్పారు.

యమునా తీరంలో ఆగ్రా నగరాన్ని ఎవరు నిర్మించారు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

సికిందర్ లోడి యమునా నదీ తీరంలో ఆగ్రా నగరాన్ని నిర్మించాడు. లోడిలకు ఇది రెండో రాజధాని. మొగలుల కాలం లోనూ ఆగ్రా రాజధానిగా ఉంది. అక్బర్ నిర్మించిన కోట, షాజహాన్ నిర్మించిన తాజ్‌మహల్, మోతీ మసీదు ఇక్కడి ప్రధాన కట్టడాలు. 17వ శతాబ్దం లో వివిధ వాణిజ్య మార్గాలకు ఇది కూడలిగా విలసిల్లింది. ఆగ్రా సమీపంలో అక్బర్ 'ఫతేపూర్ సిక్రీ' నిర్మించాడు.

ఢిల్లీ సుల్తాన్‌లు

తుగ్లక్ వంశం (క్రీ.శ. 1320-1414)


తుగ్లక్‌లు తురుష్క తెగకు చెందినవారు. ఈ వంశంలో మహమ్మద్ బిన్ తుగ్లక్, ఫిరోజ్ షా తుగ్లక్ ప్రసిద్ధమైనవారు.

గియాస్ ఉద్దీన్ (క్రీ.శ. 1320-1325): ఘజీమాలిక్ గియాస్ ఉద్దీన్ 'తుగ్లక్' వంశ పాలనను ప్రారంభించాడు. ఇతడి కుమారుడైన జునాఖాన్ కాకతీయ రాజు ప్రతాపరుద్రుడిపై దండెత్తి ఓడించాడు. ఓరుగల్లు పేరును 'సుల్తాన్‌పూర్'గా మార్చి ఢిల్లీ రాజ్యంలో విలీనం చేశాడు. తండ్రిని హత్య చేసి జునాఖాన్ 'మహమ్మద్ బిన్ తుగ్లక్'గా ఢిల్లీ సింహాసనాన్ని అధిష్ఠించాడు.

మహమ్మద్ బిన్ తుగ్లక్ (క్రీ.శ. 1325 - 1351): మహమ్మద్ బిన్ తుగ్లక్ మధ్యయుగ చక్రవర్తులందరిలో ప్రత్యేకమైన వ్యక్తిత్వం ఉన్నపాలకుడు. సమకాలీన ప్రభువుల్లో అత్యంత ప్రతిభావంతుడిగా పేరు పొందాడు. ఇతడు బహు భాషా కోవిదుడు. గణిత, తర్క, ఖగోళ, వైద్య, భౌతిక, తత్త్వ శాస్త్రాలను అధ్యయనం చేశాడు. పరమత సహనం ఉన్న వ్యక్తి. ఇన్ని సద్గుణాలున్నప్పటికీ తొందరపాటు ఎక్కువ. మొండిగా నిర్ణయాలు తీసుకునేవాడు. అదుపులేని కోపం ప్రదర్శించేవాడు. అందువల్ల చరిత్రకారులు ఇతడిని 'విరుద్ధ గుణాల నిలయుడు'గా పేర్కొన్నారు. 1327లో రాజధానిని ఢిల్లీ నుంచి దౌలతాబాద్‌కు మార్చాడు. 1329లో రాగి నాణేలను ప్రవేశపెట్టాడు. 1337లో నాగర్ కోటపై విజయం సాధించాడు. ఇతడు వివిధ సంస్కరణలు చేపట్టినప్పటికీ దూరదృష్టి లేకపోవడంతో అవి విఫలమయ్యాయి.

ఫిరోజ్ షా తుగ్లక్ (క్రీ.శ 1351-1386): సైన్యానికి జాగీర్లు ఇచ్చే పద్ధతిని తిరిగి ప్రవేశ పెట్టాడు. బానిసల అవసరాలను తీర్చడానికి ప్రభుత్వ శాఖను ఏర్పాటు చేశాడు. ముస్లిమేతరుల(హిందువులు)పై 'జిజియా' పన్ను, ముస్లింల ఆస్తులపై 2.5 శాతం పన్ను 'జకత్' విధించాడు. పండిన పంటలో పదో వంతు భాగాన్ని పన్ను (ఖరజ్) రూపంలో వసూలు చేసేవాడు. యుద్ధంలో సాధించిన ధనంలో 1/5వ భాగం ప్రభుత్వానికి, 4/5వ భాగం సైనికులకు ఇచ్చే శాడు. ఇతడి కాలంలో జియా ఉద్దీన్ బరానీ హిందూ-సంస్కృత గ్రంథాలను పర్షియన్ భాషలోకి అనువదించాడు.

ఫిరోజ్ షా శాంతికాముకుడు. ఇతడు యుద్ధాల పట్ల విముఖత చూపాడు. ఇతడికి ధైర్య సాహసాలు, యుద్ధ నిర్వహణా సామర్థ్యాలు తక్కువ. అందువల్ల ఇతడి కాలంలో విజయనగర, బహమనీ రాజ్యాలు ఏర్పడ్డాయి; బెంగాల్‌లోనూ స్వతంత్ర పాలన ప్రారంభమైంది.



ఫిరోజ్ షా ప్రజా సంక్షేమం కోసం పాటుపడ్డాడు. నీటిపారుదల సౌకర్యాలు కల్పించాడు. ఫతేబాద్, హిస్సార్, ఫిరోజాబాద్, జాన్‌పూర్ మొదలైన నూతన నగరాలను నిర్మించాడు. కఠిన శిక్షలను రద్దు చేశాడు. బానిసల అవసరాలకు ప్రత్యేక శాఖను నెలకొల్పాడు.

తుగ్లక్ వంశ చివరి పాలకులు: ఫిరోజ్ షా తర్వాత తుగ్లక్ షా అధికారంలోకి వచ్చాడు. ఢిల్లీ సర్దార్‌లు ఏడాది కాలంలోనే (1389) ఇతడిని తొలగించి మహమ్మద్‌ను సుల్తాన్‌గా నియమించారు. ఆ తర్వాత నాసిరుద్దీన్ మహమ్మద్ సింహాసనం అధిష్ఠించాడు. 1398లో తైమూర్ దండయాత్ర జరిగింది. 1414లో తుగ్లక్ వంశం పూర్తిగా అంతరించింది.

సయ్యద్ వంశం (క్రీ.శ. 1414-1451)

తైమూర్ ప్రతినిధి 'ఖిజర్‌ఖాన్' ఢిల్లీని ఆక్రమించి 1414లో సయ్యద్ వంశాన్ని స్థాపించాడు. ఈ వంశంలో నలుగురి పాలనలో రాజ్యం అల్లకల్లోలంగా మారింది. దీంతో లోడి వంశానికి చెందిన బహలాల్ లోడి ఢిల్లీని ఆక్రమించాడు.

లోడి వంశం (క్రీ.శ. 1451-1526)

ఈ వంశాన్ని బహలాల్ లోడి స్థాపించాడు. ఇతడు అఫ్గాన్ తెగకు చెందినవాడు. ఇతడి కుమారుడైన 'సికిందర్ లోడి' భూమిని కొలవడానికి 'సికిందర్ గజ్' పద్ధతిని ప్రవేశపెట్టాడు. ఆగ్రా నగరాన్ని కూడా ఇతడే నిర్మించాడు. ఇబ్రహీం లోడి 1526లో బాబర్‌తో జరిగిన 'పానిపట్ యుద్ధం'లో ఓడిపోయాడు. దీంతో లోడి వంశం అంతమైంది.

భక్తి, సూఫీ ఉద్యమాలు

భక్తి అంటే ఇష్టదైవంపై గాఢమైన అనురాగం. భక్తి ఉద్యమకారులు మూఢాచారాలు, కర్మలను ప్రతిఘటించారు. హిందువుల్లో ఈ భక్తి సిద్ధాంతం అతి ప్రాచీనమైంది. దీన్ని ఉపనిషత్తులు, భగవద్గీతలో గమనించవచ్చు. భక్తి ఉద్యమం 15, 16 శతాబ్దాల్లో ఉత్తర భారతదేశంలో శక్తివంతంగా మారింది. ఇస్లాం మత ప్రభావంతో అనేక మంది మతాచార్యులు దేవుడి ఏకత్వం, మానవ సౌభ్రాతృత్వాన్ని ప్రచారం చేయడానికి ముందుకు వచ్చారు. ఇదే సమయంలో హిందూమతంలో అనేక దూరాచారాలు చోటు చేసుకున్నాయి. విగ్రహారాధన, అస్పృశ్యత, వర్ణభేదాలు, దురాచారాలు అధికమయ్యాయి. దీంతో చాలా మంది హిందూమత సంస్కారాన్ని కోరుకున్నారు.

భక్తి ఉద్యమ గురువులు దేశ భాషల్లో సామాన్య జనానికి అర్థమయ్యేవిధంగా దృష్టాంతాలతో కథలు బోధించారు. నిమ్న జాతుల ఉద్ధరణ కోసం వీరు వర్ణభేదాలను ఖండించారు.

శంకరాచార్యులు: ఈయన కేరళలోని 'కాలిడి' గ్రామంలో జన్మించారు. అద్వైత మత సిద్ధాంతాన్ని ప్రచారం చేశారు. జీవాత్మ, పరమాత్మలో ఐక్యం కావడమే మోక్షం, ఈ జ్ఞానం సాధించినవాడే జీవన్ముఖుడు అని చెప్పారు. యాంత్రికమైన ఆచారాలు, కర్మకాండలను తీవ్రంగా నిరసించారు. భారతదేశంలో అద్వైత వేదాంత మత సిద్ధాంతాలను ప్రచారం చేశారు. భగవద్గీత, ఉపనిషత్తులు, వేదాంత సూత్రాలకు భాష్యాలు రాసి అద్వైత సూత్రాన్ని ప్రబోధించారు. భక్తి, జ్ఞానం, కర్మ, వైరాగ్య మార్గాల ద్వారా మోక్షాన్ని పొందొచ్చని చెప్పారు. ఆయన దేశ నలుమూలలా తన సిద్ధాంతాలను ప్రచారం చేశారు. దీని కోసం శృంగేరి (మైసూర్ దక్షిణ ప్రాంతం), ద్వారకా (గుజరాత్ పశ్చిమ ప్రాంతం),పూరీ(ఒడిశా తూర్పు ప్రాంతం), బదరీ (ఉత్తరప్రదేశ్ ఉత్తరప్రాంతం)లో మఠాలను స్థాపించారు. శంకరాచార్యుడి విధానాన్ని 'ఉత్తర మీమాంస'గా పేర్కొంటారు.

రామానుజాచార్యులు: ఈయన మద్రాసు సమీపంలోని పెరంబుదూర్ గ్రామంలో జన్మించారు. విశిష్టాద్వైతాన్ని ప్రచారం చేశారు. జీవాత్మ పరమాత్మ సామీప్యం పొందడమే మోక్షమని, మోక్షానికి విష్ణుభక్తే మార్గమని రామానుజుడు బోధించారు. ఈయన కులతత్వాన్ని ఖండించారు.

మధ్వాచార్యులు: ఈయన కర్ణాటకలోని ఉడిపి పట్టణ సమీపం వేలి గ్రామంలో 1199లో జన్మించారు. మధ్వాచార్యులు 'ద్వైత' మత ప్రతిష్ఠాపకులు. ఇందులో మూడు సత్య పదార్థాలను పేర్కొన్నారు. అవి.. ఆదిబ్రహ్మ, జీవుడు, ప్రపంచం. ఈయన వైష్ణవభక్తి మార్గాన్ని ప్రచారం చేశారు.

రామానందుడు: వైష్ణవ మత ప్రచారానికి సంబంధించిన అగ్రగణ్యుల్లో రామానందుడు ఒకరు. మధ్యయుగంలో భక్తి ఉద్యమం ప్రధానంగా ఈయనతోనే ప్రారంభమైంది. ఈయన ఇష్టదైవాలు రాముడు, సీత. రాజపుత్ర వనిత మీరాబాయి ఈయన శిష్యురాలు.

వల్లభాచార్యుడు: ఈయన 1449లో బెనారస్ నగరంలో జన్మించారు. ఈయన తల్లిదండ్రులు కాశీలో స్థిరపడ్డ తెలుగు బ్రాహ్మణ కుటుంబానికి చెందినవారు. వల్లభాచార్యుల ఇష్టదైవం కృష్ణుడు. ఈయన కృష్ణతత్వాన్ని ప్రచారం చేశారు. 'శుద్ధ అద్వైత' మతాన్ని ప్రబోధించారు.

చైతన్యుడు (1485-1533): బెంగాల్‌లోని నవద్వీపంలో 1486లో ఈయన జన్మించారు. చైతన్యుడు భక్తిభావంతో రాధాకృష్ణుల ప్రేమతత్వాన్ని ప్రబోధించడానికి జీవితం అంకితం చేశారు. ఈయన వల్లభాచార్యుల సమకాలీకులు.

కబీరు: ఈయన రామానందుడి శిష్యుల్లో గొప్పవారు. వర్ణభేదాలు, విగ్రహారాధనను నిరసించాడు. 'అల్లా' ఒక్కడేనని, ఈశ్వరుడు సర్వవ్యాప్తి అని ఈయన ప్రబోధించారు. భజనను ముక్తికి మార్గంగా ప్రచారం చేశారు. కబీరు శిష్యవర్గంలో హిందువులు, ముస్లింలు ఉన్నారు.

గురునానక్: ఈయన సిక్కు మత స్థాపకుడు. లాహోర్ సమీపంలోని తల్వండి గ్రామంలో 1469లో క్షత్రియ కుటుంబంలో జన్మించారు. ఏకేశ్వరోపాసన, ప్రేమ, భక్తి మార్గం ఈయన ముఖ్య సిద్ధాంతాలు. వర్ణభేదాలు, విగ్రహారాధనను నిరసించారు. దేవుడు సత్య స్వరూపుడని, ఆరాధించడానికి గురువు అవసరమని ఈయన పేర్కొన్నారు. గురునానక్ 1538లో మరణించారు.

తుకారం: ఈయన మరాఠా కబీర్‌గా గుర్తింపు పొందారు. పరిశుద్ధ హృదయం, నైతిక ఔన్నత్యం భక్తి సాధనాలని చెప్పారు. విగ్రహారాధనను నిరసించారు. ఈయన పద్యాలు శివాజీని ఎంతగానో ఆకర్షించాయి.

నామదేవుడు: ఈయన 15వ శతాబ్దంలో మహారాష్ట్రలో జన్మించారు. దుస్తులకు అద్దకం వేసే వృత్తి చేసేవారు. భక్తి మార్గం ముక్తికి ముఖ్య సాధనంగా బోధించారు. ఏకేశ్వరోపాసనాన్ని బలపర్చారు. ఈయన విగ్రహారాధన, కర్మకాండలను ఖండించారు.

తులసీదాసు: 1532లో జన్మించారు. 'రామచరిత మానస్' రచించారు. తులసీదాసు అద్వైతాన్ని అనుసరించారు. ఈయన అక్బర్ సమకాలీకులు.

వేమన: ఈయన ఆంధ్రదేశంలోని నీతి బోధకుల్లో గొప్పవారు. ప్రజాకవి. ఈయన రాసిన నీతి శతకాలు ప్రజల్లో బాగా వ్యాప్తి చెందాయి. వేమన అర్థంలేని సాంప్రదాయాలు, వర్ణభేదాలు, విగ్రహారాధనను ఖండించారు.

సూఫీ మతం

భక్తి ఉద్యమం మాదిరిగా సూఫీ మతం కూడా సాంఘిక, మత రంగాల్లో ప్రజలను ఎక్కువగా ప్రభావితం చేసింది. భారత్‌లో తురుష్కుల పాలన నెలకొన్న తర్వాత సూఫీలు మనదేశానికి వచ్చారు. 'మానవుడు ప్రేమతో భగవంతుడిలో లీనం కాగలడు' అనేది సూఫీ మత ముఖ్య సిద్ధాంతం. సూఫీలు ప్రేమకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ఇతర మతస్థుల పట్ల సహనంతో వ్యవహరించేవారు.

సూఫీ ప్రవక్తల్లో కొంత మంది హిందూ మతం వల్ల ప్రభావితమయ్యారు. భగవంతుడిని చేరుకోవడానికి అనేక మార్గాలు ఉంటాయని సూఫీలు విశ్వసించారు. వీరు సంఘానికి దూరంగా, ప్రత్యేక స్థలాల్లో నివసించేవారు. కర్మకాండలకు వ్యతిరేకంగా భక్తి ఉద్యమం ప్రారంభమైన విధంగా మహమ్మదీయ మతంలోని కొన్ని సాంప్రదాయాలకు వ్యతిరేకంగా సూఫీ మతం ప్రారంభమైంది.

సూఫీలు ఉపవాసాలు, ధ్యానం లాంటి హిందూ ఆచారాలను పాటించారు.భారత్‌లో ముఖ్యంగా మూడు సూఫీ శాఖలున్నాయి. వీటిలో ముఖ్యమైంది 'చిస్తి'. ఈ శాఖాధిపతి అజ్మీర్‌కు చెందిన మొయినుద్దీన్ చిస్తీ. ఈయన 13వ శతాబ్దానికి చెందినవారు. భక్తి సంగీతంతో భగవంతుడి సాన్నిధ్యం పొందవచ్చని చిస్తీ విశ్వసించారు. సుప్రసిద్ధ కవి అమీర్ ఖుస్రూ సహా అనేక మంది ఈయన అనుచరులు. చిస్తి అనుచరులు ఎక్కువగా ఢిల్లీ ప్రాంతంలో ఉన్నారు.

సూఫీల్లో రెండో శాఖ నాయకుడు షేక్ షహాబుద్దీన్ సుహ్రావర్ది. ఈయన శిష్యులు ఎక్కువగా సింధ్ ప్రాంతంలో ఉన్నారు. మూడో సూఫీశాఖ గురువు ఫిరదౌసి అనుచరులు ఎక్కువగా బిహార్ ప్రాంతంలో ఉన్నారు. నిజాముద్దీన్ అవులియా కూడా సూఫీ మతగురువుల్లో ముఖ్యులు. సూఫీ నాయకులు సమానత్వాన్ని ప్రవచించారు. బడుగు వర్గాలకు చెందిన రైతులు, కార్మికులు, కూలీలను ఆకర్షించారు.

మూత్రపిండాల అధ్యయనాన్ని ఏమంటారు?

జీవుల దేహంలోని మలిన పదార్థాలను బయటికి పంపడాన్నే విసర్జన అంటారు. మానవుడిలో ఒక జత మూత్ర పిండాలు ఉంటాయి. వీటి అధ్యయనాన్ని నెఫ్రాలజీ అంటారు. ఒక వ్యక్తి రోజుకు సుమారు 1 నుంచి1.5 లీటర్ల మూత్రాన్ని విసర్జిస్తాడు. మానవ శరీరంలో అవయవ మార్పిడి చేసిన మొదటి అవయవం 'మూత్ర పిండం'. కృత్రిమ అవయవాల అధ్యయనాన్ని బయోనిక్స్ అంటారు.

విసర్జన వ్యవస్థ

శరీరంలో జీవక్రియల ఫలితంగా ఏర్పడిన నీరు, కార్బన్ డై ఆక్సైడ్, నత్రజని సంబంధ వ్యర్థ పదార్థాలను దేహం నుంచి బయటకు పంపడాన్ని విసర్జన అంటారు. విసర్జన క్రియను అధ్యయనం చేసే శాస్త్రం యూరాలజీ. మానవుడిలో ఒక జత మూత్రపిండాలు విసర్జన క్రియను నిర్వర్తిస్తాయి. మూత్ర పిండాలు విసర్జనతో పాటు రక్తం, కణజాలాల ద్రవాభిసరణ పీడనం, అయాన్లను సమతుల్యం చేస్తాయి.

విసర్జన పద్ధతులు - జీవుల రకాలు

అమ్మోనోటెలిక్ జీవులు: అమ్మోనియాను విసర్జించే జీవులను అమ్మోనోటెలిక్ జీవులు అంటారు. దీని విష స్వభావం అధికంగా ఉంటుంది. **ఉదా:** అమీబా, హైడ్రా, అస్థి చేపలు, డిప్నాయ్ చేపలు, రొయ్యలు, పీతలు, నత్త, ఆల్చిప్ప, చిరుకప్ప, సముద్ర క్షీరదాలు (డాల్ఫిన్స్, తిమింగలం)

యూరికోటెలిక్ జీవులు: యూరికామ్లాన్ని విసర్జిస్తాయి. విషస్వభావం చాలా తక్కువ. నీటికొరత ఉండే ఎడారి జీవుల్లో ఈ విధానం కనిపిస్తుంది. **ఉదా:** కీటకాలు (ఆర్థోపోడ) సరీసృపాలు (బల్లి, పాము, తొండ, మొసలి, తాబేలు), పక్షులు. కప్ప సుప్తావస్థ దశలో యూరికామ్లాన్ని విసర్జిస్తుంది.

యూరియోటెలిక్ జీవులు: యూరియాను విసర్జిస్తాయి. **ఉదా:** మంచినీటి చేపలు, వానపాము, ఉభయచరాలు (ప్రౌడకప్ప), క్షీరదాలు (మానవుడు). మొదటిసారి కృత్రిమంగా తయారు చేసిన జీవ సమ్మేళనం 'యూరియా'. దీని రసాయన నామం 'కార్బమైడ్'

మానవ విసర్జన వ్యవస్థ

మానవుడి విసర్జన వ్యవస్థలో జత మూత్రపిండాలు, జత మూత్ర నాళాలు, మూత్రాశయం, ప్రసేకం ఉంటాయి. పక్షుల్లో మూత్రాశయం ఉండదు. విసర్జక వ్యవస్థ ప్రాథమిక కర్తవ్యం రక్తం, శరీర ద్రవాల అయాన్ల సమతాస్థితిని కాపాడటం. ద్వితీయ కర్తవ్యం నత్రజని సంబంధ వ్యర్థ పదార్థాల విసర్జన.

మూత్ర పిండాలు (కిడ్నీలు)



- మూత్ర పిండాల అధ్యయనాన్ని నెఫ్రాలజీ అంటారు.
- మూత్ర పిండాలు చిక్కుడు గింజ ఆకారంలో, ముదురు ఎరుపు రంగులో ఉంటాయి.
- కాలేయం వల్ల ఎడమ మూత్ర పిండం కంటే కుడి మూత్రపిండం కొద్దిగా దిగువన అమరి ఉంటుంది.
- మూత్ర పిండాలు 120 నుంచి 170 గ్రాముల బరువుంటాయి. ఇవి వెన్నెముకకు ఇరువైపులా, పృష్ఠ శరీర కుడ్యాన్ని అంటిపెట్టుకొని ఉంటాయి.
- మూత్ర పిండాలకు హృదయం నుంచి వృక్క ధమని రక్తాన్ని సరఫరా చేస్తుంది.
- మూత్ర పిండాల నుంచి హృదయానికి రక్తాన్ని తీసుకుపోయే సిరను వృక్కసిర అంటారు.
- నిలువుకోతలో మూత్ర పిండం వెలుపలి భాగాన్ని వల్కలం (కోర్టెక్స్), లోపలి భాగాన్ని దవ్వ అంటారు.
- మూత్రపిండం పుటాకార అంచులో ఉండే నొక్కును నాభి అంటారు.
- నాభి ద్వారా వృక్కసిర, మూత్రనాళాలు బయటకు వస్తాయి.
- మూత్ర పిండాల నిర్మాణాత్మక, క్రియాత్మక ప్రమాణాలు మూత్రనాళికలు (నెఫ్రాన్లు)

మూత్రనాళికలు (నెఫ్రాన్లు)

ఒక్కో మూత్ర పిండంలో 12 లక్షల (1.2 మిలియన్లు) నెఫ్రాన్లు ఉంటాయి. ప్రతి నెఫ్రాన్ (మూత్ర నాళిక)లో రెండు భాగాలుంటాయి. అవి.

ఎ) భౌమన్స్ గుళిక

బి) నాళికా భాగం.

భౌమన్స్ గుళిక: ఇది ఒక గిన్నెవంటి భాగం. వృక్క ధమని మూత్రపిండంలోకి ప్రవేశించి అనేక ధమనికలుగా విభజన చెందుతుంది. భౌమన్ గుళికలోకి ఒక అభివాహి ధమనిక ప్రవేశించి అనేక రక్త కేశనాళికలుగా చీలి, రక్త కేశ నాళికాగుచ్ఛాన్ని ఏర్పరుస్తుంది. దీనిలోని సూక్ష్మ రంధ్రాల ద్వారా రక్తంలోని నీరు,మలినాలు భౌమన్స్ గుళికలోకి చేరుతాయి. ఈ వడబోతను సూక్ష్మగాలనం(అల్ట్రాఫిల్టరేషన్) అంటారు. భౌమన్స్ గుళికలో రక్తంలోని మలినాలు ఫిల్టరై ప్రాథమిక మూత్రం ఏర్పడుతుంది. దీనిలో గ్లూకోజ్, కొన్ని క్లోరైడ్లు, విటమిన్లు ఉంటాయి.

నాళికాభాగం: ఇది భౌమన్స్ గుళిక వెనకభాగం. దీనిలో మూడు ఉప భాగాలు ఉన్నాయి.

ఎ) **సమీప సంవళిత నాళం:** ఇది ముడతలు పడి ఉంటుంది. దీనిలో 60 శాతం నీరు పునఃశోషణం చెందుతుంది.

బి) **హెన్లీ శిక్యం:** ఇది తలపిన్ను / సి ఆకారంలో ఉంటుంది. ఇందులో 20 శాతం నీరు పునఃశోషణం చెందుతుంది

సి) **దూరాగ్రసంవళిత నాళం:** దీనిద్వారా 15 శాతం నీరు పునః శోషణం అవుతుంది.

- రక్తం వడపోతలో రెండు మూత్ర పిండాల్లో నిమిషానికి 125 మి.లీ, రోజుకు 180 లీటర్లు మూత్రం ఏర్పడుతుంది. ఇందులో 178.5 లీటర్ల మూత్రం పునఃశోషణం చెందుతుంది. రోజుకు 1.5 లీటర్ల మూత్రం విసర్జితమవుతుంది.

3. **మూత్రాశయం**

- మూత్రనాళాల నుంచి మూత్రం మూత్రాశయంలోకి చేరి అక్కడ నిల్వ ఉంటుంది. మూత్రాశయం నుంచి ప్రసేకం ద్వారా మూత్ర విసర్జన జరుగుతుంది. పెద్దవారిలో మూత్రవిసర్జన నియంత్రిత చర్య కాని చిన్న పిల్లల్లో అనియంత్రిత చర్య.

మూత్రం (యూరిన్) లక్షణాలు

ఒక వ్యక్తి రోజుకు సుమారు 1 నుంచి 1.5 లీటర్ల మూత్రాన్ని విసర్జిస్తాడు. మూత్రంలో 96 శాతం నీరు, 2 శాతం యూరియా, 2 శాతం అకర్బన పదార్థాలుంటాయి.మానవుడు మూత్రం ద్వారా రోజుకు సుమారు 25 నుంచి 30గ్రాముల యూరియా విసర్జిస్తాడు.

యూరోక్రోమ్ అనే వర్ణద్రవ్యం వల్ల మూత్రం లేత పసుపు రంగులో ఉంటుంది. మూత్రం కొద్దిగా ఆమ్ల స్వభావంలో ఉంటుంది. దీని పీహెచ్ '6'. మానవుడి మూత్రంలో 'సి' విటమిన్ ఉంటుంది. మూత్రం శరీరంలో ఎక్కువ కాలం నిల్వ ఉంటే యూరియా 'అమ్మోనియా' అనే విష పదార్థంగా మారుతుంది. అమ్మోనియా వల్ల మూత్రానికి ఘాటైన వాసన వస్తుంది. విసర్జితమైన మూత్రం కొంత సమయానికి వాసన వస్తుంది. మూత్రంలో గ్లూకోజ్, సోడియం ఉండవు. మధుమేహ వ్యాధిగ్రస్తుల మూత్రంలో గ్లూకోజ్ ఉంటుంది.

విసర్జనలో ఇతర అవయవాల పాత్ర

మూత్రపిండాలతో పాటు ఊపిరితిత్తులు,కాలేయం, చర్మం కూడా వ్యర్థ పదార్థాలను విసర్జిస్తాయి.

1. **ఊపిరితిత్తులు:** రోజుకు 18 లీటర్ల కార్బన్ డై ఆక్సైడ్, 300 నుంచి 500 మి.లీ. తేమను బయటకు పంపుతాయి
2. **కాలేయం:** ఇది మానవ శరీరంలో అతిపెద్ద గ్రంథి. ఇది వయసు మళ్లిన ఎర్రరక్త కణాలను విచ్ఛిన్నం చేసి హీమోగ్లోబిన్‌ను బైల్ వర్ణకాలుగా మారుస్తుంది.
3. **చర్మం:** చర్మంలోని స్వేద గ్రంథులు చెమట రూపంలో మలినాలను విసర్జిస్తాయి. మానవుడి స్వేదంలో నీరు, లవణాలు (ఉప్పు/ సోడియం క్లోరైడ్), కొవ్వులు, కొద్దిగా యూరియా ఉంటాయి.

విసర్జక అవయవాలు - రకాలు

విసర్జక అవయవాలు	జీవులు
1. సంకోచ రిక్తికలు	ప్రొటోజోవా జీవులు (అమీబా, పారమీషియం)
2. జ్వాలా కణాలు (ఫ్లేమ్‌సెల్స్)	ప్లాటి హెల్మింథిస్ జీవులు (బద్దెపురుగు, టేప్ వార్మ్)
3. వృక్కాలు	అనిలెడ (వానపాము, జలగ)
4. మాల్పీజియన్ నాళికలు	ఆర్థ్రోపొడ (బొద్దింక, ఈగ)
5. హరిత గ్రంథులు	ఆర్థ్రోపొడ (రొయ్యలు, పీతలు)
6. కోక్సల్ గ్రంథులు	ఆర్థ్రోపొడ (తేలు)
7. కీబర్స్ అవయవం	మొలస్కా (నత్తలు)
8. బొజానస్ అవయవం	మొలస్కా (ఆల్చిప్ప)
9. మూత్రపిండాలు (కిడ్నీ)	చేప, ఉభయ చరాలు, సరీసృపాలు, పక్షులు, క్షీరదాలు

కృత్రిమ మూత్ర పిండం:

- మూత్రపిండాలు పనిచేయని వారిలో రక్తంలోని మలినాలను తొలగించడానికి ఉపయోగించే యంత్రమే కృత్రిమ మూత్రపిండం (డయాలైజర్). దీన్ని విలియం కోల్ఫ్ కనుగొన్నారు. దీన్ని ఆవిష్కరించిన రోజు మార్చి 13ను ప్రపంచ కిడ్నీ దినోత్సవంగా జరుపుకుంటున్నారు. డయాలసిస్ చేయడానికి 2-6 గంటలు పడుతుంది.

మూత్రపిండాల మార్పిడి:

- మూత్రపిండాలు పూర్తిగా పనిచేయని వ్యక్తికి దాత నుంచి సేకరించిన కిడ్నీని అమర్చడాన్నే ట్రాన్స్‌ప్లాంటేషన్ అంటారు.
- మానవ శరీరంలో అవయవ మార్పిడి చేసిన మొదటి అవయవం'మూత్రపిండం'. కృత్రిమ అవయవాల అధ్యయనాన్ని బయోనిక్స్ అంటారు.

మూత్రపిండాల్లో రాళ్లు: కాల్షియం ఆక్సలేట్ (ఎక్కువ మొత్తం), కాల్షియం ఫాస్ఫేట్, యూరియాతో ఏర్పడిన స్ఫటికాలను కిడ్నీ స్టోన్స్ అంటారు. వీటి వల్ల నెఫ్రాన్లు నశించి మూత్ర విసర్జన సమయంలో నొప్పి వస్తుంది.

మూత్ర పరీక్ష - విశ్లేషణ: మూత్రం క్లినికల్ డయాగ్నసిస్ ద్వారా రోగ నిర్ధారణ చేస్తారు. కొన్ని పరీక్షలు...

1. గ్లైకోస్యూరియా అంటే మూత్రంలో గ్లూకోజ్ ఉండటం (డయాబెటీస్ మిలిటస్ వ్యాధి).
2. కీటోన్యూరియా (మూత్రంలో కీటోన్ దేహాలు ఉంటాయి)
3. హిమటూరియా (మూత్రంలో రక్తం)
4. ఆల్కిప్టాన్యూరియా (నలుపురంగు మూత్ర విసర్జన, ఇది జన్యుసంబంధ వ్యాధి)
5. ఎన్యూరియా (మూత్రపిండాల్లో మూత్రం ఏర్పడకపోవడం)
6. నెఫ్రోసిస్ (హై బీపీ ఉన్న వారి మూత్ర పిండాల్లోని నెఫ్రాన్లు చితికిపోతాయి).
7. ఆల్బ్యుమిన్యూరియా (మూత్రంలో ప్రొటీన్లు ఉంటాయి)
8. వృక్కకాల్క్యులీ (మూత్రపిండంలో రాళ్లు)
9. **డయాబెటీస్ ఇన్సిపిడస్:** అధిక మూత్ర విసర్జన (డై యూరియా).
10. **హెచ్.సి.జి. లేదా గ్రావెడిక్స్ టెస్ట్:** హ్యూమన్ క్రానిక్ గోనాడోట్రోపిక్ హార్మోన్. గర్భిణుల మూత్రంలో ఈ హార్మోన్ ఉంటుంది.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. కింది వాటిలో విసర్జన క్రియతో సంబంధం లేని అవయవం ఏది?
   1) స్వేద గ్రంథి 2) మూత్రపిండం
   3) ఊపిరితిత్తులు 4) లాలాజల గ్రంథులు
2. మొదటిసారి కృత్రిమంగా తయారు చేసిన జీవ సమ్మేళనం?
   1) మీథేన్ 2) బెంజీన్
   3) గ్లూకోజ్ 4) యూరియా
3. యూరియా రసాయన నామం?
   1) క్లోరో ఈథేన్ 2) ఎన్యూరిన్
   3) నైట్రిన్ 4) కార్బమైడ్
4. ఆరోగ్యవంతమైన వ్యక్తి మూత్రంలో గ్లూకోజ్ శాతం ఎంత?
   1) 0.1 శాతం 2) 2 శాతం
   3) 95 శాతం 4) 0 శాతం
5. మూత్రం పసుపు రంగులో ఉండటానికి కారణమైన పదార్థం?
   1) ఆల్బుమిన్ 2) సల్ఫర్
   3) యూరోక్రోమ్ 4) లెగ్ హీమోగ్లోబిన్
6. సాధారణంగా మూత్రం ద్వారా విసర్జితమయ్యే పదార్థం ఏది?
   1) పంచదార 2) గ్లూకోజ్
   3) క్రియాటిన్ 4) ప్రొటీన్
7. అప్పుడే విసర్జించిన మూత్రానికి ఎలాంటి వాసన ఉండదు. కానీ విసర్జించిన కొద్దిసేపటి తర్వాత మూత్రానికి ఘాటైన వాసన ఎందుకు వస్తుంది?
   1) యూరియా అమ్మోనియాగా తిరిగి యూరియాగా మారే వలయ చర్యల ద్వారా
   2) బ్యాక్టీరియా ప్రభావంతో యూరియా అమ్మోనియాగా మారడం వల్ల
   3) మూత్రంలోని యూరియా, యూరికామ్లంగా మారడం
   4) యూరియా, యూరికామ్లం, క్రియాటిన్ అమ్మోనియాగా మారడం
8. మానవుడి మూత్రపిండాల్లో ఏర్పడే రాళ్లలో అధికంగా ఉండే పదార్థం?
   1) కాల్షియం ఆక్సలేట్
   2) సోడియం ఎసిటేట్
   3) మెగ్నీషియం ఫాస్ఫేట్
   4) పైవన్నీ
9. చక్కెర వ్యాధిగ్రస్తుడి మూత్ర నమూనాలో ఉండేది?
   1) లాక్టోజ్ 2) మాల్టోజ్
   3) గ్లూకోజ్ 4) సుక్రోజ్

సమాధానాలు

1) 4 2) 4 3) 4 4) 4 5) 3
6) 3 7) 2 8) 1 9) 3

హైదరాబాద్ సంస్థానంపై 'పోలీసు చర్య' ఎప్పుడు జరిగింది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

తెలంగాణ వైతాళికులు

కొండా వెంకటరంగారెడ్డి (1890-1970)

కొండా వెంకటరంగారెడ్డి 'అత్రాఫ్ బల్దా' (హైదరాబాద్) జిల్లాలోని 'మంగళారం' గ్రామంలో 1890లో జన్మించారు. తండ్రి చెన్నారెడ్డి, తల్లి బుచ్చమ్మ. చెన్నారెడ్డి గ్రామ పోలీసు పటేల్‌గా పనిచేశారు. నాడు అత్రాఫ్ బల్దా జిల్లాలోని భూములన్నీ నిజాం నవాబు సర్ఫేఖాస్‌గా ఉండేవి. ఈ భూముల నుంచి వచ్చే ఆదాయాన్ని నవాబు సొంత ఖర్చుల కోసం (సర్ఫేఖాస్) వినియోగించేవారు. ఇలాంటి గ్రామాల్లో ప్రజా సంక్షేమాన్ని ఎవరూ పట్టించుకోలేదు. ప్రభుత్వ పాఠశాలలు లేవు. ఇలాంటి పరిస్థితుల్లో చెన్నారెడ్డి సొంత ఖర్చులతో ఒక వీధి బడిని ఏర్పాటు చేసి విద్యాభ్యాసం చేసే అవకాశం కల్పించారు. తండ్రి స్థాపించిన వీధిబడిలోనే కొండా వెంకటరంగారెడ్డి ప్రాథమిక విద్యాభ్యాసం చేశారు.

మిడిల్ స్కూల్ విద్యాభ్యాసం తర్వాత 1909లో 'వకాలత్' (న్యాయశాస్త్రం)లో పట్టా పొందారు. తర్వాత న్యాయశాస్త్రంలో 'దర్జెదువ్వం', 'దర్జె అవ్వల్' సర్టిఫికెట్లు పొందారు. హైకోర్టులో 'దర్జె అవ్వల్ వకీల్‌'గా శిక్షణ పొందారు. తెలంగాణ ప్రాంతంలో న్యాయవాద వృత్తికి సంబంధించిన పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం 'లా ఇన్‌స్టిట్యూట్'ను ఏర్పాటు చేసి 1911 నుంచి 1923 వరకు సేవలు అందించారు. కొండా వెంకటరంగారెడ్డి 1910 నుంచి 1920 వరకు అనేక రెవెన్యూ, సివిల్, క్రిమినల్ కేసుల్లో విజయం సాధించారు. 1935 నుంచి 1940 వరకు హైకోర్టులో 'వకాలత్' చేశారు.

వెంకట రంగారెడ్డి ప్రజాసేవ

నిజాం పాలనలో ప్రభుత్వ ఉద్యోగులు, జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లు ప్రజలపై జరిపే అత్యాచారాలు, అన్యాయాలు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా, రైతుల న్యాయమైన హక్కుల కోసం వెంకటరంగారెడ్డి ధైర్యంగా పోరాడారు. ఈయనకు భూస్వాములు, జాగీర్దార్ల కేసులు వచ్చేవి కాదు. పేద రైతుల పక్షాన న్యాయ పోరాటం చేసి అనతికాలంలోనే తెలంగాణ ప్రజల 'దీనజన బాంధవుడు', 'పేదల పెన్నిధి', 'రైతు బాంధవుడు'గా పేరు పొందారు.

నిజాం ప్రభుత్వం నెలకొల్పిన శాసన పరిషత్‌కు కొండా వెంకటరంగారెడ్డి 1939లో న్యాయవాదుల స్థానం నుంచి ఎన్నికయ్యారు. శాసన పరిషత్‌లో ప్రజాభ్యుదయం, సామాజిక న్యాయానికి దోహదం చేసే అనేక బిల్లులు ప్రవేశపెట్టారు. ఈయన ప్రవేశపెట్టిన బిల్లుల్లో ముఖ్యమైనవి.. స్త్రీలకు వారసత్వ హక్కు, బాల్య వివాహాల నిషేధం, వితంతు వివాహాలు చట్ట సమ్మతం, అంటరానితనం నిర్మూలన, జాగీర్దారీ విధానం రద్దు, సంస్థానంలో ప్రభుత్వ ఉద్యోగాల నియామకానికి పబ్లిక్ సర్వీసు కమిషన్ ఏర్పాటు, బావుల కింద వ్యవసాయం చేసే భూములపై నీటి పన్ను రద్దు చేయడం. వీటిని నిజాం నవాబు అనుమతితో శాసనసభలో ప్రవేశపెట్టాల్సి ఉండేది. అత్యధిక మంది ప్రజలు ఈ సంస్కరణలకు వ్యతిరేకమనే కారణంతో నిజాం నవాబు ఈ బిల్లులను తిరస్కరించారు. ఒక్క బాల్య వివాహాలకు సంబంధించిన బిల్లును మాత్రమే ప్రజాభిప్రాయ సేకరణకు నవాబు అంగీకరించారు. దీని కోసం హైకోర్టు న్యాయమూర్తిని నియమించారు. అయినప్పటికీ ఈ అభ్యుదయకరమైన, విప్లవాత్మక బిల్లులు ఇతర ప్రాంతాల సాంఘికోద్యమాలపై ప్రభావం చూపాయి.


కొండా వెంకటరంగారెడ్డి 1886 నుంచి 1917 వరకు హైదరాబాద్ హైకోర్టు జ్యుడీషియల్ కమిటీ వెలువరించిన తీర్పులన్నింటినీ క్రోడీకరించి రెండు సంపుటాలుగా ప్రచురించారు. ఇది న్యాయవాదులకు ఎంతో ఉపయోగకరమైన గ్రంథంగా గుర్తింపు పొందింది.

కొండా వెంకటరంగారెడ్డి తదితరుల ప్రోత్సాహంతో 1918లో రాజా బహద్దూర్ వెంకట్రామారెడ్డి 'రెడ్డి హాస్టల్' స్థాపించారు. దీనికి వెంకటరంగారెడ్డి కార్యదర్శిగా పదేళ్లు సేవలందించారు. రెడ్డి హాస్టల్‌ను మొదట 'రెడ్డి బోర్డింగ్'గా వ్యవహరించేవారు. తర్వాత ఇది రెడ్డి హాస్టల్‌గా రూపాంతరం చెందింది. కొండా వెంకటరంగారెడ్డి దీనికి కార్యదర్శిగా, కోశాధికారిగా, అధ్యక్షుడిగా సుదీర్ఘ కాలం పనిచేశారు.

ముఖ్యమైన అంశాలు

- రెడ్డి జనసంఘం పక్షాన తెలుగు బోధనాభాషగా జాంబాగ్‌లో మాధ్యమిక పాఠశాలను ఏర్పాటు చేయడంలో వెంకటరంగారెడ్డి విశేషమైన కృషి చేశారు.
- షా అలీబండాలో ఉన్నత పాఠశాల, ఫీల్ఖానాలోని ఆంధ్ర సరస్వతీ బాలికా పాఠశాలను ఈయన అభివృద్ధి చేశారు.
- నారాయణగూడలోని బాలికోన్నత పాఠశాల, లాల్ దర్వాజలోని వెంకట్రావు స్మారక నిధి ఉన్నత పాఠశాల, ఆర్.బి.వి.ఆర్. మహిళా కళాశాల, గగన్‌మహల్‌లోని ఆంధ్ర విద్యాలయ కళాశాల(ప్రస్తుత ఏవీ కాలేజ్), చిక్కడపల్లిలోని ఆంధ్ర విద్యాలయం మొదలైనవన్నీ నేటికీ ఉత్తమ విద్యా సంస్థలుగా సేవలందిస్తున్నాయి. వీటి అభివృద్ధిలో వెంకటరంగారెడ్డి కృషి ఉంది.
- శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం, వేమనాంధ్ర భాషా నిలయం, బాల సరస్వతీ గ్రంథాలయం, ఆంధ్ర సారస్వత పరిషత్, దక్షిణ భారత హిందీ ప్రచార సభ, ఇందిరా సేవా సదన్, గ్రంథాలయాల స్థాపనలోనూ కొండా వెంకటరంగారెడ్డి విశేష కృషి చేశారు.
- కొండా వెంకటరంగారెడ్డి 70వ జన్మదినం సందర్భంగా 1960లో ఆయన పేరు మీద ఆర్.బి.వి.ఆర్. మహిళా కళాశాల ఆవరణలో 'రెడ్డి బాలికా వసతి గృహం' నిర్మించారు.
- 1921లో 'ఆంధ్ర జన సంఘం' స్థాపించడంలో ఈయణ్ని మూల పురుషుడిగా పేర్కొంటారు.
- జోగిపేటలో సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షతన ఆంధ్ర మహాసభ మొదటి సమావేశం జరిగింది. ఇందులో రంగారెడ్డి కీలకపాత్ర పోషించారు.
- 1936లో షాద్‌నగర్‌లో నిర్వహించిన 5వ, 1943లో హైదరాబాద్‌లో నిర్వహించిన 7వ ఆంధ్ర మహాసభలకు కొండా వెంకటరంగారెడ్డి అధ్యక్షుడిగా వ్యవహరించారు.
- హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో కలవాలని 1938లో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కొండా వెంకటరంగారెడ్డి తెలంగాణ జిల్లాల్లో పర్యటించి ప్రజలను ఉత్తేజపరిచారు.
- తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో రజాకార్ల దురాగతాలు.. ముఖ్యంగా దోపిడీలు, గృహ దహనాలు నిత్యకృత్యమవడం వల్ల భారత ప్రభుత్వం కె.ఎం. మున్షీని హైదరాబాద్ ఏజెంట్ జనరల్‌గా నియమించింది. వెంకటరంగారెడ్డి ఆయనకు తెలంగాణ ప్రజల బాధలను వివరించారు.
- భారత ప్రభుత్వం 1948 సెప్టెంబర్ 13న హైదరాబాద్ సంస్థానంపై 'పోలీసు చర్య' జరిపింది. రజాకార్ల నాయకుడైన సయ్యద్ కాశిం రజ్వీ బందీ అయ్యాడు. మేజర్ జనరల్ చౌదరీ మిలటరీ గవర్నర్‌గా నియమితుడయ్యాడు.
- 1950లో కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్ రాష్ట్రంలో మిలటరీ ప్రభుత్వాన్ని రద్దుచేసి సీనియర్ ఐసీఎస్ అధికారి ఎం.కె. వెల్లోడిని ముఖ్యమంత్రిగా నియమించింది.
- భారత పార్లమెంట్‌కు హైదరాబాద్ సంస్థానం నుంచి 25 మంది సభ్యులను నియమించారు. వీరిలో కొండా వెంకటరంగారెడ్డి ఒకరు.
- 1952లో హైదరాబాద్ రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాల్లో విజయం సాధించింది.
- హైదరాబాద్ సంస్థానంలో బూర్గుల రామకృష్ణారావు నాయకత్వంలో 1952లో మొదటి ప్రజా ప్రభుత్వం ఏర్పాటైంది. ఈయన మంత్రివర్గంలో వెంకటరంగారెడ్డి ఎక్సైజ్, కస్టమ్స్, అటవీశాఖలు నిర్వహించారు.
- కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కోసం 'ఫజల్ అలీ' అధ్యక్షతన కమిటీ నియమించింది. హైదరాబాద్ విభజన జరగాలని ఈ కమిటీ పేర్కొంది. తెలంగాణ ప్రాంతాన్ని ప్రత్యేక రాష్ట్రంగా రూపొందించాలని పేర్కొంది.
- రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ (ఎస్ఆర్సీ) నివేదిక తర్వాత అనేక తర్జనభర్జనలు జరిగాయి.
- కొండా వెంకటరంగారెడ్డి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడాలని వాదించారు. ఈయన నాయకత్వంలో పెద్ద ఎత్తున ఉద్యమం జరిగింది.
- నాటి హైదరాబాద్ రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి మర్రి చెన్నారెడ్డి తెలంగాణ జిల్లాల్లో పర్యటించి ప్రజల అభిప్రాయం సేకరించారు. అత్యధిక ప్రజలు తెలంగాణ రాష్ట్రం ఏర్పడాలని కోరుతున్నట్లు ఆయన ప్రకటించారు.
- ఇదే సమయంలో కొంత మంది విశాలాంధ్ర ఏర్పాటు కోసం ఉద్యమించారు.
- ఆంధ్రా - తెలంగాణ నాయకుల మధ్య పెద్ద మనుషుల ఒప్పందం జరిగింది.
- ఈ ఒప్పందం ప్రకారం 1956 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. దీనికి నీలం సంజీవ రెడ్డి ప్రథమ ముఖ్యమంత్రి అయ్యారు.
- కొండా వెంకటరంగారెడ్డి పేరు మీదే రంగారెడ్డి జిల్లా పేరు వచ్చింది.
- 1957లో తెలంగాణ ప్రాంతంలో జరిగిన ఎన్నికల్లో రంగారెడ్డి శాసనసభకు తిరిగి ఎన్నికయ్యారు.
- దామోదరం సంజీవయ్య మంత్రివర్గంలోనూ కొండా వెంకటరంగారెడ్డి పనిచేశారు.
- 1962లో జరిగిన సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ ముఠా తగదాల ఫలితంగా రంగారెడ్డి ఓడిపోయారు.
- 1969లో తెలంగాణను తిరిగి ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలనే ఉద్యమానికి రంగారెడ్డి నాయకత్వం వహించారు.

1970 జూలై 24న కొండా వెంకట రంగారెడ్డి మరణించారు. తెలంగాణ ప్రజల హక్కులు, విద్యాభివృద్ధి, రైతులు, పేద ప్రజల అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి ప్రశంసనీయమైంది.



తాను నిజమని నమ్మిన, అంతరాత్మకు సమంజసమని తోచిన విషయాన్ని సూటిగా, స్పష్టంగా, నిర్భయంగా వ్యక్తం చేసిన, నిష్కల్మష హృదయం ఉన్న వ్యక్తి - కొండా వెంకటరంగారెడ్డి. తెలంగాణ ప్రజల పట్ల ఆయనకు అపారమైన ప్రేమ ఉండేది. తెలంగాణ ప్రజలు కూడా ఆయనపట్ల అమితమైన గౌరవం చూపారు. ప్రజలు ఆయనను ఆప్యాయంగా 'తెలంగాణా బాబాయ్' అని పిలుచుకునేవారు.

మాదిరి ప్రశ్నలు

1. కొండా వెంకటరంగారెడ్డి ఏ జిల్లాలో జన్మించారు?
   1) మెదక్ 2) కరీంనగర్
   3) హైదరాబాద్ (అత్రాఫ్ బల్దా జిల్లా)
   4) మహబూబ్‌నగర్
2. సర్ఫేఖాస్ అంటే ఏమిటి?
   1) నిజాం నవాబు సొంత ఖర్చుల కోసం సేద్యం చేసే భూములు
   2) బంగారు నాణేలు
   3) ఉన్నత న్యాయస్థానం
   4) బహుమతులు
3. నిజాం నవాబు నెలకొల్పిన 'శాసన పరిషత్'కు కొండా వెంకటరంగారెడ్డి న్యాయవాదుల స్థానం నుంచి ఎప్పుడు ఎన్నికయ్యారు?
   1) 1956 2) 1946
   3) 1939 4) 1950
4. హైదరాబాద్ సంస్థానంలో 'ఆంధ్ర జనసంఘం' ఎప్పుడు స్థాపించారు?
   1) 1921 2) 1920 3) 1936 4) 1946
5. కొండా వెంకటరంగారెడ్డి అధ్యక్షతన 5వ ఆంధ్ర మహాసభ ఎప్పుడు? ఎక్కడ జరిగింది?
   1) 1940, హైదరాబాద్
   2) 1936, షాద్‌నగర్
   3) 1930, జోగిపేట (మెదక్ జిల్లా)
   4) 1928, సిరిసిల్ల (కరీంనగర్)
6. 1943లో హైదరాబాద్‌లో నిర్వహించిన 7వ ఆంధ్ర మహాసభకు అధ్యక్షుడిగా ఎవరు వ్యవహరించారు?
   1) స్వామి రామానంద తీర్థ
   2) కాశీనాథ్ వైద్య
   3) సురవరం ప్రతాపరెడ్డి
   4) కొండా వెంకటరంగారెడ్డి
7. హైదరాబాద్ సంస్థానంపై 'పోలీసు చర్య' ఎప్పుడు జరిగింది?
   1) 1942 సెప్టెంబర్ 17
   2) 1946 ఆగస్టు 9
   3) 1950 నవంబర్ 10
   4) 1948 సెప్టెంబర్ 13
8. హైదరాబాద్ సంస్థానంలో 1952లో ఎవరి నాయకత్వంలో ప్రథమ ప్రజా ప్రభుత్వం ఏర్పడింది?
   1) కొండా వెంకటరంగారెడ్డి
   2) మర్రి చెన్నారెడ్డి
   3) బూర్గుల రామకృష్ణారావు
   4) రామానంద తీర్థ
9. కొండా వెంకటరంగారెడ్డి ఎప్పుడు మరణించారు?
   1) 1970 2) 1969 3) 1968 4) 1958

సమాధానాలు

1) 3; 2) 1; 3) 3; 4) 1; 5) 2; 6) 4; 7) 4; 8) 3; 9) 1.

What is the code for "both"?



BANK EXAMS

REASONING

MODEL QUESTIONS

Directions (Q. No. 1-5): Observe the statements carefully and choose the option by finding out the validity of the given conclusions.

1. **Statements:**
   All Desks are Cats.
   Some Cats are plants.
   All plants are Trees.
   Conclusions:
   I) Some Trees are Desks.
   II) No Desk is a Tree.
   III) All Trees being plants is a possibility
   1) Only I, II and III follow
   2) Only II and III follow
   3) Only III with Either I or II follows
   4) I and III follow
   5) None of these
2. **Statements:**
   All flowers are buds.
   All buds are roots.
   All roots are cots.
   Conclusions:
   I) Some cots are definitely not buds
   II) All cots are buds
   III) All those roots which are flowers must be buds
   1) Only II and III follow
   2) Only I and III follow
   3) Either I or II and III follow
   4) All follow
   5) None of these
3. **Statements:**
   All canteens are restaurants.
   Some restaurants are shops.
   Some shops are plots.
   Conclusions:
   I) Some plots are restaurants.
   II) Some restaurants are canteens.
   III) Some plots which are shops need not necessarily be restaurants.
   1) Only I and III follow
   2) Only II and III follow
   3) Either I or III and II follow
   4) All follow 5) None of these
4. **Statements:**
   No wafer is ring.
   All pastries are wafers.
   All diamonds are rings.
   Conclusions:
   I) Some diamonds are wafers.
   II) No ring is wafer
   III) No any rastry is diamond
   1) Only I and II follow
   2) Only II and III follow
   3) Either I or II and III follow
   4) All follow 5) None of these
5. **Statements:**
   All scales are pens.
   Some pens are bulbs.
   All bulbs are sockets.
   Conclusions:
   I) At least Some sockets are pens.
   II) Some pens are scales.
   III) All sockets can never be scales
   1) Only I and II follow
   2) All follow
   3) Either I or III and II follow
   4) None follows 5) None of these

Directions (Q. No. 6 -10): Study the following information carefully to answer the given questions.

A word and number arrangement machine, when given an input line of words and numbers, re-arranges them following a particular rule in each step. The following is an illustration of input and rearrangement.

Input: sim favour 7 oder 87 38 cold 75 travel 6 uncover 5 virus 2

Step I: cold sim favour 7 oder 87 38 75 travel 6 uncover 5 virus 2

Step II: cold 87 sim favour 7 oder 38 75 travel 6 uncover 5 virus 2

Step III: cold 87 favour sim 7 oder 38 75 travel 6 uncover 5 virus 2

Step IV: cold 87 favour 75 sim 7 oder 38 travel 6 uncover 5 virus 2

Step V: cold 87 favour 75 oder sim 7 38 travel 6 uncover 5 virus 2

Step VI: cold 87 favour 75 oder 38 sim 7 travel 6 uncover 5 virus 2

Step VI is the last step of the rearrangement of the above input.

As per the rules followed in the above steps, answer the following questions.

6. **Input:** odd as 55 45 65 said more 85
   Which of the following steps will be the last step?
   1) Sixth 2) Seventh 3) Eighth
   4) Fifth 5) None of these
7. **Step III of an input:** bad 71 door 42 54 tomorrow fame 69
   Which of the following steps will be the last but one step?
   1) V 2) VI 3) VII
   4) VIII 5) None of these
8. **Step II of an input:** end 48 22 30 hold game 11 make
   Which of the following is definitely the input?
   1) 22 end 48 30 hold game 11 make
   2) 48 11 end 30 hold game make 22
   3) end hold game make 48 22 30 11
   4) Can't be determined
   5) None of these
9. **Input:** marriage has fit 17 always 90 36 49
   Which of the following will be step III?
   1) always 90 marriage 49 has fit 17 36
   2) always 90 fit marriage has 17 36 49
   3) always 90 fit 49 marriage has 17 36
   4) Can't be determined
   5) None of these
10. **Input:** born all 18 68 74 game need 39
    Which of the following is step II?
    1) all 68 born 18 74 game need 39
    2) all 74 born 18 68 game need 39
    3) all 74 born 68 game 39 need 18
    4) Can't be determined
    5) None of these


Directions (Q. No. 11-14): Study the following information to answer the given questions.

In a certain code language, "chi na le ba pi" means "Federer and Nadal are rivals", "ki ba lo tha" means "both rivals plays tennis", "da ki chi" means "Federer plays excellent", "tha na da" means "excellent and tennis" and "mu ki" means "children plays".


11. What is the code for "Nadal"?
    1) le 2) pi 3) ba
    4) Either le or pi 5) None
12. What is the code for "both"?
    1) ba 2) ki 3) lo
    4) Can't be determined
    5) None of these
13. Which of the following is the code for "Nadal and rivals are children"?
    1) chi na ki le pi 2) pi le na ba mu
    3) ba mu le ki pi 4) chi pi le ba mu
    5) None of these
14. Which of the following may be the code for "some rivals plays excellent"?
    1) ba da fi ki 2) lo da no ki
    3) ki fi ba le 4) da ba tha fi
    5) None of these

Key and Explanations

1. **Basic Diagram**



Alternate Diagram




As all the given statements are affirmative, "All Trees being plants is a possibility" is valid.


Based on the above diagrams, both I and II conclusions form a complementary pair.

Answer is "Only III with either I or II" follows. *Ans: 3*

2. **Basic Diagram**




Alternate Diagram




As all the given statements are affirmative, there is a possibility of "All cots are buds". Hence, both I & II conclusions form a complementary pair. Answer is "only III with Either I or II" follows. *Ans: 3*

3. **Basic Diagram**




Clearly, only II and III conclusion are valid. *Ans: 2*

4. **Basic Diagram**



"No ring is wafer" is a valid conclusion as the statement given is "No wafer is ring". No pastry is diamond is also valid. Hence, conclusion II and III follow. *Ans: 2*

5. **Basic Diagram**



Clearly, both I and II conclusions are valid. As all the statements are affirmative "All sockets can be scales" follows. Hence, conclusion III is not valid. *Ans: 1*

(6-10):

6. The machine rearranges one word and one number in alternate steps. Words are rearranged in alphabetical order while numbers are rearranged in descending order.
   Input: odd as 55 45 65 said more 85
   Step I: as odd 55 45 65 said more 85
   Step II: as 85 odd 55 45 65 said more
   Step III: as 85 more odd 55 45 65 said
   Step IV: as 85 more 65 odd 55 45 said
   Step V: as 85 more 65 odd 55 said 45 *Ans: 4*
7. **Step III:** bad 71 door 42 54 tomorrow fame 69
   Step IV: bad 71 door 69 42 54 tomorrow fame
   Step V: bad 71 door 69 fame 42 54 tomorrow
   Step VI: bad 71 door 69 fame 54 42 tomorrow
   Step VII: bad 71 door 69 fame 54 tomorrow 42 *Ans: 2*
8. We can't proceed backward. *Ans: 4*
9. **Input:** marriage has fit 17 always 90 36 49
   Step I: always marriage has fit 17 90 36 49
   Step II: always 90 marriage has fit 17 36 49
   Step III: always 90 fit marriage has 17 36 49 *Ans: 2*
10. **Input:** born all 18 68 74 game need 39
    Step I: all born 18 68 74 game need 39
    Step II: all 74 born 18 68 game need 39 *Ans: 2*

(11-14):

chi na le ba pi → Federer and Nadal are rivals ... (1)
ki ba lo tha → Both rivals plays tennis ... (2)
da ki chi → Federer plays excellent ... (3)
tha na da → excellent and tennis ... (4)
mu ki → children plays ... (5)
From (1) and (3), chi → Federer
From (1) and (2), ba → rivals
From (1) and (4), na → and
From (1), le pi → Nadal are.. (6)
Since neither "Nadal" nor "are" is common with any other equation, so we can't find the exact code for "Nadal". It may be either "le" or "pi".
From (2), (3) and (5),
ki → plays and mu → children
From (2) and (4), tha → tennis
From (3) and (4), da → excellent
From (2), lo → both

11) *4;*
12) *3;*
13) *2;*
14) *1.*